

‘బీడుబడిన భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి’

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 117

శుక్రవారం 18-7-2025



బ్యాంకులు, ఐటీషేర్లలో అమ్మకాలు


సెన్సెక్స్ 375 పాయింట్ల పతనం..
నిఫ్టీ నష్టం 101 పాయింట్లు - 15లో



కార్ల్‌సన్‌కు ప్రజ్ఞానంద షాక్

ఫ్రీస్టయిల్ చెస్ టోర్నీలో వరల్డ్ నంబర్ వన్‌పై నెగ్గిన భారత గ్రాండ్‌మాస్టర్ -15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ముగ్గురి డీఎన్‌ఏతో ముద్దుల పిల్లలు

ప్రపంచంలోనే తొలిసారిగా ముగ్గురి డీఎన్‌ఏ సాయంతో శిశువుల పుట్టుకను బ్రిటన్ సైంటిస్టులు సుసాధ్యం చేసి చూపించారు.

- వివరాలు 6లో



హ్యాపీ రీ యూనియన్

18 రోజుల అంతరిక్ష యాత్రను ముగించుకొని తిరిగొచ్చిన వ్యోమగామి శుభాంశు శుక్లా తన భార్య, కుమారుడిని కలుసుకున్నారు.

- వివరాలు 6లో



దాడులకు దిగినా, చోరీ చేసినా..

అమెరికాలో విదేశీయులు దాడులు చేసినా, చోరీకి పాల్పడ్డా వీసా రద్దయ్యే ప్రమాదం ఉంటుందని ఆ దేశ ఎంబసీ స్పష్టం చేసింది.

- వివరాలు 6లో



నటి రన్యారావుకు జైలు

విదేశాల నుంచి భారత్‌కు బంగారాన్ని అక్రమంగా తరలించిన కేసులో కన్నడ నటి రన్యారావుకు ఏడాది జైలుశిక్ష పడింది.

- వివరాలు 6లో

ఏపీతో చర్చించొద్దా?

ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

- నదీ జలాల విషయంలో భారత్–పాకిస్తాన్ మధ్యే చర్చలు
- కృష్ణా, గోదావరి జలాలపై మేం చర్చిస్తే తప్పేంటి?
- గతంలో చంద్రబాబుతో కేసీఆర్, హరీశ్‌రావు చర్చించలేదా?
- కేంద్రం చర్చకు పిలిస్తే ఢిల్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌కు రావాలా?
- నీళ్ల ద్రోహి కేసీఆరే.. పదేళ్లలో కృష్ణాలో 1200 టీఎంసీలు పోనిచ్చిండు
- సినిమాల్లో విలన్లను ఆఖర్లో చంపుతారు.. ‘కాళేశ్వరం’ విషయంలోనూ మెల్లగా అరెస్టులు..
- కేటీఆర్‌ది గంజాయి బ్యాచ్
- కేంద్రంతో కలిసి పనిచేసేందుకు సిద్ధం.. కొట్లాట నా చివరి అస్త్రం
- కేంద్రంతోపాటు ఏపీతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాం
- సెప్టెంబర్‌లోగా స్థానిక ఎన్నికలు
- రెండేళ్ల తర్వాతే నామినేటెడ్ చైర్మన్ల నియామకం ఉంటుందని వెల్లడి



రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో రఘువీర్, శ్రీధర్‌బాబు, ఉత్తమ్, చామల

సాక్షి, న్యూఢిల్లీ: ‘నదీ జలాల విషయంలో భారత్–పాకిస్తాన్ మధ్యే చర్చలు జరుగుతున్నాయి. నీటి పంపకాలపై రెండు దేశాలు మాట్లాడుకుంటున్నాయి. అలాంటప్పుడు కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించిన అంశాలపై పొరుగు రాష్ట్రంతో మేం చర్చిస్తే తప్పేంటి. నదీ జలాలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితో చర్చలే వద్దన్న తరహాలో బీఆర్‌ఎస్ మాట్లాడటం విడ్డూరంగా ఉంది. 2015–16లో చంద్రబాబునాయుడుతో చర్చలకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్ వెళ్లలేదా? ఇప్పుడు మేము వెళితేనే

మిగతా 3వ పేజీలో ▶

సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపండి

- రీజనల్ రింగ్ రైలు ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వండి
- ఖాజీపేట రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయండి
- హైదరాబాద్ డ్రై పోర్టు–బందరు లైన్ మంజూరు చేయండి

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

- వివరాలు 3లో

చంద్రబాబు స్క్రిప్టు.. రేవంత్ చిలక పలుకు

- తెలంగాణను చంద్రబాబుకు గురుదక్షిణగా ఇచ్చిన సీఎం
- ఢిల్లీలో తెలంగాణ జలాలను ఏపీకి తాకట్టు పెట్టారు
- పిరికిపందలా ఢిల్లీకి వెళ్లి చిట్‌చాట్‌లతో నాపై దుష్ప్రచారం
- నాపై డ్రగ్స్ కేసు ఉన్నట్లు దమ్ముంటే నిరూపించు
- రేవంత్.. క్షమాపణ చెప్పకుంటే తీవ్ర పరిణామాలు
- సిరిసిల్లలో కేటీఆర్ హెచ్చరిక



సిరిసిల్ల: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తొత్తుగా మారారని, తెలంగాణ ప్రయోజనాలను గురుదక్షిణగా తాకట్టు పెట్టేందుకు చూస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు విమర్శించారు. ఇక్కడ మాట్లాడుతున్న చిలక రేవంత్‌రెడ్డి అయితే పలుకులు మాత్రం చంద్రబాబువని మండిపడ్డారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం బీఆర్‌ఎస్ కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఆరు దశాబ్దాలుగా జరిగిన జలదోపిడీ ఒక ఎత్తయితే సీఎం రేవంత్‌రెడ్డి కోవర్టుగా మారి ఢిల్లీలో బుధవారం తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టడం ఒక ఎత్తు అని ధ్వజమెత్తారు. బనకచర్ల ప్రాజెక్టు గురించి చర్చ పెడితే సమావేశానికే వెళ్లను అని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఎలా మీటింగ్‌కు పోయారని ప్రశ్నించారు. అసలు ఆదిత్యనాథ్‌ను సాగునీటి సలహాదారుగా పెట్టుకోవడమే పెద్ద తప్పు అన్నారు. కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వొద్దని అడ్డుకున్నదే చంద్రబాబు నాయుడు అని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ రైతుల హక్కులను కాపాడడానికి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఉన్నారని స్పష్టం చేశారు. బనకచర్లపై కాంగ్రెస్ ప్రభుత్వం తీరు

మిగతా 3వ పేజీలో ▶

రేవంత్‌వి చెత్త వ్యాఖ్యలు: హరీశ్

- చీకటి బాగోతాన్ని కప్పి పుచ్చుకునేందుకే కేటీఆర్‌పై ఆరోపణలు
- మేం బనకచర్ల ప్రాజెక్టు గురించి మాట్లాడుతున్నాం
- ఆయన డ్రగ్స్ అంటూ మోకాలుకు, బోడిగుండుకు ముడి పెడుతున్నారు

3లో

న్యూస్‌రీల్

ఇరాక్‌లో ఘోర అగ్ని ప్రమాదం



తూర్పు ఇరాక్‌లో ఇటీవల ప్రారంభమైన అధునాతన షాపింగ్ మాల్ భవనంలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఐదంతస్తుల ఈ భవనానికి అకస్మాత్తుగా మంటలంటుకోవడంతో అందులోని 60 మందికిపైగా సజీవ దహనమయ్యారు.

- వివరాలు 6లో

ఓఆర్ఆర్ లోపల కల్లు దుకాణాలు బంద్!



కల్లుపై నిషేధాన్ని హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా ఔటర్ రింగ్‌రోడ్డు లోపలి మొత్తం ప్రాంతాన్ని చేర్చాలని ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. దీనిపై పూర్తి వివరాలను తెప్పించుకున్నట్లు సమాచారం.

- వివరాలు 2లో

హెచ్‌సీఏ అక్రమాల వెనుక కేటీఆర్, కవిత

- హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో జరిగిన నిధుల గోల్‌మాల్ వెనుక కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత హస్తం ఉందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ ఆరోపించారు. - 16లో



‘నిట్’కే విద్యార్థుల టిక్

- ఓపెన్ కేటగిరీలో గరిష్టంగా 6వేల ర్యాంకు వరకే సీట్లు.. నిట్‌లోనూ సీఎస్‌ఈకి భారీ డిమాండ్
- నిట్‌లో రాకుంటే రాష్ట్ర కాలేజీలకే ప్రాధాన్యం ఐఐటీలకు తగ్గిన పోటీ – పెరిగిన కటాఫ్
- 13 వేల ర్యాంకు వరకూ ఐఐటీల్లో సీటు
- ముగిసిన ‘జోసా’ కౌన్సెలింగ్

- వివరాలు 2లో



ఏఐతో.. ముప్పు పొంచి ఉంది..

- ఉద్యోగాలకు ప్రమాదం ఉందంటున్న నిపుణులు
- నైపుణ్యాల పెంపెనకు ‘అప్‌స్కిల్లింగ్’ బాట
- ఆరు నెలల్లోపు కెరీర్ ప్రోగ్రామ్స్‌పై అత్యధికుల ఆసక్తి
- ఏఐ, మెషీన్ లెర్నింగ్ స్కిల్స్‌పైనే ప్రధాన ఫోకస్

- వివరాలు 2లో



పాన్.. పాన్.. పాన్..


- పాన్.. పాన్.. పాన్ అన్నది ప్రపంచవ్యాప్తంగా ప్రామాణికంగా అనుసరించే రేడియో కాల్. తక్షణ ప్రాణాపాయం లేని పరిస్థితుల్లో వాడే ఎమర్జెన్సీ కాల్ ఇది.

- వివరాలు 16లో

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. ప్రస్తుతం ప్రపంచమంతా మాట్లాడుకుంటున్న సాంకేతికత. ఏఐతో కొత్త అవకాశాలు రావడమే కాదు.. ప్రస్తుతం తాము పనిచేస్తున్న ఉద్యోగాలకు ముప్పు రానుందని అత్యధిక మంది నిపుణులు నమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో నైపుణ్యాలను పెంచుకోవాలన్న కృతనిశ్చయం వారిలో కనిపిస్తోంది. మెషీన్ లెర్నింగ్, ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఎక్కువ శాతం మంది భావిస్తున్నారని 'గ్రేట్ లెర్నింగ్' సర్వేలో తేలింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

ఏఐతో.. ముప్పు పొంచి ఉంది!



- ఉద్యోగాలకు ప్రమాదం ఉందంటున్న నిపుణులు
- నైపుణ్యాలు పెంచుకునేందుకు 'అప్‌స్కిల్లింగ్' బాట
- ఆరు నెలల్లోపు కెరీర్ ప్రోగ్రామ్స్‌పై అత్యధికుల ఆసక్తి
- ఏఐ, మెషీన్ లెర్నింగ్ స్కిల్స్‌పైనే ప్రధాన ఫోకస్
- సంపాదన సామర్థ్యం పెంచుకోవడమే ముఖ్య లక్ష్యం

సాంకేతికతతో తమ ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉందని భావించే వారిలో 21 నుండి 28 సంవత్సరాల వయసు గల యువత (జనరేషన్-జెడ్) అత్యధికంగా ఉండటం విశేషం. ముఖ్యంగా ఏఐ వల్ల తమ ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందని 74% మంది జెన్-జెడ్ తరం భావిస్తున్నారు. ప్రస్తుతం తాము పనిచేస్తున్న ఉద్యోగానికి ఢోకా లేదని 64 శాతం మంది ధీమాగా ఉన్నారు. 45-60 సంవత్సరాల వయసు గల జనరేషన్-ఎక్స్‌లో 56% మంది ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మొత్తంగా 69% మంది నిపుణులు తమ ఉద్యోగాలకు ఏఐ వల్ల ప్రమాదం ఉందని నమ్ముతున్నారు. 'అప్‌స్కిల్లింగ్ ట్రెండ్స్ రిపోర్ట్ 2025-26' పేరుతో ఎడ్‌టెక్ కంపెనీ 'గ్రేట్ లెర్నింగ్' దేశవ్యాప్తంగా విభిన్న రంగాలకు చెందిన 1,000 మందికిపైగా నిపుణులతో చేసిన సర్వేలో ఇలాంటి ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి.

నైపుణ్యం పెంచుకుంటాం..


ఈ సంవత్సరం నైపుణ్యాలను పెంచుకోవాలని 81% మంది భావిస్తున్నారు. హైదరాబాద్‌లో ఈ సంఖ్య దేశంలోనే అత్యధికంగా 90 శాతం ఉంది. తమ కెరీర్‌లపై ఏఐ ప్రభావం సానుకూలంగా ఉంటుందని 78% మంది చెబుతున్నారు. ఈ ఏడాది 73% మంది నిపుణులు తమ ఉద్యోగాలను నిలుపుకోవడంపై నమ్మకంగా ఉన్నారు. 82% మంది చురుగ్గా కొత్త ఉద్యోగ అవకాశాలను అన్వేషిస్తున్నారు. ఇక 29-44 ఏళ్ల వయసున్న (మిలీనియల్స్) ఉద్యోగుల్లో 90 శాతం మంది నైపుణ్య విలువను గుర్తించారు. జెన్-జెడ్ విషయంలో ఇది 79 శాతం. కానీ ఆఫీసు పని గంటల కారణంగా నూతన సాంకేతిక నైపుణ్యాలను సంపాదించడం అడ్డంకిగా మారిందని 37% మంది అంటున్నారు. కుటుంబ బాధ్యతలు, ఇంటి పని కారణంగా కొత్త కోర్సులు నేర్చుకోలేకపోతున్నామని 25 శాతం మహిళలు చెబుతుంటే.. ఇలా చెప్పిన పురుషులు 20 శాతం కావడం విశేషం.

సర్వేలో ఎవరు పాల్గొన్నారంటే...


ఏయే రంగాలు?

ఐటీ, ఐటీఈఎస్, టెలికం, ఫిన్‌టెక్, తయారీ, విద్య, ఆరోగ్యం, ఫార్మా, అనుబంధ రంగాలు ఈ-కామర్స్, రిటైల్, వాహనాలు, విడిభాగాలు, కన్సల్టింగ్, ఎఫ్ఎంసీజీ, మీడియా, వినోదం, ఓటీటీ, సినిమా నిర్మాణం మొదలైనవి.

ఏ వయసుల వారు?



ఉద్యోగ అనుభవం (సంవత్సరాల్లో)



నైపుణ్యాభివృద్ధికి అడ్డంకులు

కారణం	శాతం
ప్రస్తుత విధుల్లో బిజీ	37%
కుటుంబ బాధ్యతలు, ఇంటి పని	22%
సోషల్ లైఫ్‌లో బిజీ	10%
స్తోమత లేదు	5%

నైపుణ్యం పెంపు ఎందుకోసం? కారణాల వారీగా

కారణం	శాతం
సంపాదన సామర్థ్యం పెంపు	23%
పదోన్నతుల కోసం	15%
వ్యక్తిగత ఆసక్తి	14%
కొత్త ఉద్యోగం కోసం	13%
ఉన్న నైపుణ్యం పాతదైనందున	12%
కంపెనీ కోసం	8%
ఇతర రంగాల్లోకి వెళ్లేందుకు	8%
ఏఐ వల్ల అనిశ్చితి	7%



ఏ స్కిల్ కావాలంటే.. ప్యానెల్ వారీగా

స్కిల్	శాతం
మెషీన్ లెర్నింగ్, ఏఐ	44%
సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్	36%
సైబర్ సెక్యూరిటీ	35%
డేటా సైన్స్, అనలిటిక్స్	35%
డిజిటల్ మార్కెటింగ్	34%
మేనేజ్‌మెంట్	31%
క్లౌడ్ కంప్యూటింగ్	27%
డిజైన్	22%

6 వారాల నుంచి ఆరు నెలలు..

కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడానికి జెన్-ఏఐని ఉపయోగిస్తున్నట్లు 80% మంది నిపుణులు వెల్లడించారు. మెషీన్ లెర్నింగ్, ఏఐ విభాగాల్లో నైపుణ్యం పెంచుకుంటామని 44 శాతం మంది తెలిపారు. తమ పనిలో జెన్-ఏఐని 'ఎల్లప్పుడూ' లేదా 'తరచుగా' ఉపయోగిస్తామని 60% మంది చెబుతున్నారు. ఇక ఐటీ, ఐటీఈఎస్, బీపీఎం, టెలికం రంగాల్లో పనిచేస్తున్న వారిలో 91 శాతం మంది నైపుణ్యం మెరుగుపర్చుకోవడం ముఖ్యం అని తెలిపారు. 64% మంది నిపుణులు 6 వారాల నుంచి 6 నెలల నిడివిగల ప్రోగ్రామ్స్‌తో నైపుణ్యాన్ని పెంచుకోవాలని అనుకుంటున్నారు. జెన్-జీ ప్రధానంగా స్వల్పకాలిక ప్రోగ్రామ్స్‌ను ఇష్టపడుతున్నారు. 50% మంది 6 వారాల కంటే తక్కువ లేదా 6 వారాల నుండి 3 నెలల మధ్య ఉన్న ప్రోగ్రామ్‌లను ఇష్టపడుతున్నారు. దేశీయ యూనివర్సిటీలు అందించే సర్టిఫికెట్ ప్రోగ్రామ్స్ చేస్తున్నామని 43 శాతం చెప్పగా.. అంతర్జాతీయ వర్సిటీల సర్టిఫికెట్ ప్రోగ్రామ్స్ చేస్తున్నామని 36 శాతం తెలిపారు. తల్లి/తండ్రిగా బాధ్యతలు నెరవేరుస్తున్న ఉద్యోగుల్లో 90% మంది నిపుణులు నైపుణ్యం పెంపుదల ముఖ్యమైనదని భావిస్తున్నారు. ఇతర (పెళ్లికాని లేదా పిల్లలు లేనివారు) నిపుణుల్లో ఈ సంఖ్య 76 శాతమే.

బీఆర్క్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 23 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ చేపడతారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి నేతృత్వంలోని కమిటీ గురువారం సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈ నెల 23 నుంచి 31 వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేపడతారు. ఆగస్టు 4న ధ్రువపత్రాల పరిశీలన, వెబ్ ఆప్షన్లు ఆగస్టు 16 నుంచి 18 వరకూ ఉంటాయి. ఇదే నెల 20వ తేదీన తొలి దశ సీట్ల కేటాయింపు చేపడతారు. సీటు వచ్చిన విద్యార్థులు ఆగస్టు 22 లోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. ఆగస్టు 24 నుంచి రెండో దశ కౌన్సెలింగ్ ఉంటుంది. సెప్టెంబర్ 1 నుంచి బీఆర్క్ తరగతులు మొదలవుతాయని షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

ప్రైవేటు ఇంజనీరింగ్ 'బీ' కేటగిరీకి ఆమోదం

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో యాజమాన్య కోటా సీట్ల భర్తీకి ఉన్నత విద్యామండలి ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 19న విడుదల చేస్తామని మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఆగస్టు 10వ తేదీకల్లా ప్రవేశాల ప్రక్రియను ముగించాలని ఆయన సూచించారు. యాజమాన్య కోటా సీట్ల భర్తీ విషయంలో కాలేజీలు నిబంధనలు పాటించాలని కోరారు.

ఇదంజగత్



వెల్‌కం టు అమెరికా! మీకు వీసా ఉన్నా మీ వెంటే ఉండి గమనించమని ట్రంప్ చెప్పారు!

'నిట్'కే విద్యార్థుల టిక్

రాకుంటే రాష్ట్ర కాలేజీలకే ప్రాధాన్యం

- ఐఐటీలకు తగ్గిన పోటీ – పెరిగిన కటాఫ్
- 13 వేల ర్యాంకు వరకూ ఐఐటీల్లో సీటు
- ముగిసిన 'జోసా' కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) నిర్వహించిన కౌన్సెలింగ్ ఆరు రౌండ్లు పూర్తయింది. దీంతో ఐఐటీల్లో సీట్ల కేటాయింపు బుధవారంతో ముగిసింది. ఐఐటీల్లో 18,160 సీట్లుండగా.. వాటన్నింటినీ భర్తీ చేశారు. జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో (నిట్)లో సీట్ల భర్తీకి మరికొన్ని రౌండ్లు ఉన్నాయి. జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో మొత్తం 62,853 సీట్లున్నాయి. వాటికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఉమ్మడి ప్రవేశపరీక్ష నిర్వహించి ర్యాంకుల ఆధారంగా జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 2.5 లక్షల మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీటిల్లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా ఐఐటీల్లో సీట్లు కేటాయించారు. మిగతా సీట్లను జేఈఈ ర్యాంకుల ఆధారంగా భర్తీ చేశారు.

పెరిగిన కటాఫ్

ఈసారి ఐఐటీల్లో కటాఫ్ ర్యాంకులు పెరిగాయి. కంప్యూటర్ కోర్సులకు జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో 13 వేల లోపు ర్యాంకు వరకే సీట్లు వచ్చాయి. ఒక్క ముంబై ఐఐటీలో మాత్రం ఈ ఏడాదీ పోటీ కన్పించింది. సీఎస్ఈ బ్రాంచీకి ఐఐటీ హైదరాబాద్‌లో గత ఏడాది బాలురకు 656 ర్యాంకు వరకే సీటు వచ్చింది. తాజా కౌన్సెలింగ్‌లో 673 ర్యాంకు వరకూ సీటు వచ్చింది. ఇలా అన్ని ఐఐటీల్లోనూ ఇదే ట్రెండ్ కన్పించింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష కష్టంగా ఉందని విద్యార్థులు భావిస్తున్నారు. దీంతో జేఈఈ మెయిన్స్ వరకే చాలామంది పరిమితమవుతున్నారు. ఐఐటీలు కాకుండా నిట్ లేదా ట్రిపుల్ ఐటీల్లో సీట్లు పొందేందుకు ఇష్టపడుతున్నారు. ఇది కూడా సాధ్యం కాకపోతే రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో టాప్ కేటగిరీలోని వాటికి ప్రాధాన్యమిస్తున్నారు. అందుకే ఈసారి రాష్ట్ర ఎప్‌సెట్‌లో 5 వేల ర్యాంక్ వచ్చిన వారూ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేశారు. నిట్‌లో కూడా సీఎస్‌ఈకి భారీ డిమాండ్ కన్పించింది. ఓపెన్ కేటగిరీలో గరిష్టంగా 6 వేల ర్యాంకు వరకే సీట్లు వచ్చాయి. కెమికల్ ఇంజనీరింగ్‌లో 30 వేల ర్యాంకుపైన కూడా సీట్లు వచ్చాయి.

నేడు రాష్ట్ర కాలేజీల్లో సీట్ల కేటాయింపు

తెలంగాణ ఎప్‌సెట్ తొలి దశ సీట్ల కేటాయింపు శుక్రవారం చేపడతారు. జోసా కౌన్సెలింగ్ పూర్తవ్వడంతో జాతీయ కాలేజీల్లో సీట్లు రానివారు రాష్ట్ర కాలేజీల్లో చేరే వీలుంది. రాష్ట్రంలో 76,795 ఇంజనీరింగ్ సీట్లను కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తున్నారు. ఇందులో 70 శాతం కంప్యూటర్, ఎమర్జింగ్ కోర్సుల్లోనే ఉన్నాయి. 94,354 మంది 59 లక్షలకు పైగా వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. దీంతో సీట్ల కేటాయింపు విద్యార్థులకు కీలకంగా మారబోతోంది.

ఐఐటీల్లో ఓపెన్ కేటగిరీలో కంప్యూటర్ సైన్స్ కటాఫ్ ర్యాంకులు ఇలా..

ఐఐటీ	2025 బాలురు	2025 బాలికలు	2024 బాలురు	2024 బాలికలు
ముంబై	66	369	68	421
ఢిల్లీ	126	498	116	556
మద్రాస్	171	866	159	757
కాన్పూర్	271	1109	252	1117
ఖరగ్‌పూర్	466	1908	415	1661
రూర్కీ	592	2047	481	1870
హైదరాబాద్	673	2121	656	1809
తిరుపతి	5034	8459	5024	6324
గోవా	6242	12211	5371	11151
ధార్వాడ్	7208	10860	6375	11138
భిలాయ్	7382	12896	6516	11544

కేంద్ర ప్రభుత్వ సహకారంతో నడిచే కాలేజీల్లో సీట్లు ఇలా...

సంస్థలు	2022	2023	2024	2025
ఐఐటీలు	16,598	17,385	17,740	18,160
ఎన్ఐటీలు	23,994	23,954	24,229	24,525
ట్రిపుల్ ఐటీ	7,126	7,746	8,546	9,940
జీఎఫ్‌టీఐలు	6,759	8,067	9,402	10,228
మొత్తం	54,477	57,152	59,917	62,853



కటాఫ్ పెరిగింది

గతంతో పోలిస్తే ఈసారి ఐఐటీల్లో కటాఫ్ పెరిగింది. విద్యార్థులు అడ్వాన్స్‌డ్ కన్నా జేఈఈ మెయిన్‌తో ఆగిపోవడమే దీనికి కారణం. ఎన్ఐటీల్లో సీట్లు పొందడం, అక్కడ సాధ్యం కానప్పుడు రాష్ట్రంలోని టాప్ కాలేజీల్లో సీట్లు తెచ్చుకోవాలని భావిస్తున్నారు.

- ఎంఎన్ రావు, జేఈఈ అధ్యాపకులు

పేదలైతే చాలు.. సంక్షేమం గ్యారంటీ

ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ సంక్షేమ ఫలాలు

- మంత్రులు పొంగులేటి, సీతక్క
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మహిళా శక్తి సంబురాలు



ఇందిరమ్మ గృహ మంజూరు పత్రం అందజేస్తున్న పొంగులేటి, సీతక్క, కోరం కనకయ్య

ఇల్లెందు/సత్తుపల్లి/కూసుమంచి: ఏ పార్టీ వారైనా, ఏ కులం వారైనా, పేదవాడైతే చాలు.. ఇందిరమ్మ రాజ్యంలో తప్పకుండా సంక్షేమ ఫలాలు అందుతాయని గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తమది ఆడబిడ్డల ప్రభుత్వమని, వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఇల్లెందు, సత్తుపల్లి, కూసుమంచిలో నిర్వహించిన మహిళా శక్తి సంబురాల కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో పొంగులేటి మాట్లాడుతూ లక్ష మంది మహిళలను లక్షాధికారులను చేయాలనేది నాడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి నినాదమని, అదే స్ఫూర్తితో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. నాడు వైఎస్ రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తే.. నేడు తమ ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల లోపు వినియోగించేవారికి ఉచిత కరెంట్‌ను అందిస్తోందని చెప్పారు. రైతును రాజుగా చేస్తామన్న కేసీఆర్ పదేళ్లలో రూ.17 వేల కోట్ల రుణ మాఫీ చేస్తే తమ ప్రభుత్వం 10 నెలల్లోనే రూ.20 వేల కోట్లకు పైగా రైతుల రుణాలను మాఫీ చేసిందని వివరించారు. ఇన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్న కాంగ్రెస్ పార్టీని అందరూ ఆశీర్వదించాలని కోరారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి..: మహిళలు పురుషులపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదగాలని, ఈ మేరకు తమ ప్రభుత్వం అవసరమైన ఆర్థిక సాయం అందిస్తుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఇల్లెందులో జరిగిన మహిళా శక్తి వేడుకల్లో ఆమె మాట్లాడుతూ.. మహిళల కోసం సెర్ప్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని చెప్పారు. అనంతరం మహిళలకు వడ్డీ లేని రుణాలు, బీమా, బ్యాంక్ లింకేజీ తదితర పథకాల కింద రూ. 34 కోట్ల చెక్కులు, ఇందరమ్మ గృహ మంజూరు పత్రాలను పొంగులేటి, సీతక్క అందజేశారు.

రేవంత్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు చెల్లదు

- గచ్చిబౌలి పీఎస్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసిన హైకోర్టు
- ఘటనా స్థలంలో లేకున్నా కేసు నమోదు చేశారన్న జడ్జి
- తీర్పు వెలువరించవద్దని కోరిన ఫిర్యాదుదారు
- రిజర్వు చేశాక తీర్పివ్వడం కోర్టు విధి అన్న న్యాయమూర్తి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిపై 2016లో దాఖలైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును హైకోర్టు కొట్టివేసింది. నేరం జరిగిన ప్రదేశంలో ఆయన లేకున్నా తప్పుడు ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని స్పష్టం చేసింది. సాక్ష్యాధారాలు అందజేయడంలో ఫిర్యాదుదారు విఫలమయ్యారని వ్యాఖ్యానించింది. ఈ మేరకు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపనపల్లి గ్రామం సర్వే నంబర్ 127లోని 31.5 ఎకరాలపై ఫిర్యాదుదారు పెద్దిరాజుకు, ఎనుముల సోదరుల మధ్య వివాదం ఉంది. తన భూమిలోకి అక్రమంగా జొరబడి జేసీబీతో సొసైటీ గదిని కూల్చివేశారని, తనను కులంపేరుతో అసభ్యకరంగా దూషించారని పెద్దిరాజు ఫిర్యాదు చేశారు. దీంతో కొండల్‌రెడ్డిని ఏ-1గా, ఈ.లక్ష్మిని ఏ-2గా, రేవంత్‌రెడ్డిని ఏ-3గా పేర్కొంటూ పోలీసులు 2016లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ 2020లో రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

తీర్పు ఇవ్వకుండా ఆపలేం..

వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ మౌషుమీ భట్టాచార్య గత నెల 20న తీర్పు రిజర్వు చేసి గురువారం తుది ఉత్తర్వులు జారీ చేశారు. 'ఎస్సీ, ఎస్టీ(పీవోఏ) చట్టం 1989 కింద చార్జీషీట్‌లో పేర్కొన్న విషయాలకు కేసు విరుద్ధంగా ఉంది. ఈ కేసులో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 484 మేరకు పిటిషనర్‌పై అట్రాసిటీ కేసును రద్దు చేస్తున్నాం'అని తీర్పునిచ్చారు. అయితే, న్యాయమూర్తి తీర్పు ప్రకటించే సమయంలో ఫిర్యాదుదారు పెద్దిరాజు తరఫున బీఎస్ రావు కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసును మరో హైకోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో జూలై 12న పిటిషన్ దాఖలు చేశామని.. తీర్పు వెలువరించొద్దని కోరారు. తీర్పిచ్చేందుకు జాబితాలో పేర్కొన్న తర్వాత ఆపడం సాధ్యంకాదని న్యాయమూర్తి చెప్పారు.

మహిళా సంఘాలకు రూ.344 కోట్లు

- గ్రామీణ సంఘాలకు రూ.300 కోట్లు.. పట్టణాల్లో రూ.44 కోట్లు
- మహిళా శక్తి సంబురాల్లో అందజేసిన రాష్ట్ర ప్రభుత్వం
- నేటితో ముగియనున్న సంబురాలు

సాక్షి, హైదరాబాద్: ఇందిర మహిళా శక్తి సంబురాల్లో భాగంగా మహిళా సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.344 కోట్లు చెల్లించింది. ఇందులో గ్రామీణ మహిళా సంఘాలకు రూ.300 కోట్లు, పట్టణ మహిళా సంఘాలకు రూ.44 కోట్లు అందజేశారు. ఈ నెల 7 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సాగిన ఈ సంబరాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఈ సంబురాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని వడ్డీ చెక్కులను పంపిణీ చేశారు. స్వయం ఉపాధి నుంచి సంపద సృష్టి దాకా మహిళా సంఘాలు ఎదగడం పట్ల పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క హర్షం వ్యక్తంచేశారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇందిర మహిళా శక్తి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా ఏటా రూ.25 వేల కోట్లకు తగ్గకుండా బ్యాంకు లింకేజీ ద్వారా మహిళా సంఘాలకు ప్రభుత్వమే రుణాలను సమకూర్చాలని నిర్ణయించింది. మహిళలు తీసుకున్న లోన్లకు సకాలంలో వడ్డీలు చెల్లించడం ద్వారా ప్రమాద బీమా, లోన్ బీమా వంటి స్కీంలను అమలు చేస్తున్నారు.

ఓఆర్ఆర్ లోపల కల్లు దుకాణాలు బంద్!

సొసైటీల పరిధిలోని 454 దుకాణాల ఎత్తివేత, అలాగే టీఎఫ్‌టీ లైసెన్స్‌లు రద్దు

- ఎక్సైజ్ శాఖ నుంచి నివేదికలు తెప్పించుకున్న ప్రభుత్వం?
- కల్తీ కల్లును అరికట్టడానికి అధికార యంత్రాంగం సూచన!



సాక్షి, హైదరాబాద్: కల్లుపై నిషేధాన్ని హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా ఔటర్ రింగ్‌రోడ్డు లోపలి మొత్తం ప్రాంతాన్ని చేర్చాలని ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఎక్సైజ్ శాఖ నుంచి పూర్తి వివరాలను తెప్పించుకున్నట్లు సమాచారం. ఈ కల్లు దుకాణాలకు అవసరమైన చెట్లు లేకపోవడం వల్ల వ్యాపారులు అల్ప్రాజోలమ్ వినియోగించి కల్తీ కల్లు తయారు చేస్తున్నట్లు అధికార వర్గాలు కూడా వెల్లడిస్తున్నాయి. ఈ మధ్య కూకట్‌పల్లిలో కల్తీ కల్లు తాగి 10 మంది మరణించడం ఎక్సైజ్ శాఖను కుదిపేసింది. ఈ వ్యవహారంలో కొందరు అధికారులపై చర్యలు తీసుకున్నా.. కల్తీ కల్లు కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తప్పదన్న నిశ్చితాభిప్రాయానికి ప్రభుత్వం వచ్చినట్లు ఎక్సైజ్ వర్గాలు వెల్లడించాయి. ఔటర్ రింగ్ రోడ్డులోపల ఎన్ని దుకాణాలు ఉన్నాయన్న సమాచారంతో పాటు దానిపై ఆధారపడి ఉన్న వారి వివరాలను కూడా అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు రంగారెడ్డి ఎక్సైజ్ డివిజన్ పరిధిలోని మల్కాజి గిరి, మేడ్చల్, సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ల పరిధిలోని కల్లు దుకాణాల ఎత్తి వేతకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. కల్తీ కల్లు కారణంగా పది మంది మరణించడం ప్రభుత్వానికి మచ్చగా మారిందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ఓఆర్ఆర్ లోపల 390 సంఘాలు, 454 దుకాణాలు

ఔటర్ రింగ్ రోడ్డు లోపల తాటి కో ఆపరేటివ్ సొసైటీలు.. హైదరాబాద్‌లో 14 ఉండగా, వీటి కింద 53 కల్లు దుకాణాలు, సికింద్రాబాద్‌లో 31 సంఘాల పరిధిలో 50 కల్లు దుకాణాలు, రంగారెడ్డి జిల్లాలోని మల్కాజిగిరిలో 77 సంఘాల కింద 79 దుకాణాలు, మేడ్చల్ పరిధిలో 50 సంఘాల కింద 52 కల్లు దుకాణాలు, సరూర్‌నగర్ పరిధిలో 158 సంఘాల కింద 158 దుకాణాలు శంషాబాద్ పరిధిలో 60 సంఘాల కింద 62 దుకాణాలు ఉన్నాయి. మొత్తం 390 సంఘాల కింద 454 కల్లు దుకాణాలు ఉన్నట్లు ఎక్సైజ్‌శాఖ నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ప్రభుత్వం ఈ 454 కల్లు దుకాణాలను పూర్తిగా ఎత్తేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. దుకాణాల మూతతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ మినహా మేడ్చల్, మల్కాజిగిరి, శంషాబాద్, సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ల పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న టీఎఫ్‌టీ (ట్రీఫర్ ట్రేడ్) లైసెన్స్‌లు కూడా రద్దు అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరో పక్క ఎక్సైజ్, పోలీసులు, టీజీ న్యాబ్, కొత్తగా ఏర్పాటు చేసిన ఈగల్ నిఘా సంస్థలు కల్తీ కల్లు తయారుకు వినియోగించే అల్ప్రాజోలమ్, హైడ్రో క్లోరైడ్, డైజో ఫామ్ లాంటి నిషేధిత రసాయనాలను పూర్తిగా అరికట్టలేక పోతుండడంతో ప్రభుత్వం ఓఆర్ఆర్ పరిధి లోపల కల్లు అమ్మకాలను నిషేధించాలని భావిస్తున్నట్లు ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి.

ఎండీఎస్ కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్ వెబ్ ఆప్షన్లకు నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: ఎండీఎస్ కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్ వెబ్ ఆప్షన్ల నమోదుకు కాళోజీ హెల్త్ యూనివర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. గురువారం ఉదయం 8 గంటల నుంచి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల వరకూ వెబ్‌ఆప్షన్ల నమోదుకు గడువు ఇచ్చింది. మొదటి విడత కౌన్సెలింగ్‌లో సీటు వచ్చినా, కాలేజీల్లో చేరని విద్యార్థులు.. రెండో విడత కౌన్సెలింగ్‌కు అనర్హులని యూనివర్సిటీ స్పష్టం చేసింది. మొదటి విడతలో సీటు పొందని విద్యార్థులతో పాటు.. మొదటి విడతలో సీటు వచ్చి, కాలేజీల్లో చేరిన వారు రెండో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొంది. రెండో విడత కౌన్సెలింగ్‌కు అందుబాటులో ఉన్న సీట్ల వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో (http://knruhs.telangana.gov.in) పొందుపరిచారు. వెబ్ ఆప్షన్ల నమోదులో సమస్యలు, సందేహాలుంటే హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని వర్సిటీ సూచించింది. హెల్ప్‌లైన్ నంబర్లు: టెక్నికల్: 9059672216/7842136688, పేమెంట్ గేట్‌వే సమస్యలు: 9618240276, రెగ్యులేషన్స్: 7901098840/9490585796.

క్లుప్తంగా...

నేడు నాగర్‌కర్నూల్ జిల్లాలో సీఎం పర్యటన

సాక్షి, నాగర్‌కర్నూల్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించనున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెంట్లవెల్లి మండలం జటప్రోల్‌లో రూ.150 కోట్లతో 22 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. సీఎం హెలీకాప్టర్‌లో హైదరాబాద్ నుంచి బయలుదేరి.. జటప్రోల్ చేరుకుంటారు. ముందుగా గ్రామంలోని పురాతన మదనగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన, ఆ తర్వాత భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. సభలో ఇందిరా మహిళాశక్తి కింద స్వయం సహాయక బృందాల మహిళలకు వడ్డీలేని రుణాలను పంపిణీ చేయనున్నారు.

మన నీళ్లు మనకు రాకుండా కుట్ర

తెలంగాణ హక్కులను ఏపీకి రాసిస్తున్న రేవంత్: జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: నదీ జలాల్లో తెలంగాణ వాటా తెలంగాణకు రాకుండా చేసే కుట్ర జరుగుతోందని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి జి. జగదీశ్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణ వాదులు భయపడుతున్నది నిజం అవుతోందన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యేలు ఎన్.భాస్కర్‌రావు, గ్యాదరి కిషోర్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ హక్కును ఒక్కొక్కటిగా ఏపీకి కాంగ్రెస్ ప్రభుత్వం ధారాదత్తం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఢిల్లీ నుంచి వచ్చిన ఒక్క ఫోన్ కాల్‌తో రేవంత్‌రెడ్డి హుటాహుటిన వెళ్లాడు. ఓ పత్రిక ఢిల్లీ మీటింగ్‌కు సంబంధించి జలవివాదాలపై కమిటీ అని తెలంగాణలో, బనకచర్లపై కమిటీ అని ఏపీ ఎడిషన్‌లో పెట్టారు. ఇదొక్కటి చాలు తెలంగాణకు చేస్తున్న ద్రోహమేంటో తెలుసుకోవడానికి' అని జగదీశ్‌రెడ్డి అన్నారు.

తెలంగాణ హక్కులు కాలరాస్తున్న రేవంత్‌రెడ్డి


ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్: సాగునీటి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ హక్కులను కాలరాస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి గోదావరి నీళ్లను ఏపీ సీఎం చంద్రబాబుకు బహుమతిగా ఇచ్చారని మండిపడ్డారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో బనకచర్లపై అసలు చర్చే జరగలేదని రేవంత్ రెడ్డి బుకాయించారని, కానీ మొదట చర్చ జరిగిందే బనకచర్ల మీద అని తనకు స్పష్టమైన సమాచారం ఉందని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి నాన్ సీరియస్ ముఖ్యమంత్రి అని, తెలంగాణ హక్కులను కాలరాస్తున్న ఆయనకు పదవిలో కొనసాగే అర్హత లేదని ధ్వజమెత్తారు. కొప్పుల ఈశ్వర్‌కు టీబీజీకేఎస్ బాధ్యతలు అప్పగించడాన్ని స్వాగతిస్తున్నానని కవిత పేర్కొన్నారు.

వంశీచంద్‌రెడ్డికి ఏఐసీసీలో కీలక పదవి

దేశవ్యాప్తంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపికపై సమన్వయం, ఫీడ్‌బ్యాక్ బాధ్యత



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ కీలకంగా చేపట్టిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ వేగవంతానికి పార్టీ సీనియర్ నేత చల్లా వంశీచంద్‌రెడ్డిని ప్రత్యేక బాధ్యతలతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. పార్టీ సంస్థాగత విభాగం పరిధిలో వంశీచంద్‌రెడ్డి ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఆయన ప్రధానంగా వివిధ జిల్లాల్లో డీసీసీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియను సమన్వయం చేస్తారు. ఇప్పటికే నియమితులైన అధ్యక్షుల పనితీరు, సంస్థాగత ప్రభావాన్ని పర్యవేక్షించి ఫీడ్‌బ్యాక్ సేకరిస్తారు. రాష్ట్ర, జాతీయ నాయకత్వానికి ఈ ఫీడ్‌బ్యాక్‌ను సమర్పిస్తారు.

సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపండి

కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

- రీజనల్ రింగ్ రైలు ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వండి
- ఖాజీపేట రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయండి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో సెమీకండక్టర్ ప్రాజెక్టులకు త్వరితగతిన ఆమోదం తెలపాలని కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నూతన ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణం, ప్రపంచ స్థాయి పరిశోధన, అభివద్ధి కేంద్రాలు తెలంగాణలో ఉన్నాయని తెలిపారు. అందువల్ల ప్రతిపాదిత అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ (ఏఎస్ఐపీ) ప్రాజెక్టు, మైక్రో ఎల్ఈడీ డిస్‌ప్లే ఫ్యాబ్ ప్రాజెక్టు క్రిస్టల్ మ్యాట్రిక్స్‌కు ఆమోదం తెలపాలని కోరారు. రెండురోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా ఢిల్లీ వచ్చిన సీఎం..గురువారం రైల్ భవన్‌లో అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు రైల్వే ప్రాజెక్టులపై చర్చించారు. రంగారెడ్డి జిల్లా ముచ్చెర్లలో హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటుకు ఈఎంసీ 2.0 పథకం కింద తెలంగాణ ఇచ్చిన వినతిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రీజినల్ రింగు రోడ్డు సమీపంలో నూతన ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ పార్క్ ఏర్పాటు చేయాలని కోరారు. రీజినల్ రింగు రైలుకు అనుమతివ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఎం వినతులపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు.

హైదరాబాద్ డ్రైపోర్టు–బందరు లైన్ మంజూరు చేయండి

రాష్ట్రంలో రైల్వే అనుసంధానత పెంపు కోసం నూతన ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని అశ్వినీ వైష్ణవ్‌ను ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డుకు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టును ప్రతిపాదించామని..ఇందుకు రైల్వే బోర్డు ఇప్పటికే ఫైనల్ లొకేషన్ సర్వేకు అనుమతి ఇచ్చిందని తెలిపారు. రూ.8 వేల కోట్ల విలువైన ఈ ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. 'రీజినల్ రింగ్ రైలుతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానత పెరగడంతో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన స్టేషన్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది..'అని చెప్పారు. హైదరాబాద్ డ్రైపోర్టు నుంచి బందరు ఓడ రేవుకు అనుసంధానంగా రైలుమార్గం మంజూరు చేయాలని కోరా రు. ఔషధాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫుడ్ ప్రాసెసింగ్ ఉ త్పత్తుల ఎగుమతులకు ఈ మార్గం దోహదపడుతుందన్నారు.



గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయిన సీఎం రేవంత్, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్

కొత్త రైలు మార్గాలు మంజూరు చేయండి

ఖాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు అంశాన్ని సీఎం రేవంత్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రంలో రైల్వే ఆపరేషన్లను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఖాజీపేట రైల్వే డివిజన్ అవసరమని తెలిపారు. ప్రయాణికులకు భద్రత, వేగవంతమైన సేవల కోసం దీనిని ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా తెలంగాణలో వివిధ ప్రాంతాల అనుసంధానత, పారిశ్రామిక, వ్యవసాయక ఎగుమతులు, దిగుమతుల కోసం.. వెనుకబడిన ప్రాంతాల అభివద్ధికి నూతన రైలు మార్గాలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. వికారాబాద్–కృష్ణా (122 కి.మీ.–అంచనా వ్యయం రూ.2,677 కోట్లు) కల్వకుర్తి–మాచర్ల (100 కి.మీ.–అంచనా వ్యయం రూ.2 వేల కోట్లు), డోర్నకల్–గద్వాల (296 కి.మీ.–అంచనా వ్యయం రూ.6,512 కోట్లు), డోర్నకల్–మిర్యాలగూడ (97 కి.మీ.–అంచనా వ్యయం 2,184 కోట్లు) మార్గాలను వంద శాతం రైల్వే శాఖ వ్యయంతో మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎంపీలు పోరిక బలరాం నాయక్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, సురేశ్ షెట్కార్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్, ఆర్ అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు.

హరీశ్ వల్లే బనకచర్లకు అన్యాయం

- బీసీలపై కవిత మాటలు హాస్యాస్పదం: మహేశ్ గౌడ్
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 100 సీట్లు గెలవటం ఖాయం



మెదక్‌జోన్: బనకచర్ల విషయంలో రాష్ట్రానికి 200 టీఎంసీల నీరు చాలని సంతకం పెట్టి హరీశ్‌రావు తప్పు చేశారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఆరడుగులు పెరిగిన ఆయనకు బుద్ధి మాత్రం పెరగలేదని ఎద్దేవాచేశారు. సీఎం మాటలకు కౌంటర్‌గా ఏదో ఒకటి మాట్లాడి తన ఉనికిని చాటుకోవాలన్న తాపత్రయం తప్ప రాష్ట్ర ప్రయోజనాలు కనిపించడం లేదన్నారు. గురువారం రాత్రి మెదక్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బీఆర్‌ఎస్, బీజేపీకి చెందిన మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు కాంగ్రెస్‌లో చేరగా, వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. బనకచర్ల నుంచి వచ్చే ఒక్కబొట్టునూ వదలకుండా తెలంగాణ హక్కులను కాపాడే బాధ్యత తమ ప్రభుత్వానిదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో వంద సీట్లు గెలిచి అధికారంలోకి వస్తామన్నారు.

లక్షల కోట్లు అప్పులు చేసి..: పదేళ్లలో బీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని మహేశ్ గౌడ్ దుయ్యబట్టారు. మిగులు బడ్జెట్‌ను విచ్ఛిన్నం చేసి రూ.7.50 లక్షల కోట్లు అప్పులు చేసిన కేసీఆర్ ఫాంహౌస్‌లో నిద్ర పోతున్నారని ఎద్దేవా చేశారు. ఆయన చేసిన అప్పుకు సంబంధించి నెలకు రూ.6,500 కోట్ల వడ్డీ చెల్లించాల్సిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. ఖజానా ఖాళీగా ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తాము నెరవేర్చుతున్నామన్నారు. పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదన్నారు. బీసీలపై కవిత మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని చెప్పారు. తన పోరాటం వల్లే బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందంటూ కవిత మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తూ బీజేపీ అధికారంలోకి వచ్చి నేటికీ పదకొండున్నర సంవత్సరాలు అవుతోందన్నారు. బీజేపీ మతం పేరుచెప్పి రాజకీయాలు చేస్తే, బీఆర్‌ఎస్ అబద్ధాలు చెప్పి రాజకీయాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మంత్రి వివేక్, ఎమ్మెల్యే రోహిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీతో చర్చించొద్దా?

▶ మొదటి పేజీ తరువాయి

నొప్పొచ్చింది?. రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాలు కొనసాగాలి. మేము రాజకీయంగా బతకాలన్నది వారి కోరిక. అందుకే మా భేటీపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. కేంద్రంతో కలిసి పనిచేసేందుకు కూడా మాకెలాంటి అభ్యంతరం లేదు. నేనెవరికీ భయపడను. కేవలం సిస్టమ్‌కు మాత్రమే భయపడే వ్యక్తిని. నా ప్రాధాన్యత రాష్ట్రం. సమస్య ఉంటే చర్చలతో పరిష్కరించుకుంటా. కొట్లాట నా చివరి అస్త్రం. ఇదే ధోరణిలో కేంద్రంతో పాటు పక్క రాష్ట్రం ఏపీతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాం. కొట్లాడుకుంటూ పోతే పాలకులకు కాదు, ప్రజలకు నష్టం..' అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నదీ జలాల అంశంపై కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన భేటీలో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన సీఎం గురువారం తన అధికారిక నివాసంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. పలు అంశాలపై వివరంగా మాట్లాడారు. బీఆర్‌ఎస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

కేసీఆర్ రాజకీయ ప్రత్యర్థి మాత్రమే..

కేంద్ర జలశక్తి మంత్రి వద్ద సమావేశంలో బనకచర్లపై చర్చ జరగలేదు. జలశక్తి శాఖ తన ప్రకటనలో కూడా అదే చెప్పింది. ఆ భేటీ భవిష్యత్ కార్యాచరణకు రోడ్‌మ్యాప్ వంటిది. మేం పూర్తిగా కేంద్రానికి సహకరిస్తాం. వారి సహకారం తీసుకుంటాం. కలిసి పనిచేస్తాం. నిధులైనా, అనుమతులైనా అడగకపోతే ఎవరూ ఇవ్వరు. కాబట్టి అడిగి తీసుకుంటాం. కేంద్రం పిలిస్తే మీరెందుకు వెళ్తారని బీఆర్‌ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. కేంద్రం పిలిస్తే ఢిల్లీకి రాకుండా, ఫామ్‌హౌస్‌కు రావాలా? కేంద్రం వద్ద వాదన వినిపించకుండా, ఫామ్‌హౌస్‌లో వాదించాలా? కేసీఆర్‌తో నాకు ఎలాంటి శత్రుత్వం లేదు, ఆయన నాకు కేవలం రాజకీయ ప్రత్యర్థి మాత్రమే. ఆయనతో ఏ అంశంపై అయినా చర్చకు సిద్ధమే.

అన్నీ అధ్యయనం చేశాకే 'ఇచ్చంపల్లి'..

కేంద్ర ప్రభుత్వమే గోదావరి–కావేరి నదుల అనుసంధానంలో భాగంగా ఇచ్చంపల్లి–నాగార్జునసాగర్ ప్రతిపాదనను ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రానికి ప్రయోజనం కలిగించేదైతే ఈ లింక్‌పై చర్చిస్తామని కేంద్రానికి చెప్పాం. ఎప్పుడో తయారు చేసిన డీపీఆర్ ప్రకారం అయితే దీనికి ఒప్పుకునేది లేదు. అది తయారయ్యాక ఎగువ రాష్ట్రాల్లో అనేక ప్రాజెక్టులు వచ్చేశాయి. కాబట్టి ప్రస్తుతం నీటి లభ్యత ఎంత ఉందో తేలాలి. వందేళ్ల రాష్ట్ర అవసరాలకు సరిపడా నీటి లభ్యత, అవసరాలు అన్నీ అధ్యయనం చేశాకే ముందుకెళ్తాం తప్ప గుడ్డిగా వ్యవహరించం.

400 టీఎంసీలు చాలన్నది కేసీఆరే..

నీళ్ల ద్రోహి కేసీఆరే. 2004–2014 వరకు శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి రోజుకు 4.1 టీఎంసీల చొప్పున నీళ్లు తరలించుకుపోతే, 2014–23 మధ్య ఆ సామర్థ్యాన్ని ఏకంగా 9.6 టీఎంసీలకు పెంచనిచ్చింది కేసీఆరే. అంతకుముందు ఉమ్మడి ఏపీలో పదేళ్లలో 727 టీఎంసీలు ఏపీ తరలించుకుపోతే, బీఆర్‌ఎస్ పదేళ్ల హయాంలో ఏకంగా 1,200 టీఎంసీల నీటిని ఏపీకి పోనిచ్చాడు. దీన్నిబట్టి నీళ్ల ద్రోహి ఎవరో తెలుస్తోంది. మరోవైపు 2023లో కృష్ణా జలాల్లో 400 టీఎంసీలు చాలు అన్నది కేసీఆరే. గోదావరిలో 3వేల టీఎంసీలు వృధాగా పోతున్నాయి. వాటిని వాడుకోండని ఏపీకి చెప్పింది ఆయనే. ఇదే సమయంలో 'కాళేశ్వరం' కూలిపోతే ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు. మేం ఒక్కొక్కరిపై చర్యలు తీసుకుంటున్నాం. సినిమాల్లో విలన్లను ఆఖరిలో చంపినట్లు ఇక్కడా మెల్లగా అరెస్టులు జరుగుతాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్ అరెస్టు చివర్లోనే జరిగింది కదా.

42% రిజర్వేషన్ల అమలుపై ప్రత్యేక వ్యూహం

2014కు ముందు కాంగ్రెస్ పార్టీ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించింది. 2014లో కేసీఆర్ అధికారంలోకి వచ్చాక 23 శాతానికి తగ్గించారు. రిజర్వేషన్లు 50శాతం దాటకూడదని 2018లో పంచాయతీరాజ్ చట్టాన్ని తెచ్చి బీసీలకు అన్యాయం చేశారు. ప్రస్తుతం 50 శాతం క్యాప్‌ను ఎత్తివేస్తున్నాం. 42 శాతం రిజర్వేషన్ల అమలుపై మాకు ప్రత్యేక వ్యూహం ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను అమలు చేసి తీరుతాం. కోర్టు ఆదేశాల ప్రకారం సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు పెడతాం. అందుకే ఆర్డినెన్స్, మిగతా ప్రక్రియపై దృష్టి పెట్టాం. గుజరాత్, యూపీ, మహారాష్ట్రల్లో ముస్లింలకు రిజర్వేషన్లు తొలగించాక, తెలంగాణలో రిజర్వేషన్లపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడాలి. రాష్ట్రంలో రెండేళ్ల తర్వాతే కొత్త నామినేటెడ్ చైర్మన్ పోస్టులు ఇస్తాం. అప్పటివరకు ప్రస్తుత కార్పొరేషన్లకు డైరెక్టర్లు, సభ్యులను భర్తీ చేస్తాం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ కచ్చితంగా పోటీ చేస్తుంది.

మిగిలింది కేటీఆరే..

మున్సిపల్ శాఖలో అక్రమాలకు సంబంధించి కీలక అధికారి బాలకృష్ణ అరెస్టు అయ్యారని, ఇక మిగిలింది కేటీఆర్ మాత్రమేనని ముఖ్యమంత్రి అన్నారు. 'ఫోన్ ట్యాపింగ్ కేసులో ఒక్కొక్కరూ బయటకు వస్తున్నారు. కేసు ప్రస్తుతం హైకోర్టులో ఉంది. గతంలో నా ఫోన్ ట్యాప్ అయిందని చెప్పిన కిషన్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదు? ఏడాదిన్నరగా ప్రభాకరావును కాపాడింది ఎవరు? ఇదే బీజేపీ, బీఆర్‌ఎస్ కాదా?..' అని రేవంత్ ప్రశ్నించారు.

కేటీఆర్‌ది గంజాయి బ్యాచ్

కేటీఆర్‌ది గంజాయి బ్యాచ్ అని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 'ఆ గంజాయి బ్యాచ్ సవాల్ విసిరితే నేను స్పందించాలా? కేటీఆర్ బిజినెస్ భాగస్వామి కేదార్ రకరకాల డ్రగ్స్ వాడి దుబాయ్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. లిక్కర్‌లో కాక్‌టెయిల్ విన్నాం..కానీ ఇక్కడ గంజాయి, డ్రగ్స్ కాక్‌టెయిల్ అని వింటున్నాం. అతని ఫోరెన్సిక్ రిపోర్టును తెప్పించాం. సందర్భాన్ని బట్టి మీడియా ద్వారా బయటపెడతాం. అవసరమైతే అసెంబ్లీలో పెట్టడానికీ సిద్ధమే. ఆయన బావమరిది ఫాంహౌస్‌లో సమీప గ్యాంగ్ అంతా గంజాయి, డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడ్డారు. ఇలా కేటీఆర్ చుట్టూ ఉన్న వాళ్లంతా గంజాయి బ్యాచే..' అని సీఎం ఆరోపించారు.

లోకేశ్‌ను కేటీఆర్ చీకట్లో ఎందుకు కలిసినట్లు?

'నేను అధికారికంగా చర్చలో పాల్గొంటే తప్పు అంటున్నారు. మరి ఇటీవల ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను కేటీఆర్ ఎందుకు కలిశాడు?, చీకట్లో కలవాల్సిన అవసరం ఏముంది?. లోకేశ్‌తో భేటీ అయిన మాట వాస్తవం కాదా? చెప్పమనండి..' అని రేవంత్‌రెడ్డి సవాల్ చేశారు. లోకేశ్‌ను కలిసినట్లు మీకెలా తెలిసింది? మీరు కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారా? అని మీడియా ప్రశ్నించగా.. ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం తమకు లేదని ఆయన అన్నారు. ఆ విషయాన్ని మాకు కళ్ల ముందు ఉన్న వ్యక్తులే చెప్పారని తెలిపారు.

చంద్రబాబు స్క్రిప్టు.. రేవంత్ చిలక పలుకు

▶ మొదటి పేజీ తరువాయి

మార్చుకోకపోతే మరోసారి ఉద్యమానికి బీఆర్‌ఎస్ సిద్ధమవుతుందని హెచ్చరించారు.

చంద్రబాబు కనుసన్నల్లో కేంద్రం


కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చంద్రబాబు కనుసన్నల్లో నడుస్తోందని, తెలంగాణ జలవనరులను దోపిడీ చేయాలని చూస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండానే బనకచర్ల ప్రాజెక్టు కట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డికి తెలిసిందల్లా రియల్ ఎస్టేట్ వ్యాపారమేనని ఎద్దేవా చేశారు. రాయలసీమ, ఆంధ్రా కూడా బాగుండాలని.. అదే సమయంలో తెలంగాణ నీటి వాటా తేలాలని కేసీఆర్ కోరుకున్నట్లు చెప్పారు. తమకు ఆంధ్రా ప్రజలతో గొడవ లేదని స్పష్టంచేశారు. వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని. కన్నెపల్లిలో మోటార్లను ఆన్ చేస్తే తెలంగాణలో కరువు ఛాయలు ఉండవని అన్నారు.

డ్రగ్స్ కేసులో ఆధారాలు చూపాలి

సీఎం రేవంత్‌రెడ్డి మీడియా చిట్‌చాట్ పేరుతో తనపై విషం చిమ్ముతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం కార్యాలయానికి గౌరవం ఇచ్చి ఇప్పటి వరకు సంయమనం పాటించానని, ఇకపై ఊరుకోబోనని స్పష్టంచేశారు. డ్రగ్స్ కేసులో తనపై విచారణ జరుగుతుందని రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆధారం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. 'హైదరాబాద్‌లో నాతో ముఖాముఖి చర్చకు వచ్చే దమ్ము లేక ఢిల్లీకి వెళ్లి మరీ రేవంత్‌రెడ్డి నాపై బురద జల్లుతున్నారు. న్యాయస్థానాల పరిధి నుంచి తప్పించుకోవడానికే చిట్‌చాట్‌ల పేరుతో దొంగచాటు మాటలు మాట్లాడుతున్నారు. నా వ్యక్తిత్వ హననానికి సైతం పాల్పడుతున్నారు. ఇకపై వీటిని సహించేది లేదు. సీఎం చేసిన నిరాధార ఆరోపణలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది'అని హెచ్చరించారు.

రేవంత్‌వి చెత్త వ్యాఖ్యలు

- చీకటి బాగోతాన్ని కప్పి పుచ్చుకునేందుకే కేటీఆర్‌పై ఆరోపణలు
- మీడియాతో చిట్‌చాట్‌లో హరీశ్‌రావు
- మేం బనకచర్ల ప్రాజెక్టు గురించి మాట్లాడుతున్నాం
- ఆయన డ్రగ్స్ అంటూ మోకాలుకు, బోడిగుండుకు ముడి పెడుతున్నారు



సాక్షి, హైదరాబాద్: బనకచర్ల విషయంలో ఢిల్లీ సమావేశంలో తన నిజ స్వరూపాన్ని బట్టబయలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, తన చీకటి బాగోతాన్ని కప్పి పుచ్చుకునేందుకు కేటీఆర్‌పై చెత్త వ్యాఖ్యలు చేస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి పక్కన ఉన్న వారంతా గార్బేజ్ (చెత్త) బ్యాచేనని, కాలుష్యం అధికంగా ఉండే ఢిల్లీలో రేవంత్‌రెడ్డి చెత్త వ్యాఖ్యలతో అది మరింత పెరిగిందని ఎద్దేవా చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు.

బనకచర్లపై అబద్ధాలు చెబుతున్నారు..

'బనకచర్ల ప్రాజెక్టు ఢిల్లీ భేటీ ఎజెండాలో ఉందని ఏపీ ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు చెపుతుంటే, రేవంత్‌రెడ్డి అసలు చర్చకే రాలేదని అంటున్నారు. కేంద్ర జలశక్తి నిర్వహించిన సమావేశంలో బనకచర్లపై చర్చ జరిగినట్లు ఏపీలోని అన్ని పేపర్లలో వచ్చింది. లైయింగ్ సింప్రోమ్ అనే వ్యాధితో రేవంత్‌రెడ్డి బాధ పడుతున్నాడు. అందుకే అబద్ధాలు చెపుతున్నాడు.

కేటీఆర్ మీలా బ్యాగ్‌లు మోయలేదు..

మేము బనకచర్ల గురించి మాట్లాడుతుంటే ఆయన డ్రగ్స్, గంజాయి అంటూ మోకాళ్లకు, బోడి గుండుకు ముడి పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డిలా కేటీఆర్ బ్యాగ్‌లు మోయలేదు. ఆయన చుట్టూ ఉన్నవారు కూడా బ్యాగులు మోసేవారే. పరిపాలన అంటే బ్యాగ్‌లు మోసుడు కాదని రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలి. కేటీఆర్‌ను లోకేశ్ అర్ధరాత్రి పూట కలిశాడని అంటున్నాడు. రాష్ట్రంలో అర్ధరాత్రి పూట గోడలు దూకే అలవాటు రేవంత్‌రెడ్డికే ఉంది. ఎవడో దుబాయ్‌లో చనిపోతే కేటీఆర్‌కు ఏం సంబంధం? కేటీఆర్‌పై చేసిన ఆరోపణలకు రుజువులు ఉంటే చూపించాలి. లేదంటే కేటీఆర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలి..'అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

శాంతిభద్రతలు పూర్తిగా విఫలం

'కాంగ్రెస్ పార్టీ పాలనలో మలేరియా, డెంగ్యూ వంటి రోగాలతో గురుకుల పాఠశాలల విద్యార్థులు ఆస్పత్రుల్లో ఉంటున్నారు. మరోవైపు గ్రామాల్లో పాలన పడకేసింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయి. మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఇంటిపై, నా క్యాంపు కార్యాలయంపై, పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై, సునీత లక్ష్మారెడ్డిపై, మర్రి రాజశేఖర్‌రెడ్డిపై దాడికి దిగుతున్నారు..'అని మాజీ మంత్రి చెప్పారు.

మా ఫోన్లతో పాటు విలేకరులవీ ట్యాప్ చేస్తున్నారు..

'రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అండగా ఉంటున్నాడు కాబట్టే ఈడీ ఆయన్ను అరెస్టు చేయడం లేదు. మాపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు. ఇంటెలిజెన్స్ వ్యవస్థతో నిఘా పెట్టినా మాకేం కాదు. రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకుల ఫోన్లను ట్యాప్ చేస్తున్నాడు. విలేకరుల ఫోన్లు కూడా ట్యాప్ అవుతున్నాయి..'అని హరీశ్‌రావు ఆరోపించారు.

“ఎవరైతే విశ్వసించి, సత్కార్యాలు చేస్తారో వారికి మేము స్వర్గంలో గొప్ప భవనాలలో స్థిరనివాసం ఇస్తాము. దాని క్రింద సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ వారు శాశ్వతంగా ఉంటారు. సత్కార్యాలు చేసిన వారి ప్రతిఫలం ఎంత శ్రేష్ఠమైనది!

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 18 జూలై 2025

ఎన్నదగిన తీర్పు

తబ్లీగీ జమాత్‌తో సంబంధాలుండి, కరోనా మహమ్మారి వ్యాపించిన కాలంలో అక్రమంగా 190 మంది విదేశీయులకు వివిధ మసీదుల్లో ఆశ్రయం కల్పించిన కేసుల్లో మన పౌరులు 70 మందిపై దాఖలైన ఎఫ్ఐఆర్‌లనూ, తదుపరి విచారణలనూ, వివిధ కేసుల కింద వారిపై దాఖలైన చార్జిషీట్లనూ కొట్టివేస్తూ ఢిల్లీ హైకోర్టు గురువారం వెల్లడించిన తీర్పు అనేక విధాల ఎన్నదగినది. 2020 మార్చిలో 24 తేదీ నుంచి 30 వరకూ 195 మంది విదేశీయులకు ఆశ్రయమిచ్చారన్నది వీరిపై ప్రధాన ఆరోపణ. వాస్తవానికి విదేశీయుల్ని కూడా ఎఫ్ఐఆర్‌లలో ప్రస్తావించినా చార్జిషీట్లు దాఖలైన సమయానికి వారి పేర్లు తొలగించారు. ఒక నేరానికి రెండుసార్లు శిక్షించరాదన్న సూత్రాన్ని ఆధారం చేసుకుని కొందరిపై చార్జిషీట్ల దాఖలు సమయంలోనే మేజిస్ట్రేట్ కోర్టు నిరాకరించింది. ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్ మసీదులో వేలాది మందితో మార్చి మొదటివారంలో నిర్వహించిన మతపరమైన కార్యక్రమం సందర్భంగా ఈ కేసులు దాఖలయ్యాయి. అప్పుడున్న ప్రత్యేక పరిస్థితి వేరు. అది కోవిడ్ మహమ్మారి వ్యాపిస్తున్న సమయం. అందువల్ల వేలమంది కోవిడ్ నిబంధనలకు విరుద్ధంగా ఒకచోట గుమిగూడారన్నది ఆందోళనకరమే. చట్టవిరుద్ధమైనప్పుడు ఎవరినీ ఉపేక్షించాల్సిన అవసరం లేదు. కానీ అదేమీ రహస్య సమావేశం కాదు. ఆ కార్యక్రమానికి ప్రభుత్వ విభాగాల నుంచి నిర్వాహకులు ముందస్తు అనుమతులు పొందారు. మార్చి 24న రాత్రి దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించగా, అంతకుముందు మార్చి 13న దేశవ్యాప్తంగా అంటురోగాల చట్టం అమలవుతుందని ప్రకటించారు. అప్పటికి కూడా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కరోనా వైరస్‌ను 'ఆరోగ్యపరమైన ఆత్యయిక స్థితి'గా ఇంకా పరిగణించటం మొదలుపెట్టలేదు. అంతక్రితం అనుమతులిచ్చినా వాటిని రద్దుచేయకపోవటానికి ప్రభుత్వ విభాగాల్లో వ్యాధి తీవ్రత, పెనువేగంతో వ్యాపించే దాని తీరుతెన్నులపై అవగాహన లేకపోవటమే కారణం. తబ్లీగీ నిర్వాహకులు చెబుతున్న కారణాలు కూడా వున్నాయి. వ్యాధి తీవ్రత అర్థమైన తర్వాత అందరినీ స్వస్థలాలకు పంపించాలని నిర్ణయించినా లాక్‌డౌన్ వల్ల సాధ్యపడక వివిధ మసీదుల్లో ఆశ్రయమివ్వక తప్పలేదని వారి సంజాయిషీ.

కానీ ఈ కార్యక్రమాన్ని ప్రధాన స్రవంతి మీడియాతోపాటు సామాజిక మాధ్యమాలు ఒక భూతంలా చిత్రించాయి. కరోనా మహమ్మారిని వ్యాప్తి చేయటం కోసం కుట్రపూరితంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారన్న అపవాదు వేశారు. తబ్లీగీ ఒక 'సూపర్ స్ప్రెడర్' అనీ, దానివల్ల 4,000 మంది కరోనా బారిన పడ్డారని ప్రచారం సాగించారు. వారు సక్రమంగా వీసాలు తీసుకుని వచ్చిన విదేశీయులనీ, ఆ కార్యక్రమానికి అన్ని అనుమతులూ ఉన్నాయనీ తెలియనట్టు నటించారు. వచ్చిన వారంతా నిబంధనల ప్రకారం తమ తమ దేశాల్లో, భారత్ గడ్డపై అడుగుపెట్టాక ఇక్కడ కరోనా పరీక్షలు జరిపించుకుని, ఆ వైరస్ లేదని నిర్ధారణ అయినవారు. కరోనా తీవ్రత దాఖలా కనబడ్డాక నిర్వాహకుల వద్దకెళ్లి వెంటనే నిలిపేయాలని ఉత్తర్వులిస్తే తప్పు బట్టాల్సిన పని లేదు. అది చేయకుండా, విదేశాల నుంచి వచ్చినవారికి ప్రత్యామ్నాయ సదుపాయాలేమీ కల్పించకుండా మసీదుల్లో రహస్యంగా ఆశ్రయం పొందినట్టు చూపటం ద్వారా సాధించిందేమిటి? ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు అది పూర్తయ్యాక ప్రచారం నిమిత్తం దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లారు. అలాంటి వారిపై తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల్లో సైతం కేసులు నమోదయ్యాయి.

తబ్లీగీ కార్యక్రమాలు మన దేశానికి కొత్తగాదు. ప్రతి యేటా జరుగుతుంటాయి. ఢిల్లీకి సమీపంలోని మేవాత్‌లో మౌలానా మహమ్మద్ ఇలియాసి అనే ఆధ్యాత్మికవేత్త ముస్లిం మతానుయాయుల్లో ఆధ్యాత్మికత సన్నగిల్లుతున్నదని, స్వార్థం పెరిగి స్వప్రయోజనాలే పరమావధి అవుతున్నదని భావించి వారిలో కరుణ, దయ, నిరాడంబరత, ఆధ్యాత్మికత పెంపొందించటానికి తబ్లీగీని ప్రారంభించారు. దీనికి విదేశాల్లో సైతం ఆదరణ లభించటం, అక్కడినుంచి ఏటా వందల సంఖ్యలో హాజరై మతపరమైన మౌలిక విలువలు గ్రహించి, అటు తర్వాత ఆ మతస్థుల్లో వాటిని ప్రచారం చేయటం రివాజుగా వస్తోంది. తబ్లీగీ ప్రధాన కార్యాలయం మర్కజ్ మసీదులోనే వుంటుంది. బొంబాయి హైకోర్టు తబ్లీగీ అనుయాయుల విషయంలో పోలీసుల వైఖరిని 2021లో తీవ్రంగా తప్పు బట్టింది. మతపరమైన ఆదర్శాన్నీ, సంస్కరణనూ బోధించే యువకులను కోవిడ్ వ్యాప్తి చెందిన సమయంలో ఆదుకోవాల్సింది పోయి, వారిని జైలుపాలు చేయటం, అక్కడ దుర్భర పరిస్థితుల మధ్య వారు గడపాల్సి రావటం విచారకరమని వారిని విడుదల చేస్తూ ఇచ్చిన తీర్పులో న్యాయ మూర్తులు వ్యాఖ్యానించటం గమనార్హం. మద్రాసు, కర్ణాటక హైకోర్టులు సైతం తబ్లీగీలపై కేసులు బనాయించటం, వారిని నిర్బంధించటం అహేతుకం, అన్యాయం అని దుయ్యబట్టాయి.

తాజాగా ఢిల్లీ హైకోర్టు 70 మంది పౌరులను వివిధ కేసుల నుంచీ, ఎఫ్ఐఆర్‌ల నుంచీ, విచారణల నుంచీ విముక్తుల్ని చేయటం హర్షించదగ్గది. తప్పుడు ప్రచారాలకు దిగి, విద్వేషాలను రెచ్చగొట్టి తాత్కాలికంగా లబ్ధిపొందేవారు ఈ దేశంలో స్వతంత్ర న్యాయవ్యవస్థ వున్నదని, కొంత ఆలస్యం జరిగినా అంతిమంగా న్యాయం లభించటం ఖాయమని గుర్తించటం లేదు. సామాజిక మాధ్యమాల మాటెలా వున్నా, ప్రధాన స్రవంతి మీడియా సైతం వార్తలకు మతం రంగు పులిమి అపచారం చేస్తున్నదని సాక్షాత్తూ సుప్రీంకోర్టు 2021 సెప్టెంబర్‌లో వ్యాఖ్యానించింది. తాజా తీర్పయినా అటువంటివారి కళ్లు తెరిపించాలి. బాధ్యతాయుత ప్రవర్తనా శైలినీ, జవాబుదారీ తనాన్నీ వారిలో పెంపొందించాలి.

ప్రశ్నించడం ప్రజల హక్కు... బాధ్యత!

అభిప్రాయం



పి. వేణుగోపాల్ రెడ్డి

గతంలో రాజకీయాలు అంటే దేశ సేవ, ప్రజల కోసం పని చేయడం, న్యాయం కోసం పోరాటం అనే భావనలతో నిండిపోయి ఉండేది. లాల్ బహదూర్ శాస్త్రి, గాంధీ, నెహ్రూ, సర్దార్ వల్లభభాయ్ పటేల్, అంబేడ్కర్ వంటి చాలామంది నాయకులు రాజకీయాలను దేశ పునర్నిర్మాణానికి వేదికగా మలచారు. పదవులను ప్రజలు తమపై ఉంచిన అతి విలువైన బాధ్యతగా భావించి వారు. కానీ కాలం మారింది. ఆ ఆలోచనలు మరుగున పడిపోయాయి. ఇప్పుడు రాజకీయాలు అంటే, అధికారం కోసం పోటీ, డబ్బు సంపాదించేందుకు మార్గం, వ్యక్తిగత స్వప్రయోజనాల వేదికగా మారిపోయాయి. ఈ పరిణామం కేవలం మన దేశానికే కాదు, అనేక ప్రజాస్వామ్య దేశాలలోనూ కనిపిస్తోంది. మన దేశంలో, ఇది మరింత తీవ్రమవుతోంది.

ప్రజాస్వామ్య సూత్రాలకు వ్యతిరేకం

ఒకసారి రాజకీయ నాయకుడు అయిన తర్వాత, వారి ఆర్థిక బలం అమాంతం పెరిగిపోతుంది. పదవిలో ఉన్నవారికి లభించే వనరులు, అధికారాలు స్వార్థ ఆలోచనలకు దారి తీయడానికి ఉపయోగపడుతున్నాయి.

ఎన్నికల్లో విజయం సాధించడానికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఆ ఖర్చును తిరిగి సంపాదించేందుకు కాంట్రాక్టులు, కమీషన్లు, ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరుగుతోంది. వారి వ్యక్తిగత వ్యాపారాలకు పదవిని వాడుకుంటున్నారు. ప్రజల బదులుగా తమ లాభాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇది ప్రజాస్వామ్య మూల సూత్రాలకు వ్యతిరేకం.

ఎక్కువ మంది చెడు ఆలోచనలతో రాజకీయాలలోకి వస్తున్న కారణంగా, ఎవరైనా మంచి వ్యక్తి రాజకీయాల్లోకి వచ్చినా, సమాజం అతడిని అనుమానంగా చూస్తోంది. 'ఇతను డబ్బు, అధికారం కోసం వచ్చాడేమో', 'తన ఉద్దేశాలు నిజమా?' అనే ప్రశ్నలు వస్తున్నాయి. దానితో సామర్థ్యం, యోగ్యత గల నాయకులూ రాజకీయాలకు దూరంగా వెళ్ళిపోతున్నారు.

మంచి వ్యక్తులు రాజకీయాల్లోకి ఎందుకు రావడం లేదు? ఎన్నికల్లో పోటీ చేయాలంటే కోట్ల రూపాయలు ఖర్చవుతుందని భావన. ఈ మధ్య పంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు పదుల లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు ఇది భరించలేరు. 2019 లోక్‌సభ ఎన్నికలో – మొత్తం దేశవ్యాప్తంగా సుమారు 60,000 కోట్ల రూపాయలు ఖర్చయినట్టు అంచనా. ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ప్రజాస్వామ్య ఎన్నికగా గుర్తించబడింది. రాష్ట్ర స్థాయిలో, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని నియోజక వర్గాల్లో ఒక్కో అభ్యర్థి 10 కోట్లకు పైగా ఖర్చు చేసినట్టు సమాచారం. దీనివల్ల సామాన్యులకు, నిష్కల్మషమైన వారికి ఎదగడానికి అవకాశాలు రావడం లేదు.



◆ 2019 లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా సుమారు రూ. 60,000 కోట్లు ఖర్చయినట్టు అంచనా. ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ప్రజాస్వామ్య ఎన్నికగా గుర్తించబడింది. మరి మంచి వ్యక్తులను రాజకీయాల్లోకి తేవడం ఎలా? ప్రభుత్వమే కొంతవరకు ఖర్చును భరించాలి. ఎన్నికల ఖర్చు అదుపులో ఉంటే, సామాన్యులూ పోటీ చేయగలుగుతారు.

నాయకులు ఎదిగేలా...

రాజకీయాలు దేశ అభివృద్ధికి మూలం. పాలనలో తగిన మార్గదర్శకత్వం ఉంటేనే ప్రజలకు మంచి విద్య, మెరుగైన వైద్యం, ఉద్యోగ అవకాశాలు, మహిళల భద్రత, రైతుల సంక్షేమం వంటివి అందుతాయి. పాలన బాగుండాలి అంటే నాయకులు బాగుండాలి. మరి మంచి వ్యక్తులను రాజకీయాల్లోకి తేవడం ఎలా సాధ్యం?

ప్రభుత్వమే కొంతవరకు ఖర్చును భరించాలి. ఎన్నికల్లో ఖర్చు అదుపులో ఉంటే, సామాన్యులూ పోటీ చేయగలుగుతారు. చిన్ననాటి నుంచే ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు గురించి విద్యార్థులకు బోధించాలి. యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి. నాయకత్వ లక్షణాలను ఎదగనివ్వాలి. ఆసక్తి గల యువతకు తగిన శిక్షణ ఇప్పించాలి. నిజాయితీ గల నాయకులను ఆదర్శంగా చూపించడం ద్వారా మరిన్ని మంచి వ్యక్తులు ప్రేరణ పొందుతారు. వ్యక్తిగత, పార్టీల దూషణలకు పోకుండా సమాజంలోని సమస్యలు, వాటి పరిష్కారాలకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రచారం చేయాలి. మంచి వ్యక్తులు రాజకీయ పార్టీలకు చెందకపోయినా, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తే, ప్రజలు వారికి మద్దతివ్వాలి.

ప్రజాస్వామ్యంలో అధికారం ఓటర్లదే. కానీ ఓటుతో పాటు బాధ్యత కూడా మనదే. దేశ పాలన మెరుగవ్వాలంటే మంచి నాయకులకు మద్దతు ఇవ్వాలి. మంచి వ్యక్తులు రాజకీయాల్లోకి రావాలని ప్రోత్సహించాలి. మనం తీసుకునే ఒక నిర్ణయం దేశ భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. అందుకే పౌరుడిగా దేశ భవిష్యత్తును మెరుగు పరచే బాధ్యత మనపై ఉంది.

నాయకత్వం అంటే పదవి కాదు, అది బాధ్యత. ఒక నిజమైన నాయకుడు ప్రజల సమస్యలను విని, వాటికి పరిష్కారం చూపే విధంగా పనిచేయాలి. ప్రజల పట్ల బాధ్యతతో, నిస్వార్థంగా, నిజాయితీతో ఉండే వ్యక్తులే మంచి నాయకులవుతారు. దేశానికి అవసరం అయినది – సేవాభావంతో పనిచేసే నాయకులు. అలాంటి నైపుణ్యం ఉన్నవారు ఎక్కడైనా ఉండవచ్చు – డాక్టర్లు, ఇంజినీర్లు, ఉపాధ్యాయులు, రైతులు, ఉద్యోగులు. వీరి అనుభవం సమాజానికి ఎంతో మేలు చేస్తుంది. పాలన అనేది కేవలం రాజకీయ నాయకుల పని కాదు. అది చైతన్యవంతులైన ప్రతి పౌరుడి బాధ్యత. సమాజానికి ఉపయోగపడాలనే సంకల్పంతో ముందుకు వచ్చేవారు మాత్రమే ప్రజలకు నిజమైన మార్గదర్శకులవుతారు. అలాంటి వారికి మద్దతు ఇవ్వాలి. అప్పుడే దేశం నిజమైన అభివృద్ధి దిశగా నడుస్తుంది.

నిలదీతే మార్గం

మంచి రాజకీయం కోసం పౌరులుగా మన మొదటి బాధ్యత ఓటు హక్కు వినియోగం. ఓటు వేయడం కేవలం హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా. మన సమాజానికి శ్రేయస్కరంగా పనిచేసే నాయకులను ఎంచుకోవాలి. ఓటు వేయకపోవడం లేదా ప్రలోభాలకు లొంగి ఓటు వేయడం మన భవిష్యత్తుకే ప్రమాదం.

రాజకీయాలలో అవినీతి పెరిగిపోతున్నదంటే, దానికి కారణం సరైన నాయకులను ఎన్నుకోకపోవడమే. వారు ఎవరైనా సరే – వారి వర్గం, కులం, పార్టీని పక్కన పెట్టి, వారి సేవా దృక్పథాన్ని పరిశీలించి ఓటు వేయాలి. ప్రశ్నించే ధైర్యంకూడా మన బాధ్యతలలో ఒకటి. అధికారంలో ఉన్నవారు ప్రజల సేవకు వచ్చారు... వాళ్ల పని తీరును ప్రశ్నించాలి, తప్పుంటే నిలదీయాలి. ప్రజలు నిశ్శబ్దంగా ఉంటే, పాలకులు తప్పుడు దారిలో వెళ్తారు.

అంతేకాక, యువత రాజకీయాల్లోకి రావాలి. విద్యావంతులు, విలువలతో కూడిన వ్యక్తులు రాజకీయాల్లోకి అడుగుపెడితేనే మార్పు వస్తుంది. దేశం ఎలా ఉండాలన్నది మన చేతుల్లో ఉంది. మంచి రాజకీయ వాతావరణం కోసం ప్రతి పౌరుడు చైతన్యంతో, నైతికంగా, బాధ్యతగా ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే, పౌరుల భాగస్వామ్యం అత్యంత అవసరం. ఒక మంచి దేశం కోసం, మంచి నాయకత్వం అవసరం. ఒక మంచి నాయకత్వం కోసం, మనం ముందడుగు వేయాలి.

వ్యాసకర్త 'ఏకలవ్య ఫౌండేషన్' ఛైర్మన్
pvg2020@gmail.com

సోషల్ మీడియా

మనసు దిశలో పయనం



మనసు పవనాలు వీచిన దిశగా నేను వెళ్లడానికి ప్రయత్నిస్తాను, వాటికి వ్యతిరేకంగా కాదు. సృజనాత్మక పవనం వీస్తున్నదని అనిపించినప్పుడు, ఇతర పనులన్నీ పక్కనబెట్టి, క్రియేటివ్ టాస్కుల మీద దృష్టి పెడతాను. అలాంటిదేమీ లేనప్పుడు, రాయడానికి నన్ను నేను ఒత్తిడికి గురిచేసుకోను. బదులుగా మెయిల్స్‌కు జవాబివ్వడం, గిన్నెలు తోమడం లాంటి తప్పక చేయని పనులను చేస్తాను. ఈ పద్ధతి అలవర్చుకోవడానికి నాకు చాలాకాలం పట్టింది. అంతకుముందు మనసు పవనాల దిశలో పోకుండా వాటిని నియంత్రించడానికి ప్రయత్నించేవాడిని. సృజనాత్మకత కోసం ఒత్తిడి చేస్తే మనసు మరింత నీరసపడేది.

– యువల్ నోవా హరారీ, పాపులర్ హిస్టారియన్

ఎలా అవుతుంది?



ప్రపంచానికి ఇండియా ఆహార అన్నపూర్ణ కానుందని కేంద్ర వ్యవసాయ మంత్రి ప్రకటించడం సంతోషం. కానీ వెంటనే పాడయ్యే ఆహారోత్పత్తుల్లో 70 శాతం పొలాల్లోనే పాడవకుండా ఆపగలిగే కోల్డ్ స్టోరేజ్ చైన్లు లేకుండా ఇది ఎలా సాధ్యమో ఆయన వివరించగలరా?

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

ఆరోగ్య కదలిక



మీరు అధికంగా బరువు లేకపోయినా, స్థూలకాయులు కాకపోయినా ఎక్కువగా కూర్చుని ఉండటం వల్ల (రోజుకు 7.1 గంటల కన్నా ఎక్కువ) మద్యేతర ఫ్యాటీ లివర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఎక్కువ. రోజుకు 10 గంటల కన్నా ఎక్కువ కూర్చుంటే మరింత ప్రమాదం. ఆ రిస్కును తగ్గించుకోవడానికి కనీసం అరగంట, గంటకోసారి నిల్చోండి, నడవండి, కొద్దిగానైనా కదలండి.

– సరియాక్ అబ్బీ ఫిలిప్స్, హెపటాలజిస్ట్

వాడుకున్నవాళ్లకు వాడుకున్నంత...



మీరు మేధాపరంగా సోమరి అయితే, ఏఐ మిమ్మల్ని మరింత సోమరిగా మార్చుతుంది. అదే మీరు మేధను బాగా వాడుకునేవాళ్లయితే, మిమ్మల్ని ఏఐ మరింత పెద్దవాళ్లను చేస్తుంది.

– పెడ్రో డొమింగోస్, కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్

మార్పును కోరుకుంటే...



మన అలవాట్లు, సంస్కారాలను తరచి చూసుకుంటే – మనం ఏం మార్చుకోవాలో మనకు తెలుస్తుంది; మనం ఎందుకు మారాలో తెలుస్తుంది; మనం ఎలా మారాలో తెలుస్తుంది. అయినా మార్పు రావట్లేదా? ఎందుకు, ఏమిటి, ఎలా మారాలి అనేది మన లోలోపల మారాలన్న తపన గాఢంగా ఉన్నప్పుడే పనిచేస్తుంది.

– బి.కె. శివాని, ఆధ్యాత్మిక బోధకురాలు

ఇన్ బాక్స్

నిస్వార్థ నాయకుడు

యూసీసీఆర్ఐ (ఎం–ఎల్) నాయకత్వ కమిటీ సభ్యుడు, కమ్యూనిస్టు విప్లవ కారుల ప్రియతమ నాయకుడు కామ్రేడ్ విజయ్ 2025 జూలై 12న మరణించారు. కామ్రేడ్స్ దేవులపల్లి వెంకటేశ్వరరావు (డీవీ), తరిమెల నాగిరెడ్డి (టీఎన్) విప్లవ బాటలో కమ్యూనిస్టు విప్లవ లక్ష్యం కోసం తన జీవితం చివరి క్షణం వరకు పోరాడారాయన. ఆనాటి మద్రాస్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లాలోని లంకపల్లి గ్రామంలో 1951 మార్చి 19న జన్మించారు. విద్యాభ్యాసం అనంతరం హైదరాబాదులో ఎన్ఎఫ్‌సీ కంపెనీలో కార్మికునిగా చేరారు.



కామ్రేడ్ విజయ్

తన అన్నగారి ఇల్లు డీవీ, టీఎన్‌ల నాయకత్వంలో పనిచేస్తున్న కమ్యూనిస్టు విప్లవ కారుల కార్యకలాపాలకు 1970–74 కాలంలో కేంద్రంగా ఉండేది. దీంతో విప్లవ భావజాలంతో, రాజకీయాలతో గాఢంగా ప్రభావితులయ్యారు. దేశంలో ఎమర్జెన్సీ విధించిన కాలంలో తాను పని చేస్తున్న ఎన్ఎఫ్‌సీ కంపెనీలోని వేలాది మంది కార్మికులతో వారు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం ప్రారంభించారు. తమ కంపెనీ కార్మికులతో 58 రోజులపాటు చారిత్రాత్మకమైన సమ్మెను నిర్వహించారు. క్రమంగా ఆయన తన కార్యకలాపాలను జంట నగరాలలోని ఇతర ప్రభుత్వ రంగ సంస్థలకు, కార్మిక కేంద్రాలకు విస్తరింపజేశారు.


కామ్రేడ్ విజయ్ 1981లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఆనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా కమ్యూనిస్టు విప్లవోద్యమాన్ని విస్తరింప జేయటానికి వృత్తి విప్లవకారునిగా తన మొత్తం సమయాన్ని వెచ్చించారు. ఆ తర్వాత కాలంలో కోస్తా, రాయలసీమ జిల్లాల్లో విప్లవోద్యమాన్ని నిర్మించటానికీ, కమ్యూనిస్టు విప్లవకారుల సంస్థ నిర్మాణాన్ని అభివృద్ధి చేయటానికీ కృషి చేశారు.

విప్లవ లక్ష్యం పట్ల తదేక దీక్ష, క్రమశిక్షణ, నిస్వార్థ దృష్టి, త్యాగ నిరతి, మచ్చలేని వ్యక్తిత్వం, అనుకున్న లక్ష్యాలను సాధించటంలో నేర్పరితనం వంటివి ఆయన విశిష్ట లక్షణాలు. ఆయన ఆశయాలకు పాటు పడటమే ఆయనకు ఇవ్వగల నిజమైన నివాళి.

– సి. భాస్కర్ । యు.సి.సి.ఆర్.ఐ. (ఎం–ఎల్) సభ్యుడు

విచారణా లేదు... విడుదలా లేదు!

సందర్భం



ఎన్. వేణుగోపాల్

‘‘అన్యాయం ఏ ఒక్కరికి జరిగినా అందరికీ హెచ్చరికే, ఏ ఒక్కచోట జరిగినా అంతటా న్యాయానికి ప్రమాద హెచ్చరికే’’ అని మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ 1963లో బర్మింగ్ హామ్ జైలు నుంచి రాసిన లేఖలో అన్నాడు. మానవ హక్కుల ఉల్లంఘనల విషయంలో వందల, వేలసార్లు ఉటంకించబడిన వాక్యం అది. కానీ అదే సమయంలో లక్షలసార్లు మరచిపోతున్న వాక్యం కూడా. ముఖ్యంగా భారత ప్రభుత్వం ఎడాపెడా అమలు చేస్తున్న అక్రమ జైలు నిర్బంధం అనే అన్యాయపు సందర్భంలో ఈ వాక్యం గుర్తుకు రాకుండా ఉండదు.

దేశంలో నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ఇస్తున్న అధికారిక గణాంకాల ప్రకారం, 2022 డిసెంబర్ 31 నాటికి దేశంలోని జైళ్లలో ఉన్న 5,73,220 మంది ఖైదీలలో 4,34,302 మంది విచారణలో ఉన్న ఖైదీలే. అంటే జైళ్లలో ఉన్న వారిలో నూటికి 76 మంది తమ నేరం రుజువై శిక్ష అనుభవిస్తున్న వాళ్లు కాదు, కేవలం విచారణలో ఉన్న వాళ్లన్నమాట! సాధారణంగా భారత న్యాయ తత్వశాస్త్రంలో ‘బెయిల్ సాధారణం, జైలు మినహాయింపు’ అని జస్టిస్ వీఆర్ కృష్ణయ్యర్ 1977లో ప్రకటించిన సూత్రాన్ని పాటించడం దశాబ్దాలుగా కొనసాగుతున్నది. కానీ చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధ చట్టం (అన్‌లాఫుల్ ఆక్టివిటీస్ ప్రివెన్షన్ ఆక్ట్ – యూఏపీఏ) కింద నమోదైన కేసులలో బెయిల్ ఇవ్వడానికి నిబంధనలను కఠినతరం చేశారు. దేశవ్యాప్తంగా వేలాది మందిని ఆ చట్టం కింద కేసులలోనే నిర్బంధిస్తున్నారు. అందువల్ల ఏళ్లకు ఏళ్లు గడిచిపోతున్నా ఆ కేసులు విచారణకూ రావు, ఈలోగా ఖైదీలు బెయిల్ మీద విడుదలయ్యే అవకాశమూ లేదు.

యూఏపీఏ నేరాలను ఎంత అస్పష్టంగా, ఎంత విశాలంగా నిర్వచించిందంటే... ప్రభుత్వం, పోలీసు అధికారులు తలచుకుంటే ఎవరినైనా, ఏ పని చేసినందుకైనా, చేయనందుకైనా ఆ చట్టం కింద నిందితులుగా చూపవచ్చు. విచారణంటూ జరిగితే, ఆ కాలంలో బెయిల్ మీద విడుదల చేయకుండా ఉండవచ్చు. విచారణను తాత్సారం చేసి ఏళ్ల తరబడి జైలులో ఉంచవచ్చు. ఆ అస్పష్ట నేరం కింద ఏడెనిమిదేళ్లుగా విచారణ లేకుండా, బెయిల్‌పై విడుదల లేకుండా వందలాది మంది జైళ్లలో మగ్గిపోతున్నారు. ఆ చట్టం కింద 23 ఏళ్ల జైలులో ఉండి, చివరికి నిర్దోషిగా విడుదలైన వారు కూడా ఉన్నారు.

ఇలాంటి అక్రమ కేసుల నుంచి వేలాది ఆదివాసులకు విముక్తి కలిగించిన వారు నాగపూర్‌కు చెందిన న్యాయవాది సురేంద్ర గడ్లింగ్. అటువంటిది ఆయనే స్వయంగా ఏడేళ్లకు పైగా భీమా కోరేగాం కేసులో విచారణ లేకుండా, బెయిల్ రాకుండా జైలులో ఉన్నారు. ప్రైమ్ మినిస్టర్ రీసర్చ్ ఫెలోషిప్ కింద ఆదివాసీ ప్రాంతాలలో క్షేత్ర పరిశోధన చేస్తున్న పరిశోధక విద్యార్థి మహేష్ రౌత్ కూడా అదే కేసులో 2018 జూన్ 6 నుంచి జైలులో ఉన్నారు.



◆ యూఏపీఏ కేసులలో కఠినమైన బెయిల్ నిబంధనలు ఉన్నా, ఏపీ, తెలంగాణలలో న్యాయమూర్తులు బెయిల్ ఇస్తున్నారనీ, అరెస్టు వంటి నిర్బంధ చర్యలకు పాల్పడగూడదని ఆదేశాలు ఇస్తున్నారనీ నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఈ రెండు రాష్ట్రాల కార్యకర్తలను పొరుగు రాష్ట్రాల అక్రమ కేసుల్లో నిందితులుగా చూపుతున్నది.

యూఏపీఏ కేసులలో కఠిన తరమైన బెయిల్ నిబంధనలు ఉన్నప్పటికీ, ఏపీ, తెలంగాణలలో న్యాయమూర్తులు బెయిల్ ఇస్తున్నారనీ, అరెస్టు వంటి నిర్బంధ చర్యలకు పాల్పడగూడదని ఆదేశాలు ఇస్తున్నారనీ, ఆగ్రహించిన కేంద్ర దర్యాప్తు సంస్థ నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఈ రెండు రాష్ట్రాల కార్యకర్తలను పొరుగు రాష్ట్రాల అక్రమ కేసుల్లో నిందితులుగా చూపుతున్నది. ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్ జిల్లా నాగర్నార్ పోలీస్ స్టేషన్ పరిధిలో తిరియా గ్రామం దగ్గర 2019 జూలైలో నమోదైన కేసు ఒకటి ఉంది. అడవిలో సీఆర్పీ, డీఆర్జీ, ఎస్టీఎఫ్ బలగాలకూ – మావోయిస్టులకూ జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులూ, ఒక గ్రామస్థుడూ చనిపోయారనీ, ఘటనాస్థలిలో దొరికిన డైరీలో కొందరి పేర్లు ఉన్నాయనీ పోలీసులు ప్రకటించారు. అలా చనిపోయిన మావోయిస్టులనూ, పారిపోయారంటున్న మావోయిస్టులనూ, డైరీల్లో ఉన్నాయని చెపుతున్న తెలుగువారి పేర్లనూ కలిపి 2019 జూలై 28న కేసు పెట్టారు. రెండేళ్ల తర్వాత 2021 మార్చిలో ఈ కేసును ఎన్ఐఏ తన అధీనంలోకి తీసుకుంది.

ఈ కేసులో భాగంగా డొంగరి దేవేంద్ర, చుక్క శిల్పలను 2022 జూన్‌లో అరెస్టు చేసి మరెన్నో కేసుల్లో నిందితులుగా చూపారు. పద్మ అంతకు ముందు ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నో అక్రమ కేసుల్లో పదేళ్ల జైలు జీవితం గడిపి, అన్ని కేసులలోనూ నిర్దోషిగా విడుదలై, హైదరాబాద్ వచ్చి ఎల్ఎల్‌బీ పూర్తిచేసి న్యాయవాదిగా ఉండగా, 2023 జూన్‌లో అరెస్టు చేసి ఈ ఛత్తీస్‌గఢ్ కేసులో జైలుకు పంపారు. అలాగే 2021లో మరణించిన మావోయిస్టు పార్టీ నాయకుడు రామకృష్ణ సహచరి, ప్రకాశం జిల్లా ఆలకూరపాడులో సాధారణ జీవితంలో ఉన్న కందుల శిరీషను, ఆంధ్రప్రదేశ్ కుల నిర్మూలనా పోరాట సమితి అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్‌ను 2023 జూలై 21న అరెస్టు చేసి ఈ కేసులో నిందితులుగా ఛత్తీస్‌గఢ్‌లో జైలులో నిర్బంధించారు. రెండేళ్లు గడిచినా విచారణా లేదు, బెయిలూ లేదు.

దుడ్డు ప్రభాకర్ 1985 కారంచేడు నరమేధం నాటికి చీరాలలో పీజీ విద్యార్థిగా ఉంటూ, ఆ నరమేధానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనతో కుల నిర్మూలన రాజకీయాలలో ప్రవేశించారు. దళితులపై దాడులు జరిగిన చీమకుర్తి, వై చెర్లోపల్లి, వేంపెంట, రాజుపాలెం, చుండూరు, లక్ష్మింపేట తదితర ఎన్నోచోట్ల ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నారు. ఈ క్రమంలో ఎన్నో అక్రమ కేసులను ఎదుర్కొన్నారు. 'కుల నిర్మూలన' మాసపత్రికకు సంపాదకులుగా పని చేశారు. ఆయన గొంతు వినిపించకుండా చేయాలని, బెయిల్ ఇవ్వకుండా సుదీర్ఘకాలం జైలులో ఉంచాలని ఈ కేసులో నిందితులుగా చూపారు. చార్జిషీట్ ప్రకారమే చూసినా ఈ కేసులో ఉన్న తెలుగు వారెవరికీ ఎటువంటి నేరంతో, ఘటనతో, ప్రాణ నష్టంతో, ఆస్తి నష్టంతో సంబంధం లేదు. అది ఎవరిదో తెలియని, అసలు ఉందో లేదో తెలియని ఒక డైరీలో వీళ్ల పేర్లు ఉన్నాయనేది మాత్రమే ఆరోపణ. ఆ ఆరోపణ మీద విచారణ కూడా జరపకుండా రెండేళ్లకు పైగా జైలులో మగ్గిపోయేలా చేసిన ఘనమైన చట్టబద్ధ పాలన మనది!

వ్యాసకర్త 'వీక్షణం' సంపాదకుడు

సర్వజ్ఞుల మాటలు

అల్లుళ్లనీ, కూతుర్నీ చూసివద్దామని వెళ్ళినప్పుడు, ఎదురొచ్చి సాదరంగా ఆహ్వానించి, తగిన మర్యాదలు చేయలేదని శంకరుడిపై కోపగించిన దక్షుడు, ప్రతీకారంగా శంకరుడిని అవమానించాలనే ఆలోచనతో ఒక యజ్ఞం చేయడానికి పూనుకున్నాడు. ఆ యజ్ఞానికి శంకరుడిని తప్ప సకల దేవతలనూ, మునిగణాలనూ పిలిచాడు.

జ్యోతిర్మయం

అది తెలుసుకున్న నారదుడు వెంటనే కైలాసానికి వెళ్ళి పార్వతితో, 'అమ్మా, మీ తండ్రిగారికి ఏమైందో తెలియడం లేదు. మీ ఇరువురనూ తప్ప మిగతా అందరినీ పిలిచి, అన్ని హంగులతో యాగం చేస్తున్నాడు. వినడానికే నాకు బాగా అనిపించక, నీ చెవిన వేసి పోదామని వచ్చాను. వచ్చిన పని అయిపోయింది. ఇక వెళ్ళొస్తాను!' అని చెప్పి, అగ్గి రాజేసి వెళ్ళిపోయాడు. తండ్రి చేస్తున్న యజ్ఞాన్ని చూడాలని పార్వతికి మనసులో కోరిక కలిగింది. అయితే, పిలవని పేరంటానికి వెళ్ళడం ఎలాగ? కలత చెందిన మనస్సుతో, చెప్పాలా వద్దా అని సందేహిస్తూనే, విషయం శంకరుడి చెవిలో వేసింది. సతి మాటలలోని ఉద్దేశాన్ని గ్రహించిన శంకరుడు ఇలా సమాధానం చెప్పాడన్నాడు పోతన, తాను రచించిన 'వీరభద్ర విజయం' కావ్యం ప్రథమాశ్వాసంలో:

మెచ్చని మామలిండ్లకును మేకొని శోభనవేళ బిల్వమిన్
పొచ్చముగల్గుటో దగుట పోలదు నల్లుర కెజ్జగంబులం
బొచ్చెము లేదు కన్యలకు బుట్టినయిండ్లకు బోవ లోకము
న్మెచ్చును బొమ్ము పబ్బముకు మీతలిదండ్రుల జూడ భైదలీ!

'తనను ఇష్టపడని మామల ఇండ్లలో జరిగే శుభ కార్యాలకు, ఆహ్వానం లేకుండా వెళ్ళడం ఏ లోకంలోని అల్లుళ్ళకైనా మర్యాద కాదు. అయితే, ఆహ్వానం లేనప్పటికీ కన్యలకు తమ పుట్టినిండ్లకు వెళ్ళడానికి ఎటువంటి అభ్యంతరమూ లేదు. లోకం మెచ్చుకుంటుంది కూడా! అందువలన, మీ తల్లిదండ్రులను చూడటానికి నీవు వెళ్ళు!' అలా పార్వతి పుట్టినింటికి వెళ్ళింది. కానీ తిరిగి రాలేదు. పుట్టినింట్లో జరిగిన అవమానాన్ని భరించలేక, శివుడిని మనసులో తలుచుకుని శివయోగవహ్నిని మేలుకొలిపి, ఆ ఘోరాగ్నిలో తనను తాను భస్మం చేసుకుంది. శివుడి ఆజ్ఞ లేకుండా చీమైనా కుట్టదు. కనుకనే, జరగబోయేది తెలిసిన శంకరుడు పార్వతిని 'పోయిరమ్మని' అనకుండా, కేవలం 'పొమ్ము పబ్బమునకు' అని మాత్రమే అన్నాడు. సర్వజ్ఞుల మాటలు భవిష్యత్తుకు దర్పణములుగా భాసిల్లుతాయి.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.అష్టమి ప.3.56 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** అశ్వని రా.1.57 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** రా.10.13 నుండి 11.43 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.12 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.23 వరకు, **అమృత ఘడియలు:** రా.7.11 నుండి 8.41 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.38, **సూర్యాస్తమయం:** 6.34.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
జిల్లా కలెక్టరు వారి కార్యాలయం, సంగారెడ్డి జిల్లా

ఫైల్ నెం. G1/1190/2018 **ప్రాథమిక ప్రకటన** తేది: 03-07-2025

ఫారమ్ -VI

(చట్టం 30/2013 యొక్క సెక్షన్ నెం. 11 (1) మరియు రూల్ 19 యొక్క సెక్షన్ రూల్ (1) చూడగలరు)

తెలంగాణ ప్రభుత్వము / కలెక్టర్ సంగారెడ్డి గారు కలిగియున్న సంగారెడ్డి జిల్లా ఝరాసంఘం మండలం, ఎల్లోయ్ గ్రామంలో దాదాపు ఎ.195.13 గుంటల భూమి [illegible] ప్రజా ప్రయోజనార్థము [illegible] ఆవశ్యకత ఉన్నదని భావించడం జరిగింది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము జి.ఓ.యం.యస్. నం. 53 ఇండస్ట్రీస్ & కామర్స్ (ఐ.పి.ఈ.ఐ.ఎన్.ఎఫ్.), తేది: 01.08.2017, ద్వారా [illegible] భూసేకరణ చట్టం [illegible] 2013/30 [illegible] షెడ్యూల్-II మరియు III లను [illegible]. ఇట్టి మెమో తెలంగాణ [illegible] నం. నెం.234 తేది: 17.08.2017 నందు ప్రచురించబడినది.

తదనుగుణంగా పై ప్రాజెక్ట్ కోసం [illegible] సంగారెడ్డి జిల్లా ఝరాసంఘం మండలం ఎల్లోయ్ గ్రామములో దాదాపు ఎ.195.13 గుం. గల భూమి ఈ దిగువ చూపిన ప్రకారం సేకరించుటకు గాను [illegible] జారీచేయనైనది.

జిల్లా: సంగారెడ్డి | మండలం: ఝరాసంఘం | గ్రామం: ఎల్లోయ్

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	125	[illegible]	[illegible]	1.00	బాలాయ్య తం పాపయ్య	TSIIC	TSIIC	TSIIC	TSIIC	0	0	0	0
మొత్తం:				1.00									
2	255/అ	[illegible]	[illegible]	0.37	దత్తు తం ఖదిమన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
3	255/ఆ1/1	[illegible]	[illegible]	0.37	మల్లన్న తం ఖదిమన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
4	255/ఇ	[illegible]	[illegible]	1.34	సంగన్న తం ఏరన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
5	255/ఈ	[illegible]	[illegible]	1.34	నర్సమ్మ [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				5.22									
6	256/ఇ	[illegible]	[illegible]	1.09	హుస్సేన్ అలి తం పీరాన్ సబ్	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
7	258/ఇ	[illegible]	[illegible]	2.18	దుందప్ప తం మల్లప్ప	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
8	258/ఇ2	[illegible]	[illegible]	1.10	సుల్తానా బేగం [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				4.37									
9	259/ఆ1/2	[illegible]	[illegible]	0.10	అంజన్న తం రామన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
10	259/ఆ3/1	[illegible]	[illegible]	0.09	అంజన్న తం రామన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
11	259/ఆ1/అ	[illegible]	[illegible]	0.08	అంజన్న తం రామన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
12	259/అ3	[illegible]	[illegible]	0.23	అంజన్న తం రామన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
13	259/అ1/1	[illegible]	[illegible]	0.14	రామచందర్ తం రామన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
14	259/ఆ1/2	[illegible]	[illegible]	0.08	రామచందర్ తం రామన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
15	259/ఇ4	[illegible]	[illegible]	0.19	సంగన్న తం పెంటయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
16	259/ఉ2	[illegible]	[illegible]	0.18	ఈరన్న తం పాపయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
17	259/ఉ1	[illegible]	[illegible]	0.18	నారాయణ తం పాపయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
18	259/ఉ3	[illegible]	[illegible]	0.19	మల్లయ్య తం పెంటయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
19	259/ఉ4/1	[illegible]	[illegible]	0.14	CH నర్సింలు తం వీరన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
20	259/ఊ	[illegible]	[illegible]	0.18	దశరథ విఠల్ తం బంటి నర్సన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
21	259/ఊ/2	[illegible]	[illegible]	2.12	దశరథ నరేష్ తం బంటి పెంటన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
22	259/ఊ/2	[illegible]	[illegible]	2.12	దశరథ అంజన్న తం బంటి పెంటన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				9.03									
23	260/ఆ	[illegible]	[illegible]	0.20	రామచందర్ తం రామన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
24	260/ఇ	[illegible]	[illegible]	1.11	నారాయణ తం వీరన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
25	260/ఈ	[illegible]	[illegible]	1.11	పద్మిని తం మల్లన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
26	260/ఉ	[illegible]	[illegible]	1.13	అరుణమ్మ భర్త మాణిక్ రావు	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
27	260/ఉ1/ఆ	[illegible]	[illegible]	0.20	CH నర్సింలు తం రాములు	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
28	260/ఉ/1/1	[illegible]	[illegible]	0.05	కమ్మరి గోవర్ధన్ తం [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
29	260/ఉ/2	[illegible]	[illegible]	1.00	కమ్మరి విష్ణు వర్ధన్ తం కమ్మరి గోవర్ధన్	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
30	260/ఉ1/2	[illegible]	[illegible]	0.30	కమ్మరి విజయ లక్ష్మి [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
31	260/ఉ/1/2	[illegible]	[illegible]	1.00	కమ్మరి మహేష్ తం కమ్మరి గోవర్ధన్	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				7.30									
32	261/1/2	[illegible]	[illegible]	0.20	వెంకన్న తం చంద్రన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
33	261/1/1	[illegible]	[illegible]	1.01	మాణమ్మ భర్త మల్లన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
34	261/2	[illegible]	[illegible]	0.20	విఠల్ తం చంద్రన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
35	261/ఇ	[illegible]	[illegible]	2.00	డి. అంజన్న తం మాణెప్ప	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
36	261/ఆ1	[illegible]	[illegible]	1.00	డి. బాబురావు తం మాణెప్ప	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
37	261/ఆ2	[illegible]	[illegible]	1.00	డి. బాబురావు తం మాణెప్ప	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				6.01									
38	262/ఆ2	[illegible]	[illegible]	0.11	శివన్న తం చంద్రన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
39	262/ఆ/1/2	[illegible]	[illegible]	0.05	మల్లన్న తం నర్సన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
40	262/ఇ1/1	[illegible]	[illegible]	0.13	విఠలప్ప భర్త అంజన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
41	262/ఇ2/1	[illegible]	[illegible]	0.11	విఠల్ తం చంద్రన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
42	262/ఇ3	[illegible]	[illegible]	0.21	పెద్దగొల్ల పద్మ D/o పెద్దగొల్ల [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
43	262/ఈ1	[illegible]	[illegible]	0.05	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
44	262/ఈ1/2	[illegible]	[illegible]	1.10	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
45	262/ఈ2	[illegible]	[illegible]	0.05	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
46	262/ఉ1/2	[illegible]	[illegible]	0.09	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				3.10									
47	263/ఆ/2	[illegible]	[illegible]	0.01	మాణెప్ప భర్త నర్సన్న	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
48	263/ఇ3	[illegible]	[illegible]	0.13	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
49	263/ఆ1	[illegible]	[illegible]	0.13	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
50	263/ఈ1	[illegible]	[illegible]	0.28	సయ్యద్ అలి తం మీరాన్ సాబ్	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
51	263/అ	[illegible]	[illegible]	1.15	హుస్సేన్ అలి తం మీరాన్ సాబ్	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
52	263/ఆ6	[illegible]	[illegible]	1.15	సయ్యద్ అలి తం మీరాన్ సాబ్	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
53	263/ఇ	[illegible]	[illegible]	0.09	సయ్యద్ అంజాద్ మియా తం సయ్యద్ హుస్సేన్ అలి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
54	263/ఈ	[illegible]	[illegible]	0.19	సయ్యద్ అజర్ మియా తం సయ్యద్ హుస్సేన్ అలి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
55	263/ఉ/2	[illegible]	[illegible]	0.13	పాషా మియా తం [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
56	263/ఊ1	[illegible]	[illegible]	0.03	బాబు మియా తం పీర్సాబ్	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
57	263/ఊ1	[illegible]	[illegible]	0.18	బాబు మియా తం పీర్సాబ్	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
58	263/ఎ1	[illegible]	[illegible]	0.04	బాబు మియా తం పీర్సాబ్	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
59	263/ఎ2	[illegible]	[illegible]	0.03	బాబు మియా తం పీర్సాబ్	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
60	263/ఏ	[illegible]	[illegible]	0.03	బాబు మియా తం పీర్సాబ్	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
61	263/ఏ2	[illegible]	[illegible]	0.03	బాబు మియా తం పీర్సాబ్	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
62	263/ఐ1	[illegible]	[illegible]	0.03	ఫిరోజ్ మియా తం బాబు మియా	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
63	263/ఒ/2	[illegible]	[illegible]	0.09	ఇస్మాయిల్ సాబ్ [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
64	263/ఒ/1	[illegible]	[illegible]	0.27	పెద్దగొల్ల పద్మ D/o పెద్దగొల్ల [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
65	263/ఓ	[illegible]	[illegible]	0.14	పెద్దగొల్ల పద్మ D/o పెద్దగొల్ల [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
66	263/ఔ1	[illegible]	[illegible]	0.13	పెద్దగొల్ల పద్మ D/o పెద్దగొల్ల [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
67	263/ఔ/1	[illegible]	[illegible]	0.09	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
68	263/ఔ/4	[illegible]	[illegible]	0.12	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				3.07									
69	264/ఆ1	[illegible]	[illegible]	0.39	మాణెప్ప తం లక్ష్మయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
70	264/ఆ3/1	[illegible]	[illegible]	0.26	ఈశ్వర్ తం విఠల్	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
71	264/ఆ1/1	[illegible]	[illegible]	0.13	ఈశ్వర్ తం విఠల్	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
72	264/ఇ2	[illegible]	[illegible]	0.13	రాజు తం విఠల్	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
73	264/ఆ2/2	[illegible]	[illegible]	0.26	రాజు తం విఠల్	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
74	264/ఇ	[illegible]	[illegible]	1.11	రత్నమ్మ భర్త [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
75	264/ఆ2	[illegible]	[illegible]	0.38	రత్నమ్మ భర్త [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
76	264/ఇ3	[illegible]	[illegible]	0.38	రత్నమ్మ భర్త [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
77	264/ఉ1/1	[illegible]	[illegible]	0.10	శివమ్మ భర్త మాణెప్ప	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
78	264/ఊ	[illegible]	[illegible]	0.28	శివమ్మ భర్త [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
79	264/ఎ1/2	[illegible]	[illegible]	0.12	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
80	264/ఎ3/1	[illegible]	[illegible]	0.25 38	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
81	264/ఎ1/3	[illegible]	[illegible]	0.12	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
82	264/ఏ3/2	[illegible]	[illegible]	0.25 50	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
83	264/ఏ/2	[illegible]	[illegible]	0.25 50	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
84	264/ఐ/1	[illegible]	[illegible]	0.25 50	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
85	264/ఒ	[illegible]	[illegible]	1.12	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				11.20									
86	265/ఆ2	[illegible]	[illegible]	0.31	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
87	265/ఇ	[illegible]	[illegible]	1.05	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
88	265/ఈ1	[illegible]	[illegible]	0.31	M నర్సన్న [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
89	265/ఉ	[illegible]	[illegible]	0.31	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
90	265/ఊ1/2	[illegible]	[illegible]	0.23 50	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
91	265/ఊ1/1	[illegible]	[illegible]	0.23 50	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				4.25									
92	266/ఆ1	[illegible]	[illegible]	0.22	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
93	266/ఇ1	[illegible]	[illegible]	1.05	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
94	266/ఈ3/2	[illegible]	[illegible]	0.20	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
95	266/ఈ/1/1	[illegible]	[illegible]	1.05	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
96	266/ఉ/3/1	[illegible]	[illegible]	0.05	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
97	266/ఊ1/1	[illegible]	[illegible]	0.23	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
98	266/ఊ/2	[illegible]	[illegible]	1.05	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
99	266/ఎ1/2	[illegible]	[illegible]	1.05	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
100	266/ఏ3/2	[illegible]	[illegible]	0.20	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				6.30									
101	270/ఆ1/1	[illegible]	[illegible]	0.06	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
102	270/అ1	[illegible]	[illegible]	2.13	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
103	270/ఆ2	[illegible]	[illegible]	1.00	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
104	270/ఇ3	[illegible]	[illegible]	0.16	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
105	270/ఈ1/2	[illegible]	[illegible]	0.06	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
106	270/ఈ4	[illegible]	[illegible]	0.13	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
107	270/ఉ2	[illegible]	[illegible]	0.13	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
108	270/ఉ1	[illegible]	[illegible]	0.13	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
109	270/ఊ1/3	[illegible]	[illegible]	0.06	CH నర్సింలు [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
110	270/ఊ4	[illegible]	[illegible]	0.16	CH నర్సింలు [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
111	270/ఎ3	[illegible]	[illegible]	0.13	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
112	270/ఏ	[illegible]	[illegible]	0.14	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				6.09									
113	271/ఆ1	[illegible]	[illegible]	2.22	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
114	271/ఇ	[illegible]	[illegible]	2.22	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
115	271/ఆ1	[illegible]	[illegible]	2.22	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
116	271/ఆ2	[illegible]	[illegible]	2.22	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				10.08									
117	272/ఆ1/4/2	[illegible]	[illegible]	0.20	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
118	272/ఆ1/3/8	[illegible]	[illegible]	1.00	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
119	272/ఇ	[illegible]	[illegible]	5.08	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
120	272/ఆ2/1/1	[illegible]	[illegible]	1.04	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
121	272/ఆ1/1/1	[illegible]	[illegible]	0.11	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
122	272/ఇ4	[illegible]	[illegible]	0.08	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
123	272/ఈ/2/3	[illegible]	[illegible]	0.32	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
124	272/ఈ/2	[illegible]	[illegible]	0.32	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
125	272/ఈ2	[illegible]	[illegible]	0.07	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
126	272/ఉ1	[illegible]	[illegible]	0.07	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
127	272/ఉ3/ఇ	[illegible]	[illegible]	0.33	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
128	272/ఊ	[illegible]	[illegible]	2.24	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
129	272/ఊ1	[illegible]	[illegible]	2.23	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
130	272/ఎ1/2/1	[illegible]	[illegible]	0.20	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
131	272/ఎ1/1	[illegible]	[illegible]	1.13	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
132	272/ఏ1	[illegible]	[illegible]	1.00	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
133	272/ఏ1/3	[illegible]	[illegible]	0.09	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
134	272/ఐ/2/1/1/1	[illegible]	[illegible]	0.05	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
135	272/ఒ	[illegible]	[illegible]	0.07	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
136	272/ఒ1	[illegible]	[illegible]	0.07	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
137	272/ఒ1/3	[illegible]	[illegible]	0.12	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
138	272/ఓ3/1	[illegible]	[illegible]	0.06	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
139	272/ఔ2/1/2	[illegible]	[illegible]	0.02	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
140	272/ఔ/2/1/1/2	[illegible]	[illegible]	0.20	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				20.20									
141	282/ఆ	[illegible]	[illegible]	2.00	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
142	282/ఆ1/ఇ	[illegible]	[illegible]	1.00	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
143	282/ఇ	[illegible]	[illegible]	3.20	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
144	282/ఈ/1/1/1	[illegible]	[illegible]	0.02	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
145	282/ఉ4	[illegible]	[illegible]	1.22	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
146	282/ఉ4/1	[illegible]	[illegible]	1.22	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
147	282/ఊ	[illegible]	[illegible]	4.22	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
148	282/ఎ1/1	[illegible]	[illegible]	0.20	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
149	282/ఏ1/1	[illegible]	[illegible]	1.20	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
150	282/ఐ/2	[illegible]	[illegible]	1.21	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
151	282/ఐ3/1/2/1	[illegible]	[illegible]	0.11	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
152	283/ఆ3/1/3	[illegible]	[illegible]	0.20	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
153	282/ఒ/2	[illegible]	[illegible]	0.13	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
154	282/ఓ/1/2	[illegible]	[illegible]	0.15	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
155	282/ఔ/1/1/2	[illegible]	[illegible]	0.03	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
156	282/ఔ3/1	[illegible]	[illegible]	0.03	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				19.16									
157	283/ఆ1	[illegible]	[illegible]	2.00	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
158	283/ఆ1	[illegible]	[illegible]	2.28	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
159	283/ఆ2/3	[illegible]	[illegible]	1.00	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
160	283/ఇ3	[illegible]	[illegible]	1.28	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
161	283/ఈ1/1	[illegible]	[illegible]	0.19	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
162	283/ఈ1/1	[illegible]	[illegible]	0.28	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
163	283/ఉ4	[illegible]	[illegible]	0.13	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
164	283/ఉ2/1	[illegible]	[illegible]	0.29	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
165	283/ఊ3/8	[illegible]	[illegible]	0.31	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
166	283/ఎ2/1	[illegible]	[illegible]	1.00	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
167	283/ఏ3/1	[illegible]	[illegible]	0.16	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
168	283/ఐ3	[illegible]	[illegible]	2.00	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
169	283/ఒ2	[illegible]	[illegible]	0.28	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
170	283/ఓ2/1	[illegible]	[illegible]	0.11	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
171	283/ఔ/1	[illegible]	[illegible]	1.14	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
172	283/ఔ2/1/1	[illegible]	[illegible]	0.01	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
173	283/ఔ3/4	[illegible]	[illegible]	0.32	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
174	283/ఆ3	[illegible]	[illegible]	0.32	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
175	283/ఆ2/3	[illegible]	[illegible]	0.20	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
176	283/ఆ3/1	[illegible]	[illegible]	1.00	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
177	283/ఇ1	[illegible]	[illegible]	0.28	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
178	283/ఇ1/1	[illegible]	[illegible]	1.00	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
179	283/ఇ/2/2	[illegible]	[illegible]	0.14	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
180	283/ఈ/2	[illegible]	[illegible]	0.11	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
181	283/ఈ/2/1/1	[illegible]	[illegible]	0.06	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
182	283/ఉ/2	[illegible]	[illegible]	0.17	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
183	283/ఉ/2/2	[illegible]	[illegible]	0.20	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
184	283/ఊ1/2	[illegible]	[illegible]	1.00	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
185	283/ఊ1/1	[illegible]	[illegible]	0.07	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
186	283/ఎ1/2	[illegible]	[illegible]	0.06	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
187	283/ఏ1/2	[illegible]	[illegible]	0.13	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				24.11									
188	284/ఆ	[illegible]	[illegible]	3.00	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
189	284/ఇ4	[illegible]	[illegible]	0.24	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
190	284/ఈ2	[illegible]	[illegible]	0.24	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
191	284/ఉ1	[illegible]	[illegible]	0.24	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
192	284/ఊ1	[illegible]	[illegible]	0.25	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				10.17									
193	290/ఆ1	[illegible]	[illegible]	1.18	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
194	290/ఇ1	[illegible]	[illegible]	1.19	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
195	290/ఈ/1/2	[illegible]	[illegible]	0.17	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
196	290/ఉ1	[illegible]	[illegible]	1.19	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
197	290/ఊ2	[illegible]	[illegible]	1.18	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
198	290/ఎ	[illegible]	[illegible]	1.10	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
199	290/ఏ1	[illegible]	[illegible]	1.10	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				8.31									
200	291/ఆ	[illegible]	[illegible]	2.00	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
201	291/ఇ	[illegible]	[illegible]	1.02	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				3.02									
202	293/ఆ	[illegible]	[illegible]	0.28	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
203	293/ఇ1	[illegible]	[illegible]	0.28	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
204	293/ఈ	[illegible]	[illegible]	1.16	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
205	293/ఉ1	[illegible]	[illegible]	0.38	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
206	293/ఊ	[illegible]	[illegible]	1.16	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
207	293/ఎ	[illegible]	[illegible]	0.18	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				6.24									
208	294/ఆ1	[illegible]	[illegible]	0.21	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
209	294/ఇ1	[illegible]	[illegible]	1.10	N. అంజన్న [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
210	294/ఈ1	[illegible]	[illegible]	0.21	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
211	294/ఉ4	[illegible]	[illegible]	0.21	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
212	294/ఊ4	[illegible]	[illegible]	0.13	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
213	294/ఎ2	[illegible]	[illegible]	0.21	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
214	294/ఏ/2	[illegible]	[illegible]	0.26	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
215	294/ఐ7/1	[illegible]	[illegible]	0.26	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				4.39									
216	295	[illegible]	[illegible]	3.12	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				3.12									
217	296/ఆ1	[illegible]	[illegible]	2.20	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
218	296/ఇ3	[illegible]	[illegible]	1.07	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
219	296/ఈ1	[illegible]	[illegible]	1.06	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
220	296/ఉ2	[illegible]	[illegible]	1.06	G. [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
221	296/ఊ1	[illegible]	[illegible]	1.00	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				6.39									
222	297	[illegible]	[illegible]	2.30	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తం:				2.30									
పూర్తి మొత్తం:				195.13									

భూసేకరణ [illegible] పునరావాసములో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టం 2013 (చట్టం నం.30/2013) యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిబంధనల క్రింద సంబంధితులందరికి ఈ ప్రకటనను చేయడమైనది.

సదరు భూమి యొక్క ప్లానును జిల్లా కలెక్టర్, సంగారెడ్డి మరియు ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు భూసేకరణ [illegible] ప్రాజెక్ట్ జహీరాబాద్ కార్యాలయం నందు ఏదేని పని దినములో పని వేళల్లో పరిశీలించవచ్చును.

సదరు చట్టం యొక్క సెక్షన్ 12లో [illegible] భూమిలో ప్రవేశించుటకు మరియు భూమిని సర్వే చేయుటకు, [illegible] భూమి యొక్క లెవెల్స్ ను తీసుకోవడానికి, భూమి లోపల బోర్లు [illegible] [illegible] ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు భూసేకరణ [illegible] ప్రాజెక్ట్ జహీరాబాద్ మరియు వారి సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వము / కలెక్టరు అధికారమిచ్చారు.

చట్టం యొక్క సెక్షన్ 11(4) ననుసరించి కలెక్టర్ గారి నుండి ముందస్తు అనుమతి లేకుండా ఈ నోటిఫికేషన్ ప్రచురణ తేది నుంచి సదరు భూమికి సంబంధించి ఏవేని [illegible] / [illegible] చేయరాదు [illegible].

[illegible] సెక్షన్ 15 కింద [illegible] ఈ నోటిఫికేషన్ ప్రచురణ తేది నుంచి 60 (అరవై) రోజుల్లోపు తమ అభ్యంతరాలను జిల్లా కలెక్టర్, సంగారెడ్డి / ప్రత్యేక ఉప కలెక్టర్ [illegible] ప్రాజెక్ట్ సమక్షంలో దాఖలు చేయవలెను.

సం/-	సం/-	సం/-	సం/-
తహసీల్దార్ ఝరాసంగం	ప్రత్యేక ఉప కలెక్టర్ [illegible] ప్రాజెక్ట్, జహీరాబాద్	అదనపు కలెక్టర్ సంగారెడ్డి జిల్లా	కలెక్టర్ సంగారెడ్డి జిల్లా

DPR No. 393 LA-PP [illegible] 2025-26

ముగ్గురి డీఎన్‌ఏతో ముద్దుల పిల్లలు

వంశపారంపర్య వ్యాధులకు చెక్ • ప్రపంచంలోనే తొలిసారి • బ్రిటిష్ సైంటిస్టుల ఘనత

వేలాది మంది మహిళలను మాతృత్వానికి దూరం చేస్తున్న మైటోకాండ్రియా సంబంధిత వంశపారంపర్య వ్యాధులకు బ్రిటన్‌లో జీవ శాస్త్రజ్ఞులు వినూత్న మార్గం ద్వారా చెక్ పెట్టారు. ప్రపంచంలోనే తొలిసారిగా ముగ్గురి డీఎన్‌ఏ సాయంతో శిశువుల పుట్టుకను సుసాధ్యం చేసి చూపించారు. వంశపారంపర్యంగా పిల్లలు మైటోకాండ్రియా లోపాలతో పుడుతున్న కుటుంబాలకు ఇది అక్షరాలా వరప్రసాదంగా మారింది. ఈ పద్ధతిలో బ్రిటన్‌లో ఇటీవలే తొలిసారిగా తొమ్మిది మంది పండంటి పాపాయిలు జన్మించారు. వీరిలో నలుగురు బాబులు కాగా ఐదుగురు ఆడపిల్లలు. వారిలో ఇద్దరు కవలలు కావడం విశేషం. తమ కుటుంబాలకు తరతరాల శాపంగా పరిణమించిన ప్రాణాంతమైక మైటోకాండ్రియా లోపాలేవీ లేకుండా వారంతా పూర్తి ఆరోగ్యంతో పుట్టడం విశేషం! దీన్ని వైద్య చరిత్రలోనే కీలక మైలురాయిగా భావిస్తున్నారు.

మాకిది కొత్త జీవితం

''ఆరోగ్యకరంగా పిల్లలను కనడం ఈ జన్మకు సాధ్యం కాదన్న నిశ్చయానికి వచ్చి భారంగా బతుకీడుస్తున్నాం. ఎట్టకేలకు మా పాలిట వరప్రసాదంలా ఈ కొత్త తరహా చికిత్స అందివచ్చింది. పూర్తి జీవశక్తితో కళకళలాడుతూ ముద్దులు మూటగడుతున్న మా బుజ్జాయిని చూస్తుంటే ఆనందంతో నోటమాట కూడా రావడం లేదు. ఇది నిజమంటే ఇప్పటికీ ఓ పట్టాన నమ్మబుద్ధే కావడం లేదు''

- 'ముగ్గురి డీఎన్‌ఏ' పద్ధతిలో పాపను కన్న మహిళల హర్షాతిరేకాలు
(గుర్తింపును గోప్యంగా ఉంచేందుకని వారు తమ వివరాలను బయటపెట్టలేదు)

మైటో లోపాలుంటే అంతే...

మైటోకాండ్రియా లోపాలతో పుట్టే పిల్లల్లో జీవక్రియలకు కావాల్సిన ఎలాంటి శక్తీ ఉండదు. చివరికి కనీసం గుండె కొట్టుకోవడానికి అవసరమైన శక్తి కూడా ఒంట్లో లేకుండా పోతుంది. దాంతో కండరాలు అత్యంత శక్తిహీనంగా మారతాయి. దాంతో మెదడు దెబ్బ తినడం మొదలుకుని గుడ్డితనం దాకా నానారకాల వ్యాధుల బారిన పడతారు. చాలా కేసుల్లో ఇలాంటి పిల్లలు బతికి బట్టకట్టడం కూడా గగనమే. రోజుల వ్యవధిలోనే మృత్యువాత పడి తల్లిదండ్రులకు తీరని గర్భశోకం మిగులుస్తుంటారు. ఇంతటి విపత్తుకు కారణమయ్యే మైటోకాండ్రియా లోపాలు అత్యధిక కేసుల్లో తల్లి నుంచే నవజాత శిశువుకు సంక్రమిస్తుంటాయి. ప్రతి 5,000 మంది పిల్లల్లో ఒకరు ఈ సమస్యలతో పుడుతుంటారు. ఈ నేపథ్యంలో బ్రిటన్‌లో ఏటా కనీసం 20 నుంచి 30 మంది దంపతులు ఈ సరికొత్త చికిత్స విధానంతో సంతానపు కలను నిజం చేసుకోనున్నట్టు వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఇలా సరిచేశారు...

బ్రిటన్ జీవ శాస్త్రజ్ఞులు కనిపెట్టిన కొత్త విధానంలో పాపాయిలు తమ డీఎన్‌ఏలో అత్యధిక శాతాన్ని తల్లిదండ్రుల నుంచే పొందుతారు. కాకపోతే దాతగా వ్యవహరించే మరో ఆరోగ్యకరమైన మహిళ నుంచి అత్యల్ప పరిమాణంలో, అంటే 0.1 శాతాన్ని అందుకుంటారు. మైటోకాండ్రియా పిల్లలకు కేవలం తల్లి నుంచే అందుతుంది. ఈ సరికొత్త డీఎన్‌ఏ తల్లి ద్వారా వంశపారంపర్యంగా వచ్చే మైటోకాండ్రియా లోపాలను పూర్తిస్థాయిలో అరికడుతుంది. తద్వారా పిల్లలు పూర్తి ఆరోగ్యంతో పుడతారు. సదరు డీఎన్‌ఏ మార్పు వారి వారసులందరికీ పారంపర్యంగా అందుతూ వెళ్తుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

మైటోకాండ్రియా... కణంలో శక్తి భాండాగారం

సూక్ష్మాకృతిలో ఉండే మైటోకాండ్రియా సులువుగా అర్థమయేలా చెప్పాలంటే ఒక సూక్ష్మ కణాంగం. కణంలో జరిగే అనేకానేక జీవక్రియలకు అవసరమైన శక్తినంతటినీ సిద్ధం చేసి పెట్టేది ఇదే. అందుకే మైటోకాండ్రియాను కణం తాలూకు శక్తి భాండాగారమని చెబితే అతిశయోక్తి కాదు. అసలు మనం శ్వాసిస్తున్నామంటే అందుకు కారణం కూడా మైట్రోకాండ్రియానే. తినే ఆహారాన్ని ఇది శరీర క్రియలు జరిగేందుకు కావాల్సిన శక్తిగా మారుస్తుంది. అందుకోసం ఆక్సిజన్‌ను ఉపయోగించుకుంటుంది. పాక్షిక స్వయం ప్రతిపత్తితో పని చేయడం వీటి ప్రత్యేకత. ఇవి రెండు పొరలతో కూడుకుని ఉంటాయి. చూసేందుకు ఇవి అచ్చం కణత్వాన్ని తలపిస్తాయి.

పదేళ్ల ముందే కనిపెట్టినా...

నిజానికి ఈ 'ముగ్గురి డీఎన్‌ఏ' పద్ధతిని బ్రిటన్‌లోని న్యూక్యాజిల్ విశ్వవిద్యాలయానికి చెందిన టైన్ హాస్పిటల్స్, ఎన్‌హెచ్‌ఎస్ ఫౌండేషన్ ట్రస్ట్ జీవ శాస్త్రవేత్తలు పది సంవత్సరాల క్రితమే కనిపెట్టారు. భార్య అండంతో పాటు దాతగా వ్యవహరించే మరో ఆరోగ్యకరమైన మహిళ నుంచి సేకరించిన అండాన్ని కూడా భర్త వీర్యంతో లేబొరేటరీలో విడిగా ఫలదీకరణ చెందిస్తారు. అనంతరం రెండో పిండంలోని ఆరోగ్యకరమైన మైటోకాండ్రియాను భార్య పిండంలోకి చొప్పిస్తారు. తద్వారా పుట్టే పాపాయి జన్యుపరంగా తల్లిదండ్రుల లక్షణాలనే పుణికి పుచ్చుకుంటుంది. కానీ మైటోకాండ్రియా లోపాలేవీ లేకుండా ఆరోగ్యకరంగా పుడుతుంది.

బ్రిటన్‌లోనే అనుమతి

ఈ 'ముగ్గురి డీఎన్‌ఏ' విధానానికి ప్రస్తుతం కేవలం బ్రిటన్‌లో మాత్రమే అనుమతి ఉంది. ఈ మేరకు 2015 సంవత్సరంలోనే అక్కడి పార్లమెంట్ ఓ చట్టాన్ని ఆమోదించింది. కానీ ఇలా పుట్టే పిల్లల్లో 0.1 శాతం వేరే మహిళ డీఎన్‌ఏ ఉంటుంది. అది ముందు తరాలకు కూడా అవిచ్ఛిన్నతంగా అందుతూ వెళ్తుంది. మరోలా చెప్పాలంటే సదరు కుటుంబపు డీఎన్‌ఏలో శాశ్వత మార్పులు చోటుచేసుకుంటాయి. దాంతో ఈ పద్ధతిపై అప్పట్లోనే తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.


మంటల్లో షాపింగ్ మాల్

ఇరాక్‌లో భారీ అగ్ని ప్రమాదం

- 60 మందికిపైగా సజీవదహనం
- కుట్ నగరంలో దుర్ఘటన

బాగ్దాద్: తూర్పు ఇరాక్‌లో ఇటీవల ప్రారంభమైన అధునాతన షాపింగ్ మాల్ భవనంలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఐదంతస్తుల ఈ భవనానికి అకస్మాత్తుగా మంటలంటుకోవడంతో అందులోని 60 మందికిపైగా సజీవ దహనమయ్యారు. 45 మందిని అగ్నిమాపక సిబ్బంది ఎట్టకేలకు కాపాడారు. మరణాల సంఖ్య పెరిగే అవకాశముందని స్థానిక అధికారులు తెలిపారు. మరికొంత మంది జాడ గల్లంతైందని ఇరాక్ అంతర్గత మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. బుధవారం రాత్రి కుట్ నగరంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. వారం క్రితం వినియోగదారుల కోసం కొత్తగా ప్రారంభమైన ఈ భవనం మొత్తం అగ్నికీలలకు ఆహుతవుతున్న వీడియోలు ప్రస్తుతం సామాజికమాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. చనిపోయిన వారిలో అత్యధికులు చిన్నారులు, మహిళలే ఉన్నారు. దట్టంగా పొగచూరడంతో లోపల ఇరుక్కుపోయిన వారిలో చాలా మంది ఊపిరాడక చనిపోయారని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన ప్రభుత్వం మూడు రోజులపాటు సంతాప దినాలు ప్రకటించింది. అత్యంత పేలవంగా నిర్మాణాలు చేపట్టడంతోపాటు ప్రమాణాలు పాటించకపోవడంతో ఇరాక్‌లో భవనాల్లో అగ్నిప్రమాద ఘటనలు సర్వసాధారణ మయ్యాయి. 2021 జూలైలోనూ నసిరియా నగరంలోని ఓ ఆస్పత్రిలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 60 నుంచి 92 మందిదాకా సజీవదహనమయ్యారు. అత్యంత మండే గుణమున్న, అత్యంత చవగ్గా దొరికే శాండ్‌విచ్ ప్యానెళ్లను నిర్మాణంలో వినియోగిస్తారు. వీటి కారణంగా అగ్ని ప్రమాద తీవ్రత పెరుగుతోంది. నినేవేహ్ ప్రావిన్సులోని హమ్దానియా పట్టణంలో 2023 సంవత్సరంలో ఒక ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో ఏకంగా 100 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.

ఈ రాయి విలువ రూ. 37 కోట్లు!



న్యూయార్క్: పాత భవనాన్ని కూలగొట్టినప్పుడు బయటపడిన పునాది రాయిలా ఉందికదూ. నిజానికి ఇది ఇక్కడి రాయి కాదు. అంగారక గ్రహం నుంచి దూసుకొచ్చి పుడమిపై పడిన అత్యంత అరుదైన శిల ఇది. భూమిపై దొరికిన అతిపెద్ద అంగారక రాయి ఇదే. దీనిని బుధవారం ప్రఖ్యాత సోత్‌బీ వేలం సంస్థ న్యూయార్క్‌లో వేలంవేయగా ఏకంగా రూ.37 కోట్ల(43 లక్షల డాలర్ల) ధర పలికింది. 38.1 సెంటీమీటర్ల పొడవు, 24.5 కేజీల బరువైన ఈ శిలకు 'ఎన్‌డబ్ల్యూఏ 16788' అని పేరు పెట్టారు. 2023 నవంబర్‌లో ఆఫ్రికా ఖండంలోని నైగర్ దేశంలో దీనిని పురాతత్వ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. తోకచుక్క లేదా గ్రహశకలం భూవాతావరణం గుండా ప్రయాణించేటప్పుడు భూమి గురుత్వాకర్షణకు లోనవుతాయి. దాంతో తోకచుక్క కొనలోని చిన్నపాటి శిలలు లేదా గ్రహశకలంలోని చిన్న రాతిభాగాలు ఇలా భూమి మీద పడతాయి. అలా అంగారకుని నుంచి వచ్చిన ఒక గ్రహశకలంలోని చిన్న రాతి ముక్కే ఈ శిల. ''అమెరికాలో పన్నులు, ఇతరత్రా ఖర్చులు కలుపుకుని ఇప్పుడీ రాయిని కొనుగోలుదారు సొంతం చేసుకోవాలంటే ఏకంగా రూ.45.61 కోట్లు చెల్లించుకోక తప్పదు. చరిత్రలో ఇప్పటిదాకా భూమిపై కేవలం 400 అంగారక శిలలే దొరికాయి. అవన్నీ చాలా చిన్నవి. ఇదొక్కటే పెద్దది. అందుకే ఇంత ధర పలికింది. భూ ఉపరితలం 75 శాతం సముద్రజలాలతో నిండి ఉంది. సముద్రంలో పడకుండా సహారా ఎడారిలో పడటం వల్లే మనకు ఇది దొరికింది'' అని సోత్‌బీ సైన్స్, నేచరల్ హిస్టరీ విభాగ ఉపాధ్యక్షుడు కసాండ్రా హ్యాటన్ చెప్పారు. అయితే ఈ రాయిని కొన్నది ఎవరో సంస్థ బహిర్గతం చేయలేదు. బుధవారం మరెన్నో అరుదైన చారిత్రక వస్తువులను వేలంవేశారు. కోట్ల ఏళ్ల నాటి సెరటాసారస్ డైనోసార్ అస్థిపంజరం రూ.223 కోట్లకు అమ్ముడుపోవడం విశేషం

జాతీయ ప్రయోజనాలే ముఖ్యం

- రష్యా చమురు విషయంలో ద్వంద్వ ప్రమాణాలు వద్దు
- విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే, వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తే 100 శాతం టారిఫ్‌లు విధిస్తామంటూ 'నాటో' సెక్రెటరీ జనరల్ మార్క్ రుట్టే చేసిన హెచ్చరికలను భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తిప్పికొట్టారు. జాతీయ ప్రయోజనాలు, మార్కెట్ అవసరాల ఆధారంగానే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. తమకు దేశ ప్రయోజనాలు, అవసరాలే ముఖ్యమని తేల్చిచెప్పారు. రష్యా చమురు విషయంలో ద్వంద్వ ప్రమాణాలు పాటించొద్దని నాటోకు సూచించారు. రణధీర్ జైశ్వాల్ గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. మార్క్ రుట్టే హెచ్చరికలను నిశితంగా గమనిస్తున్నామని చెప్పారు. భారత ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలు ప్రజా ప్రయోజన కోణంలోనే ఉంటాయన్నారు. సుస్థిరమైన ఇంధన భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మార్కెట్‌లో తక్కువ ధరకు చమురు లభించినప్పుడు కొనడం సాధారణమేనని వివరించారు. రష్యా నుంచి యూరప్ దేశాలు చమురు కొనుగోలు చేస్తున్నారని రణధీర్ జైశ్వాల్ పరోక్షంగా ప్రస్తావించారు. రష్యా నుంచి చమురు కొనడం ఆపాలని, ఉక్రెయిన్‌పై యుద్ధం విరమించేలా రష్యాపై ఒత్తిడి పెంచాలని ఇండియా, చైనా, బ్రెజిల్‌కు మార్క్ రుట్టే సూచించిన సంగతి తెలిసిందే. రష్యా నుంచి ఈ మూడు దేశాలే అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్నాయి.

బిహార్‌లో అన్ని ఇళ్లకు 125 యూనిట్ల ఉచిత విద్యుత్



పట్నా: బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో అన్ని నివాసాలకు ఉచితంగా 125 యూనిట్ల విద్యుత్ సరఫరా చేస్తామని గురువారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. దీనివల్ల 1.67 కోట్ల ఇళ్లకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 125 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా ప్రారంభమవుతుందని తెలిపారు. విద్యుత్ బిల్లుల్లో 125 యూనిట్ల వరకు ఎలాంటి రుసుము విధించబోమని, జూన్‌లో వాడుకున్న విద్యుత్‌కు కూడా ఇది వర్తిస్తుందని ప్రకటించారు.

చోరీ చేసినా వీసా రద్దు: అమెరికా

న్యూఢిల్లీ: అమెరికాలో నివసిస్తున్న విదేశీయులు అక్కడి నిబంధనలు కచ్చితంగా పాటించాలని భారత్‌లో అమెరికా రాయబార కార్యాలయం స్పష్టంచేసింది. ఒకవేళ ఇతరులపై దాడులకు పాల్పడినా, చోరీ చేసినా వీసా రద్దయ్యే ప్రమాదం ఉంటుందని పేర్కొంది. చట్టపరమైన చర్యలను ఎదుర్కోవడంతోపాటు భవిష్యత్తులో అమెరికా వీసా పొందడానికి కూడా అర్హత కోల్పోతారని తాజాగా ఒక ప్రకటనలో వెల్లడించింది. మళ్లీ అమెరికాలో అడుగుపెట్టే అవకాశం ఉండదని తేల్చిచెప్పింది. అమెరికాలో భారతీయ మహిళ ఒకరు దుకాణంలో చోరీ చేస్తూ పోలీసులకు దొరికిపోయిన నేపథ్యంలో అమెరికన్ ఎంబసీ ఈ హెచ్చరికలు జారీ చేసింది.

ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీలో గందరగోళం

30 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఒకరోజు సస్పెన్షన్

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ శాసనసభ నుంచి 30 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఒకరోజు పాటు సస్పెండ్ అయ్యారు. రాష్ట్రంలో ఎరువుల సమస్యలపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఏర్పడిన గందరగోళం కాంగ్రెస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్‌కు దారి తీసింది. రాష్ట్రంలో ఎరువుల కొరతను కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే ఉమేష్ పటేల్ లేవనెత్తారు. అందుకు వ్యవసాయ మంత్రి రామ్ విచార్ నేతమ్ సమాధానమిస్తూ ప్రత్యామ్నాయ ఎరువులను నిల్వ చేస్తున్నామని చెప్పారు. మంత్రి సమాధానంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసిన ప్రతిపక్ష సభ్యులు నిరసన తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలుచేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొనడంతో ఐదు నిమిషాలు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన తర్వాత సైతం కాంగ్రెస్ సభ్యులు అదే అంశాన్ని లేవనెత్తారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో ప్రతిపక్ష నాయకుడు చరణ్‌దాస్ మహంత్, మాజీ సీఎం భూపేష్ బఘేల్ సహా 30 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ రమణ్ సింగ్ ప్రకటించారు. అయినా ఎమ్మెల్యేలు వెల్‌లోనే ఉండి నినాదాలు చేయడంతో మళ్లీ సభను వాయిదా వేశారు. ప్రతిపక్ష సభ్యుల తీరుపై స్పీకర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సస్పెండ్ చేసినా ఎమ్మెల్యేలు నిబంధనలను ఉల్లంఘించి వెల్‌లోనే ఉండటం బాధ కలిగించిందని స్పీకర్ అన్నారు.

బ్రిటన్‌లో 16 ఏళ్లకే ఓటు హక్కు

లండన్: ఓటు హక్కు వయో పరిమితిని 18 నుంచి 16 ఏళ్లకు తగ్గిస్తూ యూకే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2029లో జరిగే ఎన్నికల్లో ఇది అమల్లోకి వచ్చే అవకాశం ఉందని గురువారం వెల్లడించింది. బ్రిటన్‌లో ప్రస్తుతం 18 ఏళ్లకు ఓటు హక్కు కల్పిస్తున్నారు. ఇకపై 16 ఏళ్లకే ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం లభించనుంది. బ్రిటన్‌లో గత ఏడాది జరిగిన ఎన్నికల్లో లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఓటింగ్ వయో పరిమితిని 16 ఏళ్లకు తగ్గిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఆ పార్టీ హామీ ఇచ్చింది. ఓటింగ్ వయసును కుదించడాన్ని బ్రిటన్ ప్రజాస్వామ్య వ్యవస్థలో అతిపెద్ద మార్పుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. యూకేలో ఓటర్ ఐడీ వ్యవస్థను సైతం విస్తరింపజేయబోతున్నారు. బ్యాంకులు జారీ చేసిన క్రెడిట్, డెబిట్ కార్డులను కూడా పోలింగ్ స్టేషన్ల వద్ద గుర్తింపు కార్డులుగా పరిగణనలోకి తీసుకున్నారు. అర్హులైన వారికి ఓటు హక్కును నిరాకరించకూడదన్నదే దీని ఉద్దేశం.

అనుమతి లేకుండానే విజయోత్సవాలు

- అందుకే చిన్నస్వామి స్టేడియంలో తొక్కిసలాట
- కేవలం సమాచారం ఇచ్చారు.. అనుమతి తీసుకోలేదు
- దుర్ఘటనకు ఆర్సీబీ యాజమాన్యం, డీఎన్‌ఏ సంస్థ, కేఎస్‌సీఏ బాధ్యత వహించాలి
- హైకోర్టుకు నివేదిక సమర్పించిన కర్ణాటక ప్రభుత్వం

బెంగళూరు: ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) విజయం తర్వాత బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటకు ఆర్సీబీ యాజమాన్యం, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డీఎన్‌ఏ నెట్‌వర్క్స్ లిమిటెడ్‌తోపాటు కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్(కేఎస్‌సీఏ) కారణమని కర్ణాటక ప్రభుత్వం తేల్చిచెప్పింది. ఈ మేరకు ఒక నివేదికను హైకోర్టుకు సమర్పించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ముందస్తుగా అనుమతి తీసుకోకుండానే విజయోత్సవ ర్యాలీ నిర్వహించడం వల్లే ఈ దుర్ఘటన జరిగినట్లు కర్ణాటక సర్కార్ స్పష్టంచేసింది. ఈ ర్యాలీ నిర్వహించాలని ఆర్సీబీ యాజమాన్యం, డీఎన్‌ఏ సంస్థ, కేఎస్‌సీఏ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నట్లు తప్పు పట్టింది. పోలీసులకు ముందుగా సమాచారం ఇవ్వలేదని, చట్టప్రకారం తీసుకోవాల్సి అనుమతులేవీ తీసుకోలేదని వెల్లడించింది. జూన్ 4న జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించగా, మరో 30 మందికిపైగా గాయపడిన సంగతి తెలిసిందే. ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్‌పై ఆర్సీబీ గెలిస్తే బెంగళూరులో విజయో త్సవాలు నిర్వహిస్తామంటూ మ్యాచ్‌కు కొన్ని గంటల ముందు కేవలం సమాచారం మాత్రమే ఇచ్చారని, అధికారికంగా అనుమతి తీసుకోలేదని ప్రభుత్వం పేర్కొంది. అయితే, ఆ సమాచారంలో పూర్తి వివరాలు లేకపోవడంతో విజయోత్సవాలకు పోలీసులు అంగీకరించలేదని తెలిపింది. కేవలం సమాచారం ఇవ్వడాన్ని అనుమతి కోసం చేసుకున్న దరఖాస్తుగా పరిగణించలేమని తేల్చిచెప్పింది. అయినప్పటికీ జూన్ 4న ఆర్సీబీ టీమ్ యాజమన్యం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని, విధాన సౌధ నుంచి చిన్న స్వామి స్టేడియం ద్వారా విక్టరీ పరేడ్ నిర్వహించబోతున్నట్లు సోషల్ మీడియాలో ప్రకటనలు జారీ చేసిందని వెల్లడించింది. సోషల్ మీడియాలో మొదటి పోస్టు ఉదయం 7.01 గంటలకు, చివరి పోస్టు మధ్యాహ్నం 3.14 గంటలకు పెట్టినట్లు తెలిపింది. ఆన్‌లైన్‌లో ఉచిత పాసులు అందుబాటులో ఉన్నాయని యాజమాన్యం చెప్పగా, అప్పటికే జనం స్టేడియం వద్దకు చేరుకున్నారని వివరించింది. మొత్తానికి ఆర్సీబీ యాజమాన్యం, డీఎన్‌ఏ నెట్‌వర్క్స్ లిమిటెడ్, కేఎస్‌సీఏ నిర్లక్ష్యం వల్లే తొక్కిసలాట జరిగినట్లు ప్రభుత్వం స్పష్టంచేసింది. ఈ దుర్ఘటనకు వారే పూర్తి బాధ్యత వహించాలని పేర్కొంది.

ఆర్సీబీ సేవకులుగా పోలీసులు

బెంగళూరు తొక్కిసలాట ఘటనలో ఐపీఎస్ అధికారి వికాస్ కుమార్‌తోపాటు మరికొందరు పోలీసులను సస్పెండ్ చేయడాన్ని కర్ణాటక ప్రభుత్వం సమర్థించుకుంది. పోలీసులు ఆర్సీబీ టీమ్‌కు సేవకులుగా వ్యవహరించారని హైకోర్టుకు సమర్పించిన నివేదికలో ఆక్షేపించింది. ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయకుండానే ఆర్సీబీ విజయోత్సవాల కోసం ఏర్పాటు చేశారని ఆరోపించింది. అనుమతి ఉందో లేదో కూడా తెలుసుకోకుండా ఆర్సీబీ సేవలో తరించారని విమర్శించింది.

నటి రన్యా రావుకు ఏడాది జైలు

మరో ఇద్దరు నిందితులకూ శిక్ష



బనశంకరి: విదేశాల నుంచి భారత్‌కు బంగారాన్ని అక్రమంగా తరలించిన కేసులో నిందితురాలు, కన్నడ నటి రన్యా రావుకు ఏడాది జైలు శిక్ష పడింది. విదేశీ మారక ద్రవ్య పరిరక్షణ, స్మగ్లింగ్ నిరోధక చట్టం కింద ఆమెకు కోర్టు ఏడాది జైలు శిక్షను ఖరారు చేసింది. ఆమెతోపాటు సహచరుడు తరుణ్ కొండూరు రాజు, బంగారం వ్యాపారి సాహిల్ జైన్‌లకూ శిక్ష పడింది. ఇటీవలే నటి రన్యారావు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. ఈ ఏడాదిలో రన్యా రావు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునే హక్కును కోర్టు నిరాకరించింది. రన్యారావు ఏడాదిపాటు జైలు నుంచి విడుదల కాకుండా ఉండేందుకు సీఓఎఫ్‌ఈపీఓఎస్‌ఏ చట్టం జారీ చేశారు. నటి రన్యారావు ఈ ఏడాది మార్చి ఒకటో తేదీన రూ.12.56 కోట్ల విలువైన 14.2 కేజీల బరువైన బంగారాన్ని దుబాయ్ నుంచి స్మగ్లింగ్ చేస్తూ బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులకు చిక్కిన విషయం తెలిసిందే. దీంతో రన్యా రావును డీఆర్ఐ అరెస్ట్‌చేసి విచారించింది. నటితో పాటు ఆమె సహచరుడు తరుణ్ కొండూరు రాజు, వజ్రాభరణాల వ్యాపారి సాహిల్ జైన్ ఈ స్మగ్లింగ్ రాకెట్‌లో భాగమైనట్లు ఆరోపణలు వచ్చాయి. రన్యా రావు 2023 నుంచి 2025 వరకు దుబాయ్‌కు ఏకంగా 56 సార్లు ప్రయాణించినట్లు డీఆర్ఐ దర్యాప్తులో స్పష్టమైంది. దుబాయ్ పర్యటనలో భాగంగా భారత్ నుంచి తరుణ్‌తో కలిసి 20 సార్లు ప్రయాణించింది. ఇది గుర్తించిన అధికారులు విచారించగా నటి పొంతన లేని సమాధానాలు ఇచ్చింది. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు ఆమె నివాసంలో సోదాలు నిర్వహించారు. సోదాల్లో రూ. 2.06 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు రూ.2.67 కోట్ల విలువైన కరెన్సీ కట్టలను స్వాధీనం చేసుకున్నారు. రన్యా రావు నుంచి మొత్తంగా రూ. 17.29 కోట్ల నగదు, బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రన్యా రావు గత 12 నెలలకాలంలో 27 సార్లు విదేశాలకు వెళ్లిందని, కస్టమ్స్ సుంకం మోసానికి పాల్పడినట్లు విచారణలో తేలింది.

హ్యాపీ రీ యూనియన్

- రెండేళ్ల తర్వాత భార్యాపిల్లలను కలిసిన శుభాంశు
- గుండెలకు హత్తుకుని హర్షాతిరేకాలు
- భార్య కామ్నా ఆనందబాష్పాలు

న్యూఢిల్లీ: 18 రోజుల అంతరిక్ష యాత్రను ముగించుకుని విజయవంతంగా తిరిగొచ్చిన భారత వ్యోమగామి, వాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా ఎట్టకేలకు తన భార్యను, కుమారున్ని కలుసుకున్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో కాలు పెట్టిన తొలి భారతీయునిగా ఆయన చరిత్ర సృష్టించడం తెలిసిందే. ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్పేస్ ఎక్స్‌కు చెందిన డ్రాగన్ 'గ్రేస్' వ్యోమనౌకలో మరో ముగ్గురు సహచర వ్యోమగాములతో కలిసి శుభాంశు ఐఎస్‌ఎస్ నుంచి మంగళవారం సురక్షితంగా భూమికి తిరిగి రావడం తెలిసిందే. కాలిఫోర్నియా సమీపంలో పసిఫిక్ మహాసముద్ర జలాల్లో డ్రాగన్ క్షేమంగా దిగింది. అనంతరం శుభాంశు బృందాన్ని హ్యూస్టన్‌కు తరలించారు. అక్కడి నాసా కేంద్రంలో వాళ్లు ప్రస్తుతం క్వారెంటైన్‌లో గడుపుతున్నారు. బుధవారం శుభాంశు తన భార్య కామ్నా, నాలుగేళ్ల కుమారుడు కియష్‌ను కలుసుకున్నారు. వారిని ఆనందంగా గుండెలకు హత్తుకుని భావోద్వేగానికి లోనయ్యారు. అంతరిక్ష యాత్ర నుంచి క్షేమంగా తిరిగొచ్చిన భర్తను కళ్లా చూసిన క్షణాన కామ్నా కన్నీటిపర్యంతమయ్యారు. ఈ విషయమై బుధవారం సాయంత్రం ఇన్‌స్టాగాంలో శుభాంశు భావోద్వేగపూరిత పోస్ట్ పెట్టారు. ''అంతరిక్షంలో సమయం నిజంగా సవాలుగానే గడిచింది. దానికి ముందస్తు సన్నాహాలతో కలుపుకుంటే ఒకరకంగా నేను గత 2 నెలలుగా క్వారెంటైన్‌లోనే ఉన్నట్టు లెక్క. దాంతో నా భార్యాపిల్లలను కంటినిండా చూసుకున్న, ఆప్యాయంగా దగ్గరికి తీసుకున్న క్షణాలు ఎంతో అద్భుతంగా అనిపించాయి. ఎందుకంటే అంతరిక్ష యాత్రకు వెళ్లే ముందు దాదాపుగా నెల రోజుల పాటు క్వారెంటైన్ కారణంగా వాళ్లిద్దరితో 8 మీటర్ల దూరం నుంచే వాళ్లతో మాట్లాడాల్సి వచ్చింది. నాన్న ఎందుకు దగ్గరికి రావడం లేదని నా కొడుకు పదేపదే అడిగేవాడు కూడా. తన చేతులకు బ్యాక్టీరియా అంటుకుందని, అందుకే రావడం లేదని వాడికి నచ్చజెప్పాల్సి వచ్చింది. 'అయితే చేతులు బాగా కడుక్కుంటే నాన్న దగ్గరికి వెళ్లనిస్తారా నన్ను?' అని వాళ్ల అమ్మను పదేపదే సతాయించేవాడు. వాడికి నచ్చజెప్పడం తలకు మించి పనే అయింది''అని భావోద్వేగపూరితంగా పోస్ట్ రాసుకొచ్చారు. సొంతవారితో అల్లుకున్న ప్రేమానుబంధాలకు అత్యంత విలువ ఇవ్వాల్సిందిగా అందరికీ సూచించారు. ''మీ ప్రియతములను గుర్తించండి. వాళ్లను మీరెంతగా ప్రేమిస్తున్నదీ స్పష్టంగా వారికి వ్యక్తపరచండి. జీవితపు ఉరుకులు పరుగుల్లో పడి మన జీవితాల్లో వాళ్లు ఎంత ముఖ్యమన్నది చాలాసార్లు మర్చిపోతుంటాం''అని అభిప్రాయపడ్డారు. శుభాంశు ఈ నెల 23 దాకా క్వారెంటైన్‌లో గడుపుతారని కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు.


కుమారునితో..


భార్యతో..

ఆరోగ్యం బావుంది: ఇస్రో

శుభాంశు బాగున్నారని ఇస్రో పేర్కొంది. ఇప్పటిదాకా ఆయనకు ఎలాంటి ఆరోగ్య సమస్యలూ తలెత్తలేదని తెలిపింది. యాగ్జియం వైద్యులు.. శుభాంశు బృందం ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు వెల్లడించింది.

ముందస్తు నిర్ణయం దారుణం

- విదేశీ మీడియాలో తప్పుడు కథనాలొస్తున్నాయి
- ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో డైరెక్టర్ జనరల్ ఆగ్రహం

న్యూఢిల్లీ: అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనలో పైలెట్ల తప్పిదం కారణంగానే ఎయిర్‌ఇండియా విమానం కుప్పకూలిందంటూ అంతర్జాతీయ మీడియాలో తప్పుడు కథనాలు వెల్లువెత్తుతున్నాయని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో డైరెక్టర్ జనరల్ జీవీజీ యుగంధర్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. నిరాధార సమాచారంతో ప్రమాదఘటనపై ముందస్తు నిర్ణయానికి రావొద్దని విదేశీ మీడియాకు ఆయన హితవు పలికారు. '' అసంబద్ధ కథనాలు అల్లడం మానేయండి. ఈ కేసు సమగ్ర దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. ప్రమాదానికి మూల కారణాలు, సిఫార్సులతో తుది నివేదిక రూపొందిస్తాం. ఆలోపే అసమగ్ర సమాచారంతో ఎవ్వరూ ముందస్తు అంచనాకు, తుది నిర్ణయానికి రావొద్దు. తప్పుడు డేటాతో భారత విమానయాన రంగం భద్రతపై ప్రయాణికుల్లో ఆందోళనను అనవసరంగా పెంచకండి'' అని యుగంధర్ హితవు పలికారు.

వివాదమైన అమెరికా 'క్రాష్' నివేదిక

ఎయిరిండియా విమాన ప్రమాదంలో అమెరికా క్రాష్ నివేదిక వివాదమైంది. కెప్టెన్ ఇంజిన్లకు ఇంధన ప్రవాహాన్ని తగ్గించాడని కాక్‌పిట్ రికార్డింగ్‌లను ఉదహరిస్తూ యూఎస్ ఇచ్చిన నివేదికను భారత పైలట్ల సమాఖ్య తోసిపుచ్చింది. అమెరికా అధికారుల అంచనాను ఉటంకిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ ముందే నివేదిక వెల్లడించడంపై అనుమానం వ్యక్తం చేసింది. ప్రమాదం జరిగిన ఎయిరిండియా విమానానికి ఆరోజు 56 ఏళ్ల సుమీత్ సభర్వాల్ కెప్టెన్ హోదాలో నాయకత్వం వహించారు. ఆయనకు మొత్తం 15,638 గంటలపాటు విమానాలు నడిపిన అనుభవం ఉంది. 32 ఏళ్ల మరో పైలట్ క్లైవ్ కుందర్ ఆరోజు ఫస్ట్ ఆఫీసర్ హోదాలో కో–పైలట్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఈయనకు మొత్తం 3,403 గంటలపాటు విమానాలు నడిపిన అనుభవం ఉంది. విమానం టేకాఫ్ అయిన కొన్ని సెకన్ల తర్వాత ఇంధన స్విచ్‌లు 'కటాఫ్' పొజిషన్‌లోకి మారడం చూసి కుందర్.. సుమీత్‌ను మీరెందుకు స్విచ్‌లను రణ నుంచి కటాఫ్‌లోకి మార్చారు? అని ప్రశ్నించారని వాల్ స్ట్రీట్ జర్నల్ తన కథనంలో పేర్కొంది. అమెరికా ఉన్నతాధికారుల ద్వారా ఈ సమాచారాన్ని సేకరించామని వార్తాసంస్థ పేర్కొంది. స్విచ్‌లు కటాఫ్‌లోకి మారడంతో కుందర్ భయపడిపోయారని, కుందర్ ప్రశ్నించాక కూడా పైలట్ సుమీత్ ఎలాంటి భయం, ఆందోళనలేకుండా ప్రశాంతంగా కనిపించారని వార్తాసంస్థ తన కథనంలో పేర్కొంది.



ఎముకలూ వివరాలు చెబుతాయి!

అస్థిపంజరాలను ఫోరెన్సిక్ కోణంలో అధ్యయనం చేసి అనేక వివరాలు తెలుసుకుంటారు. దీన్నే సాంకేతిక పరిభాషలో ఫోరెన్సిక్ ఆస్టియాలజీ అంటారు. -8లో



మానవత్వం.. అ'మూల్యం'

మానవత్వం మంటగలిసిపోతోంది.. అమూల్యమైన సేవలకు సైతం మూల్యం చెల్లించుకోవాల్సివస్తోంది.. కొందరి అవసరం.. ఇంకొందరికి వరంగా మారుతోంది. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/23.0

నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశముంది. గరిష్టంగా 33, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.



సచివాలయంలో బోనాల సంబరాలు

నిత్యం ఉద్యోగ బాధ్యతల్లో తలమునకలయ్యే సచివాలయ సిబ్బందికి ఆటవిడుపు లభించింది. బోనాల సంబరాలతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయ ప్రాంగణం ఆధ్యాత్మికత వాతావరణాన్ని సంతరించుకుంది. గురువారం ఇక్కడి ఉద్యోగులు బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. డప్పుల దరువులు.. శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాలు.. అమ్మవారి వేషధారణల మధ్య బోనాల పండుగను వైభవంగా జరుపుకొన్నారు.

\- సాక్షి, సిటీబ్యూరో



వెజి 'ట్రబుల్స్'

మండుతున్న కూరగాయల ధరలు

- చేతికందని కొత్త పంట దిగుబడులు
- వచ్చే ఆగస్టు వరకూ ఇదే పరిస్థితి
- నగటు జీవులపై అదనపు ఆర్థిక భారం



రైతుబజార్‌లో నెల రోజుల వ్యవధిలో పెరిగిన ధరలు (రూ.లలో)

కిలో	జూన్ 17	జులై 17
బెండకాయ	35	55
పచ్చిమిర్చి	45	70
బజ్జీ మిర్చి	23	70
క్యాప్సికమ్	55	75
బీన్స్	55	65
గింజచిక్కుడు	60	75
గోకరకాయ	35	45
టమాటా	21	27
వంకాయ	22	28

సనత్‌నగర్: నగరంలో కూరగాయలు ధరలు మండుతున్నాయి. కిలో బెండకాయ రూ.55.. పచ్చిమిర్చి రూ.70.. బజ్జీమిర్చి రూ.70.. క్యాప్సికమ్ రూ.75.. గింజచిక్కుడు రూ.75.. బీన్స్ రూ.65.. గోకరకాయ రూ.45, పందిరిబీర రూ.38.. ఇవి కేవలం చౌకగా లభించే రైతుబజార్‌లో ధరలు మాత్రమే. ఇక బయట మార్కెట్లలో కూరగాయలు కొనాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రైతుబజార్ కంటే ప్రతి కూరగాయ రకంపై అదనంగా రూ.10 నుంచి రూ.20 వెచ్చించాల్సిందే. ఖరీఫ్ సీజన్‌లో ఇటీవల కొత్త పంటలు వేయడంతో అవి చేతికి రావడానికి 50– 60 రోజుల సమయం పడుతుంది. ఈ క్రమంలో కూరగాయల దిగుబడి తగ్గడంతో ప్రస్తుతం కూరగాయల ధరలు కూడా పెరిగినట్లు ఎర్రగడ్డ రైతుబజార్ వర్గాలు పేర్కొంటున్నాయి. వారానికొచ్చేసరికి నలుగురైదుగురు సభ్యులు ఉన్న కుటుంబం రూ.500 పెడితే గానీ వంట గదిలో కూరగాయల ఘుమఘుమలు ఉండడం లేదు. అలా నెలకొచ్చేసరికి రూ.2,000 కూరగాయలకే ఖర్చవుతుండడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం తప్పడం లేదు.

ఆగస్టు వరకు ఇంతేనా..

కొత్తగా వేసిన కూరగాయల పంటలు చేతికి రావాలంటే మరో నెల రోజులు పండుతుంది. అప్పటి వరకు కూరగాయల భారం తప్పేలా కనిపించడం లేదు. ఒకవైపు నిత్యావసర సరుకుల ధరలు నింగికి ఎగబాకగా, ఇంకోవైపు కూరగాయలు సైతం మేమేం తక్కువా? అన్నట్లు ధరలు పెరగడంతో సామాన్యుల బతుకు భారం కనాకష్టంగా మారింది. రైతుబజార్‌లోనే తక్కువగా దొరుకుతాయి కదా? అని వెళితే అక్కడ కూడా ధరలు ఎక్కువగా ఉంటుండడంతో చాలీచాలని విధంగా కూరగాయలను కొనుగోలు చేసి సర్దుకునే పరిస్థితి నెలకొంది. ఇక బహిరంగ మార్కెట్లో చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. ఎక్కడో దూరంగా ఉండే రైతుబజార్‌కు వెళ్లాలంటే దూరభారం కావడంతో వారాంతపు సంతలు గానీ, లేక సమీపంలోని కూరగాయల షాపుకు వెళ్లాల్సి రావడంతో అక్కడ ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఒకవైపు వేతన జీవి ఆదాయం పెరగక.. మరోవైపు నిత్యావసర, కూరగాయల ధరలు పైపైకి ఎగబాగుతుండడంతో నెలయ్యేసరికి జేబులు ఖాళీ అయ్యి చేతులు చాచాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి.

దిగుబడులు తగ్గడం వల్లే..

నెల రోజులుగా పంట దిగుబడి సరిగా లేకపోవడంతో ధరలు కూడా పెరిగాయి. వేసిన కొత్త పంటలు కోతకు రావాలంటే మరికొంత సమయం పడుతుంది. ఆగస్టు వరకు ధరలు తగ్గే అవకాశం ఉంటుంది.

\- రమేష్, ఎర్రగడ్డ రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్

లైన్ క్లియర్!

యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్‌కు మార్గం సుగమం

- రాష్ట్ర ప్రభుత్వంతో పొత్తు లేకుండానే నిర్మించనున్న రైల్వేశాఖ
- ఇటీవల స్పష్టం చేసిన రైల్వేశాఖ సహాయ మంత్రి
- రూ.430 కోట్లతో 33 కి.మీ వరకు కొత్తగా ఎంఎంటీఎస్ లైన్‌లు
- 2015లోనే యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్‌కు ప్రతిపాదనలు
- త్వరలో పనులు చేపట్టనున్న దక్షిణమధ్య రైల్వే

సాక్షి, సిటీబ్యూరో



ఎట్టకేలకు యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ ప్రాజెక్ట్‌లో కదలిక వచ్చింది. పదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన ప్రాజెక్టును రైల్వేశాఖ సొంతంగా నిర్మించేందుకు సన్నద్ధమైంది. ఘట్‌కేసర్ నుంచి యాదగిరిగుట్ట (రాయగిరి) వరకు 33 కి.మీ మార్గాన్ని కొత్తగా నిర్మించనున్నారు. మొదట్లో ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం, రైల్వేశాఖ సంయుక్త భాగస్వామ్యంతో చేపట్టాలని నిర్ణయించారు. ట్రాక్ నిర్మాణానికి అవసరమైన భూమి, వనరులు, నిధులు, ఇతర మౌలిక సదుపాయాలకయ్యే వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమంగా పంచుకోవాలని భావించారు. ఈ ఒప్పందానికి అనుగుణంగా 2016లో దక్షిణమధ్య రైల్వే క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించింది. ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు లైన్‌ల నిర్మాణానికి ప్రణాళికలను రూపొందించింది. అనంతరం ఈ ప్రాజెక్టు ముందుకు కదల్లేదు, ఒకటి, రెండు బడ్జెట్‌ల్లో కేంద్రం కొన్ని నిధులను కేటాయించింది. అదే స్థాయిలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు, వనరులు లభించకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ఈ క్రమంలో రైల్వేశాఖ సైతం వెనకడుగు వేసింది. ఇలా 2016 నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టులో ఎలాంటి పురోగతి లేకుండా పోయింది.

ఇటీవల రూ.100 కోట్లు..

లక్షలాది మంది భక్తులు సందర్శించుకునే యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రానికి రైల్వే సదుపాయం అందుబాటులో లేకపోవడంతో రైల్వేశాఖ సీరియస్‌గా దృష్టి సారించింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారం లేకుండానే ఇక్కడికి ఎంఎంటీఎస్ సదుపాయాన్ని కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు గత సంవత్సరమే ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకనుగుణంగానే ఇటీవల రూ.100 కోట్లు అందజేసింది. ప్రాజెక్టును ప్రతిపాదించిన మొదట్లో రూ.10 కోట్లు, ఆ తర్వాత రెండు దఫాలుగా రూ.60 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.430 వరకు ఖర్చు కానున్నట్లు అంచనా. పదేళ్ల జాప్యం వల్ల నిర్మాణ వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంది.

సొంత నిధులతోనే పనులు..

రైల్వేశాఖ ఈ ప్రాజెక్టును సొంత నిధులతో నిర్మించనుందని ఆ శాఖ సహాయ మంత్రి రవనీత్‌సింగ్ భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలోనూ స్పష్టం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీన పార్లమెంట్ సమావేశాల్లో 'జీరో అవర్'లో యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ ప్రాజెక్టుపై ఎంపీ కేంద్రాన్ని ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు రైల్వేశాఖ సహాయమంత్రి రాతపూర్వకంగా తమ స్పందన తెలిపారు. అంతేకుండా ఈ ఆర్థిక సంవత్సరం రూ.100 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్రరైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు ఈ ప్రాజెక్టును సొంతంగానే చేపట్టనున్నట్లు దక్షిణమధ్యరైల్వే అధికారులు సైతం స్పష్టం చేశారు. త్వరలోనే రైల్‌వికాస్‌నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్) పనులు చేపట్టనుంది.

లక్షలాది మందికి ఊరట...

యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ ప్రాజెక్టు పూర్తయితే లక్షలాదిమంది భక్తులకు గొప్ప ఊరట లభించనుంది. ప్రస్తుతం ప్రతిరోజు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లోనే ప్రయాణికులు యాదగిరిగుట్టకు రాకపోకలు సాగిస్తున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాలకు ఎంఎంటీఎస్ రైళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ నేరుగా పుణ్యక్షేత్రం వరకు వెళ్లే సదుపాయం లేదు. ఈ మార్గం అందుబాటులోకి వస్తే లింగంపల్లి, బేగంపేట్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, మేడ్చల్, చర్లపల్లి తదితర ప్రాంతాల నుంచి ఎంఎంటీఎస్ రైళ్లలో నేరుగా రాయగిరి వరకు రాకపోకలు సాగించవచ్చు. అక్కడి నుంచి 4 కి.మీ. మాత్రం రోడ్డు మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది. ఇప్పటికే నగరంలో మొదటి, రెండో దశ ఎంఎంటీఎస్ ప్రాజెక్టులు పూర్తయినందువల్ల యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్ మూడో దశ ప్రాజెక్టుగా చేపట్టనున్నారు.

'సీఆర్ఎస్' ద్వారా బర్త్, డెత్ సర్టిఫికెట్లు

- జీహెచ్ఎంసీలో త్వరలో అమలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీకి ఇకపై కేంద్ర రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయానికి చెందిన సీఆర్ఎస్ (సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్) పోర్టల్‌ను వినియోగించనున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీలో పలు అవకతవకలు, నకిలీ సర్టిఫికెట్ల జారీ, తదితరాలు చోటుచేసుకోవడంతో.. వాటిని జారీ చేసేందుకు వినియోగిస్తున్న జీహెచ్ఎంసీ పోర్టల్ స్థానంలో సీఆర్ఎస్ పోర్టల్ వినియోగానికి అనుమతించాల్సిందిగా జీహెచ్ఎంసీ కమిషనర్ రాసిన లేఖకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అందుకు అనుమతిస్తూ ఎంఏయూడీ (జీహెచ్ఎంసీ-2) కార్యదర్శి కె.ఇలంబర్తి మెమో జారీ చేశారు. ఈమేరకు తగిన చర్యలు చేపట్టాల్సిందిగా కమిషనర్ కర్ణన్‌కు సూచించారు. ఈ ప్రక్రియ అమల్లోకి వచ్చేందుకు దాదాపు నెలరోజులు పట్టవచ్చని భావిస్తున్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తి ఉన్నప్పుడే ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టగా.. సెక్రటరీ హోదాలో ఆయనే అనుమతిస్తూ ఉత్తర్వు జారీ చేయడం విశేషం. ఈ విధానం అమల్లోకి వస్తే.. జనగణన రికార్డుల్లోనూ జననాల వివరాలు ఎప్పటికప్పుడు నమోదవుతాయి. ప్రతి బర్త్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్‌లకు యూనిక్ ఐడీ ఉంటుంది. ఒకరు ఒకటి కంటే ఎక్కువ బర్త్ సర్టిఫికెట్లు పొందలేరు. ఆధార్‌తో అనుసంధానం చేసే అవకాశం ఉంది. ప్రభుత్వ నియమనిబంధనల కనుగుణంగా ఎప్పటికప్పుడు సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ జరుగుతుంది.

అమ్మవారి సన్నిధిలో అనుపమ పరమేశ్వరన్

బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్న సినీనటి



సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని సినీనటి అనుపమ పరమేశ్వరన్ దర్శించుకున్నారు. ఆమె నటించిన 'పరదా' చిత్రం వచ్చే నెల 22న విడుదల కానుండగా యూనిట్ సభ్యులతో కలిసి గురువారం బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. 'యత్ర నార్యస్తు' పాటకు సంబంధించిన పోస్టర్లను ఈ సందర్భంగా ప్రదర్శించారు.

ఆలస్యంగా నడిచిన మెట్రో రైళ్లు

అమీర్‌పేట్– సికింద్రాబాద్ మార్గంలో స్తంభించిన సర్వీసులు

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రైళ్ల ప్రయాణికులకు గురువారం సాయంత్రం చుక్కలు చూపించాయి. అమీర్‌పేట్ –సికింద్రాబాద్ మార్గంలో పరేడ్ గ్రౌండ్స్, సికింద్రాబాద్ ఈస్ట్ స్టేషన్లలో సాంకేతిక సమస్యలతో సర్వీసులు కొద్దిసేపు స్తంభించాయి. దీంతో రైళ్లు ఆలస్యంగా నడిచాయి. మరోవైపు వర్షం కారణంగా ప్రయాణికుల రద్దీ బాగా పెరిగింది. రాయదుర్గం నుంచి సికింద్రాబాద్ వరకు, ఎల్బీనగర్ నుంచి జేఎన్టీయూ వరకు మెట్రోస్టేషన్లు, మెట్రో రైళ్లు కిక్కిరిసిపోయాయి. సర్వీసులు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు



పురస్కారం అందుకున్న అనంతరం ఇలంబర్తి, ఆర్‌వీ కర్ణన్ తదితరులు

స్వచ్ఛ షహర్.. హైదరాబాద్

ప్రామిసింగ్ క్లీన్‌సిటీగా రాష్ట్రస్థాయి పురస్కారం

- 'గార్బేజ్ ఫ్రీ'లో నగరానికి 6వ ర్యాంక్
- సెవెన్ స్టార్ రేటింగ్ సైతం
- వాటర్‌ప్లస్ రీ సర్టిఫికేషన్

సాక్షి, సిటీబ్యూరో: ఎప్పటిలాగే ఈసారి కూడా జీహెచ్ఎంసీ స్వచ్ఛ ర్యాంకింగ్ అవార్డుల్లో తన ప్రత్యేకతను చాటుకుంది. స్వచ్ఛ సర్వేక్షణ్–2024 ర్యాంకింగ్స్‌లో 'ప్రామిసింగ్ స్వచ్ఛ షహర్ ఆఫ్ తెలంగాణ'గా రాష్ట్రస్థాయిలో తొలి ర్యాంకింగ్‌తో నిలిచింది. పది లక్షల జనాభా మించిన నగరాల గార్బేజ్ ఫ్రీ సిటీస్‌లో దేశవ్యాప్తంగా ఉన్న 44 నగరాల్లో 6వ ర్యాంక్ పొందింది. గత ఏడాది 9వ ర్యాంక్ వచ్చింది. గతంలో ఉన్న ఫైవ్ స్టార్ రేటింగ్‌ను దాటి ఈసారి సెవెన్ స్టార్ రేటింగ్‌ను సాధించింది. వాటర్ ప్లస్ సిటీ హోదాను వరుసగా నాలుగోసారి నిలబెట్టుకుంది. మొత్తం ఎనిమిది అంశాలకు గాను గ్రేటర్ హైదరాబాద్ ఏడు అంశాల్లో వందశాతం మార్కులు పొందింది. వీటిలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ, వ్యర్థాల ప్రాసెసింగ్, డంప్‌సైట్‌ల నివారణ, నివాస ప్రాంతాల పరిశుభ్రత, మార్కెట్ ప్రాంతాల్లో శుభ్రత, చెరువుల శుభ్రత, పబ్లిక్ టాయ్‌లెట్ల పరిశుభ్రత ఉన్నాయి. ఉత్పత్తి చోటే చెత్త వేరే చేసే ప్రక్రియలో మాత్రమే 93 శాతం మార్కులు వచ్చాయి. మొత్తం 12,500 మార్కులకుగాను జీహెచ్ఎంసీ 11,805 మార్కులు సాధించింది. గురువారం ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్రమంత్రి మనోహర్‌లాల్ చేతుల మీదుగా మున్సిపల్ శాఖ సెక్రటరీ కె.ఇలంబర్తి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అవార్డు స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సీఎన్ రఘుప్రసాద్ (పారిశుధ్యం–ఆరోగ్యం), ఘనవ్యర్థాల నిర్వహణ విభాగం ఎస్ఈ కోటేశ్వరరావు, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్‌బీఎం యశశ్రీరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, పారిశుధ్య కార్మికురాలు ఊర్మిళ పాల్గొన్నారు. ఘనవ్యర్థాల నిర్వహణ, పారిశుధ్య కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం, ప్రజలకు అవగాహన తదితర అంశాలతో చెత్త రహిత నగరాలుగా తీర్చిదిద్దేందుకు స్టార్ రేటింగ్స్‌ను ప్రవేశపెట్టారు.

ప్రజల ఆశ్చర్యం..

గ్రేటర్ నగరానికి ఆయా అంశాల్లో వంద శాతం మార్కులు రావడం చూసి నగర ప్రజలు నివ్వెరపోతున్నారు. ముఖ్యంగా పబ్లిక్ టాయ్‌లెట్లు, మార్కెట్ ప్రాంతాలు, చెరువుల శుభ్రత అంశాల్లో ఈ మార్కులు చూసి ఇది నిజమేనా అంటూ నమ్మలేకపోతున్నారు.

మా బాధ్యత మరింత పెంచింది

మేయర్, డిప్యూటీ మేయర్ హర్షం

జీహెచ్ఎంసీ స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డును సాధించిన సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత హర్షం వ్యక్తం చేశారు. అవార్డు తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఈ స్ఫూర్తితో గ్రేటర్ హైదరాబాద్‌ను పరిశుభ్రత, పచ్చదనం, ఆరోగ్యకరమైన అంశంలో దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు మరింత కృషి చేస్తామన్నారు. అవార్డు రావడంలో కీలక పాత్ర పోషించిన కమిషనర్, అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు అభినందనలు తెలిపారు.

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు సైతం..

కంటోన్మెంట్: గ్రేటర్ పరిధిలోనే ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ కూడా కంటోన్మెంట్ బోర్డుల కేటగిరీలో మొదటి ర్యాంక్ పొందింది. ప్రతిష్టాత్మక స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు దక్కింది. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ చేతుల మీదుగా కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్ ఈ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ సీఈఓ పల్లవి విజయవర్గీ, కంటోన్మెంట్ హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్, బోర్డు సభ్యురాలు భానుక నర్మద తదితరులు పాల్గొన్నారు. సాలిడ్ వేస్ట్



స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు అందుకుంటున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ అధికారులు

మేనేజ్‌మెంట్, సానిటేషన్ విభాగాల్లో చేపట్టిన వినూత్న కార్యక్రమాలతో ఈ అవార్డుకు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. బోర్డు సిబ్బంది, ప్రజల భాగస్వామ్యం ఎంతో ఉందని సీఈఓ మధుకర్ నాయక్ తెలిపారు.

నాలా విస్తరణను కొనసాగించండి

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని నాలాలను గురువారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. రోడ్డునెంబర్– 3, 14లలో తలెత్తుతున్న వరద సమస్యకు కారణాలను క్షేత్ర స్థాయిలో తెలుసుకున్నారు. రోడ్డు నెంబర్–3లోని జ్యోతినెస్ట్ నివాసితులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేబీఆర్ పార్కు, నందినగర్ మీదుగా బంజారాహిల్స్ నుంచి జలగం వెంగళరావునగర్ పార్కులోని చెరువులోకి చేరే వరద కాల్వను ఆయన పరిశీలించారు. ఎగువన 4 మీటర్ల వెడల్పుతో ఉన్న నాలా బంజారాహిల్స్ రోడ్డునెంబర్–3 వద్దకు వచ్చేసరికి కొన్నిచోట్ల 2 మీటర్లకే పరిమితవడాన్ని గుర్తించారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14తో పాటు 3లోనూ నాలాలు కుంచించుకుపోవడాన్ని పరిశీలించారు. బఫర్ లేకుండా చేయడంతో పాటు నాలాను ఆక్రమించడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎగువ నుంచి చివరి వరకూ నాలా వెడల్పును పరిశీలించి వరద ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.



అధికారులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య


హితేష్ (ఫైల్)

గచ్చిబౌలి: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా, మంచిర్యాల పట్టణానికి చెందిన వలివేటి హితేష్(29) కోకాపేట్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తూ మణికొండలోని లాంకో హిల్స్‌లో తన సోదరుడు ప్రమోద్‌తో కలిసి నివాసం ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం ప్రమోద్ డ్యూటీకి వెళ్తుండగా హితేష్ తన ఆరోగ్యం సరిగా లేదని తర్వాత వస్తానని చెప్పాడు. సాయంత్రమైనా అతను ఆఫీసుకు రాకపోవడంతో ఫోన్ చేసినా స్పందించలేదు. అనుమానం వచ్చి స్నేహితుడిని ఇంటికి వెళ్లి చూడాలని కోరాడు. దీంతో అతను అక్కడికి వెళ్లి చూడగా లోపలి నుంచి గడియ పెట్టి ఉండటంతో ప్రమోద్‌కు సమాచారం అందించాడు. దీంతో అక్కడికి వచ్చిన ప్రమోదు స్నేహితుల సహాయంతో తలుపులు విరగొట్టి చూడగా హితేష్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. సారీ నేను చనిపోతున్నా.. అందరూ జాగ్రత్తగా ఉండాలి.. నా చావును మీడియాలో చూపించవద్దని రాసిన లేఖను గుర్తించాడు. రెండేళ్లుగా ప్రేమిస్తున్న యువతితో మనస్పర్థలు రావడంతో మనస్తాపానికిలోనై ఆత్మహత్యకు పాల్పడినట్లు అతడి సోదరుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎముకలూ వివరాలు చెబుతాయి!

నగరంలో తరచూ లభిస్తున్న అస్థిపంజరాలు

- వాటి నిర్మాణం ఆధారంగా మృతుల లింగ నిర్ధారణ
- ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకునే నిపుణులు
- ఫోరెన్సిక్ భాషలో ఆస్టియాలజీగా ప్రాచుర్యం



సాక్షి, సిటీబ్యూరో: మొన్న డీబీఆర్ మిల్స్ ప్రాంగణంలోని పాత భవనం వాటర్ ట్యాంక్‌లో... నిన్న ముర్గీ చౌక్‌లోని పాడుబడిన ఇంట్లో... ఇలా నగరంలో తరచూ అస్థిపంజరాలు లభిస్తూనే ఉంటాయి. ఫోరెన్సిక్ నిపుణుల సాయంతో వీటిని అధ్యయనం చేసే పోలీసులు మృతుల లింగ నిర్ధారణ చేస్తుంటారు. అదెలా సాధ్యమనే అనుమానం అనేక మందిలో ఉంటుంది. అస్థిపంజరాలన్నీ సామాన్యుల కంటికి ఒకేలా కనిపిస్తాయి. అయితే వీటిని ఫోరెన్సిక్ కోణంలో అధ్యయనం చేసి అనేక వివరాలు తెలుసుకుంటారు. దీన్నే సాంకేతిక పరిభాషలో ఫోరెన్సిక్ ఆస్టియాలజీ అంటారు. ఈ శాస్త్రం ఆధారంగా అస్థిపంజరాల లింగం, వయస్సు తదితరాలను గుర్తిస్తుంటారు.

లింగ నిర్ధారణ చేసేది ఇలా...

ఎక్కడైనా గుర్తుతెలియని అస్థిపంజరం దొరికినప్పుడు అది పురుషుడిదా? స్త్రీదా? అనేది నిర్ధారించడంలో పెల్విక్ బోన్ కీలకపాత్ర పోషిస్తుంది. తొడ ఎముకలు, వెన్నుముకను కలుపుతూ ఉండే ప్రాంతంలో గుండ్రంగా ఉండే దాన్నే పెల్విక్ బోన్ అంటారు. ఇది స్త్రీలకు వెడల్పుగా, పురుషులకు కుంచించుకుని ఉంటుంది. దీని వల్లే తొడ ఎముక యాంగిల్ (వంపు) నిర్మాణంలోనూ తేడాలు వస్తాయి. పురుషుల తొడ ఎముక యాంగిల్ తక్కువగా, స్త్రీలకు ఎక్కువగా నిర్మాణమై ఉంటాయి. లింగ నిర్ధారణకు ఇది ప్రాథమికమైన అంశం. పుర్రె సైతం దీని గుర్తింపునకు పనికి వస్తుంది. పుర్రె స్త్రీలకు చిన్నదిగా, పురుషులకు పెద్దదిగా ఉంటుంది. ఫీమర్ బోన్‌గా పిలిచే తొడ ఎముకను బట్టి గుర్తించవచ్చు. సాధారణంగా స్త్రీల తొడ ఎముక సున్నితంగా ఉంటుంది. పురుషుల ఎముకకు కండ పట్టి రఫ్‌గా తయారవుతుంది. దైనందిన జీవితంలో చేసే పనుల్లో ఉన్న వ్యత్యాసం కారణంగానే ఇలా ఉంటాయి.

వయస్సు గుర్తించేది ఇలా...

ఆ అస్థిపంజరం ఏ వయస్సు వారిదో నిర్ధారించడానికి పుర్రె చాలా కీలమైంది. శిశువు గర్భంలో ఉండగా పుర్రె ఏడు భాగాలుగా ఉంటుంది. ప్రసవం సమయానికి అవి అతుక్కుని ఒకటిగా మారతాయి. ఈ అతుకులనే సూచర్స్ అంటారు. వయస్సు పెరిగే కొద్దీ ఈ అతుకులు కనుమరుగవుతుంటాయి. అందుకే పసి వాళ్ల తలపై నడినెత్తి భాగం చాలా మెత్తగా ఉంటుంది. కొన్ని నెలలకు అది పూడి గట్టిగా తయారవుతుంది. సూచర్స్ ఉన్న స్థితిని బట్టి వయస్సు నిర్ధారిస్తారు. పుర్రెలో ఉన్న పళ్లు కూడా వయస్సు నిర్ధారించడానికి ఉపకరిస్తాయి. దీన్ని ఫోరెన్సిక్ ఒడెంటాలజీ అంటారు. జ్ఞానదంతం రాకపోతే 18 ఏళ్ల లోపుగా అంచనా వేస్తారు. మిగిలిన పళ్ల తీరు తెన్నులు, ఎముకల నిర్మాణం, వాటి పటుత్వం, ఎత్తు కూడా అస్థిపంజరం ఏ వయస్సు వారిదో గుర్తించడానికి ఉపకరిస్తాయి.

నిర్ధారణ మాత్రం డీఎన్ఏ ద్వారానే...

అస్థిపంజరం లభించకుండా కేవలం కొన్ని ఎముకలే దొరికి, అవి కూడా పూర్తి స్థాయిలో లేకపోతే గుర్తింపు కొద్దిగా ఇబ్బందే. అప్పుడు ఉన్న అవశేషాలను ఫోరెన్సిక్ లాబ్‌కు పంపడం ద్వారా డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల్లోనే లింగం, వయస్సు తదితర వివరాలు బయటపడతాయి. లభించిన అస్థిపంజరం ఎవరిదనేది గుర్తించి, అధికారికంగా ఖరారు చేయాలన్నా డీఎన్ఏ పరీక్షలు తప్పనిసరి. అనుమానితులుగా ఉన్న సంబంధీకుల నుంచి రక్తనమూనాల తీసుకోవడం లేదా వారి మెడికల్ రికార్డుల ఆధారంగా ఈ పరీక్షలు చేస్తారు. అలా పోలీసులు తమకు లభించిన పుర్రెలు, ఎముకలకు డీఎన్ఏ టెస్ట్‌కు పంపించి అవి ఎవరివో ఓ అవగాహనకు వస్తారు. కేసుల దర్యాప్తు, అనుమానితులు, నిందితుల గుర్తింపులో ఈ విధానాలన్నీ ఎంతో కీలమైంది.

గోషామహల్‌లో స్పెషల్ డ్రైవ్



సాక్షి, సిటీబ్యూరో: సిటీ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు నగర వ్యాప్తంగా ఆకస్మిక డ్రంక్ డ్రైవింగ్ తనిఖీలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం సౌత్ వెస్ట్ ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.సైదులు వివిధ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అలాస్కా జంక్షన్‌లో ద్విచక్ర వాహనచోదకులతో పాటు ఆటో, బస్సు డ్రైవర్లను తనిఖీ చేశారు.

ఉప్పల్ ఇన్‌స్పెక్టర్‌పై వేటు

- సీపీ కార్యాలయానికి అటాచ్


ఎలక్షన్ రెడ్డి

ఉప్పల్: హెచ్‌సీఏ వివాదంలో తల దూర్చాడన్న అభియోగంతో ఉప్పల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డిపై వేటు పడింది. అతడిని సీపీ కార్యాయానికి అటాచ్ చేస్తూ గురువారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. సీఐడీ సమాచారాన్ని ముందుగానే హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజుకు చేరవేశాడని ఆరోపణలు రావడంతో సీపీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ప్రేమ పేరుతో మోసం..

వెంగళరావునగర్: ప్రేమించానని నమ్మించి మోసం చేయడమే గాక బ్లాక్‌మెయిల్ చేస్తున్న యువకుడిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లాకు చెందిన యువతి నగరంలో ఉంటూ ప్రైవేట్ సంస్థలో క్యాషియర్‌గా పని చేస్తోంది. ఆమెకు యూసుఫ్‌గూడకు చెందిన అల్లవారి శ్రీధర్ అనే యువకుడితో ఇన్‌స్టాగ్రాం పరిచయం ఏర్పడింది. అనంతరం ప్రేమించానని నమ్మించి పలుమార్లు ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో కొన్నాళ్లుగా దూరం ఉంటున్నాడు. దీంతో బాధితురాలు ఈ విషయాన్ని అతని తల్లిదండ్రులకు చెబుతానని అనడంతో ఆగ్రహానికి లోనైన శ్రీధర్ ఇద్దరూ కలిసి ఉన్న ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దాంతో బాధితురాలు గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోడలి వేధింపులు తాళలేక అత్త ఆత్మహత్య

నాంపల్లి: కోడలి వేధింపులు తాళలేక అత్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హబీబ్‌నగర్ లోథ్‌బస్తీలో రామేశ్వర్‌సింగ్, ఉషాబాయి దంపతులు నివాసం ఉంటున్నారు. వారు కుటుంబ సభ్యులతో కలిసి ఇటీవల తీర్థయాత్రలకు వెళ్లగా నాసిక్‌లో అత్తాకోడళ్ల మధ్య గొడవ జరిగింది. అప్పటి నుంచి కోడలి వేధింపులు తాళలేక ఉషాబాయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు ప్పాడింది. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కల్తీ కల్లు ఘటనలో మరొకరి మృతి

మూసా పేట: కల్తీ కల్లు తాగి ఆసుపత్రి పాలైన వారిలో మరొకరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, తాండూరు మండలం, ఇంద్రకల్ గ్రామానికి చెందిన దొండి సునీత (42) కూకట్‌పల్లి, ఇంద్రహిల్స్‌లో ఉంటున్న కుమారుడి వద్దకు వచ్చింది. ఈ నెల 5న శాతవాహన నగర్ లోని కల్లు దుకాణంలో కల్లు తాగి, మర్నాడు సొంత ఊరికి వెళ్లింది. అక్కడ వాంతులు కావడంతో 7న నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రి కి తీసుకెళ్లారు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో ఉస్మానియా ఆసుపత్రికి తలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. మృతురాలి కుమారడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చిట్టీల పేరిట మోసం..

- భార్యాభర్తలకు జైలు, జరిమానా

చిలకలగూడ : చిట్టీల పేరిట మోసానికి పాల్పడిన భార్యాభర్తలకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయ స్థానం గురువారం తీర్పు చెప్పింది. చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ అనుదీప్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చిలకలగూడ ఠాణా పరిధి పార్శిగుట్టకు చెందిన రవీందర్, సుజాత దంపతులు చిట్టీల వ్యాపారం నిర్వహించేవారు. మొదట్లో తక్కువ మొత్తాలకు చిట్టీలు వేసి సకాలంలో డబ్బులు తిరిగి చెల్లించి స్థానికుల్లో నమ్మకం సంపాదించారు. ఆ తర్వాత పెద్దమొత్తంలో చిట్టీలు ప్రారంభించి ఎక్కువ మందిని చేర్చుకున్నారు. కాల పరిమితి ముగిసినా చిట్టీ డబ్బులు చెల్లించకుండా, అధిక వడ్డీ ఇస్తామని ఆశ చూపి రూ. లక్షలు వసూలు చేసి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు ఆర్థిక మోసానికి పాల్పడిన రవీందర్, సుజాతతోపాటు వారికి సహకరించిన శంకర్, రాజేశ్వర్‌లపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన అప్పటి ఎస్ఐ పెండ్యాల జయశంకర్ నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయడంతో న్యాయస్థానం విచారణ చేపట్టింది. వాదోపవాదాలు విన్న తర్వాత సికింద్రాబాద్ 19వ అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ అరుణ గురువారం నిందితులు రవీందర్, సుజాతలకు ఏడాది జైలుశిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. వీరికి సహకరించిన శంకర్, రాజేశ్వర్‌లపై కేసు కొట్టివేశారు.

బస్సు డ్రైవర్ పై దాడి

- రూ. లక్ష నగదు చోరీ
- ఐదుగురు నిందితుల అరెస్ట్
- బస్సులో సిగరేట్ తాగవద్దన్నందుకు గొడవ



మియాపూర్: బస్సులో సిగరేట్ తాగవద్దన్నందుకు ఓ ప్రయాణికుడు బస్సు డ్రైవర్‌తో గొడవ పడి తన స్నేహితులతో కలిసి అతడిపై దాడిచేసి రూ. లక్ష నగదు లాక్కెళ్లారు. ఈ ఘటనలో ఐదుగురు నిందితులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీఐ రమేష్ నాయుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నింబోలి అడ్డాకు చెందిన పప్పురామ్ ట్రావెల్స్ నిర్వహిస్తున్నాడు. అతను హైదరాబాద్ నుంచి రాజస్థాన్‌కు ప్రైవేటు బస్సు నడిపేవాడు. ఈ నెల 12న రాత్రి ప్రయాణికులను ఎక్కించుకుని రాజస్థాన్ బయలుదేరాడు. ఎల్‌బీనగర్‌లో ఉంటున్న రాజస్థాన్ రాష్ట్రం, జోద్‌పూర్ జిల్లా కు చెందిన పూనారామ్ తన సొంత ఊరికి వెళ్లేందుకు పప్పురామ్ ట్రావెల్ బస్సులో ఎక్కాడు. బస్సులో పునరామ్ సిగరేట్ తాగుతుండడంతో పప్పురామ్ అతడిని వారించాడు. దీంతో ఆగ్రహానికి లోనైన పునరామ్ బస్సు డ్రైవర్‌తో గొడవపడ్డాడు. అంతేగాక నగరంలో ఉంటున్న తన స్నేహితులు మహిపాల్, నారాయణ రామ్, వికాస్ విష్ణోయ్, కైలాష్‌తో పాటు మరో ముగ్గురు స్నేహితులకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. రాత్రి 10 గంటలకు వారు మదీనాగూడలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద బస్సును అడ్డుకుని డ్రైవర్ పప్పురామ్‌పై మూకుమ్మడిగా దాడి చేశారు. అతడి నుంచి రూ. లక్ష నగదు లాక్కుని పరారయ్యారు. డ్రైవర్ పప్పురామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన మియాపూర్ పోలీసులు గురువారం ప్రధాన నిందితుడు పునరామ్‌తో పాటు అతడి స్నేహితులు మహిపాల్, నారాయణరామ్, వికాస్, కైలాష్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మరో ముగ్గురు వ్యక్తులు వికాస్, మనుపాల్, ఫకియాలు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

మ్యాన్‌హోల్ మూతలను తెరవొద్దు

జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో మ్యాన్‌హోల్ మూతలను తెరవకూడదని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి హెచ్చరించారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, డీప్ మ్యాన్‌హోళ్ల దగ్గర సీవరేజి సూపర్‌వైజర్లు ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి జూమ్ మీటింగ్‌తో పలు అదేశాలు జారీచేశారు. నగర ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు (ఈఆర్టీ), ఎస్పీటి వాహనాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తరచూ సీవరేజీ ఓవర్ ఫ్లో అయ్యే మ్యాన్‌హోళ్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నీరు నిలిచే ప్రాంతాలపై ఈ బృందాలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అధికారులు 24 గంటలు క్షేత్రస్థాయిలో సిబ్బందితో పర్యవేక్షించుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ, హైడ్రా, పోలీస్ శాఖల అధికారులతో కలిసి సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.

పాల ప్యాకెట్‌ల తరహాలో కల్లు ప్యాకెట్లు



సాక్షి, సిటీబ్యూరో: కిరాణా దుకాణాల్లో పాల ప్యాకెట్‌ల తరహాలో హోటళ్లలో కల్లు ప్యాకెట్‌ల అమ్మకాలు జరుగుతున్నాయి. కల్తీకల్లుపై పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహిస్తోన్న ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు గుండ్లపోచంపల్లి అయోధ్యనగర్ ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా హోటళ్లలో ఎస్‌వీఎస్ బ్రాండ్ పేరుతో విక్రయిస్తున్న కల్లు ప్యాకెట్‌లను గుర్తించారు. హోటళ్లలో తినుబండారాలతో పాటు ఎస్‌వీఎస్ కల్లుప్యాకెట్‌లు కూడా విక్రయించడం అధికారులను విస్మయానికి గురిచేసింది. పక్కా సమాచారంతో ఎక్సైజ్ అధికారులు సుభాష్‌చందర్, బాలరాజు,అఖిల్, రవిచంద్ర తదితరులు తమ సిబ్బందితో కలిసి దాడులు చేసి కల్లు ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. శంకర్‌గౌడ్ అనే వ్యక్తి నిర్వహిస్తున్న ఈ హోటల్‌లో 270 లీటర్ల కల్లు ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా కల్లు విక్రయిస్తున్న శంకర్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకొని కల్లు ప్యాకెట్లను మేడ్చల్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. మల్కాజిగిరిలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న 20 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకుని పారబోశారు. సైదాబాద్ ప్రాంతంలో అనుమతి లేకుండా కల్లు అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో టీమ్ లీడర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో దాడి చేసి 750 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పల్లె భిక్షపతి, బొడిగే శ్రీనివాస్ గౌడ్‌లపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు


రంజిత్ సింగ్

రాజేంద్రనగర్: ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.8 వేల జరిమానా విధిస్తూ రాజేంద్రనగర్ పోక్సో కోర్టు న్యాయమూర్తి గురువారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గగన్‌పహాడ్ ప్రాంతంలో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కుటుంబం నివాసం ఉంటోంది. వీరికి ముగ్గురు ఆడ పిల్లలు. అదే ప్రాంతంలో ఉంటున్న బిహార్‌కు చెందిన రంజిత్ సింగ్ కూలీగ పని చేసేవాడు. 2019 మార్చి 22న మూడేళ్ల బాలిక ఇంటి ముందు ఆడుకుంటుండగా రంజిత్ సింగ్ ఆమెను కిడ్నాప్ చేసి సమీపంలోని మామిడికుంట చెరువు వద్దకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం చిన్నారిని అక్కడే వదిలి పారిపోయాడు. చిన్నారి కనిపించకపోవడంతో గాలింపు చేపట్టిన కుటుంబ సభ్యులు కుంట సమీపంలో ఆమెను గుర్తించారు. చిన్నారి లైంగికదాడి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు శంషాబాద్ ఆర్‌జీఐ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు రంజిత్ సింగ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ చేపట్టిన పోక్సో కోర్టు న్యాయమూర్తి అంజనేయులు నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.8 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. బాధితురాలికి రూ.3 లక్షలు పరిహారం చెల్లించాలని న్యాయసేవాధికార సంస్థకు సిఫారసు చేశారు.

టమాటా లారీ బోల్తా



రాజేంద్రనగర్: ప్యాసింజర్ ఆటో అడ్డు రావడంతో దానిని తప్పించే క్రమంలో డీసీఎం ఫుట్‌పాత్‌ను ఢీ కొనడంతో వాహనం బోల్తా పడిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై మామిడి కిశోర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లాకు చెందిన గంగాధర్ డీసీఎంలో ప్రతిరోజు నగరంలోని కూరగాయల మార్కెట్‌లకు కూరగాయలను సరఫరా చేస్తుంటాడు. గురువారం ఉదయం డీసీఎంలో టమాటా లోడ్ తీసుకొని ఆరాంఘర్ మీదుగా గుడిమల్కాపూర్ వెళుతుండగా రాజేంద్రనగర్ పీడీపీ చౌరస్తా 215 పిల్లర్ వద్దకు రాగానే ప్యాసింజర్ ఆటో రాంగ్ రూట్‌లో దూసుకొచ్చింది. దానిని తప్పించే క్రమంలో డీసీఎం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. డీసీఎంలోని టమాటాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. డ్రైవర్ గంగాధర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ కారణంగా దాదాపు గంటసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్రేన్ ద్వారా డీసీఎంను పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. డీసీఎం యజమాని ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టమాటాలు ఎత్తుకెళ్లిన స్థానికులు...

రోడ్డుపై టమాటలు చెల్లాచెదురుగా పడిపోవడంతో ఉదయం వాకింగ్‌కు వచ్చిన వారితో స్థానికులు, వాహనదారులు టమాటాలను ఎత్తుకెళ్లారు. అందిన కాడికి సంచులు, ప్లాస్టిక్ కవర్లలో తీసుకుని ఉడాయించారు.

జీడిమెట్ల ఏటీఎం చోరీ కేసులో వీడిన మిస్టరీ

- ముగ్గురు దొంగల అరెస్ట్
- పరారీలో మరొకరు
- రూ.17లక్షల నగదు, నాలుగు బైక్‌లు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్..

జీడిమెట్ల: గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను కట్‌చేసి రూ.34.71లక్షలు దోచుకువెళ్లిన అంతర్రాష్ట్ర ముఠాను జీడిమెట్ల, బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. గురువారం సైబరాబాద్ సీపీ కార్యాలయంలో బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్, క్రైం డీసీపీలు ముత్యంరెడ్డి, రామ్‌కుమార్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఈనెల 8న షాపూర్‌నగర్, మార్కండేయనగర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎంలో చొరబడిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు సీసీ కెమెరా వైర్లను కత్తిరించారు. అనంతరం తమతో పాటు తెచ్చుకున్న గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం మిషన్‌ను కట్ చేసి అందులో ఉన్న రూ.34.71లక్షల నగదు ఎత్తుకెళ్లారు.

ఆధారాలు చిక్కకుండా జాగ్రత్తలు..

ఈ కేసులో దొంగలు పోలీసులకు చిక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ముఖాలకు మాస్కులు ధరించడంతో పాటు వివిధ ప్రాంతాల్లో చోరీ చేసిన వాహనాలను ఈ చోరీకి ఉపయోగించారు. అనంతరం బైకులపై నర్సాపూర్, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, అదిలాబాద్, నాగ్‌పూర్, మీదుగా హరియాణాకు పారిపోయారు. వీరు సెల్‌ఫోన్‌లు కూడా వాడకుండా జాగ్రత్త పడ్డారు. చోరీ అనంతరం గ్యాస్ కట్టర్‌లు, సిలిండర్లను జీడిమెట్ల డిపో వద్ద పారవేశారు. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటిని ఫతేనగర్‌లో కొనుగోలు చేసినట్లు గుర్తించారు. అక్కడ సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుల్లో ఒకడైన అమేర్ అన్సారీని గుర్తించారు. గతంలో అతను మెట్కానిగూడలో ఉండేవాడని, ప్రస్తుతం అతడి కుటుంబ సభ్యులు బేగంపేట ప్రకాష్‌నగర్‌లో హాస్టల్ నిర్వహిస్తున్నట్లు తెలుసుకుని వారి ద్వారా కూపీ లాగారు. దీంతో ఒక బృందాన్ని హరియాణాకు పంపారు. పోలీసులు తమ కోసం ఆరా తీస్తున్నట్లు తెలుసుకున్న దొంగలు హైదరాబాద్‌కు తిరిగి వచ్చి అమేర్ అన్సారీ ఇంట్లో తలదాచుకున్నారు. గురువారం ఉదయం అమేర్ అన్సారీ, యాసీద్ హుస్సేన్, మహ్మద్ అబేద్ నెంబర్ ప్లేట్‌లేని బైక్‌పై వెళ్తుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి నుంచి రూ.17లక్షల నగదు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కాగా మరో దొంగ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

మధ్యప్రదేశ్ జైల్‌లో పరిచయం..

హైదరాబాద్‌కు చెందిన అమేర్ అన్సారీ గతంలో మధ్యప్రదేష్‌కు చెందిన బాలికను ఇన్‌స్టా ద్వారా ట్రాప్ చేసి నగరానికి రప్పించాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసునమోదు చేసిన పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మధ్యప్రదేశ్‌లో జైలులో ఉన్న అతడికి ఇప్పటికే పదుల సంఖ్యలో చోరీలు చేసి జైలులో ఉన్న , యాసీద్ హుస్సేన్, మహ్మద్ అబేద్‌తో పరిచయం ఏర్పడింది. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్, డీఐ కనకయ్య, బాలానగర్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌లను డీసీపీ అభినందించారు.

గర్భిణులకు చీరల పంపిణీ



బంజారాహిల్స్: సత్య కుసుమ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని సింగాడబస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు చీరలతో పాటు పండ్లు, పోషకాహారం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఫౌండర్, ఎస్‌బీఐ బీమా రత్న, వీర తెలంగాణ అవార్డు గ్రహీత జవ్వాది అనిల్‌కుమార్ మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం తమ ట్రస్టులో ఉండే సభ్యుల ముఖ్యమైన రోజులను ఇలా సమాజానికి ఉపయోగపడే విధంగా సమాజంలోని పేద వారి మధ్య జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నదన్నారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలోని గర్భిణులకు చీరలతో పాటు పౌష్టికాహారం పంపిణీ చేసినట్లు తెలిపారు. అదే విధంగా అంగన్‌వాడీ స్కూల్‌లోని 40 మంది పిల్లలకు స్కూల్ బ్యాగులు, పలకలు, బిస్కెట్లు పంపిణీ చేశామన్నారు.

అత్యాధునిక 'హాల్సియాన్' ప్రారంభం



బంజారాహిల్స్ బసవతారకం ఇండో–అమెరికన్ కేన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో అత్యాధునిక రేడియేషన్ యంత్రం హాల్సియాన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. దక్షిణ భారతదేశంలోనే ఈ అత్యాధునిక రేడియేషన్ యంత్రం మొట్టమొదటిది కాగా, దేశంలో రెండవది. హాల్సియాన్ వ్యవస్థ అల్ట్రా–ఫాస్ట్ చికిత్సలను 10 నిమిషాల్లోపు పూర్తి చేయడానికి వీలు కల్పిస్తుంది. మెరుగైన కణితి స్థానికీకరణ కోసం హై–రిజల్యూషన్ సాఫ్ట్ టిష్యూ ఇమేజింగ్‌ను అందించడమే కాకుండా ఆఫ్‌లైన్ అడాప్టివ్ థెరపి వర్క్‌ఫ్లోలకు మద్దతు ఇస్తుందని ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

పీర్లకు ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు



శ్రీనగర్‌కాలనీ: ఎల్లారెడ్డిగూడ అసుర్‌ఖానా వద్ద ఏర్పాటు చేసిన పీర్ల వద్ద గురువారం ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హుసేన్ ప్రత్యేక పూజలను నిర్వహించారు. నేతలు ఎంఐఎం బ్రాంచ్ ప్రెసిడెంట్ షేక్ జాఫర్, సీనియర్ అడ్వకేట్ ఎస్‌కే ఉమ్మన్, ఎర్ర నగేష్, మహబూబ్, ఖలీమ్, షరీఫ్, ఫరీద్, షఫీ, జమీర్ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం.14లోని నందినగర్ బస్టాండ్‌లో కొద్ది రోజులుగా ప్రభుత్వ స్థలంలో డబ్బాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో ఇక్కడ నిత్యం బస్సు వచ్చి తిరిగి వెళ్లడానికి ఈ అక్రమ డబ్బాలు అడ్డుగా వస్తున్నాయి. ఈ సమస్యను స్థానికులు మండల అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన డబ్బాలు, నిర్మాణాలను నేలమట్టం చేశారు. మరోసారి ప్రభుత్వ స్థలంలో అక్రమంగా డబ్బాలు ఏర్పాటు చేస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతుల కల్పనకు కృషి



శ్రీనగర్‌కాలనీ: అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ విడియోగల్లీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. అక్కడి మౌలిక వసతులు తెలుసుకొని చిన్నారులకు నిత్యావసర వస్తువులు, కేంద్రానికి ఫ్యాన్లు, ఇతర వస్తువులను అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యల పరిష్కారానికి, చిన్నారుల విద్య, వైద్య వసతులకు తోడుగా ఉంటానని పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త మాచర్ల పీటర్‌లాల్, టీచర్ వేదవతి, నేతలు కుమారి, ఆల్బర్ట్, ఖురేషి, గురునాథరావు, భరత్, నాగరాజు పాల్గొన్నారు.

మందుబాబులపై ఫోకస్!

- అన్ని ప్రధాన కూడళ్లలో డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు
- ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్న పోలీసులు
- పట్టుబడితే వాహనం సీజ్

పట్టపగలు.. పోలీసులకు చిక్కుతున్న మందుబాబులు



పంజగుట్ట చౌరస్తాలో డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న మందుబాబులకు ట్రాఫిక్ పోలీసులు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నారు. అన్ని ప్రధాన చౌరస్తాల్లో గత రెండు రోజుల నుంచి ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. ఎక్కడికక్కడ ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. రెడ్ సిగ్నల్ పడగానే అప్పటికే అక్కడ కాచుకుంటున్న ట్రాఫిక్ ఎస్‌ఐ వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. రాత్రిపూట మాత్రమే డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తారని, పగటిపూట మద్యం మత్తులో తూలుతూ వెళ్లినా పట్టుకోరనే వాహనదారుల అపోహను పటాపంచల్ చేస్తున్నారు.

- నగర ట్రాఫిక్ పోలీసు జాయింట్ కమిషనర్ జోయల్ డేవిడ్ ఆదేశాల మేరకు వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ పర్యవేక్షణలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు రెండు రోజుల నుంచి ఆకస్మిక తనిఖీలు చేస్తూ డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. పట్టపగలే మద్యం సేవించి స్కూటర్ నడుపుతూ బుధవారం ఐదుగురు, గురువారం ఐదుగురు ఆయా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంకన్ డ్రైవ్‌లో పోలీసులకు చిక్కారు. వీరి వాహనాలను సీజ్ చేస్తున్న పోలీసులు జరిమానాలు కూడా విధిస్తున్నారు.
- చాలామంది వాహనదారులు డ్రంకన్ డ్రైవ్ రాత్రి పూటనే నిర్వహిస్తారని భావిస్తూ పగటిపూట ఫుల్లుగా మద్యం తాగి మత్తులో దూసుకుపోతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. అంతేకాకుండా ఇటీవల వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పోలీసులు అంబులెన్స్ డ్రైవర్లకు కూడా డ్రంకన్ డ్రైవ్ నిర్వహించగా 10 మంది వరకు పట్టుబడ్డారు. అది కూడా పట్టపగలే మద్యం సేవించి అంబులెన్స్‌లు నడుపుతున్నట్లుగా తేలింది.
- ఇటీవల పగటిపూటనే స్కూల్ బస్సులు, స్కూల్ వ్యాన్‌లు, ఆటోడ్రైవర్లు కూడా పగటిపూట డ్రంకన్ డ్రైవ్ నిర్వహించగా ప్రముఖ పాఠశాలలకు చెందిన బస్సు డ్రైవర్లు, వ్యాన్ డ్రైవర్ల మద్యం సేవించి మత్తులో ట్రాఫిక్ పోలీసులకు దొరికారు. దీంతో పోలీసులు పగలూ, రాత్రీ అని తేడా లేకుండా డ్రంకన్ డ్రైవ్ నిర్వహించాలని తలపెట్టారు. ఈ నేపథ్యంలోనే రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న డ్రంకన్ డ్రైవ్‌లో మందుబాబులు పెద్ద ఎత్తున పట్టుబడుతుండటం ఆందోళన కలిగిస్తున్నది.
- తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని పోలీసులు ఈ తరహా విధానానికి తెరలేపారు. ప్రతిరోజూ ఈ టెస్ట్‌లు నిర్వహించాలని అధికారులు ఆదేశించిన నేపథ్యంలో అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.



కేబీఆర్ పార్కు చౌరస్తాలో మద్యం సేవించి స్కూటర్ నడుపుతూ పట్టుబడ్డ వాహనదారుడు

రోజూ పరీక్షలు



నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ జోయల్ డేవిడ్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే పర్యవేక్షణలో వెస్ట్‌జోన్ పరిధిలోని నాలుగు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో అన్ని చౌరస్తాల్లో డ్రంకన్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. ఆయా పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు అన్ని ప్రధాన చౌరస్తాల్లో రెడ్ సిగ్నల్ పడగానే అనుమానిత వాహనదారులకు శ్వాస పరీక్షలు నిర్వహిస్తారు. ఇలా మా పరిధిలో ఇప్పటికే పగటి పూటనే మద్యం సేవించి స్కూటర్లు నడుపుతూ 10 మంది వాహనదారులు పట్టుబడ్డారు. మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రంగా పరిగణిస్తాం. రోడ్డు ప్రమాదాలకు వీరే కారణమవుతున్నారు. ఇటీవల రెండోసారి పట్టుబడ్డ వారిని న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి వీరికి చౌరస్తాల్లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ సామాజిక సేవ నిర్వహించాలని తీర్పునిచ్చారు. ఇది కూడా అమలు చేస్తున్నాం. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దు. ఇది ప్రమాదకరం. దీనిపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నాం. చాలామంది పోలీసులు ఉండరులే అని మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్నారు. కానీ ఇక నుంచి పగలూ, రాత్రీ అని తేడా లేకుండా బ్రీత్ ఎనలైజర్ పరికరంతో మా పోలీసులు ఆకస్మికంగా ప్రత్యక్షమవుతారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వాహనదారులు మద్యం సేవించి రోడ్డెక్కవద్దని సూచిస్తున్నాం.

– కట్టా హరిప్రసాద్, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ

అభివృద్ధి పనుల్లో నాణ్యతపై రాజీపడం



రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్

వెంగళరావునగర్: ఎక్కడ ఎలాంటి అభివృద్ధి పనులు జరిగినా ప్రజలు తప్పనిసరిగా నిర్మాణ నాణ్యతను పరిశీలించాలని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. జవహర్‌నగర్ మెయిన్‌రోడ్డులో జరుగుతున్న ప్యాచ్‌వర్క్ పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... కాలనీలు, బస్తీలనే తేడా లేకుండా అభివృద్ధి చేస్తున్నామని.. అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్మించే విషయంలో తాను ఏ విధంగానూ రాజీపడబోమన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా తనకు సమాచారం అందించాలని తెలిపారు. దాదాపు ఏడాదిన్నరగా రోడ్డు ప్యాచ్‌వర్క్‌ల కోసం బీటీని అధికారులు విడుదల చేయలేదని, ప్రస్తుతం వచ్చిన బీటీతో నాణ్యతతో తీర్చిదిద్దాలని అన్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, అఫ్సర్, సత్యనారాయణ, మహబూబ్, పవన్, బాలు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'చిత్రపురి సొసైటీకి మేనేజర్స్ యూనియన్‌కు సంబంధం లేదు'



దొర

బంజారాహిల్స్: చిత్రపురికాలనీ సొసైటీ సెక్రటరీ దొరపై సస్పెన్షన్ వేటు అని ప్రచారం జరుగుతున్నదని, ఇందులో ఏమాత్రం నిజం లేదని, సినీ కార్మికులు ఇలాంటి ప్రచారాలు నమ్మవద్దని సొసైటీ సెక్రటరీ పి.ఎస్.ఎన్.దొర అన్నారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–2లోని ఇందిరానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జనరల్ బాడీ మీటింగ్ జరిగి 48 గంటలు గడవకముందే సస్పెండ్ చేస్తున్నట్లు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. అలాగైతే తనకు మూడు నెలల గడువు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. అవినీతి జరిగిందని అసత్య ప్రచారాలు చేయడం తప్పితే ఏ ఒక్కటీ నిరూపించలేకపోయారన్నారు. తనపై అసత్య ప్రచారం చేసే వారి అందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సినీ మేనేజర్ యూనియన్‌కు, చిత్రపురికి సంబంధమే లేదన్నారు. కోర్టులో కేసులు ఉండగా దీనిపై ప్రత్యేక కమిటీ, ల్యాండ్ కమిటీ, అకౌంట్ కమిటీ అని ఎలా వేస్తారని ఆయన ప్రశ్నించారు. మేనేజర్స్ యూనియన్‌లో అంశాలు చిత్రపురి సొసైటీకి ముడిపెట్టి అందరినీ అయోమయానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. యూనియన్‌లో తనపై వచ్చిన అభియోగాలు నిరూపించుకోవడానికి సమయమిచ్చి వాట్సాప్ గ్రూపుల్లో అసత్య ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమో సభ్యులు గ్రహిస్తున్నారన్నారు.

అధ్వానంగా ప్రేమ్‌నగర్ రోడ్లు





పంజగుట్ట: పంజగుట్ట ప్రేమ్‌నగర్‌లో గోతుల రోడ్లు, రోడ్లపై మట్టికుప్పలు, బయటకు తేలిన పైప్ లైన్‌లతో స్థానికులు నరకం అనుభవిస్తున్నారు. పాత సమత స్కూల్ లైన్‌లో కొత్త వాటర్ పైప్‌లైన్ వేసి ఆరు నెలలు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పూర్తిచేసి నాలుగు నెలలు అవుతున్నా ఇప్పటివరకు ప్యాచ్ వర్క్ చెయ్యలేదు. ఉదయం వేళల్లో పాఠశాల విద్యార్థులు స్కూల్‌కు వెళ్లే సమయంలో ఆ గోతుల్లో పడి గాయాలపాలౌతున్నారని, వృద్ధులు తిరగలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా వేసిన మంచినీటి పైప్‌లైన్ రోడ్డు బయటకు రావడంతో వాహనదారులు పైప్‌లైన్‌వల్ల వాహనం స్కిడ్ అయి కిందపడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించకపోతే నిరసనకు దిగుతామని హెచ్చరించారు.

ఉద్యోగం పేరిట యువతికి టోకరా

సనత్‌నగర్: ఉద్యోగం పేరిట ఓ మహిళను మోసం చేసి డబ్బు తీసుకున్న ఓ సంస్థకు చెందిన సిబ్బందిపై ఎస్సార్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం జిల్లాకు చెందిన ఎం.ముత్యాలమ్మ ఎస్సార్‌నగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటుంది. ఉద్యోగ అన్వేషణలో భాగంగా తన వివరాలను జాబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసింది. ఈ క్రమంలో లాన్స్ స్టాఫ్ ఇండియా అనే సంస్థ పేరిట ఆన్‌లైన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆమెకు మెయిల్ వచ్చింది. దీంతో ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూకు హాజరు కాగా ఆ సంస్థ హెచ్‌ఆర్‌గా చెప్పుకున్న సత్య అనే యువతి మాట్లాడి సర్టిఫికెట్లను పంపమని అడిగింది. ఆ తర్వాత జయ అనే మరో వ్యక్తి ఫోన్ చేసి కొత్త ఉద్యోగం కోసం ఖాతా తెరవాలని, ఇందుకు కొంత డబ్బు కావాలని, అలాగే గేట్‌పాస్ కోసం మరికొంత పంపాలని మొత్తం రూ.69,500లు వసూలు చేశారు. తిరిగి బీమా కోసం డబ్బు పంపాలని అడగడంతో అనుమానం వచ్చిన బాధితురాలు డబ్బు పంపలేదు. దీంతో వారు ఆమెకు తిరస్కరణ లేఖను పంపారు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు ఎస్సార్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: ఇంటి వద్ద పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... అనుమల వెంకటేష్ యూసుఫ్‌గూడలో ఉంటూ పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. గత నెల 29న రాత్రి తన ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. అనేక ప్రాంతాల్లో తన వాహనం కోసం వెదికినా ప్రయోజనం లేదు. దాంతో గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్ పై నుంచి పడి మహిళ మృతి

ఖైరతాబాద్: ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్ పై నుంచి పడి మహిళ మృతిచెందిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ఖైరతాబాద్ ఆనంద్‌నగర్ కాలనీలోని సాయి సూర్య స్వర్ణ ప్రకాష్ రెసిడెన్సీలో పుష్కర కాలంగా మేడిశెట్టి శ్రీదేవి భర్తతో కలిసి నివాసముంటోంది. మూడేళ్లుగా ఆమె తల్లి గుత్తి భ్రమరాంబా(64) కూడా ఉంటోంది. గురువారం ఉదయం శ్రీదేవి పిల్లల్ని స్కూల్‌లో డ్రాప్ చేసేందుకు వెళ్లి వచ్చింది. అయితే ఫ్లాట్ తలుపు తట్టినా తీయకపోవడంతో అనుమానం వచ్చి వాచ్‌మెన్‌కు ఫోన్ చేసి ఆరా తీయగా భ్రమరాంబా కింద పడిన విషయాన్ని గుర్తించారు. వెంటనే ఆమెను హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కొద్ది రోజులుగా భ్రామరాంబా వర్టిగో సమస్యతో బాధపడుతోంది. వాషింగ్ ఏరియాలో గ్రిల్స్ తక్కువ ఎత్తు ఉండటంతో ప్రమాదవశాత్తు కింద పడిపోయి ఉంటుందని కూతురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బోనాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

సుల్తాన్ బజార్ ఏసీపీ మట్టయ్య



హిమాయత్‌నగర్: శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా బోనాల జాతర సంబురాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సుల్తాన్‌బజార్ ఏసీపీ ఎం.మట్టయ్య సూచించారు. గురువారం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ అధ్యక్షతన హిమాయత్‌నగర్ పరిధిలో నిర్వహించనున్న బోనాల ఉత్సవాలకు స్థానిక ఆలయాలు, బోనాల పండుగ నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఏసీపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు బోనాల పండుగ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఫలహారం బండ్లు, తొట్టెల ఊరేగింపు త్వరితగతిన ముగించాలని సూచించారు. ప్రజల సహకారంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అన్ని ప్రముఖ దేవాలయ ప్రాంగణాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మహిళల పట్ల ఎవరూ అసభ్యకరంగా ప్రవర్తించవద్దని, మహిళలు వేధింపులకు గురి కాకుండా షీ టీమ్స్ బృందాలు విధుల్లో ఉంటాయని తెలిపారు. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ... బోనాల పండగ సందర్భంగా ఫలహారపు బండ్లు, అమ్మవార్లకు తొట్టెల సమర్పించే నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అలాగే బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు, సెల్‌ఫోన్లు చోరీ జరిగే అవకాశాలున్నాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్‌ఐలు నాగరాజు, శ్రీకాంత్ రెడ్డి, శ్రీవాణి, రాజు, ఆలయాలు, బోనాల నిర్వాహకులు శివ, శ్రీనివాస్ ప్రసాద్, గణేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఓయూలో బీసీల ధూంధాం

ఉస్మానియా యూనివర్సిటీ: రేపు (19న) ఓయూలో బీసీల ధూంధాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ నాయకులు మహేష్‌గౌడ్ గురువారం తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకోసం వర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు జరిగే ధూంధాం కార్యక్రమానికి విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

అక్రమ పార్కింగ్‌లపై తహసీల్దార్ ఆగ్రహం



వ్యాలెట్ పార్కింగ్ నిర్వాహకులను హెచ్చరిస్తున్న తహసీల్దార్ అనితారెడ్డి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 3లోని దానం నాగేందర్ నివాసం పక్కన ఉన్న సినారే భవన్ కోసం కేటాయించిన స్థలంలో అక్రమ పార్కింగ్‌లపై షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి సీరియస్ అయ్యారు. గురువారం ఇక్కడ పర్యటించిన తహసీల్దార్ ప్రధాన రోడ్డులో ఉన్న ఓ ఆస్పత్రి, పక్కనే ఉన్న బార్ నిర్వాహకులు తమ వినియోగదారుల వాహనాలను ఇక్కడ పార్కింగ్ చేయిస్తున్నట్లు గుర్తించారు. నిర్వాహకులను పిలిపించి ఇక్కడ వాహనాలు అన్ని తొలగించాలని వార్నింగ్ ఇచ్చారు. స్థానికంగా ఉన్న కొంత మంది నేతల సహకారంతో ఇక్కడ పార్కింగ్‌లు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. మరోసారి ఇక్కడ పార్కింగ్ చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. మండల సిబ్బంది నిత్యం చెకింగ్ చేయకుండా ఏం చేస్తున్నారంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

'కేర్ బంజారా'లో అరుదైన ఘనత

ఒక్క సర్జన్.. 8 గంటల్లో 17 కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు



సంజిబ్‌కుమార్ బెహరా

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేర్ హాస్పటల్‌లో ఒకే రోజు 17 కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించి అరుదైన ఘనతను సాధించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సంజిబ్‌కుమార్ బెహరా నేతృత్వంలో ఉదయ 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 8 గంటల వ్యవధిలో ఈ శస్త్ర చికిత్సలు పూర్తి చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంజిబ్‌కుమార్ బెహరా మాట్లాడుతూ... ఇది సంఖ్యల కోసం పోటీ కాదని, కేర్ బంజారాలో ఉన్న బలమైన వ్యవస్థ, అనుభవజ్ఞులైన వైద్య బృందం మద్దతుతో, అధిక వాల్యూమ్‌ను సైతం నాణ్యతతో నిర్వహించగలమన్నది తమ లక్ష్యమన్నారు.ఈ విజయం అన్ని విభాగాల సహకారంతో సాధ్యమైందని చెప్పారు. ఈ ఘనతతో కేర్ హాస్పటల్స్ శస్త్ర చికిత్సకు ముందు, తరువాత పద్ధతుల్లోనూ, క్లినికల్ ప్రొటోకాల్స్‌లోనూ మెరుగైన ప్రమాణాలను పాటిస్తున్నదన్న విషయం మరోసారి స్పష్టమైందన్నారు. కేర్ హాస్పిటల్స్ జోనల్ సీఓఓ బిజునాయర్ మాట్లాడుతూ... ఇది కేవలం వైద్య కృతికౌశ్యం మాత్రమే కాదని, తమ ఆస్పత్రిలో జరుగుతున్న లోతైన మార్పుల సూచిక కూడా అన్నారు. తమ వైద్య బృందాలు సమష్టిగా పనిచేస్తూ వేగవంతమైన సేవ, నాణ్యమైన ఫలితాల కోసం కృషి చేస్తున్నాయన్నారు.

రోడ్లపై ఇసుక, కంకర విక్రయిస్తే చర్యలు



స్థానిక వ్యాపారులను హెచ్చరిస్తున్న జీహెచ్ఎంసీ విజిలెన్స్ అధికారులు

ఫిలింనగర్: ప్రధాన రోడ్లపై ఇసుక, కంకర అమ్మకాల వల్ల వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని విక్రయాలను వేరే చోటుకు తరలించుకోవాలని జీహెచ్ఎంసీ విజిలెన్స్ అధికారులు విక్రయదారులను హెచ్చరించారు. ఫిలింనగర్‌లోని జూబ్లీహిల్స్ రోడ్ నెం 82 కోర్ట్ యార్డ్ కాఫీ షాప్ పక్కన మూల మలుపు వద్ద రోడ్డు ఇరుకుగా ఉండటం వల్ల సినార్ వ్యాలీ వైపు నుంచి వాహనాలు పైకి వచ్చే క్రమంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయంపై ఫిర్యాదు అందుకున్న జీహెచ్ఎంసీ విజిలెన్స్ అధికారులు స్థానిక టౌన్‌ప్లానింగ్ అధికారుల సహకారంతో ఇక్కడున్న విక్రయదారుల మట్టి, కంకరతో పాటు రోడ్డు పక్కన ఉన్న మట్టి దిబ్బలను తొలగించారు. మరోసారి ఇక్కడ వ్యాపారాలు చేస్తే కేసులు తప్పవని విజిలెన్స్ డీఎస్పీ శ్రీనివాస్ హెచ్చరించారు. ఇక్కడ రోడ్డు వెడల్పు కావడం వల్ల ఇకపై వాహనాలు సాఫీగా సాగుతాయని ఆయన వెల్లడించారు. అదే విధంగా అపోలో ఆస్పత్రి చౌరస్తాలో సైతం ఆటో స్టాండ్ వద్ద ఆక్రమణలను నేలమట్టం చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బాల్‌రెడ్డి, ఎస్‌ఐ మోహన్, సర్కిల్–18 డీసీ సమ్మయ్య, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన సీపీగేట్ దరఖాస్తుల స్వీకరణ

రూ.2000 అపరాధ రుసుముతో 28 వరకు గడువు

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీ సీపీజీఈటీ–2025 (సీపీగేట్) దరఖాస్తుల స్వీకరణ గురువారంతో ముగిసింది. గత నెల 18న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియకు 55 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 24 వరకు, రూ.2000 అపరాధ రుసుముతో 28 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఆగస్టు 4 నుంచి ప్రారంభమగు పీజీ ప్రవేశ పరీక్షలకు వారం రోజుల ముందు నుంచి హాల్‌టిక్కెట్లను జారీ చేయనున్నారు. ఇదిలా ఉండగా గత ఏడాది కంటే సుమారు 15 వేల దరఖాస్తులు తగినట్లు సమాచారం. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో అధ్యాపకులు గీచిన చిత్రాలతో కూడిన మేనేజ్ చేద్దాం చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్‌కాలనీలోని శ్రీసత్యసాయి నిగమాగమంలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో కొనసాగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- ఐటీ జోన్‌లోని పుప్పాలగూడలో ఉన్న తాన్సెన్ రెస్టారెంట్‌లో అరేబియా ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

యాదవులను బెదిరిస్తే సహించం

పంజగుట్ట: ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా, ఒక రౌడీ, గూండాలా వ్యవహరిస్తున్న మైనంపల్లి హనుమంతరావు అగ్రకుల అహంకారంతో యాదవులను బెదిరిస్తే సహించేది లేదని గొల్ల కురుమ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గోసుల శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. ఎర్రమంజిల్‌లోని సమితి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మైనంపల్లి ఒక నియంతలా తయారయ్యాడని, ఆయన ప్రత్యర్థులు ఎవరు ఉన్నా వారిపై దాడులు చేయించడం ఆయనకు సాధారణంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా, భూకబ్జా గూండాలా వ్యవహరిస్తున్నాడని, గతంలో మాజీ మంత్రి హరీష్ రావుపై కూడా పిచ్చికూతలు కూశాడని గుర్తుచేశారు. మల్కాజ్‌గిరికి చెందిన ప్రజా నాయకుడు మండలం రాధాకృష్ణ యాదవ్‌ను బెదిరిస్తూ, వ్యక్తిగతంగా దూషిస్తూ, యావత్ యాదవులకు హెచ్చరికలు జారీ చేస్తున్నట్లుగా అతడి వ్యాఖ్యలు ఉన్నాయని, వెంటనే యావత్ యాదవ జాతికి మైనంపల్లి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యావత్ యాదవ జాతి నీకు తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు.

ఘనంగా దాశరథి శతజయంతి ఉత్సవాలు



కార్యక్రమంలో కేవీ రమణాచారి తదితరులు

సుల్తాన్‌బజార్: దాశరథి కృష్ణమాచార్య విప్లవ కవి వీరుడని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం రామాంజునరావు కళామందిరంలో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ.. తెలంగాణ కోటి రత్నాల వీణ అన్న దాశరథి నినాదం తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ఇవ్వడమే కాకుండా రాష్ట్ర సాధన సంభవించిందన్నారు. హిందూ విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరిశంకర్ దాశరథి కవిత్వం, వ్యక్తిత్వంపై మాట్లాడారు. దాశరథి కథ, నాటకం, నవల, యాత్ర చరిత్ర, అనువాదం వంటి ప్రక్రియల్లో రచనలు చేసిన పద్య వచన గేయ కవిత్వం ప్రధానమైనవని అన్నారు. సినీ గీతాలతో పాటు లలిత గీతాలు కూడా విశేష ప్రాచుర్యాన్ని, శ్రోతల ఆదరణను పొందాయని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ తిరునగరి శరత్‌చంద్ర దాశరథి, దాశరథి కుమార్తె ఇందిరా, డాక్టర్ సిల్మా నాయక్, డాక్టర్ జె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు వ్యాక్సిన్ అంశంలో సర్కార్‌కు హెచ్‌ఆర్‌సీ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: గడువు ముగిసిన హెపటైటిస్–బి వ్యాక్సిన్లను నిర్లక్ష్యంగా ఇచ్చిన గాంధీ ఆస్పత్రి తీరుపై మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి తుది ఉత్తర్వులు జారీ చేశారు. బాధితుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించడాన్ని తప్పుబడుతూ.. మౌలిక హక్కులు తీవ్రంగా ఉల్లంఘించారని మండిపడ్డారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో పాటు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సర్కార్‌ను ఆదేశించారు. హక్కుల పరిరక్షణ చట్టం –1993లోని సెక్షన్ 18(ఏ)(ఐ) ప్రకారం ప్రతి బాధితుడికి రూ.1,25,000 చొప్పున చెల్లించాలని స్పష్టం చేశారు. మందుల సేకరణ, నిర్వహణ ప్రక్రియలో తగిన జాగ్రత్తలు.. దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని సూచించారు. తమ సిఫార్సులను రెండు నెలల్లో అమలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు.

జలం కాదు.. గరళం..

- ఈ నీటిని కనీసం సాగు, స్నానానికి వినియోగించ వద్దన్న పీసీబీ
- పూర్తిగా పడిపోయిన ఘన ఆక్సిజన్, 12 రెట్లు అధికంగా సీసం
- నీటిని మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలన్న ఎన్‌జీటీ

సున్నం చెరువు పరిసర ప్రాంతాల్లో రసాయనాల ఆనవాళ్లు..!

సున్నం చెరువు సమీప ప్రాంతాల్లోని బోరు బావుల్లోని నీటిలో ప్రమాదకర రసాయనాలు ఉన్నట్లు కాలుష్య నియంత్రణ మండలి పరిశీలనలో తేలింది. ట్యాంకుల్లో తరలిస్తున్న నీటి నమూనాలను సేకరించి పరీక్షించగా సీసం, కాడ్మియం, నికెల్ వంటి భార లోహాలు మోతాదుకు మించి ఉన్నట్లు గుర్తించారు. ఇవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని పీసీబీ హెచ్చరిస్తోంది. ఈ నీటిని తాగడానికి కాదుకదా కనీసం సాగు, స్నానం చేయడానికి సైతం వినియోగించవద్దని హెచ్చరిస్తోంది.
– సాక్షి, సిటీబ్యూరో

మాదాపూర్ సమీపంలోని సున్నం చెరువు 32 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. చెరువు కబ్జాలపై దృష్టి సారించిన హైడ్రా నీటి నాణ్యత పరీక్షించాలని కాలుష్య నియంత్రణ మండలిని కోరింది. దీంతో ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు 4 నెలల పాటు పీసీబీ అధ్యయనం చేసింది. నమూనాలు సేకరించి పరీక్షించగా ఆందోళనకరమైన అంశాలు వెలుగు చూశాయని పీసీబీ అధికారులు చెబుతున్నారు. నీటిలో ఘన ఆక్సిజన్ స్థాయి ఒక లీటరుకు 6.5 నుంచి 8 ఎంజీ ఉండాల్సి ఉండగా ఇక్కడ కేవలం 0.3 ఎంజీ నమోదైంది. కొన్ని రకాలైన లోహాలు ఉండాల్సిన వాటి కంటే సుమారు 7 నుంచి 12 రెట్లు అధికంగా ఉన్నట్లు తేలింది. తీవ్రమైన పరిస్థితిగా గుర్తించి ఇక్కడి నీటికి 'ఈ' గ్రేడ్ ఇచ్చారు. సమాచారం అందుకున్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కనీసం 'డి' గ్రేడ్‌కు మెరుగుపడేలా చూడాలని ఆదేశించింది. అయితే చెరువును శుద్ధి చేయాలంటే హానికరమైన రసాయన వ్యర్థాలు, ఇతర వ్యర్థ జలాల ప్రవాహాన్ని అరికట్టాల్సి ఉంటుంది. ఇప్పట్లో అది సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే నగరంలోని మురుగు కాల్వలు కలిసే చెరువులు, కాల్వల సమీపంలోని బోరు బావుల్లోని నీరు ప్రమాదకరంగా మారుతున్నట్లు పీసీబీ అధ్యయనంలో తేలిందని హైడ్రా చెబుతోంది. ఆయా చెరువులు, కాల్వల సమీపంలో బోర్లు తవ్వి నీటిని వ్యాపారం చేస్తే కేసులు నమోదు చేస్తామని హైడ్రా హెచ్చరి



స్తోంది. స్థానికులు మాత్రం మా భవనాలను హైడ్రా కూలగొట్టింది. ప్రజల నుంచి వ్యతిరేకత రానీయకుండా నీటి కాలుష్యాన్ని వాడుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

ఈ నీటిని తాగితే అంతే..

మాదాపూర్ పరిసర ప్రాంతాల ప్రజలకు వేసవి వచ్చిందంటే సున్నం చెరువు సమీపంలోని బోరు బావుల నుంచి నీటిని సరఫరా చేస్తారు. హాస్టల్స్, నివాస గృహాలు, కార్యాలయాలు తదితర చోట్ల అన్నింటికీ ఇక్కడి నుంచి నీటిని ట్యాంకర్ల ద్వారా తరలిస్తారు. ఈ నీటిలో సీసం ఉండాల్సిన మోతాదు కంటే 12 రెట్లు అధికంగా ఉన్నట్లు పీసీబీ పరీక్షల్లో తేలింది. ఈ నీటిని తాగితే మెదడు చురుకుదనం తగ్గిపోతుంది. రక్తహీనత, జ్ఞాపకశక్తి తగ్గడం, రక్తపోటు, కిడ్నీలపై ప్రభావం చూపుతుందని పీసీబీ హెచ్చరిస్తోంది. గుండె సంబంధిత వ్యాధులతో పాటు సంతానోత్పత్తిపైనా ప్రభావం చూపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. కాడ్మియం రెండు నుంచి మూడు రెట్లు అధికంగా ఉండగా, నికెల్ రెండు రెట్లు అధికంగా ఉందని నివేదికలు చెబుతున్నాయి. ఈ నీటిని వేడి చేసి తాగినా ఎలాంటి ఉపయోగం ఉండదని పీసీబీ అధికారులు చెబుతున్నారు. వేడి చేయడం వల్ల సూక్ష్మక్రిములు మత్రమే చనిపోతాయని, నీటిలోని భార లోహాల్లో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేస్తున్నారు.

రసాయన ఆనవాలు

బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్(బీఓడీ) ఈ ఏడాది జనవరిలో ఒక లీటరు నీటిలో 6 ఎంజీ ఉండగా, ఏప్రిల్ నాటికి 10 ఎంజీకి పెరిగింది. కెమికల్ ఆక్సిజన్ డిమాండ్(సీఓడీ) ఒక లీటరుకు 76 ఎంజీ నుంచి 119 ఎంజీకి పెరిగింది. ఈ గణాంకాలు రసాయన కాలుష్యం పెరిగినట్లు స్పష్టం చేస్తున్నాయి.



మహిళలకు ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం

– ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

గన్‌ఫౌండ్రీ: మహిళలకు ఆర్థిక స్వావలంబనే కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతమైనప్పుడే లింగ వివక్ష సమస్యను నివారించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాలలో రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో లింగ సమానత్వం, లింగ స్పష్టత అనే అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే లింగ సమానత్వం సాధ్యం అన్నారు. ఈ దేశంలో మహిళలకు ఆత్మగౌరవం, లింగ సమానత్వం, వరకట్న నిషేధం వంటి హక్కులు కలిగాయంటే అది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే అని గుర్తు చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం మహిళా సంఘాలకు రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇస్తున్నట్లు తెలియజేశారు. మొదటి ఏడాది రూ.21,632 కోట్ల వడ్డీలేని రుణాలు స్వయం సహాయ సంఘాలకు పంపిణీ చేసినట్లు వివరించారు. ఐదు సంవత్సరాల కాలంలో రూ.లక్ష కోట్ల వడ్డీలేని రుణాలు మహిళల చేతిలో తిరిగితే ఆర్థిక స్వతంత్రం, లింగ సమానత్వం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయడం, ఎలక్ట్రానిక్ బస్సులకు మహిళలను ఓనర్లుగా చేసే కార్యక్రమాలతో పాటు అమ్మా క్యాంటీన్లు, గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంక్‌లు, ఇందిరమ్మ ఇళ్లు మహిళల పేరిటే మంజూరు చేస్తున్నట్లు గుర్తుచేశారు.

నిజాం కళాశాల గొప్పది

నిజాం కళాశాల ఎంతో గొప్ప చరిత్ర కలిగిందని, దేశం, రాష్ట్రానికే గొప్ప శాస్త్రవేత్తలను, రాజకీయ పరిపాలకులను అందించిందని కొనియాడారు. మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి, మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్, తామంతా నిజాం కళాశాల విద్యార్థులమే కావడం మరువలేని జ్ఞాపకమంటూ కళాశాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. నిజాం కళాశాలలోని సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

ప్రతి కళాశాలలో ఒక కమిటీ

మహిళల సమస్యలను మహిళా కమిషన్ దృష్టికి తీసుకువచ్చేలా ప్రతి కళాశాలలో ఐదుగురు విద్యార్థులతో ఒక కమిటీ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. నిజాం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్, మహిళా కమిషన్ సభ్యులు ఉదయ రాణి, సుధాని లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాన దంచికొట్టింది

– ఉప్పల్‌లో అత్యధికంగా 8.5 సెంటీ మీటర్లు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గురువారం సాయంత్రం వాన దంచికొట్టింది. నాలుగైదు రోజుల నుంచి ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ నగరవాసులకు ఉపశమనం కలిగినట్లయ్యింది. సాయంత్రం భారీ వర్షం కారణంగా పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అత్యధికంగా ఉప్పల్‌లో 8.5 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వరద రోడ్లపై నిలిచిపోవడంతో.. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్‌లోని మనోహర్ థియేటర్ సమీపంలో రహదారిపై మోకాళ్ల లోతు వర్షం కారణంగా తిప్పలు తప్పలేదు. కూకట్‌పల్లిలో సాయంత్రం కురిసిన మోస్తరు వర్షానికే మెయిన్ మార్కెట్ రోడ్ చెరువును తలపించింది.

గురువారం రాత్రి 10 గంటల వరకు నమోదైన వర్షపాతం

ప్రాంతం	సెంటీమీటర్లు
ఉప్పల్	8.5
నాచారం	7.8
న్యూమెట్టుగూడ	6.8
మియాపూర్	5.8
హబ్సిగూడ	5.7
చిలుకానగర్	5.7
కాప్రా	5.4
మారేడుపల్లి	4.9
ముషీరాబాద్	4.4
మల్కాజిగిరి	4.3

'డబుల్' ఇళ్లను త్వరగా పూర్తిచేయాలి

– కలెక్టర్ మనుచౌదరి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి స్పష్టం చేశారు. మేడ్చల్ కలెక్టరేట్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తాతో కలిసి గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ జిల్లాలోని జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 30,068 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఉండగా అందులో 29,094 ఇళ్ల కేటాయించడం జరిగిందని, మిగిలిన 974 ఇళ్ల కేటాయింపు ఈ వారంలోగా పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో జీహెచ్ఎంసీ పరిధిలో వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న 6,880 ఇళ్ల నిర్మాణాలను వచ్చే మూడు నెలలలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమీక్ష సమావేశంలో జీహెచ్ఎంసీ ఈఈలు, జిల్లా పంచాయతీ, ఆర్అండ్‌బీ అధికారులు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఏజెన్సీలు వేధింపులు ఆపకపోతే సరఫరా నిలిపేస్తాం

తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్

హిమాయత్‌నగర్: కుకింగ్ గ్యాస్ డెలివరీ కార్మికులను వేధిస్తున్న గ్యాస్ డీలర్లపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ల సరఫరాను నిలిపివేస్తామని తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 30 వేల మంది గ్యాస్ డెలివరీ వర్కర్స్ వివిధ గ్యాస్ డీలర్ల వద్ద పనిచేస్తున్నారని, ఏ ఒక్క గ్యాస్ ట్రేడర్ కూడా కార్మిక శాఖ నిబంధనలు పాటించకుండా వేధిస్తున్నారని చెప్పారు. జీతాలు ఇవ్వడం లేదని, ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించకుండా అకారణంగా కార్మికులను తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 904/2015 మెమోను తక్షణమే రద్దు చేయాలని కోరారు. గౌరవ సలహాదారులు చామకూర రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికశాఖ అధికారులు నిద్రపోతున్నారని, త్వరలో కార్మిక శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సలహాదారులు కె.వి.గౌడ్, యూనియన్ ప్రధాన కార్యదర్శి బుర్ర చంద్రయ్య గౌడ్, నర్సింగరావు, అజయ్ రెడ్డి, శ్రీకాంత్, బి.రాజశేఖర్, ఎస్.అశోక్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్, చిత్రంలో కేవీ గౌడ్ తదితరులు

గోల్కొండ అమ్మవార్లకు ఘనంగా బోనం



గోల్కొండ: గోల్కొండ శ్రీజగదాంబిక మహంకాళి అమ్మవార్లకు గురువారం 7వ బోనం పూజ అత్యంత భక్తిశ్రద్ధలతో సమర్పించారు. గురువారం భక్తులు కోటకు చేరుకోవడం ప్రారంభించారు. కోటలోని అక్కన్న మాదన్న కార్యాలయం, నగీనాబాగ్, సైనికుల బ్యారెక్స్ ప్రాంతాలలో మహిళలు వంటలు చేస్తూ బోనాల సందడి షురూ చేశారు. మరోవైపు సంప్రదాయ దుస్తుల్లో మహిళలు నాగదేవతకు పూజలు నిర్వహించారు. అందంగా అలంకరించిన బోనం కుండలను తలలపై పెట్టుకొని మెట్ల మార్గం మీదుగా అమ్మవారి దర్శనానికి వెళ్లారు. ఇదిలా ఉండగా ఫతేదర్వాజా రోడ్డు, రాందేవ్‌గూడ రోడ్డు తదితర ప్రాంతాలన్నీ కోటకు వచ్చే భక్తులతో కిటకిటలాడాయి. తొట్టెల ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది.

నేడు విజయవాడ నుంచి పాతబస్తీకి పట్టువస్త్రాలు

చార్మినార్: తెలుగు రాష్ట్రాలకు విజయవాడ కనక దుర్గమ్మ తల్లి వారధిగా ఏర్పడిందని.. అందుకే 15 ఏళ్లుగా విజయవాడలో తెలంగాణ ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని భాగ్యనగర్ శ్రీమహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్‌తో పాటు మాజీ అధ్యక్షుడు గాజుల అంజయ్య, రాకేష్ తివారి తెలిపారు. బోనాల జాతర ఉత్సవాలు తెలుగు రాష్ట్రాల మధ్య స్నేహ సంబంధాలను మరింత మెరుగు పరుస్తున్నాయన్నారు. తెలంగాణ భక్తులు ఆంధ్రప్రదేశ్‌లో బోనాల జాతర ఉత్సవాలు నిర్వహించినట్లే.. విజయవాడ కనక దుర్గమ్మ తల్లి దేవస్థానం తరఫున అధికారికంగా పాతబస్తీలోని ప్రధాన దేవాలయాలకు పట్టువస్త్రాలు, సారె, అమ్మవారి పసుపు, కుంకుమ, గాజులు తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. విజయవాడ కనక దుర్గమ్మ తల్లి దేవస్థానం తరఫున శుక్రవారం పాతబస్తీలోని ప్రధాన దేవాలయాలకు పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, చలివిడి సమర్పిస్తారని ఆయన తెలిపారు.

స్థానిక సంస్థల్లో వడ్డెరులకు ప్రాధాన్యం కల్పించాలి

హిమాయత్‌నగర్: విద్యా, ఉద్యోగ, రాజకీయ, సామాజికంగా వెనుకబడి ఉన్న వడ్డెరులకు అన్ని రాజకీయ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయించి ప్రాధాన్యత కల్పించాలని జాతీయ వడ్డెర సంఘం విజ్ఞప్తి చేసింది. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షుడిగా పీట్ల శ్రీధర్, రాష్ట్ర అధ్యక్షుడిగా వల్లపు శివ, యువజన సంఘం జాతీయ అధ్యక్షుడిగా వేముల భరత్‌కు వడ్డెర సంఘం నాయకులు కుంచాల ఏడుకొండలు, లోకనాథం, బత్తుల లక్ష్మీకాంతయ్య, వల్లెపు మొగిలి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ నియామక పత్రాలను అందజేశారు. నాయకులు మాట్లాడుతూ వడ్డెరుల్లో చైతన్యం కోసం ఈనెల 25న నూతన కార్యవర్గం రాష్ట్రవ్యాప్త పర్యటనలను చేపట్టనున్నట్లు తెలిపారు. సీఎం వడ్డెరులకు ప్రాధాన్యత కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గోపాల్, నరసింహ, గురురాజ్, ఎల్లయ్య, రమేష్, శేఖర్, వెంకటస్వామి, గణేష్, చంద్రశేఖర్, స్వామి, రాములు, యాదయ్య, నాగరాజు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గానికి నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

'ఫోన్ ట్యాపింగ్' నిందితులను కఠినంగా శిక్షించాలి

– ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

బంజారాహిల్స్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో వేలాది ఫోన్లు ట్యాప్ చేశారని, కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లోని సిట్ అధికారుల ఎదుట గురువారం ఆయన హాజరై తన వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మావోయిస్టు సానుభూతి పరులమంటూ తమ ఫోన్లు ట్యాప్ చేశారన్నారు. 2022 అక్టోబర్ 31వ తేదీ నుంచి 2023 అక్టోబర్ 30 వరకు తన ఫోన్‌ను ట్యాప్ చేశారని వెల్లడించారు. అదే ఏడాది జూలై 31వ తేదీన మూడు నెలల పాటు తాను వాటే మరో ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రజల అభీష్టానికి మద్దతుగా పోరాడుతున్నందుకే తనతో పాటు తన అనుచరుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని, తమ కదలికలను తెలుసుకోవడానికే ట్యాపింగ్‌కు పాల్పడ్డారన్నారు. ట్యాపింగ్ విషయంలో తన అభిప్రాయాన్ని సిట్ అధికారులకు చెప్పానని, ప్రభుత్వం మారడంతో ఇవన్నీ బయటకు వచ్చినట్లు చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ తీవ్రమైన నేరమని, ట్యాపింగ్‌కు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

వర్షాకాలంలో కరెంట్‌తో జాగ్రత్త

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో కరెంట్‌తో జాగ్రత్తగా ఉండాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ ముషారఫ్ ఫరూఖీ వినియోగదారులకు సూచించారు. చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుత వర్షాలు, విద్యుత్ సరఫరాపై ఆరా తీశారు. విద్యుత్ సరఫరా సాధారణంగా ఉందని, ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మరో రెండు రోజుల పాటు ఎడతెరపి లేకుండా వర్షాలు కురిసే అవకాశం ఉందని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇంజనీర్లు సర్కిల్ కంట్రోల్ రూముల్లో ఉంటూ సరఫరాను పర్యవేక్షించాలని సూచించారు. వాతావరణంలో చోటు చేసుకునే మార్పులను నిశితంగా గమనిస్తూ, ఆ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రజలు గృహ, బహిరంగ ప్రదేశాల్లోని విద్యుత్ ఉపకరణాలపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కిటికీ, వెంటిలేటర్ల నుంచి వర్షపు నీరు ఇంట్లోకి చేరి సెల్లార్లలోని ప్యానల్ బోర్డులు, స్విచ్‌బోర్డులు తడిసే ప్రమాదం ఉందని తెలిపారు. ఏదైనా ప్రమాదం జరిగితే విద్యుత్ సంస్థకు సమాచారం అందించాలని సూచించారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో సంపంగి గ్రూప్

– అభినందించిన మంత్రి శ్రీధర్ బాబు



సాక్షి, సిటీబ్యూరో: సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలవడమే కాకుండా తమ పరిశోధనలతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్న సంపంగి గ్రూప్ సంస్థ కృషి అభినందనీయమని మంత్రి శ్రీధర్ బాబు కొనియాడారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించిన సందర్భంగా నగరంలోని టూరిజం ప్లాజా వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గుర్తింపు రావాలంటే కష్టతరమైన సాధన. ఈ రంగంలో అన్నా హజారే తర్వాత సంపంగి గ్రూప్ సంస్థ అధినేత డాక్టర్ రమేష్ ఈ అవార్డ్ అందుకోవడం మన ప్రాంతవాసులకు గర్వకారణం అన్నారు. మన రాష్ట్రానికి, దేశానికి సంబంధించి రాబోయే కాలంలో రైతు సోదరులు కూడా ఈ తరహా వ్యవసాయం చేసి లాభాలతో పాటు మంచి ఆరోగ్యాన్ని పొందే విధంగా వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలని మంత్రి కోరారు. అనేకమంది ఇలాంటి పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి రాష్ట్రంలోని పరిశ్రమలకు సంబంధించి పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని సూచించారు. రియల్ ఎస్టేట్ రంగంలో, ప్రకృతి వ్యవసాయంలో, హాస్పిటాలిటీ రంగంలో ఆరేళ్లుగా అనేక రికార్డులు సృష్టిస్తున్న సంపంగి గ్రూప్ తాజాగా ఈ ఘనతను సాధించడం సంతోషంగా ఉందని సంస్థ అధినేత డాక్టర్ రమేష్ తెలిపారు. రాష్ట్రంలో అసాధ్యం అనుకున్న ఖర్జూర పంటను సాగుచేస్తూ, తమ సంస్థలో ప్లాట్స్ కొనుగోలు చేసినవారికి ప్రకృతి వ్యవసాయం ద్వారా తిరిగి ఆదాయాన్ని, ఆరోగ్యాన్ని ఇవ్వడం అనితర సాధ్యమైన ఘనత. ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన సంపంగి గ్రూపు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ రికార్డుల్లోకి ఎక్కిందని పేర్కొన్నారు.

గౌడ్‌లను ఆర్థికంగా, రాజకీయంగా అణిచివేసే కుట్ర


మాట్లాడుతున్న అమరవేణి నర్సాగౌడ్

హిమాయత్‌నగర్: గౌడ కులస్తులను రాజకీయంగా అణిచి వేయాలంటే ఆర్థిక మూలాలను దెబ్బకొట్టే కుట్రలో భాగమే కల్తీ పేరిట కల్లు లేకుండా చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ ఆరోపించారు. రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగుల కిరణ్ కుమార్ గౌడ్ అధ్యతన గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ సమావేశంలో గురువారం నర్సాగౌడ్ మాట్లాడారు. కూకట్‌పల్లిలో జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకొని, లిక్కర్ లాబీలో పడి కల్లు దుకాణాలపై రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న దాడులు వెంటనే అరికట్టాలన్నారు. అలాగే కల్లును మత్తు పానీయాల జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. చెట్లపై నుంచి పడి మృతి చెందిన గౌడన్నల పెండింగ్ ఎక్స్‌గ్రేషియాలను వెంటనే విడుదల చేయాలన్నారు. సిద్ధిరాములు గౌడ్, బాలరాజ్ గౌడ్, బాలేషం గౌడ్, సురేష్ గౌడ్, నర్సింలు గౌడ్, రమేష్ గౌడ్, స్వామి గౌడ్, రవీందర్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, రాజేందర్ గౌడ్ పాల్గొన్నారు.





మానవత్వం.. అ'మూల్యం'..!

నగరంలో బరితెగిస్తున్న బ్లడీ చీటర్స్

- అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్న నకిలీ రక్తదాతలు
- డోనర్స్ పేరుతో బాధితులకు టోకరా
- నమ్మకం కోల్పోతున్న నిజమైన డోనర్స్
- వాట్సాప్ గ్రూపుల్లో వేలాదిగా రక్త దాతల కోసం రిక్వెస్టులు
- నేనొస్తాను.. కానీ క్యాబ్ ఖర్చులు ఫోన్ పే చేయాలటూ మోసం
- ఆనక స్విచ్చాఫ్ చేయడంతో మోసపోతున్న బాధితులు
- గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారే టార్గెట్



మానవత్వం మంటగలిసిపోతోంది.. అమూల్యమైన సేవలకు సైతం మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.. కొందరి అమాయకత్వం, అవసరం.. ఇంకొందరికి వరంగా మారుతోంది.. సమాజం కోసం ఏదో చేయాలనే తపనతో ఓ వైపు యువత స్వచ్ఛందంగా రక్తం దానం చేసేందుకు ముందుకొస్తుంటే.. మరికొందరు బాధితుల అవసరాన్ని సైతం సొమ్ము చేసుకుంటున్నారు.. ఇటీవలి కాలంలో రక్తదానంపై అవగాహన పెరగడంతో చాలా మట్టుకు ఆపద సమయాల్లో అవసరం తీరుతోంది.. సరిగ్గా అదే అదునుగా కొందరు కేటుగాళ్లు బరితెగిస్తున్నారు. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి ఆస్పత్రులకు వచ్చేవారిని టార్గెట్ చేస్తూ బాధితులకు టోకరా వేస్తున్నారు.. మానవత్వం ముసుగులో సమాజం సిగ్గుతో తలదించుకునే చర్యలకు పాల్పడుతున్నారు..బ్లడీ చీటర్స్.. అంతేకాదు.. డబ్బు స్వాహా చేసేదే కాకుండా అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో



వివిధ ఆరోగ్య సమస్యలతో నగరంలోని గాంధీ, ఉస్మానియా, నిమ్స్‌తో పాటు జాతీయ స్థాయిలో పేరొందిన పలు కార్పొరేట్ ఆస్పత్రులకు అనేక మంది బాధితులు వస్తుంటారు. సరిగ్గా వీరినే ఆసరా చేసుకుని సరికొత్త మోసాలకు పాల్పడుతున్నారు కొందరు కేటుగాళ్ళు. సేవ పేరుతో సమాజం తలదించుకునే మోసానికి తెరతీస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమని సోషల్ మీడియాల్లో, ఇతర సామాజిక మాధ్యమాల్లో పెట్టే విజ్ఞప్తులను క్యాష్ చేసుకుంటున్నారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలతో ఆటలాడుతున్నారు.. అమూల్యమైన వారి సమయాన్ని ధనార్జన కోసం పణంగా పెడుతున్నారు.

క్యాబ్ చార్జీ పేరుతో..??

'భర్తకు అనారోగ్య కారణాలతో మెరుగైన చికిత్స కోసం వరంగల్ నుంచి నగరంలోని పెద్దాస్పత్రికి వచ్చాం. వైద్యులు మూడు యూనిట్ల రక్తం కావాలని అడిగారు. దీంతో తెలిసిన వారి సహాయంతో వాట్సాప్ గ్రూపుల్లో, ఫేస్‌బుక్ వంటి యాప్స్‌లో వివరాలతో అభ్యర్థన పెట్టాం. గంట తరువాత ఎవరో ఒక అబ్బాయి ఫోన్ చేశాడు. రక్తం ఇవ్వడానికి సిద్ధం. నాతోపాటు ఇద్దరు స్నేహితులు కూడా వస్తారు. క్యాబ్ ఖర్చులకు, రక్తదానానికి ముందు ఆహారానికి రూ.1,000 ఫోన్ పే చేయమన్నాడు. అవసరానికి రక్తం ఇవ్వడమే గొప్ప, డబ్బుదేముందిలే అని ఫోన్ పే చేశాం.. తర్వాత ఎంతకీ రాకపోవడంతో ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుంది' అని బాధితురాలు రాజమణి వాపోతున్నారు. ఇది ఒక్క రాజమణి సమస్యే కాదు.. నగరంలో నిత్యం వందల సంఖ్యలో ఇటువంటి మోసాలు జరుగుతున్నాయని తెలుస్తోంది.. కొందరు కేటుగాళ్లు ఇదే పనిలో ఉన్నారని, ఇటువంటి వ్యవహారాల్లో కాస్త జాగ్రత్తగా ఉండాలని, డబ్బుతూ పాటు అత్యవసర పరిస్థితుల్లో అమూల్యమైన సమయాన్ని వృథా చేసుకోవద్దని పలువురు బాధితులు చెబుతున్నారు. ఇలాంటి వారి వల్ల దాత ఇప్పుడో.. ఇంకాస్త సమయానికో వస్తాడనే ఆశతో ఎదురుచూస్తూ కూర్చుంటే రోగుల ప్రాణాలను కోల్పోక తప్పదని చెబుతున్నారు.





సమాచారమే.. వారి డేటా..

అత్యవసర పరిస్థితుల్లో రక్తం కోసం కుటుంబసభ్యులు, మిత్రుల ద్వారా సామాజిక మాధ్యమైలన వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్, ట్విట్టర్, టెలిగ్రామ్ వంటి వాటిల్లో సహాయం కోరేవారి వివరాలే వారికి డేటాగా మారుతోంది.. అలాంటి సమాచారాన్ని సేకరించిన మోసగాళ్లు దాతల పేరుతో తక్షణమే బాధితులకు ఫోన్ చేస్తారు. 'నాకు ఫలానా గ్రూపులో మెసేజ్ కనిపించింది. నేను రక్తం ఇవ్వడానికి సిద్ధం. కానీ నేను నగరానికి దూరంలో ఉన్నాను.. అయితే నా దగ్గర ప్రస్తుతం ట్రావెల్ చేయడానికి డబ్బులు లేవు.. మీరు ఏమీ అనుకోకుండా ఫోన్‌పేగానీ, గూగుల్‌పేగానీ చేస్తే వెంటనే వస్తాను.. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌లో రావాలంటే సమయం పడుతుంది.. మీరు అర్జెంట్ అంటున్నారు కావబట్టి క్యాబ్ చార్జీలు ఇస్తే చాలు' అని చెబుతారు.. డబ్బులు వేశాక ఫోన్ స్విచ్ఆఫ్ చేసేస్తారు.. ఆపదలో ఉన్న బాధితులు ఎలాగో పోలీసు స్టేషన్‌కి వెళ్లే పరిస్థితి ఉండదు.. ఒక వేళ వెళ్లినా వెయ్యి, రెండు వేల కోసం ఫిర్యాదు ఏం చేస్తాంలే.. అనే ఆలోచనతో ఉంటారు.. మరీ ముఖ్యంగా ఎమర్జెన్సీ పరిస్థితుల్లో వేరే దాత కోసం వేటలో పడతారు..

సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్..

అవసరం, అమాకత్వం వంటివే మోసగాళ్లకు అనుకూలంగా మారే అంశాలు.. మరీ ముఖ్యంగా నగరంలో భాష సమస్య కూడా ఓ కారణమే. ఇలాంటి తరుణంలో మోసపోయామని గ్రహించిన బాధితులు సైబర్ క్రైమ్ సెల్‌కు వెంటనే ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఇలాంటి మోసాలపై సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చు. హైదరాబాద్ నగరం మరోసారి 'గివింగ్ సిటీ'గా నిలవాలంటే.. ప్రజలతోపాటు, పోలీస్, హెల్త్ డిపార్ట్‌మెంట్, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఏర్పడింది.

రోజువారీ ఖర్చులకు.. బాధ్యతారాహిత్యంగా..

మనవీయ విలువలు లేని వారు.. పక్కవాడి బాధను అర్థం చేసుకోలేని వారే ఇలాంటి మోసాలకు పాల్పడరు.. మరీ ముఖ్యంగా రోజు వారీ ఖర్చుల కోసం కొందరు యువత ఇలా బాధ్యతా రాహిత్యంతో వ్యవహరిస్తున్నారని సైబర్ నిపుణులు చెబుతున్నారు.. ఇటీవలి కాలంలో ఈ తరహా మోసాలు పెరిగాయని, గేమింగ్, బెట్టింగ్, డేటింగ్ యాప్స్ ఖర్చుల కోసం అవగాహనా రాహిత్యంతో.. మేం చేసేది చిన్న మోసమేగా అనే అపోహతో.. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని చెబుతున్నారు. అంతేకానీ తాము చేసే ఈ చిన్న తప్పిదం వల్ల సమాజానికి ఓ పెద్ద ప్రమాదం జరుగుతోందని, ఓ నిండు ప్రాణం బలైపోయే పరిస్థితి ఉందని, ఓ కుటుంబం రోడ్డున పడుతుందనిగానీ ఆలోచించలేని మైండ్ సెట్ ఉన్నవారు మాత్రమే ఈ తరహా మోసానికి పాల్పడతారని చెబుతున్నారు. వీరి వల్ల నిజంగా రక్తం ఇచ్చే దాతలకు కూడా చెడ్డపేరు వస్తుందని, చివరికి మంచి వారిపై కూడా నమ్మకం కోల్పోయే పరిస్థితి తలెత్తుతుందని ఆలోచించకుండా మనుషుల మధ్య విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారు.

'లులు'లో రోబోవర్స్ 2025

- ఆకట్టుకుంటున్న ఏఐ ఎక్స్‌పీరియన్స్ జోన్
- అందుబాటులో ఇంటరాక్టివ్ ఫ్లోర్ టైల్స్ యాక్టివిటీస్



మూసాపేట : కూకట్‌పల్లిలోని లులు మాల్లో రోబోవర్స్–2025 పేరిట రోబోటిక్ యాక్టివిటీస్ ప్రదర్శన గురువారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) ఎక్స్ పీరియన్స్ జోన్, వర్చువల్ రియాలిటీ, హోలో గ్రామ్ డిస్‌ప్లే, 3డీ ప్రింటింగ్ ల్యాబ్, హ్యూమనాయిడ్ రోబో, ఇంటరాక్టివ్ ఫ్లోర్ టైల్స్ తదితర యాక్టివిటీస్ చిన్నారులను, సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 21 వరకూ 5 రోజుల పాటు ఈ ప్రదర్శన జరుగుతుందని, ఇందులో భాగంగా అనేక రకాల యాక్టివిటీస్ అందుబాటులో ఉంచినట్లు మాల్ రీజినల్ డైరెక్టర్ అబ్దుల్ ఖాదీర్ షేక్ తెలిపారు. మాల్‌కి వచ్చే సందర్శకులు వీటన్నిటినీ ఉచితంగా ఎక్స్‌పీరియన్స్ చేయవచ్చని రీజినల్ మేనేజర్ మహ్మద్ షరీఫ్, మాల్ మేనేజర్ ఎడిల్ అరసన్ పేర్కొన్నారు. పాఠశాలల తరపున విద్యార్థులను ఈ సాంకేతిక ప్రదర్శనకు తీసుకురావచ్చని వివరించారు. ఐపీఎల్ సమయంలో ఫేమస్ అయిన రోబోట్ డాగ్ చంపక్ సైతం అలరించనుందని, అచ్చం జంతువు మాదిరిగా నాలుగు కాళ్లతో ఉండే ఈ రోబో ప్రత్యేక ఆకర్షణ అని తెలిపారు. మాల్‌కి వచ్చే సందర్శకులు చంపక్ రోబోట్‌తో ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ సందడిచేస్తున్నారు.



బీ లీగ్‌లో 'కమల్' ప్రదర్శన

- రెండు మ్యాచ్‌లలో 8 వికెట్లతో రికార్డు
- భవిష్యత్తు ఆశాకిరణంగా ప్రశంసలు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీ డివిజన్ లీగ్‌లో కమల్ స్వరూప్ తటావర్తి 5 కీలక వికెట్లతో మెరిశాడు. సలీం నగర్ తరపున ఆడుతున్న కమల్ స్వరూప్ తన అద్భుత ప్రదర్శన, క్రీడా నైపుణ్యాలతో 5 వికెట్లు తీసి విజయాన్ని సాధించడమే కాకుండా భవిష్యాత్తు ఆశాకిరణంగా ప్రశంసలు అందుకున్నాడు. కేవలం రెండు మ్యాచ్‌లలో మొత్తం 8 వికెట్లు పడగొట్టి లీగ్‌లో రెండో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ లీగ్ మ్యాచ్ నేడు కూడా కొనసాగనుంది.

ఫిల్మ్ కోర్సుల్లో ప్రవేశాలు..

మ్యాజిక్, డైరెక్షన్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



నాంపల్లి : తెలుగు విశ్వవిద్యాలయంలో 2025–26వ విద్యా సంవత్సరానికి గానూ డిప్లొమా ఇన్ మ్యాజిక్, ఫిల్మ్ డైరెక్షన్ కోర్సుల్లో నేరుగా ప్రవేశం కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. నాంపల్లి ప్రాంగణంలో సాయంత్రం కోర్సుగా నిర్వహించే ఇంద్రజాలం, ఫిల్మ్ డైరెక్షన్ కోర్సుకు విద్యార్హతగా పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, ఆసక్తి, అభిరుచి గల విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుందని కోరారు. ఇంద్రజాలం కోర్సు వివరాల కోసం కో–ఆర్డినేటర్ సామల వేణు ఫోన్.9059794553లో, ఫిల్మ్ డైరెక్షన్ కోర్సు వివరాల కోసం డాక్టర్ రాజు ఫోన్.9346461733లో సంప్రదించాలని కోరారు.

'నిథమ్'.. పాకశాస్త్ర రిథమ్..

- 'ఫిష్' వంటకాలతో ఆకట్టుకున్న శిక్షణార్థులు
- సెర్ఫ్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తి కార్యక్రమం
- శిక్షణ పూర్తయిన 29 మందికి సర్టిఫికెట్లు, ట్రక్కులు మంజూరు

గచ్చిబౌలిలోని 'నిథమ్' ఔత్సాహిక వ్యాపార వేత్తలకు, పాకశాస్త్ర నిపుణులకు రిథమ్ అన్నట్లుగా గుర్తింపు పొందుతోంది.. ఇందిరా మహిళా శక్తి ప్రోగ్రామ్ కింద మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్స్ ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి కనబరిచిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. ఇందులో భాగంగా 20 రోజుల పాటు శిక్షణ పొందిన 29 మంది మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. దీంతోపాటు వీరందరికీ ఫుడ్ ట్రక్కులను మంజూరు చేశారు..

– రాయదుర్గం



నిథమ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 29 మందికి ట్రైనీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మిషెల్లి జే ఫ్రాన్సిస్ పర్యవేక్షణలో నిథమ్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎంకే గణేష్ సర్టిఫికెట్లు అందజేశారు. చెఫ్ తుల్జారామ్ ఆధ్వర్యంలో గురువారం పలు రకాల ఫిష్ వంటకాలను ప్రదర్శించారు. ఇందులో భాగంగా ఫిష్ పకోడా, ఫిష్ 65, ఫిష్ కట్లెట్, పత్రా రి మిర్చీ, ప్రాన్స్ పలావ్, అపోలోఫిష్, ఫిష్ ఇన్ హాట్ గార్లిక్, ఫిష్ ఫ్రై, ఫిష్ బిర్యానీ వంటి పలురకాల వంటకాలతో విందు చేశారు. చేపలతో తయారు చేసిన వంటకాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. సెర్ఫ్, నిథమ్ అధికారులు వీటిని రుచిచూసి శిక్షణార్థులను అభినందించారు. ఈ సందర్భంగా చెఫ్ తుల్జారామ్ వంటకాల తయారీపై పలు సూచనలు చేశారు. ముగింపు సమావేశం నిర్వహించి శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో నిథమ్ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మిచెల్ జే ఫ్రాన్సిస్, ఫిషరీస్ శాఖ జనరల్ మేనేజర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఉపాధి మార్గంగా..

మహిళలు తమకాళ్లపై తాము నిలబడేలా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) ఆధ్వర్యంలో శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందించాం. ఫిష్ వాల్యూ యాడెడ్ ప్రొడక్ట్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా మహిళలకు ఇది ఉపాధి మార్గంగా మారిందని, మహిళలను వ్యవస్థాపకులుగా మార్చడమే లక్ష్యంగా, జీవనోపాధి పొందేలా, తద్వారా పలువురికి ఉపాధి కల్పించేలా మొబైల్ ఫిష్ ట్రక్ క్యాంటీన్లను నడిపేందుకు ప్రోత్సహిస్తున్నాం. వ్యాపార ప్రమాణాలతో పాటు పరిశుభ్రత, నాణ్యతకు ప్రాధాన్యత ఇచ్చేలా శిక్షణ అందించాం.

– డాక్టర్ సతీష్, సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్



తాన్‌సేన్‌లో అరేబియా ఫుడ్ ఫెస్ట్



మణికొండ: ఆహార ప్రియులకు విందు చేసే తాన్‌సేన్‌లో ది టేల్స్ ఆఫ్ అరేబియా, రాయల్ కిచెన్ ఫుడ్ ఫెస్టివల్ గురువారం ప్రారంభమైంది. ఐటీ జోన్‌లోని పుప్పాలగూడలో ఉన్న తాన్‌సేన్‌లో ఈనెల 19వ తేదీ వరకూ ఈ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలను తాన్‌సేన్ తన మొదటి వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ప్రారంభించినట్లు ఓ ప్రీస్ గ్రూప్ డైరెక్టర్ అమర్ అన్నారు. విభిన్న సంస్కృతులు, రుచుల సమ్మేళనంతో గొప్ప ఆతిథ్యం అందిస్తున్నామన్నారు. భారతదేశ అద్భుతమైన పాకశాస్త్ర వారసత్వాన్ని, ఆత్మీయతను, సంప్రదాయాలను కలబోసి వంటకాల తయారీ ఉంటుందని వివరించారు. చెఫ్ అనుజ్ వాధవాన్ తీర్చిదిద్దిన రాయల్ కిచెన్ ఫుడ్ ఫెస్టివల్‌ను ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకూ నిర్వహిస్తున్నామన్నారు. ఆహార ప్రియులు తమ ఆతిథ్యాన్ని స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో తాన్‌సేన్ జనరల్ మేనేజర్ నీరజ్ రాయ్, పలువురు ఫుడ్ లవర్స్ పాల్గొన్నారు.



అవసరమైన మేరకు ఎఫ్‌సీఐ గోదాముల నిర్మాణం: డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో పెరిగిన ధాన్యం సేకరణకు అనుగుణంగా నిల్వల కోసం గోదాములను పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఎఫ్‌సీఐ కన్సల్టేటివ్ కమిటీ చైర్‌పర్సన్, ఎంపీ డీకే అరుణ అన్నారు. కమిటీ చైర్‌పర్సన్‌గా గురువారం హాకాభవన్‌లోని ఎఫ్‌సీఐ కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అధికారులు, కమిటీ సభ్యులతో తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అరుణ మీడియాతో మాట్లాడుతూ, గతంకంటే ధాన్యానికి మద్దతు ధర పెరగడంతో రైతులు పెద్దఎత్తున ధాన్యాన్ని విక్రయిస్తున్నారని తెలిపారు. 2014 తర్వాత కేంద్ర ప్రభుత్వం ధాన్యం సేకరణను రాష్ట్రాలకే అప్పజెప్పిందని, రాష్ట్రాలు సేకరించిన ధాన్యానికి పూర్తి నిధులు కేంద్ర ప్రభుత్వం ఇస్తోందని చెప్పారు. ధాన్యం నిల్వల కోసం అవసరమైనచోట గోదాముల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఎఫ్‌సీఐ పనితీరు, గోడౌన్ల నిర్వహణ, ధాన్యం సేకరణలో ఇబ్బందులు, సమస్యలు, పరిష్కార మార్గాలపై అధికారులతో చర్చించినట్లు తెలిపారు.

కాళ్లుపట్టుకున్నా కనికరించకుండా చంపేశారు

తనను చంపేస్తున్నారని టీడీపీ నేతకు రాయుడు మెసేజ్ పెట్టాడు

- పవన్ కల్యాణ్ స్పందించకపోవడం బాధాకరం
- ఏపీకి బదిలీ చేస్తే కేసు నీరుగారిపోతుంది
- కన్నీరుమున్నీరవుతున్న రాయుడు అమ్మమ్మ, సోదరి



మీడియాతో మాట్లాడుతున్న అమ్మమ్మ రాజేశ్వరి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తన మనవడిని చంపేస్తారని భయంతో కాళ్లపట్టుకున్నా కనికరించలేదని శ్రీనివాసులు రాయుడు అమ్మమ్మ రాజేశ్వరమ్మ కన్నీరు మున్నీరయ్యారు. పవన్ కల్యాణ్‌ని పిచ్చిగా అభిమానించిన తన సోదరుడిని హత్యచేశారని తెలిసినా జనసేన అధినేత ఇంతవరకు స్పందించకపోవడం అన్యాయమని రాయుడు సోదరి కీర్తి ఆవేదన వ్యక్తం చేశారు. రాయుడి హత్య విషయంపై తమకు న్యాయం చేయాలని కీర్తితోపాటు ఆమె అమ్మమ్మ రాజేశ్వరమ్మ గురువారం శ్రీకాళహస్తి డీఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. జనసేన మాజీ ఇన్‌చార్జ్ కోట వినుత డ్రైవర్ రాయుడి హత్య కేసును ఏపీకి బదిలీచేస్తే కేసు నీరుగారిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాయుడు హత్య కేసును ఏపీకి బదిలీ చేయాలని కుట్రలు చేస్తున్నారని, తమిళనాడు పోలీసులే విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరగాలంటే తమిళనాడు పోలీసులు విచారణ జరపాలని అప్పుడే వాస్తవాలు వెలుగు చూస్తాయని పేర్కొన్నారు. రాయుడిని చంపిన వారిని చట్ట పరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తన అభిమాని, జనసేన కార్యకర్త హత్యకు గురైతే ఇప్పటివరకు పవన్ కల్యాణ్ పరామర్శ లేదని, ఫోన్ కూడా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బొజ్జల అనుచరుడు మోసం చేశాడు

ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అనుచరుడు పేట చంద్రతో తన మనవడు ఫోన్ టచ్‌లో ఉన్నాడని రాజేశ్వరమ్మ వెల్లడించారు. వినుత సమాచారం, వీడియోలు పంపిస్తే డబ్బులు ఇస్తామని ఆశ చూపించారని విమర్శించారు. పేట చంద్ర ద్వారా తన మనవడితో మాట్లాడిన సంభాషణలు, చాటింగ్ మెసేజ్‌లు ఉన్నాయని, తాను దొరికిపోయాను అని ఎమ్మెల్యే అనుచరుడు చంద్రకు రాయుడు మెసేజ్ చేస్తే "నీ చావు నువ్వు చావు, మా పేర్లు చెప్పొద్దు" అని మెసేజ్ పెట్టినట్లు కన్నీరుపెట్టుకున్నారు. రాయుడిని చంపక ముందు ఐదుసార్లు పంచాయితీ జరిగిందని, మనవడిని చంపొద్దు అని వినుత దంపతుల కాళ్ళు పట్టుకుని బతిమిలాడానని, అయినా కనికరం చూపలేదని రాజేశ్వరమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. చంపేస్తారని తెలిసి వినుత ఇంటి నుంచి దూకి పారిపోయేందుకు రాయుడు యత్నించడం వల్ల అతడి కాళ్లు విరిగాయని, అది సీసీ ఫుటేజీలో రికార్డు అయిందని, ఆ తరువాత రాయుడిని పక్కనే కూర్చొని పెట్టుకుని వినుత దంపతులు తనతో మాట్లాడారని రాజేశ్వరమ్మ చెప్పారు. ఎక్కడికి పారిపోకుండా ఇద్దరితో కలిసి వినుత దంపతులు రాయుడిని నిర్బంధించి కాళ్లు, చేతులు కట్టి కూర్చోబెట్టారని విమర్శించారు. రాయుడికి డబ్బులు ఇచ్చారని చెబుతున్నారని, ఆ డబ్బు ఎక్కడుందో తెలియాలని డిమాండ్ చేశారు.

పవన్ రావాలి.. మాకు న్యాయం చేయాలి

తనకు అన్న లేకుండా చేశారని సోదరి కీర్తి ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న చిన్న విషయాలకు స్పందించే పవన్ కల్యాణ్ ఇంత జరిగినా కనీసం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పవన్‌కల్యాణ్ రావాలి, తమకు న్యాయం చేయాలని కీర్తి డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. తమకు కూడా రక్షణ కల్పించాలని కోరారు. రాయుడి హత్య తరువాత తమకు రూ.30 లక్షలు ఆఫర్ ఇచ్చారని, తాము డబ్బుకు లొంగేవాళ్లం కాదని, తమకు న్యాయం జరగాలని డిమాండ్‌చేశారు. సోషల్ మీడియాలో రాయుడిపై ఏవో విష ప్రచారం చేస్తున్నారని, ఈ కేసులో చాలామంది ఉన్నారని, వారందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

కేటీఆర్ వ్యాఖ్యలు అసమంజసం

- పోలీస్ అధికారుల సంఘం

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ డీజీపీ జితేందర్‌ను ఉద్దేశించి.. మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా చేసిన పోస్టును తెలంగాణ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.గోపిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. 'ఎవరూ శాశ్వతంగా అధికారంలో ఉండరని, మాకూ ఒకరోజు వస్తుందని, అప్పుడు ప్రతి చర్యనీ సమీక్షిస్తామని'.. డీజీపీని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ట్వీట్‌ను ఖండించారు. తెలంగాణ పోలీసు నిక్కచ్చిగా, నిజాయితీగా ప్రజల భద్రత, రక్షణ కోసం చట్టం నిర్దేశించిన పరిధిలో పనిచేస్తుందని స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదారి పట్టించే ఇలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ పోలీసుల స్థాయిని దెబ్బతీసే వ్యాఖ్యలను మానుకోవాలని కోరారు.

నగరి ఎమ్మెల్యే నోటి దురద

- ఏపీ మాజీ మంత్రి ఆర్కే రోజాపై అసభ్యకర వ్యాఖ్యలు, మెసేజ్‌లు
- వంతపాడుతూ ఐ టీడీపీ దుష్ప్రచారం



నగరి/సాక్షి, అమరావతి: మహిళలను అవమానపరచడం, కించ పరచడం ఏపీలో అధికార టీడీపీ నేతలకు పరిపాటిగా మారింది. ఇంట్లో మహిళలు ఏమనుకుంటారోనన్న కనీస స్పృహ లేకుండా ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ మహిళా నేతలపై నిస్సిగ్గుగా నోరు పారేసుకుంటున్నారు. తాజాగా మాజీ మంత్రి ఆర్కే రోజాపై సభ్య సమాజం సిగ్గు పడేలా దుర్భాషలాడుతూ ఐ టీడీపీ, చిత్తూరు జిల్లా నగరి టీడీపీ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ రెచ్చిపోయారు. పత్రికలో రాయడానికి వీలు లేనంతగా బూతులు తిడుతూ ఆమె వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. ఈ వ్యవహారంపై ఆర్‌కే రోజా గురువారం చిత్తూరు జిల్లా నగరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, ఆయన సహచరులు సోషల్ మీడియాలో తన గురించి "రూ.2,000 ఇస్తే ఏ పనైనా చేసేది. మార్కెట్లో ఆ మాట ఉంది. ఆమె నేడు రూ.రెండు వేల కోట్లు సంపాదించింది. ఆమె వ్యాంప్‌కు ఎక్కువ.. హీరోయిన్‌కు తక్కువ. ఈ పిచ్చి దాంతో వాళ్ల పార్టీ నేతకు పిచ్చెక్కిందా.. ఆయన పిచ్చి ఈమెకెక్కిందా తెలియడం లేదు"అని దుష్ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వ్యక్తిత్వ హననం చేసేలా మాట్లాడిన నగరి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే ఈ ఫిర్యాదుపై పోలీసులు స్పందించక పోవడంపై అనంతరం ఆమె ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. 'నేను రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై గొంతెత్తినందుకు టీడీపీ ఎమ్మెల్యే గాలిభాను.. నన్ను అసభ్యకరంగా, దుర్భాషలాడుతూ బాధ పెట్టారు. నేను డయల్ 100తో పాటు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్లినప్పుడు, వారు దానిని నమోదు చేయడానికి కూడా వెనుకాడారు. ఇది న్యాయమా? భాను ప్రకాష్‌పై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి'అని ఆమె డిమాండ్ చేశారు.

పవన్ కళ్యాణ్ స్పందించాలి

'సినిమా వాళ్లు అంటే ఎందుకు మీకు ఇంత చులకన? మీరు నెత్తిన ఎక్కించుకున్న పవన్ కళ్యాణ్ సినిమా వ్యక్తి కాదా?'అని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి శ్యామల ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ కూడా దీనిపై స్పందించాలి అని డిమాండ్ చేశారు.

సెప్టెంబర్ 30లోగా స్థానిక ఎన్నికలు నిర్వహించాలి


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్

సాక్షి, హైదరాబాద్‌: హైకోర్టు సూచనల మేరకు సెప్టెంబర్ 30వ తేదీ లోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరపడుతున్నాయని రైతుల శ్రేయస్సు గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమే కేంద్రం యూరియా ఇవ్వడం లేదంటూ అపోహలు సృష్టిస్తోందని మండిపడ్డారు. గురువారం బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మోర్చా పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన మోసాలు బహిర్గతం చేసి స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. రైతులకు ఇచ్చిన హామీల అమలుపై సీఎం రేవంత్ రెడ్డి లేదా పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ బహిరంగంగా సమాధానం చెప్పాలని కొండపల్లి శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు.

మావోయిస్టు కీలక నేత సంజీవ్ లొంగుబాటు

ఆయన భార్య పార్వతి కూడా

- సాంస్కృతిక కార్యక్రమాలతో సీఎస్ఎం కేడర్లకు శిక్షణ ఇచ్చిన దంపతులు
- ఎదురుకాల్పుల్లో రెండుసార్లు తప్పించుకున్న సంజీవ్



సంజీవ్



పార్వతి

సాక్షి, హైదరాబాద్‌: ఇద్దరు మావోయిస్టు కీలక నేతలు పోలీసుల ఎదుట లొంగిపోయారు. నాలుగున్నర దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉన్న సీనియర్ సీపీఐ (మావోయిస్టు) నాయకుడు, జన నాట్య మండలి వ్యవస్థాపక సభ్యుడు, ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ (డీకేఎస్‌జెడ్‌సీ) సెక్రటేరియట్ సభ్యుడు మాల సంజీవ్ అలియాస్ లెంగు దాదా, ఆయన భార్య, డీకేఎస్‌జెడ్‌సీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు పెరుగుల పార్వతి అలియాస్ దీనా గురువారం రాచకొండ కమిషనర్ జి.సుధీర్ బాబు ఎదుట లొంగిపోయారు. వీరిరువురూ హిందీ, తెలుగు, కోయ భాషల్లో పాటలు రచించడంలో దిట్ట. దండకారణ్యంలోని వివిధ ప్రాంతాల్లో సాంస్కృతిక పాటలు, ఆటలతో గిరిజనులను తమ పార్టీ వైపు ఆకర్షించారు. కమిషనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ.. తెలంగాణ పోలీసు మావోయిస్టు పార్టీ పట్ల అవలంబిస్తున్న సమగ్ర విధానానికి ఇదొక నైతిక విజయమని అన్నారు. మావోయిస్టు ఉద్యమాన్ని వదిలి జన జీవన స్రవంతిలోకి వచ్చిన ప్రతి మావోయిస్టుకు పునరావాస పథకం కింద లభించే ఫలితాలను అందిస్తామని హామీ ఇచ్చారు.

సంజీవ్ నేపథ్యమిదీ..

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా యాప్రాల్‌కు చెందిన సంజీవ్ 1980లో సీపీఐ (ఎంఎల్) పీపుల్స్ వార్‌లోని జననాట్య మండలి (జేఎన్ఎం)లో గద్దర్ నేతృత్వంలో చేరి, అందులో 1986 వరకు పని చేశారు. దేశంలోని సుమారు 16 రాష్ట్రాల్లో పీపుల్స్‌వార్ గురించి విస్తృతంగా ప్రచారం చేశారు. దీంతో గద్దర్‌కు ముఖ్య అనుచరుడిగా మారాడు. 1982లో కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌కు చెందిన పంజాల సరోజ అలియాస్ విద్యను వివాహం చేసుకున్నాడు. విద్య 2002లో ఆయిలాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పుల్లో మరణించింది. అనంతరం 1996లో సీపీఐ (ఎంఎల్) పీపుల్స్ వార్ గ్రూప్‌లోని సాయుధ దళమైన మనుగూరు చేరి, డివిజన్ కమిటీ సభ్యుడుగా పనిచేశాడు. తర్వాత ఏటూరునాగారం, పాండవ, మహదేవ్‌పూర్ దళాల్లో కూడా పనిచేశాడు. దీంతో 2001లో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొంది, ఉత్తర తెలంగాణ ప్రత్యేక జోనల్ కమిటీ పరిధిలో పనిచేశాడు. ఆ తర్వాత 2003లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి బదిలీ అయి దీని పరిధిలోని చైతన్య నాట్య మంచ్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2007లో పార్వతిని రెండో వివాహం చేసుకున్నాడు. ఇద్దరూ కలిసి సీఎస్ఎం కేడర్లకు శిక్షణ ఇచ్చేవారు. సంజీవ్ 2002లో కన్నాయిగూడెం మండలంలోని అయిలాపూర్ అడవుల్లో, 2005లో ఛత్తీస్‌గఢ్ బీజాపూర్‌లో జరిగిన ఎదురు కాల్పుల్లో తప్పించుకున్నాడు.

నల్లమలలో దీనా..

నాగర్ కర్నూల్ జిల్లా వంకేశ్వరం గ్రామానికి చెందిన పార్వతి 1992లో నల్లమల ప్రాంతంలోని పీపుల్స్‌వార్ గ్రూప్‌లోని అప్పర్ ప్లాట్యూ దళంలో చేరారు. తర్వాత పనగళ్ దళంలో పనిచేసి, అనంతరం జన నాట్య మండలిలో చేరారు. 1998లో ఏరియా కమిటీ సభ్యురాలిగా పదోన్నతి పొందారు. 2004లో ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని గాలికొండ ఏరియా దళంలోకి ఏసీఎంగా బదిలీ అయి 2007 వరకూ పని చేసి, ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్‌లోని డీకేఎస్‌జెడ్‌సీకు బదిలీ అయ్యారు. ఇక్కడే సంజీవ్‌తో కలిసి చైతన్య నాట్య మండలిలో పనిచేసింది. 2016లో డివిజన్ కమిటీ సభ్యురాలిగా పదోన్నతి పొంది సీఎస్ఎంలో సాంస్కృతిక ఉప సమితి సభ్యురాలిగా బాధ్యతలు నిర్వహించారు. 2017లో మాడ్ డివిజన్‌లో జరిగిన ఎదురు కాల్పుల్లో త్రుటిలో పోలీసుల తూటా నుంచి తప్పించుకుంది.

మా గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలి

- సరిహద్దు గ్రామాల ప్రజల వినతి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలో సరిహద్దు గ్రామాలైన అంతాపూర్, ఇంద్రానగర్, పద్మావతి, నారాయణగూడ, పరంధోలి, మహారాజ్‌గూడ గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట గురువారం నిరసన చేపట్టారు. అనంతరం వినతిపత్రం అందించారు. ఆయా గ్రామాల ప్రజలు మాట్లాడుతూ తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు వివాదం సుప్రీంకోర్టులో కొనసాగుతోందని తెలిపారు. అయితే తమకు అటవీహక్కు పట్టాలతోపాటు రేషన్‌కార్డులు, ఓటరు కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలను తెలంగాణ ప్రభుత్వమే మంజూరు చేసిందని చెప్పారు. తమ పిల్లలు తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారని వెల్లడించారు. కాగా, మహారాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 16న వివాదాస్పద 14 గ్రామాలను మహారాష్ట్రలో విలీనం చేస్తామని ప్రకటించడం ఆందోళన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సరిహద్దు గ్రామాలను తెలంగాణలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మళ్లీతెరపైకి 'సరిహద్దు' వివాదం!

- సరిహద్దు గ్రామాలపై మహారాష్ట్ర నేతల వ్యాఖ్యలు
- తమ రాష్ట్రంలోనే విలీనం చేస్తామంటూ ప్రకటనలు
- తెలంగాణలోనే కలపాలని కలెక్టరేట్ ఎదుట ప్రజల నిరసన

వివరాలు సాక్షి ప్లస్ ఈ పేపర్‌లో

సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌లపై ఏసీబీ మెరుపుదాడులు

సాక్షి, హైదరాబాద్/బీబీనగర్/జడ్చర్ల: అవినీతి అధికారులపై ఏసీబీ కొరడా ఝులిపిస్తోంది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మెరుపుదాడులు నిర్వహించింది. నల్లగొండ జిల్లా బీబీనగర్, మెదక్ జిల్లా సదాశివపేట్, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎస్ఆర్‌ఓ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ఏసీబీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. బీబీనగర్ ఎస్ఆర్‌ఓ కార్యాలయంలో తనిఖీల్లో లెక్కల్లో చూపని రూ.61,430 స్వాధీనం చేసుకోవడంతోపాటు కార్యాలయ ఆవరణలో 12 మంది అనధికారిక డాక్యుమెంట్ రైటర్లు, ప్రైవేటు వ్యక్తులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. 93 రిజిస్టర్డ్ డాక్యుమెంట్లను సైతం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా జడ్చర్ల ఎస్ఆర్‌ఓలో తనిఖీల్లో రూ.30,900 నగదు, 20 రిజిస్టర్డ్ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకోవడంతోపాటు 11 మంది అనధికారిక వ్యక్తులను గుర్తించినట్టు తెలిపారు. సదాశివపేట్ ఎస్ఆర్‌ఓలో తనిఖీ నిర్వహించగా రూ.5,500 లెక్కల్లో చూపని డబ్బుతోపాటు 9 మంది ప్రైవేటు వ్యక్తులను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గుర్తించినట్టు తెలిపారు. 39 రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అన్ని కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని, సీసీటీవీ కెమెరాలు పనిచేయడం లేదని పేర్కొన్నారు.

గురుకుల పాఠశాలలో ఫుడ్‌పాయిజన్

- 35 మందికి అస్వస్థత
- ఆస్పత్రిలో చేరిన ఆరుగురు విద్యార్థులు
- విద్యార్థినులను పరామర్శించిన కలెక్టర్



చికిత్స పొందుతున్న విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కావడంతో ఆరుగురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మరికొందరు స్వల్ప అనారోగ్యం బారినపడ్డారు. బుధవారం సాయంత్రం విద్యార్థినులకు బగారా అన్నంతోపాటు చికెన్ పెట్టారు. ముందుగా ఆహారం రుచి చూసిన ఆహార కమిటీ విద్యార్థినులు చికెన్‌లో కారంతోపాటు, మసాలా ఎక్కువైందని తెలిపారు. అయినా మిగతా విద్యార్థినులకు బగారా అన్నం, చికెన్ వడ్డించడంతో వేకువజాము రెండు గంటల సమయంలో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆరుగురిని వెంటనే జగిత్యాల పట్టణంలోని మాతాశిశు ఆస్పత్రిలో చేర్పించారు. వీరిలో సాత్విక, శ్రీనిక, లక్ష్మీప్రసన్న, శ్రీజ, పరిచయ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. మరో విద్యార్థినిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వెంటనే జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, ఉప వైద్యాధికారి శ్రీనివాస్ వసతి గృహానికి చేరుకున్నారు. అక్కడ సుమారు 30 నుంచి 35 మంది విద్యార్థినులు కడుపునొప్పి, గ్యాస్ ట్రబుల్‌తో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. మాతా శిశు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను కలెక్టర్ సత్యప్రసాద్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

ప్రాణం తీసిన ప్రేమ పంచాయితీ!

- పట్టపగలే యువకుడిని పొడిచి చంపిన దుండగులు



మల్లేశ్

వెల్గటూర్: జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో పట్టపగలు యువకుడిని దారుణంగా హత్య చేసిన సంఘటన కలకలం రేపింది. ప్రేమ వ్యవహారం కారణంగానే ఈ హత్య జరిగినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన చల్లూరి మల్లేశ్ (30) కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన ఒక యువతితో ప్రేమ వ్యవహారం నడుపుతున్నాడు. ఈ విషయంలో యువతి బంధువులు అనేకసార్లు మల్లేశ్‌కు నచ్చజెప్పారు. రెండు కుటుంబాల మధ్య గొడవలు, కొట్లాటలు జరిగాయి. ఈ క్రమంలో మల్లేశ్ జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. అతనిపై రౌడీషీట్ కూడా నమోదైంది. అయినప్పటికీ మల్లేశ్ ప్రవర్తనలో మార్పు రాలేదు. మల్లేశ్ గతంలో హార్వెస్టర్ నడిపించగా.. ఈ గొడవల నేపథ్యంలో హార్వెస్టర్ అమ్మేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. గురువారం ఉదయం కూడా మల్లేశ్ సదరు యువతి ఇంటికి వెళ్లి గొడవ చేసినట్లు సమాచారం. యువతి తండ్రికి ఫోన్ చేసి దుర్భాషలాడినట్లు తెలిసింది. ఈ క్రమంలో యువతి బంధువులు విసిగిపోయారు. ఇంటి నుంచి ద్విచక్రవానంపై బయలుదేరిన యువకుడిని వెంబడించి వెల్గటూర్ మండల కేంద్రంలోని పెద్దవాగుపై విచక్షణారహితంగా కొట్టి ఆటోలో తీసుకెళ్లి కోటిలింగాల రోడ్డులోని పాత వైన్స్ వెనకాల కత్తులతో పొడిచి చంపినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతుడి తల్లిదండ్రులకు నలుగురు కూతుళ్లుకాగా మల్లేశ్ ఒక్కడే కుమారుడు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ రఘుచందర్, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉమాసాగర్‌లు సందర్శించి వివరాలు సేకరించారు.

గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

మేళ్లచెరువు: సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు పరిధిలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ మురళిని సస్పెండ్ చేసినట్లు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సీతాలక్ష్మి తెలిపారు. తమ గురుకుల హాస్టల్‌లో నీళ్ల లేక ఇబ్బంది పడుతున్నామంటూ విద్యార్థులు బుధవారం రాస్తారోకో చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమె గురువారం సాయంత్రం ఆ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవన యజమాని అహ్మద్‌ను పిలిచి భవనంలో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్ మురళిని సస్పెండ్ చేసి.. ఆయన స్థానంలో వైస్ ప్రిన్సిపాల్ డి.మధుకర్‌కు తాత్కాలిక బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మిషన్ భగీరథ అధికారులు తాగునీటి వసతి కల్పనకు రూ.2 లక్షల అంచనా వ్యయంతో పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

స్టార్టప్ స్టార్స్

వ్యాపారం, ఆవిష్కరణలకు సంబంధించి అందరిలా ఆలోచిస్తే... పెద్దగా పోయేదేమీ ఉండదు... వచ్చేది కూడా అంతగా ఉండదు! 'కాస్త కొత్తగా ఆలోచిద్దాం' అనుకుంటే మాత్రం వచ్చేది తప్ప పోయేదేమీ ఉండదు. రెండో కోవకు చెందిన ఈ మహిళలు ఇన్నోవేటివ్ స్టార్టప్‌లతో స్టార్‌లుగా మెరిసిపోయారు. వ్యాపార నైపుణ్య దీక్షాదక్షతలతో 'సక్సెస్'కు సరియైన నిర్వచనం అనిపించుకున్నారు. తాజాగా... హురున్ ఇండియా-2025 (అండర్-30) జాబితాలో చోటు సాధించారు.

అంత 'స్క్రీన్' లేదు!


దేవాన్షీ కేజ్రీవాల్

కథలు వినడం నుంచి పొడుపు కథలకు సమాధానం చెప్పడం వరకు పిల్లలకు 'స్క్రీన్' అనేది తప్పనిసరిగా ఉండాల్సిందేనా? 'అవసరం లేదు' అంటూ మార్కెట్‌లోకి వచ్చిన 'స్కిల్‌మెటిక్స్' పిల్లల ప్రపంచానికి చేరువయింది. ఈ విజయానికి చిరునామా... దేవాన్షీ.

ఇన్నోవేటివ్ స్టార్టప్‌గా పేరు తెచ్చుకున్న 'స్కిల్‌మెటిక్స్'కు దేవాన్షీ కేజ్రీవాల్ కో-ఫౌండర్, చీఫ్ ప్రోడక్ట్ ఆఫీసర్. ముంబైలో ప్రారంభమైన 'స్కిల్‌మెటిక్స్' ఎకో-ఫ్రెండ్లీ, స్క్రీన్-ఫ్రీ ఎడ్యుకేషనల్ గేమ్స్‌ను క్రియేట్ చేస్తోంది. పిల్లలు పాఠాలు నేర్చుకునే విధానంలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. స్పెల్లింగ్ గేమ్స్‌తో మొదలైన 'స్కిల్‌మెటిక్స్' స్క్రీన్ అవసరం లేకుండానే పిల్లలకు నచ్చే, వారి ఆలోచనలకు పదును పెట్టే క్రియేటివ్ పజిల్స్‌ను డిజైన్ చేసింది. దేశీయంగానే కాదు అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా మంచి పేరు తెచ్చుకుంది కంపెనీ.

అనుభవాలే అద్భుత పాఠాలై...


దేవిక గోలప్

చిన్న వయసులోనే ఎన్నో ప్రసిద్ధ కంపెనీలలో పనిచేసి 'భేష్' అనిపించుకుంది దేవిక గోలప్. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఉన్నత స్థాయికి చేరుకుంది. హురున్ ఇండియా జాబితాలోని పిన్న వయస్కులలో 28 సంవత్సరాల దేవిక గోలప్ ఒకరు. డిజిటల్ పాథాలజీకి సంబంధించిన 'హోప్‌ట్రాస్కాన్' కంపెనీలో పనిచేస్తున్న దేవికకు వైద్యపరికరాల తయారీ రంగంలో అయిదు సంవత్సరాల అనుభవం ఉంది. 'హోప్‌ట్రాస్కాన్' కార్పొరేట్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా కంపెనీ అభివృద్ధికి సంబంధించిన వ్యూహాత్మక నిర్ణయాలలో కీలకపాత్ర పోషిస్తోంది.

'హోప్‌ట్రాస్కాన్'కు ముందు 'కెటాలిస్ట్ హెల్త్ వెంచర్'లో హెల్త్‌కేర్ ఇన్వెస్ట్‌మెంట్ ఎనలిస్ట్‌గా పనిచేసింది.

'బెకాన్ డిస్కిన్‌సన్'లో సీనియర్ ప్రాడక్ట్ మేనేజర్‌గా పనిచేసింది. అంతకుముందు 'మెడ్రోనిక్'లో సీనియర్ ఎనలిస్ట్‌గా పనిచేసింది. ఎన్నో కంపెనీలలో పని చేసిన దేవిక ఎన్నో అనుభవాలను పాఠాలుగా మార్చుకుంది.

అమ్మ ఇచ్చిన ధైర్యమే... విజయానికి దారి


వృషాలి

తనలోని ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించేలా 'జీరో రిగ్రేట్స్' అనే మాట వృషాలి ప్రసాదే నోట వినిపిస్తుంటుంది. 'రిస్క్-టేకింగ్' స్వభావం వృషాలిలో చిన్న వయసు నుంచే ఉంది. బిట్స్ గోవాలో చేరిన రోజుల్లో తన క్లాస్‌మేట్స్ శుభమ్ మిశ్రా, హరి వాలియత్‌తో కలిసి సృజనాత్మక ఆలోచనలు చేసేది.

'కొత్తగా ఆలోచించడమే విజయానికి దగ్గరి దారి' అంటున్న వృషాలి ఏఐ-పవర్డ్ ప్లాట్‌ఫామ్ 'పిక్సిస్'కు కో-ఫౌండర్, సీటీవో. ఆటోమేట్ మార్కెటింగ్ డెసిషన్‌లతో వివిధ బ్రాండ్‌లకు ఉపయోగపడే ప్లాట్‌ఫామ్ ఇది.

'నా విజయానికి ప్రధాన కారణం అమ్మ. నేను రిస్కీ డెసిషన్స్ తీసుకున్నప్పుడు ఎప్పుడూ అడ్డుపడలేదు. నువ్వు బాగా ఆలోచించే ఒక నిర్ణయానికి వస్తావు. సందేహించాల్సిన అవసరం లేదు అని ప్రోత్సహించేది' అంటుంది వృషాలి ప్రసాదే.

సుమధుర విజయగీతం


అనన్యశ్రీ బిర్లా

సింగర్, సాంగ్ రైటర్, ఎంటర్‌ప్రెన్యూర్‌గా తనదైన శైలిలో దూసుకుపోతుంది ఘనమైన వ్యాపార కుటుంబ నేపథ్యం ఉన్న అనన్యశ్రీ బిర్లా. కళారంగంలో చిన్న వయసు నుంచే ప్రతిభ చూపుతున్న అనన్య పదిహేడు సంవత్సరాల వయసులో 'స్వతంత్ర మైక్రోఫిన్'తో వ్యాపారరంగంలోకి అడుగు పెట్టింది. గ్రామీణ మహిళలకు సూక్ష్మ రుణాలు అందించే సంస్థ ఇది.

'అనన్య బిర్లా ఫౌండేషన్' వ్యవస్థాపకురాలైన అనన్య శ్రీ బిర్లా తల్లితో కలిసి మెంటల్ హెల్త్ ఆర్గనైజేషన్ 'మై పవర్' స్థాపించింది.

కుటుంబం నేర్పిన పాఠాలు


రాధిక అంబానీ

రకరకాల సేవాకార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనే రాధిక అంబానీ 'ఎన్‌కోర్ హెల్త్‌కేర్' సీఈవో వీరేన్ మార్చెంట్ కూతురు. పారిశ్రామిక దిగ్గజం అనంత్ అంబానీ భార్య. ఫామిలీ హెల్త్‌కేర్ బిజినెస్ 'ఎన్‌కోర్ హెల్త్‌కేర్' నిర్వహణలో చురుకైన పాత్ర పోషిస్తోంది.

'ఇన్నోవేషన్' 'రిసెర్చ్' 'ఎన్‌కోర్ హెల్త్ కేర్'కు ప్రాణనాడిలాంటివి. కుటుంబం నమ్మిన వ్యాపార సూత్రాల గురించి తెలుసుకోవడంతో పాటు, న్యూయార్క్ యూనివర్శిటీ చదువు ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాధిక అంబానీకి బలమైన పునాదిని ఏర్పర్చింది. భరతనాట్యంలో రాధిక అంబానీ మంచి పేరు తెచ్చుకుంది.

ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ టు ఎంటర్‌ప్రెన్యూర్


రోమితా మజుందార్

ఒకప్పటి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్, వెంచర్ క్యాపిటలిస్ట్ అయిన రోమితా మజుందార్ డైరెక్ట్-టు-కస్టమర్ స్కిన్‌కేర్ బ్రాండ్ 'ఫాక్స్‌టేల్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా అడుగులు మొదలుపెట్టి విజయం సాధించింది. జార్ఖండ్‌లోని రాంచీలో పుట్టి పెరిగిన రోమిత యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా, లాస్ ఏంజెల్స్‌లో బిజినెస్ ఎకనామిక్స్, ఫైనాన్షియల్ మ్యాథమెటిక్స్‌లో డిగ్రీ చేసింది. 'ఏ నిర్ణయం తీసుకున్నా ముందు మనపై మనకు నమ్మకం ఉండాలి. ఊగిసలాడే ధోరణి వద్దు' అంటుంది రోమిత మజుందార్.

స్టూడెంట్ నంబర్ వన్

గురుబ్రహ్మ అమ్మ అవుతున్న వేళ...

రాములవారి తలంబ్రాలూ, పట్టువస్త్రాలను తలపై పెట్టుకుంటారు... అది భక్తి. రాయలవారు తనకు తోడుగా కవులను ఏనుగు మీదకు ఎక్కించుకుంటారు. అది గౌరవం. శ్రవణకుమారుడు తన తల్లిదండ్రులను కావడిలో మోస్తాడు... అవి ప్రేమాభిమానాలు. అలాంటి భక్తి, గౌరవం, ప్రేమ ప్రపత్తులను తమ ఉపాధ్యాయినుల పట్ల చూపారు కొందరు విద్యార్థులు. హిమాచల్ ప్రదేశ్‌లో చోటుచేసుకుని... లోకమంతటా వైరలైన ఈ సంఘటన వివరాలివి...



ఇటీవల హిమాచల్‌ప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్ కారణంగా కుండపోత వానలు కురుస్తుండటం... దాంతో చండప్రచండంగా నదులు ప్రవహిస్తుండటం... ఫలితంగా ఎంతోమంది కొట్టుకుపోతున్న సంఘటనల వార్తలు తరచూ వినిపిస్తున్నాయి. కొద్దికాలంలోనే అలాంటి వరస సంఘటనలు అక్కడ చాలానే చోటు చేసుకున్నాయి.

అచ్చం అలాగే ఆరోజున కూడా హిమాచల్ ప్రదేశ్‌లోని మాండీ జిల్లా థునాగ్ ప్రాంతమంతా కారు మబ్బులు ఆవరించి నలువైపుల్నుంచీ కమ్ముకొస్తూ పట్టపగటిని చిమ్మచీకటి చేసేశాయి. ఈ వాతావరణ నేపథ్యంలోనే... థునాగ్‌లోని 'కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్ అండ్ ఫారెస్ట్రీ'కి చెందిన ఇద్దరు లెక్చరర్లకు నెలలు నిండాయి. ఏ సమయంలోనైనా వారికి నొప్పులు మొదలయ్యే అవకాశముంది.

హిమాచల్ ప్రదేశ్‌లో అందునా పర్వతప్రాంతమైన మాండీ పరిసరాల్లో ఇలా కురిసే అకస్మాత్ వర్షాలూ, హఠాత్తుగా వచ్చే మెరుపు వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్) చాలా మామూలు. ఒక పక్క నిండు గర్భిణులైన తమ లెక్చరర్లు...

మరోపక్క కమ్ముకొస్తున్న వర్షపు ధాటి...

ఇంకో పక్క పొంచి ఉన్న వరద ముప్పు!

ఏం చేయాలో తోచని అక్కడి విద్యార్థులు... మోసుకెళ్లేందుకు వీలుగా ముందుగా పల్లకి లాంటి ఓ మంచె కట్టారు. అలా కట్టిన ఆ పల్లకిలో లెక్చరర్‌ను కూర్చోబెట్టి ఆ మంచెను మోశారా విద్యార్థులు.

అసలే పర్వత ప్రాంతం! అంతా ఎగుళ్లూ దిగుళ్లు. మరోపక్క స్టూడెంట్లకు... 'వానెప్పుడు ముంచుకొస్తుందో... ప్రసవపు నొప్పులెప్పుడొస్తాయోనని గుండెనిండా దిగులు. నిట్టనిలువుగా ఉండే పర్వత మార్గాలు కూలి కొండదారులు మూసుకుపోతే వాటినెలా దిగాలో తెలియని దిగాలు!!

అలాంటి నేపథ్యంలో దాదాపు పదకొండు కిలోమీటర్ల పొడవున అత్యంత కఠినమైన దారుల్లో ముందుకు సాగారు. గోడల్లా నిలువుగా ఉన్న సానువులను దిగారు. అలా కఠిన మార్గాల్ని ఓడిస్తూ ఎట్టకేలకు పర్వతపాదాల వద్దనున్న హాస్పిటల్‌కు చేరారూ... తమ లెక్చరర్లనూ చేర్చారు.

ఇటీవల జరిగిన ఈ సంఘటన తాలూకు క్లిప్స్ వైరల్ కావడంతో ఆ స్టూడెంట్ల పట్ల అభినందనలూ, ప్రశంసలు వెల్లువెత్తాయి... అచ్చం అక్కడి క్లౌడ్ బరస్ట్ టైమ్‌లో ఫ్లాష్ ఫ్లడ్స్‌లాగే!!

'ఆ స్టూడెంట్స్ తెగువకూ, ధైర్యానికీ మా సలాం' అంటూ ఒకరు ప్రశంసిస్తే... 'గురుపూర్ణిమకు గురుదక్షిణ ఆ గురువులకు చక్కగా దొరికిందం''టూ మరొకరు కితాబిచ్చారు. ''ఇది కదా ఇండియా ప్రజల సంస్కారమం''టూ అందరూ ఆ విద్యార్థులకు జేజేలు పలికారు.

● బ్యూటిప్స్

చుండ్రుకి పటిక పరిష్కారాలు

కప్పునీటిలో రెండు టేబుల్ స్పూన్ల పటికను వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం ఈ నీటిని మాడుకు పట్టించి రుద్దాలి. తరువాత సాధారణ నీటితో కడిగేయాలి. ఇలా చేయడం వల్ల చుండ్రు తగ్గుతుంది. పటికపొడిని మగ్గు నీటిలో కలిపి కూడా వాడవచ్చు. యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు పుష్కలంగా ఉన్న పటిక చుండ్రు నుంచి మాడుని కాపాడుతుంది.






పటికపొడిని కొబ్బరినూనెలో కలిపి రాసుకుంటే... జుట్టు నల్లగా ఒత్తుగా పెరుగుతుంది. పటిక మాడు రంధ్రాలను తెరిచి, పొటాషియం, సోడియంలను కుదుళ్లకు అందిస్తుంది. దీనివల్ల చుండ్రు తగ్గడంతో పాటు జుట్టు ఒత్తుగా పెరుగుతుంది.



మెడకు మెరుపులు

రెండు టేబుల్ స్పూన్ల తెల్లని టూత్‌పేస్టులో అరటీస్పూను పసుపు, టీస్పూను వంటసోడా, అరచెక్క నిమ్మరసం పిండి రెండూ కలిసేలా చక్కగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని నల్లగా మారిన మెడకు పూతలా వేయాలి. అరగంట ఆరాక నీటితో కడిగేయాలి. వారానికి రెండుసార్లు ఇలా చేయడం వల్ల మెడ నలుపు క్రమేణా తగ్గుతుంది.



● ఒక టేబుల్ స్పూన్ శనగపిండిలో ఒక కప్పు పెరుగు కలిపి రోజూ ముఖానికి మెడకు చేతులకు పట్టిస్తుంటే చర్మానికి నిగారింపు వస్తుంది.



● తలస్నానానికి కాచే నీటిలో ఒక టేబుల్ స్పూను నిమ్మరసం, ఐదారు టీ ఆకులు కాని, ఒక కప్పు డికాషన్ కాని కలుపుకుని స్నానం చేస్తే జుట్టు కుదుళ్లు గట్టిపడతాయి, రాలడం తగ్గుతుంది.

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూలై 17న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	98,210
బంగారం (22 క్యారెట్లు)	91,680
వెండి	1,14,210
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,00,560
బంగారం (22 క్యారెట్లు)	91,500
వెండి	1,14,600
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	99,330
బంగారం (22 క్యారెట్లు)	91,050
వెండి	1,24,00
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,00,560
బంగారం (22 క్యారెట్లు)	93,780
వెండి	1,14 ,600
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	97,650
బంగారం (22 క్యారెట్లు)	89,840
వెండి	1,13,600
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	99,320
బంగారం (22 క్యారెట్లు)	91,050
వెండి	1,24,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

● కిచెన్ టిప్

బెండ... ఇలా తాజాగా...



వారానికి కనీసం ఒక్కసారైనా వండుకునే కూరగాయల్లో బెండకాయ ఒకటి. రిఫ్రిజిరేటర్‌లో పెట్టినప్పటికీ బెండకాయలు పాడవుతుంటాయి. వర్షాకాలంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. బెండకాయను తాజాగా ఉంచేందుకు ఇలా చేసి చూడండి...

● మార్కెట్ నుంచి తెచ్చిన బెండకాయల్లో తాజాగా ఉన్న బెండకాయలను ఏరి పక్కన పెట్టుకోవాలి. ● తాజా బెండకాయలన్నింటిని స్పూను వెనిగర్ వేసిన నీటిలో వేసి ఇరవై నిమిషాలు ఉంచాలి. తరువాత సాధారణ నీటితో కడిగి, తడిలేకుండా తుడిచి ఆరబెట్టుకోవాలి. ● ఆరిన బెండకాయలను నచ్చిన పరిమాణం, ఆకారంలో ముక్కలుగా తరిగి జిప్‌లాక్ బ్యాగ్‌లో వేసి రిఫ్రిజిరేటర్‌లో స్టోర్ చేసుకోవాలి. ● ఇలా నిల్వచేసుకుంటే బెండకాయలు ఎక్కువరోజులపాటు తాజాగా , రుచిగా ఉంటాయి. అవసరమైనప్పుడు జిప్‌లాక్ బ్యాగ్‌ను బయటకు తీసి వేడినీటిలో కొద్దిసేపు ఉంచాలి. కూలింగ్ తగ్గిన తరువాత వాడుకోవాలి.

ఫ్యాషన్

స్కార్ఫ్... స్పార్క్...


ఒకప్పుడు తలకు రక్షణగా కప్పుకునేందుకు, మెడ భాగంలో దుపట్టా ప్లేస్‌లో తక్కువ బరువుతో ఎక్కువ ఉపయోగకరంగా ఉండే విధంగా స్కార్ఫ్‌ను ఉపయోగించేవారు. ఇప్పుడు ఇవి కూడా స్టైల్ స్టేట్‌మెంట్‌గా మారిపోయాయి. స్కార్ఫ్ చివరన చిన్న చిన్న ఫ్లవర్స్, మెరిసే బీడ్స్, రంగురంగుల థ్రెడ్స్‌ను జోడించడం ద్వారా వాటికి ఒక ప్రత్యేకమైన అందాన్ని తీసుకు వస్తున్నారు. ఇవి ప్రత్యేకించి యువతలో ట్రెండ్ అవుతున్నాయి.







డ్రెస్సుల మీదకు ధరించే స్కార్ఫ్ డిజైన్స్‌లో ఫ్లవర్స్, టాజిల్స్, బీడ్స్, కలర్డ్ థ్రెడ్స్, బాల్స్.. అటాచ్ చేసి వస్తున్నాయి. అన్ని ఏజ్ గ్రూప్‌ల వారికీ ఉపయుక్తంగా ఉంటూ, స్టైలిష్ లుక్‌ని ఇచ్చే ఈ స్కార్ఫ్స్ ఇండో, వెస్టర్న్ అన్ని రకాల డ్రెస్సుల మీదకు స్పెషల్‌గా కనిపిస్తున్నాయి. సింపుల్ డ్రెస్సింగ్ అయినా యునిక్‌గా ఉండాలనుకునే కోరుకునేవారికి స్టైల్ స్టేట్‌మెంట్‌గా పేరొందుతున్నాయి.





ఫ్యాబ్రిక్ ఫ్లవర్స్

నైలాన్, పాలిస్టర్, కాటన్ ఫాబ్రిక్‌తో డిజైన్ చేసినవి లేదా ఫోమ్ ఫ్లవర్స్ ను స్కార్ఫ్ చివరల జతచేస్తారు. వీటి వల్ల స్కార్ఫ్ కు ఒక సాఫ్ట్, ఎలిగెంట్ లుక్ వస్తుంది. ఇవి ప్రత్యేకించి పార్టీల్లో లేదా పండగల రోజులకు సూపర్‌గా సూటవుతాయి.

పూసలు .. ముత్యాలు

చిన్న చిన్న ముత్యాలు, పూసలు స్కార్ఫ్ ఎడ్జెస్ లేదా మూలల్లో జతచేస్తారు. ఇవి స్కార్ఫ్‌కు రిచ్ లుక్‌ని ఇస్తాయి. హ్యాండ్ మేడ్ స్కార్ఫ్‌లకు డిజైనింగ్ బీడ్స్ వల్ల ప్రత్యేకత వస్తుంది.



కలర్‌ఫుల్ థ్రెడ్స్‌తో కస్టమ్ డిజైనింగ్

పింక్, బ్లాక్, గోల్డ్ .. వంటి రంగుల్లోని థ్రెడ్స్‌ను వీటి తయారీలో ఉపయోగించవచ్చు. వేడుకలు, క్యాజువల్ అవుటింగ్స్‌కు వీటిని వాడచ్చు. లైట్ వెయిట్, స్టైలిష్ లుక్, కస్టమైజ్ చేయడంలో సౌలభ్యం.. వీటి ప్రత్యేకత.

స్కార్ఫ్‌లపై ఈ డెకొరేటివ్ టచ్ అందానికి మాత్రమే కాదు, తమని తాము కొత్తగా రూపొందించుకోవడం కూడా.



యువర్స్

యూత్ ఏఐకాన్

యూత్, టెక్నాలజీ అనేవి వేరు వేరు పదాలు కాదు. టెక్నాలజీని 'జీ హుజూర్' అనేలా చేసి సమాజహితానికి ఉపకరించే డివైజ్‌లను ఆవిష్కరిస్తున్నారు యువ ఇన్వెంటర్‌లు.




వంద కోట్ల కంపెనీ వోనర్!

పదహారు ఏళ్ల వయసులోనే ఏఐ స్టార్టప్ మొదలు పెట్టి 'వావ్' అనిపించింది ప్రాంజలి అవస్థీ. మూడు కోట్లతో ప్రారంభమైన ఈ కంపెనీ వంద కోట్ల టర్నోవర్‌కు చేరడం విశేషం. ఏడేళ్ల వయసులోనే కోడింగ్ రాసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రాంజలి పదకొండు సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు వారి కుటుంబం ఫ్లోరిడాలో స్థిరపడింది. ఫ్లోరిడా యూనివర్శిటీలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న సమయంలో ప్రాంజలికి ఏఐ గురించి వివరంగా తెలుసుకునే అవకాశం వచ్చింది. మొదట్లో ఒక ఏఐ కంపెనీలో పనిచేసిన ప్రాంజలి ఆ తరువాత 'డెల్వ్.ఏఐ' పేరుతో సొంత స్టార్టప్ మొదలు పెట్టి విజయం సాధించింది. అత్యాధునిక మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్‌లను ఉపయోగించడం ద్వారా 'డెల్వ్.ఏఐ' సంక్లిష్ట డేటా ప్రక్రియను సులభతరం చేస్తుంది. వినియోగదారుల వనరులు, ఆదాయన్ని ఆదా చేస్తుంది.



అథ్లెట్ టు టెక్నో ఎక్స్‌పర్ట్

పదకొండు సంవత్సరాల వయసులో కరాటే, కిక్ బాక్సింగ్‌లో శిక్షణ మొదలుపెట్టింది పుహబి చక్రవర్తి. కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించింది. ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో రెండు బంగారు పతకాలు గెలుచుకుంది. ఆటలో విజయం సాధించడానికి ప్రతిభ ఒక్కటే సరిపోదు. మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. పోటీల సమయంలో మానసిక, శారీరక సమస్యలు ఎదుర్కొన్న పుహబి 'అథ్లెటిక్స్ ఎక్స్' అనే ఏఐ మోడల్‌కు రూపకల్పన చేసింది. చిన్నప్పటి నుంచే పుహబికి కోడింగ్ అంటే ఇష్టం. తమ స్కూల్‌లో నిర్వహించిన 'రెస్పాన్సిబుల్ ఏఐ ఫర్ యూత్' కార్యక్రమంలో పాల్గొన్న పుహబికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై మంచి అవగాహన ఏర్పడింది. 'రెస్పాన్సిబుల్ ఏఐ' కార్యక్రమంలో ఎఎస్ఎన్, సీఎస్ఎన్, పైథాన్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ నేర్చుకుంది. 'అథ్లెటిక్స్ ఎక్స్' అప్లికేషన్‌లో మెంటల్ హెల్త్, ఫిజికల్ హెల్త్, డైట్ అనే మూడు భాగాలు ఉంటాయి. ఫిజికల్ హెల్త్‌కు సీఎస్ఎన్, మెంటల్ హెల్త్‌కు ఏఎస్ఎన్, డైట్‌కు జనరల్ లూపింగ్‌ను వాడింది. ఆరోగ్యకరమైన శారీరక, మానసిక జీవనశైలి విషయంలో అథ్లెట్స్‌కు 'అథ్లెటిక్స్ ఎక్స్' బాగా ఉపయోగపడుతుంది.



గర్ల్స్ కంప్యూటింగ్ లీగ్

పద్దెనిమిది సంవత్సరాల కావ్య కొప్పారపు 'గ్లియోవిజన్' అనే ఏఐ టూల్‌ను డెవలప్ చేసింది. బ్రెయిన్ ట్యూమర్ ఇమేజ్‌లను త్వరగా విశ్లేషించడానికి ఉపకరించే టూల్ ఇది. డయాబెటిక్ రెటినోపతిని డిటెక్ట్ చేసే స్మార్ట్‌ఫోన్ సిస్టమ్‌ను కూడా డెవలప్ చేసింది. టెక్నాలజీకి సంబంధించి అమ్మాయిలను ప్రోత్సహించడానికి 'గర్ల్స్ కంప్యూటింగ్ లీగ్' అనే సంస్థను ప్రారంభించింది. హెల్త్‌కేర్‌కు ఉపకరించే ఏఐ సాధనాలపై దృష్టి పెట్టిన కావ్య టైమ్స్ '25 మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్సల్ టీన్స్' జాబితాలో చోటు సాధించింది.



యువ ఏఐ ఉద్యమం

'ఎన్‌కోడ్' అనే సంస్థకు స్నేహ రెవనర్ ఫౌండర్, ప్రెసిడెంట్. రెగ్యులేషన్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఉపకరించే యూత్ ఆర్గనైజేషన్ ఇది. అమెరికాలోని ఈ ఆర్గనైజేషన్‌లో వెయ్యి మంది యువతీ,యువకులు ఉన్నారు. ఏఐ పాలసీ ఇనిషియేటివ్స్‌కు సంబంధించి 'ఎన్‌కోడ్' క్రియాశీల పాత్ర పోషిస్తోంది. వర్క్‌షాప్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తోంది. టైమ్స్ 'మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' జాబితాలో స్నేహ చోటు సాధించింది.

ఆ నలుగురు... వందలాది వన్యప్రాణులను రక్షిస్తున్నారు

రోడ్లపై జంతువులు ప్రమాదానికి గురికాకుండా ఉండడానికి కొలరాడో (యూఎస్)లోని 'స్టెమ్ స్కూల్ హైల్యాండ్స్'కు చెందిన నలుగురు టీనేజ్ అమ్మాయిలు 'ప్రాజెక్ట్ డీర్' అనే ఏఐ-పవర్డ్ వైల్డ్‌లైఫ్ డిటెక్షన్ డివైజ్‌ను డెవలప్ చేశారు. థర్మల్ ఇమేజింగ్, ఏఐ సాంకేతికతను ఉపయోగించి పనిచేసే డివైజ్ ఇది. చీకట్లో, దట్టమైన పొగమంచు ఆవరించినప్పుడు కూడా రోడ్డుపై జంతువులను డిటెక్ట్ చేస్తుంది. 'రోడ్డుపై జంతువుల ఉనికిని కనిపెట్టిన వెంటనే ప్రాజెక్ట్ డీర్ డ్రైవర్‌లను అప్రమత్తం చేస్తుంది' అంటుంది నలుగురు ఇన్వెంటర్‌లలో ఒకరైన బ్రి స్కోవిల్లీ. 'ప్రాజెక్ట్ డీర్ డివైజ్‌లాంటి ఆవిష్కరణ గతంలో ఎప్పుడూ జరగలేదు. ఇది పూర్తిగా కొత్త' అంటుంది మరో స్టూడెంట్ సిద్ధీ సింగ్.



● యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్

దివ్యమైన మార్గం

ఐఐటీ-మద్రాస్‌లో చేసిన కాలేజీ ప్రాజెక్ట్ దివ్యాన్షు కుమార్‌ను ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది. మాన్యువల్ స్కావెంజర్స్‌కు ప్రత్యామ్నాయంగా సెప్టిక్ ట్యాంక్స్, మ్యాన్‌హోల్స్‌ను శుభ్రపరిచే రోబోట్స్‌ను రూపొందించాడు. ప్రభుత్వం మాన్యువల్లీ క్లీనింగ్‌ను నిషేధించినప్పటికీ దేశంలో ఎక్కడో ఒక చోట ఇది కొనసాగుతూనే ఉంది. 1993 నుంచి 2020 వరకు దాదాపు 928 మంది వర్కర్‌లు మరణించారు. తమిళనాడు, గుజరాత్‌లలో అత్యధిక మరణాలు సంభవించాయి.



బిహార్‌లోని గయకు చెందిన దివ్యాన్షు కుమార్ 'సోలినస్ ఇంటెగ్రిటీ' అనే స్టార్టప్‌ను మొదలుపెట్టాడు. మాన్యువల్లీ క్లీనింగ్‌కు ఈ స్టార్టప్ తయారుచేసే రోబోలు ప్రత్యామ్నాయంగా మారాయి.

ఐఐటీ-మద్రాస్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ చేసిన దివ్యాన్షు ప్రాడక్ట్ డిజైన్‌లో మాస్టర్స్ చేశాడు.

'మాన్యువల్లీ క్లీనింగ్‌కు ప్రత్యామ్నాయంగా రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో మన దేశంలో వచ్చిన తొలి స్టార్టప్ మాది. తొలి దశలో సీడ్ ఫండింగ్ మా ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది. ఇక మేము వెనక్కి తిరిగి చూసుకోలేదు' అంటున్నాడు దివ్యాన్షు.

సెప్టిక్ ట్యాంక్‌లు, డ్రైనేజీ క్లీనింగ్, వాటర్ పైప్‌లైన్‌ల క్లీనింగ్...మొదలైన వాటిపై ఈ స్టార్టప్ పనిచేస్తోంది. క్లౌడ్-బేస్డ్ స్టోరేజీ, డాటా మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్‌కు సంబంధించి 'స్వస్థ్ ఏఐ' అనే సర్వీస్‌ను కూడా 'సోలినస్' నిర్వహిస్తోంది.

● మ్యూజిక్ వరల్డ్

నీ నవ్వు వెన్నెల పండగ



అమెరికన్ సింగర్, సాంగ్ రైటర్ అలెక్స్ వారెన్ 'ఆర్డినరీ' పాట బిల్‌బోర్డ్ జాబితాలో టాప్‌లో నిలిచింది. ఇరవైకి పైగా దేశాల్లో ఈ పాట నంబర్ వన్‌గా నిలిచింది. అలెక్స్ తన ప్రొడ్యూసర్ ఆడమ్‌తో కలిసి రాసిన ఈ పాట కమర్షియల్‌గా సక్సెస్ అయింది. ప్రేమికుల ఫీలింగ్స్‌కు అద్దం పట్టే పాట ఇది.

గత సంవత్సరం 'యూ విల్ బి ఆల్‌రైట్' పాటతో బిల్‌బోర్డ్ హాట్ 100 జాబితాలో తొలిసారిగా మెరిశాడు అలెక్స్. 'ఆర్డినరీ' పాటలోని ప్రేమికుడు ఎక్స్‌ట్రార్డినరీ భావాలతో పొంగిపోతున్నాడు.

'నేను మట్టిని అయితే
నన్ను అందమైన శిల్పంగా మలిచే శిల్పి నువ్వు' అంటున్నాడు.
'నేను చీకటి ఆకాశాన్ని అయితే
నాలో వెన్నెల నింపిన కొత్త వెలుగు నీవు' అంటున్నాడు.

● టెక్ టాక్

జెమిని ఇమేజ్-టు-వీడియో ఫీచర్



'వియో.3'(జెమిని ఏఐ)కి కొత్త ఫీచర్‌ని తీసుకువచ్చింది గూగుల్. ఈ ఫీచర్‌తో యూజర్‌లు తమ ఫేవరెట్ ఇమేజ్‌లను ఎనిమిది సెకన్‌ల నిడివి ఉన్న డైనమిక్ వీడియోగా మార్చవచ్చు. డ్రాయింగ్స్, పెయింటింగ్స్‌ను కూడా వీడియో క్లిప్‌గా మార్చడానికి ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది.

ఇలా చేయాలి.... ● జెమిని ఓపెన్ చేసిన తరువాత, బాటమ్ బార్‌లోని 'వీడియో' బటన్ నొక్కాలి. ● వీడియోగా మార్చాలనుకునే ఇమేజ్‌ను అప్‌లోడ్ చేయాలి. ● బాటమ్ బార్‌లోని ప్లస్ బటన్ టాప్ చేయాలి. ● వీడియో ఎలా ఉండాలి అనేది టెక్ట్స్ బాక్స్‌లో వివరించాలి. ● సెండ్ బటన్ నొక్కాలి

ఇమేజ్ వీడియోగా మారిన వెంటనే ఆటోమెటిక్‌గా వాటర్‌మార్క్ కనిపిస్తుంది.

థమ్సప్ లేదా డౌన్ బటన్‌ను ఉపయోగించి వీయో-3 జనరేటెడ్ వీడియోపై యూజర్‌లు జెమినికీ తమ ఫీడ్ బ్యాక్‌ను ఇవ్వవచ్చు.



హువావే మేట్ ప్యాడ్ 11.5 (2025)

సైజ్: 11.5 అంగుళాలు
రిజల్యూషన్: 2,450×1,600 పిక్సెల్స్
బ్యాటరీ: 10,100 ఎంఏహెచ్
బరువు: 515 గ్రా.

సాక్షి సినిమా

రిలీజ్‌కు ఏడాదికి ముందే
బుకింగ్స్ ఓపెన్

● హాలీవుడ్ ఫిల్మ్‌మేకర్ క్రిస్టోఫర్ నోలన్ వినూత్న ప్రయోగం


● క్రిస్టోఫర్ నోలన్

'ఇన్‌సెప్షన్, ఇంటర్‌స్టెల్లర్, టెనెట్, ఓపెన్‌హైమర్' వంటి బ్లాక్ బస్టర్ సినిమాలు తీసిన అమెరికన్ ఫిల్మ్‌మేకర్ క్రిస్టోఫర్ నోలన్ తాజాగా చేస్తున్న చిత్రం 'ది ఒడిస్సీ'. మాట్ డామన్, టామ్ హాలండ్, అన్నే హతావే, జెండయా వంటి హాలీవుడ్ స్టార్స్ ఈ సినిమాలో నటిస్తున్నారు. గ్రీకు పురాతన ఇతిహాస సాహిత్యాల్లో ప్రముఖమైన వాటిల్లో ఒకటిగా చెప్పుకునే హోమర్ రాసిన 'ఒడిస్సీ' ఆధారంగా ఈ సినిమాను నోలన్ తెరకెక్కిస్తున్నారు. ట్రోజన్ యుద్ధం అనంతరం తన భార్య పెనెలోప్‌ను కలిసే క్రమంలో ఇథాకా గ్రీసు రాజు అధిగమించిన సమస్యలు, ఎదుర్కొన్న సవాళ్ల నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందట. ఎమ్మా థామస్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రానికి నోలన్ కూడా సహ-నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది జూలై 17న విడుదల కానుంది. అంటే... సరిగ్గా ఏడాదికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో సినిమా రిలీజ్‌కు సంబంధించి ఓ వినూత్నమైన విధానానికి నోలన్ నాంది పలికారు. అదేంటంటే... అమెరికాలోని కొన్ని ప్రముఖ థియేటర్స్‌లో ఇప్పుడే బుకింగ్స్ ప్రారంభించారు. అసలు... కరోనా తర్వాత ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులు థియేటర్స్‌కి రావడమే తగ్గిపోయిన ఈ రోజుల్లో నోలన్ ఈ తరహా విధానాన్ని ప్రవేశపెట్టడం, ఇందుకు ఆడియన్స్ నుంచి కూడా సానుకూల స్పందన రావడం చర్చనీయాంశమైంది. దాదాపు పాతిక థియేటర్లలో బుకింగ్ ఓపెనింగ్ అయిందని, టికెట్ల అమ్మకం జోరుగా జరిగిందని సమాచారం. మరో ఆసక్తికర విశేషం ఏంటంటే... 'ది ఒడిస్సీ'ని పూర్తి స్థాయిలో ఐమ్యాక్స్ కెమెరాతోనే చిత్రీకరిస్తున్నారు. పూర్తిగా ఐమ్యాక్స్ కెమెరాతో చిత్రీకరణ జరుపుకుంటున్న తొలి చిత్రంగా 'ది ఒడిస్సీ' నిలవనుంది. ఇలా రిలీజ్‌కు ముందే చర్చనీయాంశమైన ఈ చిత్రం థియేటర్స్‌లోకి వచ్చాక ఎన్ని సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

అందుకే మా వేవ్ లెంగ్త్ కుదిరింది


● ప్రభాస్

ఒకే బేనర్‌లో ఒక స్టార్ హీరో మూడు సినిమాలు చేయడానికి అంగీకరించడం అంటే అది పెద్ద విషయమే. ఆ బేనర్ అధినేతతో వేవ్ లెంగ్త్ కుదిరితేనే ఇలా 'త్రీ ఫిల్మ్ డీల్' ఓకే అవుతుంది. ప్రముఖ కన్నడ నిర్మాణ సంస్థ 'హోంబలే'లో ప్రభాస్ మూడు సినిమాలు చేయనున్న విషయం తెలిసిందే. ఈ హీరోతో 'సలార్: 1 సీజ్‌ఫైర్' చిత్రంతో ఈ సంస్థ అనుబంధం ఆరంభమైంది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'సలార్: 2 శౌర్యాంగపర్వం' రావాల్సి ఉంది. ఈ రెండో భాగంతో పాటు మరో రెండు చిత్రాలు ఈ సంస్థలో చేయనున్నారు ప్రభాస్. ఇలా ఒకే బేనర్‌లో మూడు చిత్రాలు చేయాలనుకున్న నిర్ణయం గురించి ప్రభాస్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ – ''హోంబలే సంస్థ అధినేత విజయ్ కిరగందూర్‌తో 'సలార్'తో నా జర్నీ మొదలైంది. సెట్స్‌లో ఆయన అందర్నీ బాగా చూసుకుంటారు. అందరి గురించి ఆయన తీసుకునే కేర్ చూసి, నేను విజయ్‌తో సినిమాలు చేయాలనుకున్నాను. మా మధ్య ఫ్యామిలీ మెంబర్స్‌కి ఉండేలాంటి అనుబంధం పెరిగింది. ఒక ఇంటి మనిషితో ఉన్నట్లే నాకనిపిస్తుంటుంది. అలాగే నేను, తను ఒక విషయంలో సేమ్. అదేంటంటే... నాలానే తను కూడా తన చైల్డ్‌హుడ్ ఫ్రెండ్స్‌కి ప్రాధాన్యం ఇస్తారు. నాలానే బయట ఎవర్నీ కలవడానికి పెద్దగా ఇష్టపడరు. ఇలాంటి కొన్ని లక్షణాల వల్ల మా వేవ్ లెంగ్త్ కుదిరింది. ఇక నిర్మాతగా క్వాలిటీ విషయంలో రాజీపడరు. ఒకసారి 'కేజీఎఫ్' సినిమా సెట్‌లో అగ్ని ప్రమాదం జరిగితే... అందరూ టెన్షన్ పడిపోయారట. కానీ విజయ్ కూల్ డౌన్ చేసి, 'బడ్జెట్ గురించి ఏం బాధపడొద్దు. రాజీపడకుండా సినిమా చేద్దాం' అన్నారని విన్నాను. అలాగే తను నిర్మించిన 'కాంతార', ఇతర సినిమా యూనిట్స్ నుంచి కూడా నేనిలాంటివి విన్నాను'' అని పేర్కొన్నారు. ఇక హోంబలేతో ప్రభాస్ చేయనున్న మూడు సినిమాల్లో 'సలార్ 2' ఒకటి కాగా మిగతా రెండు చిత్రాల వివరాలు తెలియాల్సి ఉంది.



పరదాతో రియాలిటీ అర్థమైంది

- అనుపమా పరమేశ్వరన్

''ఒక అమ్మాయి పోస్టర్‌తో ఓ సినిమా వచ్చిందంటే అది ప్రొడ్యూసర్స్ కావొచ్చు... డిస్ట్రిబ్యూటర్స్ కావొచ్చు... ఓటీటీ కావొచ్చు... ఆడియన్స్ కూడా అవ్వొచ్చు... అందరూ వెనక్కి వెళ్లిపోతారు. ఇది తప్పని నేను చెప్పడం లేదు కానీ... ఇది రియాలిటీ. 'పరదా' సినిమాతో ఈ రియాలిటీ నాకు అర్థమైంది. ఏడాదికి ముందే మా సినిమా సిద్ధమైంది. విజయ్, ప్రవీణ్ గార్లు ఈ సినిమా కోసం పడుతున్న కష్టాలను దగ్గర్నుంచి చూస్తున్నాను. 'పరదా' చిన్న సినిమా అని అందరూ చెబుతున్నారు. బడ్జెట్ పరంగా మాది పెద్ద చిత్రం కాకపోవచ్చు. కానీ ఈ చిత్రంతో మేం చెప్పాలనుకుంటున్న విషయం మాత్రం చాలా పెద్దది. ఫైట్స్, సాంగ్స్ ఉన్న సినిమా కాదు. కానీ కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్నాయి. ప్రేక్షకులను ఈ సినిమా నిరాశపరచదు'' అని అనుపమా పరమేశ్వరన్ అన్నారు. అనుపమా పరమేశ్వరన్ ప్రధాన పాత్రధారిగా, దర్శనా రాజేంద్రన్, సంగీత, రాగ్ మయూర్ ఇతర కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'పరదా'. ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకాడ ఈ చిత్రాన్ని నిర్మించారు. 'ది ఫ్యామిలీ మ్యాన్' సిరీస్ మేకర్స్ రాజ్, డీకే మద్దతు ఇస్తున్నారు. గురువారం 'పరదా' సినిమాను ఆగస్టు 22న రిలీజ్ చేస్తున్నట్లుగా వెల్లడించి, 'యత్ర నార్యస్తు..' పాట లిరికల్ వీడియోను కూడా విడుదల చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నిర్మాత డి. సురేష్‌బాబు మాట్లాడుతూ– ''పరదా' చూశాను. కొత్త రకమైన కథ చెప్పాలనే తపన కనిపించింది. ఈ సినిమాను మేం డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాం'' అన్నారు. మరో ముఖ్య అతిథి సత్యదేవ్ మాట్లాడుతూ– ''ఇలాంటి సినిమాలను ఆడియన్స్ సపోర్ట్ చేయాలి'' అని పేర్కొన్నారు. ''మాకు ఇది 'బాహుబలి'లాంటి సినిమా'' అని చెప్పారు ప్రవీణ్ కాండ్రేగుల. ''అనుపమ ఒప్పుకోకపోతే ఈ సినిమా ఉండేది కాదు'' అన్నారు విజయ్. ''మాకు మెమొరబుల్ సినిమా ఇది'' అని తెలిపారు శ్రీధర్.

మదర్ సెంటిమెంట్‌తో మై బేబీ



● సురేష్ కొండేటి, తమ్మారెడ్డి భరద్వాజ

అథర్వ, నిమిషా సజయన్ హీరో హీరోయిన్లుగా నెల్సన్ వెంకటేశన్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'డీఎన్ఏ'. ఈ సినిమాను యష్ ఫిలిం ఫ్యాక్టరీతో కలిసి తన ఎస్కే పిక్చర్స్ పతాకంపై 'మై బేబీ' పేరుతో నేడు (శుక్రవారం) తెలుగులో విడుదల చేస్తున్నారు నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ సురేష్ కొండేటి. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన సమావేశానికి తమ్మారెడ్డి భరద్వాజ ముఖ్య అతిథిగా హాజరై, 'మై బేబీ' సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. సురేష్ కొండేటి మాట్లాడుతూ– ''డీఎన్ఏ' చూసిన తర్వాత ఈ సినిమాను తెలుగులో తీసుకురావాలనిపించింది. మంచి మదర్ సెంటిమెంట్‌తో పాటు అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న చిత్రం ఇది. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 350 స్క్రీన్స్‌లో రిలీజ్ చేస్తున్నాం. మా సినిమాను థియేటర్స్‌లో చూసి, ఆదరించండి'' అన్నారు. ''మా సంస్థలో తొలి సినిమా 'మై బేబీ'' అని అన్నారు ఈ చిత్రం సహ-నిర్మాత సాయిచరణ్ తేజ. దుప్పాడిగట్టు సారికా రెడ్డి ఈ చిత్రానికి మరో సహ-నిర్మాత.

డిఫరెంట్ కాన్సెప్ట్‌తో...


● నరేస్ అన్నసాగరం, ప్రీతీ సుందర్

నరేస్ అన్నసాగరం, ప్రీతీ సుందర్ జంటగా నటించిన చిత్రం 'ఆ గ్యాంగ్ రేపు 3'. యోగి కుమార్ దర్శకత్వంలో నోక్షియస్ నాగ్స్ నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో యోగి మాట్లాడుతూ– ''2015లో మేం చేసిన 'ఆ గ్యాంగ్ రేపు షార్ట్ ఫిల్మ్', ఆ తర్వాత చేసిన 'ఆ గ్యాంగ్ రేపు 2' కూడా హిట్టయ్యాయి. ఇప్పుడు ఓ డిఫరెంట్ కాన్సెప్ట్‌తో చేసిన 'ఆ గ్యాంగ్ రేపు 3' సినిమా కూడా సక్సెస్ అవుతుందనుకుంటున్నాం'' అన్నారు. '' నేటి సమాజంలో జరుగుతున్న పరిణామాలను ఈ సినిమాలో చర్చించారు'' అని తెలిపారు ఆటా సందీప్. ''ఈ సినిమా సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు నోక్షియస్ నాగ్స్.

ఇకపై ఏ సినిమాకీ ఇలాంటి అగ్రిమెంట్ చేయను

- నిధీ అగర్వాల్



''హరి హర వీరమల్లు'లో పంచమి పాత్ర చేశాను. ఈ పాత్రలో ఎన్నో కోణాలున్నాయి. ఈ పాత్రకు తగ్గట్టుగా స్టైలిస్ట్ ఐశ్వర్య నా దుస్తులను, ఆభరణాలను అద్భుతంగా రూపొందించారు'' అని నిధీ అగర్వాల్ తెలిపారు. పవన్ కల్యాణ్ హీరోగా నటించిన చిత్రం 'హరిహర వీరమల్లు'. జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్ల మూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నిధీ అగర్వాల్ కథానాయికగా నటించారు. ఏఎం రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మించారు. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం విలేకరులతో నిధీ అగర్వాల్ పంచుకున్న విశేషాలు.

● మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో ఓ కల్పిత పాత్రను తీసుకొని 'హరిహర వీరమల్లు' కథ రాశారు. పవన్ కల్యాణ్ గారు రాబిన్ హుడ్ తరహా పాత్రలో కనిపిస్తారు. 'ఇండియానా జోన్స్' సినిమాకి ఇండియన్ వెర్షన్‌లా మా చిత్రం ఉంటుంది. ఈ చిత్రంలో భరతనాట్యం నేపథ్యంలో ఒక సీన్ ఉంటుంది. ఆ సన్నివేశం చిత్రీకరణ నాకు సవాల్‌గా అనిపించింది. భారీ సినిమా, పవన్ కల్యాణ్‌గారితో నటించే చాన్స్... పైగా ఏఎం రత్నం గారిలాంటి లెజెండరీ ప్రొడ్యూసర్. అందుకే ఆలోచించకుండా ఈ సినిమాకి ఓకే చెప్పాను. ఇంత గొప్ప సినిమాలో పంచమి వంటి శక్తివంతమైన పాత్రలో నటించే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ● క్రిష్‌గారు పంచమి పాత్రకు నన్ను ఎంపిక చేశారు. అలాగే జ్యోతికృష్ణగారు సరైన సమయానికి ఈ సినిమా దర్శకత్వ బాధ్యతలు తీసుకొని సినిమాని పూర్తి చేశారు. ఇద్దరూ నాకు ప్రత్యేకమే. ఈ సినిమా షూటింగ్ పూర్తయ్యే వరకు మరో సినిమా ఏదీ చేయకూడదన్నది అగ్రిమెంట్. అందుకే ఈ చిత్రం కోసం ఐదేళ్లు కేటాయించాను. అయితే ఈ సమయంలో ఆర్థికంగా ఇబ్బందులు రాలేదు. ఎందుకంటే నెలకు కనీసం ఒక షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికైనా వెళ్లేదాన్ని. ఐదేళ్లు ఆగినప్పటికీ ఓ మంచి చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను. నా కష్టానికి తగిన గుర్తింపు వస్తుందని ఆశిస్తున్నాను. ఇకపై 'హరిహర వీరమల్లు' సినిమాలా ఏ చిత్రానికీ అగ్రిమెంట్ చేసుకోను. అదే విధంగా ఎక్కువ సీజీ వర్క్స్ ఉన్న సినిమాలు చేయను. రెండు మూడు నెలల్లో షూటింగ్ అయిపోయి, ఆ తర్వాత వెంటనే రిలీజ్ అయ్యే సినిమాలే చేస్తాను. ● 'హరిహర వీరమల్లు' చిత్రంలో పవన్ కల్యాణ్‌గారితో, 'ది రాజా సాబ్' సినిమాలో ప్రభాస్‌గారితో కలిసి నటించడం మరచిపోలేని అనుభూతి. ఎంత పెద్ద స్టార్స్ అయినా ఎంతో వినయంగా ఉన్నారు. పవన్‌గారు పాత్రలో సులభంగా ఒదిగిపోతారు. అలాగే ప్రభాస్‌గారు మనసున్న మంచి మనిషి. అందరూ అంటున్నట్లు ఆయన నిజంగానే డార్లింగ్.

రెస్టారెంట్లో భావోద్వేగం


● 'బకాసుర రెస్టారెంట్' పోస్టర్

'వైవా' హర్ష టైటిల్ రోల్‌లో, ప్రవీణ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. కృష్ణ భగవాన్ ,షైనింగ్ ఫణి, 'కేజీఎఫ్' గరుడరామ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంతో ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. లక్ష్మయ్య ఆచారి, జనార్దన్ ఆచారి నిర్మించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 8న విడుదల కానుంది. ''వినూత్న కాన్సెప్ట్‌తో రూపొందిన హంగర్ ఎంటర్‌టైనర్ సినిమా ఇది. వినోదం, థ్రిల్ అంశాలతో పాటు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునే భావోద్వేగాలు ఈ సినిమాలో ఉన్నాయి. ప్రేక్షకులకు ఓ మంచి విందు భోజనంలాంటి సినిమా'' అని దర్శకుడు శివ పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
375	101
82,259	25,111

విదేశీ సూచీలు


సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	20,890	▲	160
డోజోన్స్	44,421	▲	166
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,973	▲	46
డాక్స్	24,371	▲	362
షాంఘై	3,516	▲	13
నికాయ్	39,901	▲	238

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.50	86.52
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	113.70	116.64
€	యూరో	ఎస్‌బీఐ	98.55	101.29
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.15	58.61
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.67	56.89
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.61	68.25
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.08	23.56
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.55	23.79
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.11	12.93

మెప్పించిన విప్రో



క్యూ1 లాభం
రూ. 3,337 కోట్లు; 10% అప్

- ఉద్యోగుల సంఖ్య @ 2,33,232
- కొత్తగా 497.1 కోట్ల డాలర్ల ఆర్డర్లు
- షేరుకి రూ. 5 మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం విప్రో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్ (క్యూ1)లో నికర లాభం 10 శాతం ఎగసి రూ. 3,337 కోట్లకు చేరింది. డీల్స్‌లో వృద్ధి ఇందుకు దోహదపడింది. గతేడాది (2024-25) ఇదే కాలంలో రూ. 3,037 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 5 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఆగస్ట్ 15కల్లా చెల్లించనుంది. మొత్తం ఆదాయం సైతం రూ. 21,964 కోట్ల నుంచి రూ. 22,135 కోట్లకు బలపడింది. ఈ కాలంలో కొత్తగా 497.1 కోట్ల డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకుంది. ఇవి 51 శాతం అధికంకాగా.. వీటిలో 131 శాతం వృద్ధితో 266.6 కోట్ల విలువైన భారీ డీల్స్ సాధించింది. క్యూ1లో 114 మంది ఉద్యోగులు తగ్గడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2,33,2325 మందికి పరిమితమైంది. ఉద్యోగ వ్యయాలు రూ. 13,428 కోట్లకు చేరాయి.

అనిశ్చితిలో..



అనిశ్చిత ఆర్థిక వాతావరణంలో కొత్త ఏడాదిని ప్రారంభించాం. దీంతో డిమాండ్ మందగించింది. మా క్లయింట్లు వ్యయ నియంత్రణ, వెండార్ కన్సాలిడేషన్‌పై దృష్టి పెట్టాం. అయితే ఇదేసమయంలో ఏఐ, డేటా, ఆధునీకరణ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. భారీ డీల్స్ నేపథ్యంలో ఈ ఏడాది ద్వితీయార్ధం నుంచి మరింత పురోగతి సాధిస్తాం.

– శ్రీని పాలియా, విప్రో సీఈవో-ఎండీ

-1 నుంచి +1 మధ్య..:

ఈ ఏడాది రెండో త్రైమాసికం(జూలై-సెప్టెంబర్)లో ఆదాయంలో -1 నుంచి +1 మధ్య వృద్ధి నమోదుకావచ్చని తాజాగా అంచనా (గైడెన్స్) ప్రకటించింది. ఇది త్రైమాసికవారీ అంచనా కాగా.. 256-261.2 కోట్ల డాలర్ల మధ్య ఐటీ సర్వీసుల ఆదాయం సాధించవచ్చని భావిస్తోంది. ఆదాయంలో బీఎఫ్ఎస్ఐ విభాగం వాటా 34 శాతంకాగా.. కన్జూమర్ 19 శాతం, కన్జూమర్ 19 శాతం, ఎనర్జీ 18 శాతంగా ఉంది. ఏడాది కాలంలో రెండుసార్లు డివిడెండ్ చెల్లించనున్నట్లు కంపెనీ సీఎఫ్‌వో అపర్ణ అయ్యర్ పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు 1% తగ్గి రూ. 260 వద్ద ముగిసింది.

యాక్సిస్ బ్యాంక్ లాభం డౌన్

క్యూ1లో రూ. 5,806 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు సాధించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 3 శాతం నీరసించి రూ. 6,244 కోట్లకు పరిమితమైంది. స్టాండెలోన్ నికర లాభం సైతం 4 శాతం క్షీణించి రూ. 5,806 కోట్లకు పరిమితమైంది. మొండి బకాయిలు, లోన్ అప్‌గ్రేడ్ విధానాలలో మార్పులు మొత్తం ఫలితాలపై ప్రభావం చూపినట్లు బ్యాంక్ పేర్కొంది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 6,034 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 35,844 కోట్ల నుంచి రూ. 38,322 కోట్లకు బలపడింది. వడ్డీ ఆదాయం రూ. 30,061 కోట్ల నుంచి రూ. 31,064 కోట్లకు పుంజుకుంది. నికర వడ్డీ ఆదాయం 1 శాతం నామమాత్ర వృద్ధితో రూ. 13,560 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 4.05 శాతం నుంచి 3.8 శాతానికి నీరసించాయి.

ఎన్‌పీఏలు పెరిగాయ్..

క్యూ1లో యాక్సిస్ బ్యాంక్ నిర్వహణ లాభం రూ. 10,106 కోట్ల నుంచి రూ. 11,515 కోట్లకు ఎగసింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.28 శాతం నుంచి 1.57 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.34 శాతం నుంచి 0.45 శాతానికి పెరిగాయి. ప్రొవిజన్లు, కంటింజెన్సీలు రూ. 2,039 కోట్ల నుంచి రూ. 3,948 కోట్లకు భారీగా ఎగశాయి. స్థూల స్లిప్పేజీలు రూ. 4,805 కోట్ల నుంచి రూ. 8,200 కోట్లకు భారీగా పెరిగాయి. అయితే టెక్నికల్ ప్రభావాన్ని సర్దుబాటు చేస్తే రూ. 5,491 కోట్లుగా నమోదైనట్లు బ్యాంక్ ఎండీ, సీఈవో అమితాబ్ చౌదరీ పేర్కొన్నారు. కనీస మూలధన నిష్పత్తి 17.07 శాతం నుంచి 16.85 శాతానికి నీరసించింది.

ఫలితాల నేపథ్యంలో యాక్సిస్ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 0.7 శాతం క్షీణించి రూ. 1,160 వద్ద ముగిసింది.

అదానీ విల్మర్‌లో వాటా విక్రయం



- 20 శాతం అమ్మివేసిన అదానీ గ్రూప్
- డీల్ విలువ రూ. 7,150 కోట్లు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ తాజాగా ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్(గతంలో అదానీ విల్మర్)లో మరో 20 శాతం వాటా విక్రయించింది. భాగస్వామ్య కంపెనీ సింగపూర్ సంస్థ విల్మర్ ఇంటర్నేషనల్‌కు రూ. 7,150 కోట్లకు విక్రయించినట్లు అదానీ గ్రూప్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. గ్రూప్‌నకు కీలక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బిజినెస్‌లపై మరింత దృష్టి పెట్టేందుకు వీలుగా అదానీ విల్మర్‌లో 44% వరకూ వాటాను విక్రయించనున్నట్లు గతేడాది డిసెంబర్‌లో ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పట్లో విల్మర్ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ లెన్స్ పీటీఈతో అనుబంధ సంస్థ అదానీ కమోడిటీస్ ఎల్ఎల్‌పీ ఇందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ వెల్లడించింది. ఒప్పందం ప్రకారం షేరుకి రూ. 305 మించకుండా తదుపరి దశలో నిర్ణయించుకునే ధరలో లావాదేవీకి తెరతీయనున్నట్లు వివరించింది. మరోవైపు 2025 జనవరిలో పబ్లిక్‌కు కనీస వాటా నిబంధన ప్రకారం షేరుకి రూ. 276.51 ధరలో అదానీ విల్మర్‌లో 13.51% వాటాను అదానీ ఎంటర్‌ప్రైజెస్ విక్రయించింది. తద్వారా రూ. 4,855 కోట్లు సమీకరించింది. దీంతో అదానీ విల్మర్‌లో వాటా 44% నుంచి 30.42%కి దిగివచ్చింది. ఈ బాటలో ప్రస్తుతం మరో 20% వాటాను షేరుకి రూ. 275 ధరలో విల్మర్ ఇంటర్నేషనల్‌కు విక్రయించింది. తద్వారా రూ. 7,150 కోట్లు అందుకోనుంది. తాజాగా ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్‌లో విల్మర్ ఇంటర్నేషనల్ వాటా 64%కి బలపడింది. మరోపక్క మిగిలిన 10.42 శాతం వాటాను సైతం త్వరలో విక్రయించనున్నట్లు అదానీ వెల్లడించింది.

బ్యాంకులు, ఐటీ షేర్లలో అమ్మకాలు

- సెన్సెక్స్ 375 పాయింట్ల పతనం
- నిఫ్టీ నష్టం 101 పాయింట్లు

ముంబై: బ్యాంకులు, ఐటీ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్ సూచీలు గురువారం అరశాతం మేర నష్టపోయాయి. సెన్సెక్స్ 375 పాయింట్లు నష్టపోయి 82,259 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 101 పాయింట్లు పతనమై 25,111 వద్ద నిలిచింది. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంపై ఇంకా స్పష్టత రాకపోవడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు, దేశీయ కార్పొరేట్ క్యూ1 ఆర్థిక ఫలితాలు నిరాశపరచడం సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఉదయం స్వల్ప లాభాల్లో మొదలైన సూచీలు.., ప్రారంభంలోనే నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ 415 పాయింట్లు క్షీణించి 82,219 వద్ద, నిఫ్టీ 111 పాయింట్లు కోల్పోయి 25,101 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. నష్టాల మార్కెట్లోనూ, రియల్టీ, మెటల్, కమోడిటీస్, ఫార్మా, కన్జూమర్ డిస్క్రెషనరీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ విక్రయాలు క్రూడాయిల్ ధరల్లో అనిశ్చితులతో డాలర్ మారకంలో రూపాయి విలువ 20 పైసలు బలహీనపడి 86.12 వద్ద స్థిరపడింది. ఆసియాలో హాంగ్‌కాంగ్ మినహా అన్ని దేశాల సూచీలు 1%కి పైగా రాణించాయి. యూరప్ మార్కెట్లు 1.5% పెరిగాయి. అమెరికా మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.



- రంగాల వారీగా బీఎస్ఈ ఇండెక్సుల్లో ఐటీ 1.50%, టెక్ 1.06%, బ్యాంకెక్స్ 0.51%, యుటిలిటీ 0.25% నష్టపోయాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.30%, 0.07 శాతం చొప్పున రాణించాయి.
- జూన్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు ఇన్వెస్టర్ల అంచనాలను అందుకోలేకపోవడంతో టెక్ మహీంద్రా షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. బీఎస్ఈలో 2.75% నష్టపోయి రూ.1,563 వద్ద స్థిరపడింది.

స్మార్ట్‌వర్క్స్ కోవర్కింగ్ స్పేస్ లిస్టింగ్ ఓకే

స్మార్ట్‌వర్క్స్ కోవర్కింగ్ స్పేస్ షేరు లిస్టింగ్ రోజే లాభాలు పంచింది. ఇష్యూ ధర(రూ.407)తో పోలిస్తే బీఎస్ఈలో 7% ప్రీమియంతో రూ.436 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 15% ఎగసి రూ.469 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 9% లాభంతో రూ.445 వద్ద ముగిసింది.

ఆర్.ఎస్.బ్రదర్స్ 'సూపర్ ఆషాఢం కేజీ సేల్' ఆఫర్లు

హైదరాబాద్: ప్రముఖ వ్యాపార సంస్థ ఆర్.ఎస్.బ్రదర్స్ ఆషాఢమాసం సందర్భంగా 'సూపర్ ఆషాఢం కేజీ సేల్' ఆఫర్ ప్రకటించింది. మహిళలు, పురుషులు, పిల్లలకు సంబంధించిన లక్షల వెరైటీ వస్త్రాలపై 70% వరకు డిస్కౌంట్ ఇస్తుంది. అలాగే అలంకారీ ప్రింట్ శారీ కొనుగోలుపై 2వ చీర కేవలం రూ.39 కే పొందవచ్చు. అలాగే ప్రతి 22 క్యారెట్ బంగారు ఆభరణాల కొనుగోలుపై గ్రాముకి ఫ్లాటు రూ.200 తగ్గింపు, కేజీ వెండి కొనుగోలుపై ఫ్లాటు రూ.5,000 తగ్గింపు పొందవచ్చు. పాత బంగారు మార్పిడి(ఎక్స్ఛేంజీ)పై గ్రాముకి రూ.100 అదనంగా పొందవచ్చు. ఆషాఢం ఆఫర్లను కస్టమర్లంతా వినియోగించుకోవాలని సంస్థ అధినేతలు కోరారు.



సాక్షి స్పోర్ట్స్



ఇక 'టైబ్రేక్'లోనే ఫలితం

బతూమి (జార్జియా): మహిళల ప్రపంచకప్ నాకౌట్ చెస్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారిణుల భవితవ్యం టైబ్రేక్‌లలో తేలనుంది. ప్రిక్వార్టర్ ఫైనల్ దశకు భారత్ నుంచి నలుగురు క్రీడాకారిణులు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలి, దివ్య దేశ్‌ముఖ్ చేరుకున్నారు. ప్రిక్వార్టర్ ఫైనల్లో నిర్ణీత రెండు గేమ్‌ల తర్వాత... హంపి-అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్): హారిక-కాటరీనా లాగ్నో (రష్యా): దివ్య-జు జినెర్ (చైనా): వైశాలి-మెరూర్ట్ కమలిదెనోవా (కజకిస్తాన్) 1-1తో సమంగా నిలిచారు. దాంతో విజేతలను నిర్ణయించేందుకు నేడు టైబ్రేక్ గేమ్‌లు నిర్వహిస్తారు. గెలిచిన ప్లేయర్లు క్వార్టర్ ఫైనల్ చేరుకుంటారు. గురువారం కొస్టెనిక్‌తో జరిగిన గేమ్‌ను హంపి 73 ఎత్తుల్లో; లాగ్నోతో గేమ్‌ను హారిక 31 ఎత్తుల్లో; మెరూర్ట్‌తో గేమ్‌ను వైశాలి 70 ఎత్తుల్లో 'డ్రా' చేసుకోగా... జు జినెర్ చేతిలో దివ్య 57 ఎత్తుల్లో ఓడిపోయింది.



కార్ల్‌సన్‌కు ప్రజ్ఞానంద షాక్

- వరల్డ్ నంబర్‌వన్‌పై గెలిచిన భారత గ్రాండ్‌మాస్టర్
- ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి



ప్రజ్ఞానంద — కార్ల్‌సన్

లాస్ వేగస్: మరోసారి భారత చెస్ ప్లేయర్ చేతిలో నార్వే దిగ్గజం, ప్రపంచ మాజీ చాంపియన్, వరల్డ్ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌కు ఓటమి ఎదురైంది. ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ టూర్ చెస్ టోర్నీలో భాగంగా భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానందతో జరిగిన గేమ్‌లో కార్ల్‌సన్ ఓడిపోయాడు. 'వైట్ గ్రూప్'లో భాగంగా జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన ప్రజ్ఞానంద 39 ఎత్తుల్లో కార్ల్‌సన్‌ను ఓడించాడు. ఓవరాల్‌గా అన్ని ఫార్మాట్‌లలో (క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్, ఫ్రీస్టయిల్, ఆన్‌లైన్) కార్ల్‌సన్‌పై ప్రజ్ఞానందకిది ఎనిమిదో విజయం కావడం విశేషం. 2022లో ఎయిర్‌థింగ్స్ మాస్టర్స్, చెస్‌ఏబల్ మాస్టర్స్ టోర్నీలలో ఒక్కోసారి, క్రిప్టో కప్ (ఆన్‌లైన్) టోర్నీలో మూడుసార్లు కార్ల్‌సన్‌ను ఓడించిన ప్రజ్ఞానంద... 2024లో పోలాండ్‌లో జరిగిన సూపర్‌బెట్ టోర్నీలో, నార్వే ఓపెన్ టోర్నీలో ఒక్కోసారి విజయం సాధించాడు. ఇటీవల క్రొయేషియాలో జరిగిన సూపర్ యునైటెడ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీలో క్లాసికల్ వరల్డ్ చాంపియన్, భారత స్టార్ దొమ్మరాజు గుకేశ్ చేతిలోనూ కార్ల్‌సన్ ఓడిపోయాడు. ఫ్రీస్టయిల్ చెస్ టోర్నీలో ఎనిమిది మంది మేటి ప్లేయర్లు ఉన్న 'వైట్ గ్రూప్'లో ప్రజ్ఞానంద 4.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి క్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధించాడు. 'వైట్ గ్రూప్' నుంచి నొదిర్‌బెక్ అబ్దుసత్తారోవ్ (ఉజ్బెకిస్తాన్), సిందరోవ్ (ఉజ్బెకిస్తాన్), అరోనియన్ (అమెరికా) కూడా క్వార్టర్ ఫైనల్ చేరుకున్నారు. మరోవైపు ఇదే టోర్నీలో ఆడుతున్న తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ కూడా క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. 'బ్లాక్ గ్రూప్'లో పోటీపడ్డ అర్జున్ 4 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. 'బ్లాక్ గ్రూప్' నుంచి నకమురు, హాన్స్ నీమన్, కరువానా (అమెరికా) కూడా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.



రెజ్లర్ సుజీత్‌కు స్వర్ణ పతకం

బుడాపెస్ట్ (హంగేరి): పొలియాక్ ఇమ్రె-వర్గా యానోస్ స్మారక అంతర్జాతీయ ర్యాంకింగ్ రెజ్లింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు తొలి రోజు రెండు పతకాలు లభించాయి. పురుషుల ఫ్రీస్టయిల్ విభాగంలో సుజీత్ (65 కేజీలు) స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకోగా... రాహుల్ (57 కేజీలు) కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. ఫైనల్లో సుజీత్ 5-1 పాయింట్ల తేడాతో అలీ రహీమ్‌జాదే (అజర్‌బైజాన్)పై గెలుపొందాడు. అంతకుముందు సెమీఫైనల్లో సుజీత్ 6-1తో వాజ్‌జెన్ తెవాన్‌యాన్ (అర్మేనియా)పై, క్వార్టర్ ఫైనల్లో 11-0తో అర్సమెర్జుయెవ్ (ఫ్రాన్స్)పై, తొలి రౌండ్‌లో 11-0తో ఇస్లాం దుదయెవ్ (అల్బేనియా)పై విజయం సాధించాడు. కాంస్య పతక బౌట్‌లో రాహుల్ 4-0తో నిక్లాస్ స్టెచెలె (జర్మనీ)పై నెగ్గాడు. అంతకుముందు సెమీఫైనల్లో రాహుల్ 6-7 పాయింట్ల తేడాతో ల్యూక్ జోసెఫ్ (అమెరికా) చేతిలో ఓడిపోయాడు.

'గెలిపించగలనని నమ్మాను'

ఇలాంటి స్థితిలో గతంలోనూ ఆడాను

- భారత క్రికెటర్ దీప్తి శర్మ



దీప్తి శర్మ

సౌతాంప్టన్: ఇంగ్లండ్‌తో బుధవారం జరిగిన తొలి వన్డేను భారత మహిళల జట్టు గెలుచుకోవడంలో దీప్తి శర్మ ప్రధాన పాత్ర పోషించింది. ఆఫ్‌స్పిన్నర్‌గా జట్టు బౌలింగ్ బృందంలో రెగ్యులర్ సభ్యురాలైన దీప్తి... బ్యాటర్‌గా లోయర్ ఆర్డర్‌లో అనేక మార్లు కీలక ఇన్నింగ్స్‌లు ఆడింది. ఇప్పుడు ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన దీప్తి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ జట్టును విజయం వరకు తీసుకెళ్లింది. 28వ ఓవర్లో 127/4 వద్ద క్రీజ్‌లోకి వచ్చిన ఆమె 62 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 64 పరుగులు సాధించి చివరి వరకు అజేయంగా నిలిచింది. లారెన్ బెల్ బౌలింగ్‌లో దీప్తి ఒంటి చేత్తో కొట్టిన సిక్సర్ హైలైట్‌గా నిలిచింది. 'ఇన్నేళ్ల నా కెరీర్‌లో చాలా సందర్భాల్లో ఇలాంటి స్థితిలోనే బరిలోకి దిగాను. నేను ఎంత ప్రశాంతంగా ఉండగలనో నాకు బాగా తెలుసు. కాబట్టి ఏమాత్రం ఒత్తిడికి గురికాలేదు. ఈసారి కూడా అదే కీలకంగా మారింది. జెమీమాతో భాగస్వామ్యం నెలకొల్పడంపై ముందుగా దృష్టి పెట్టాను. మా పార్ట్‌నర్‌షిప్ జట్టు గెలుపు వరకు తీసుకెళుతుందని నేను నమ్మాను. నేను చివరి వరకు నిలిస్తే విజయం ఖాయమవుతుందని తెలుసు. జెమీమా తర్వాత రిచా, అమన్ కూడా బాగా సహకరించారు. ఒంటి చేత్తో సిక్సర్ కొట్టడం రిషభ్ పంత్‌ను చూసి నేర్చుకున్నాను' అని మ్యాచ్ అనంతరం దీప్తి శర్మ వ్యాఖ్యానించింది. ఇంగ్లండ్ పేసర్ ఫైలర్ షార్ట్ పిచ్ బంతులతో పన్నిన వ్యూహానికి తాము సిద్ధంగా ఉండటం వల్లే ఎలాంటి సమస్యా రాలేదని దీప్తి పేర్కొంది. ఆమె కెరీర్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలవడం 20వసారి కాగా... మొదటిసారి బౌలింగ్‌లో ఒక్క వికెట్ కూడా తీయకుండా కేవలం బ్యాటింగ్ ప్రదర్శనతోనే ఆమె ఈ అవార్డును గెలుచుకోవడం విశేషం. త్వరలో జరిగే వన్డే వరల్డ్ కప్‌లోనూ ఆల్‌రౌండర్‌గా ఆమె కీలకం కానుంది. 'మా జట్టు ఇటీవల వరుసగా చెప్పుకోదగ్గ విజయాలు సాధిస్తోంది. శ్రీలంకతో ముక్కోణపు టోర్నీ గెలిచాక ఇక్కడ కూడా బాగా రాణిస్తున్నాం. వరల్డ్ కప్‌కు ఇంకా చాలా సమయం ఉంది. దాని గురించి ఇప్పుడే ఆలోచించడం లేదు. ప్రస్తుతం ఒక్కో మ్యాచ్‌పైనే దృష్టి పెట్టాం' అని దీప్తి పేర్కొంది. తొలి వన్డేలో 4 వికెట్లతో ఇంగ్లండ్‌ను ఓడించిన భారత్ సిరీస్‌లో 1-0తో ముందంజ వేయగా... రేపు లార్డ్స్ మైదానంలో రెండో వన్డే జరుగుతుంది.

టాప్ సీడ్ జోడీపై అనిరుధ్ జంట గెలుపు



లాస్ కాబోస్ (మెక్సికో): మిఫెల్ టెన్నిస్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ (భారత్)-రీస్ స్టాల్డర్ (అమెరికా) జోడీ సంచలనంతో శుభారంభం చేసింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో అనిరుధ్-స్టాల్డర్ ద్వయం 6-4, 6-3తో టాప్ సీడ్ సాడియో డుంబియా-ఫాబియెన్ రిబూల్ (ఫ్రాన్స్) జోడీని బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. 81 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుధ్-స్టాల్డర్ రెండు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థుల సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశారు.

సాత్విక్-చిరాగ్ జోడీ పరాజయం

లక్ష్య సేన్, అనుపమ కూడా అవుట్

- జపాన్ ఓపెన్‌లో ముగిసిన భారత్ పోరు

టోక్యో: అందివచ్చిన అవకాశాలను వృథా చేసుకున్న భారత బ్యాడ్మింటన్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ నుంచి నిష్క్రమించింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 15వ ర్యాంక్ ద్వయం సాత్విక్-చిరాగ్ 22-24, 14-21తో ప్రపంచ ఆరో ర్యాంక్ జోడీ లియాంగ్ కె వెంగ్-వాంగ్ చాంగ్ (చైనా) చేతిలో ఓడిపోయింది. ఓవరాల్‌గా లియాంగ్-వాంగ్ జంట చేతిలో సాత్విక్-చిరాగ్ జోడీకిది ఆరో పరాజయం కావడం గమనార్హం. 44 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ రెండు గేముల్లోనూ ఆధిక్యంలో నిలిచి ఆ తర్వాత దానిని చేజార్చుకుంది. తొలి గేమ్‌లో 9-6తో, రెండో గేమ్‌లో 10-6తో ఆధిక్యంలోకి వెళ్లిన సాత్విక్-చిరాగ్ ఈ ఆధిక్యాన్ని కాపాడుకోలేకపోయారు. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్... మహిళల సింగిల్స్‌లో అనుపమ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు. దాంతో ఈ టోర్నీలో భారత క్రీడాకారుల కథ ముగిసింది. ప్రపంచ ఏడో ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 18వ ర్యాంకర్ లక్ష్య సేన్ 19-21, 11-21తో ఓటమి పాలయ్యాడు. నరోకా చేతిలో లక్ష్య సేన్‌కిది ఐదో పరాజయం. ప్రపంచ రెండో ర్యాంకర్ వాంగ్ జి యి (చైనా)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 42వ ర్యాంకర్ అనుపమ 21-13, 11-21, 12-21తో పోరాడి ఓడిపోయింది. 55 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనుపమ తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నా... అదే జోరును కొనసాగించలేకపోయింది.



మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

పాన్.. పాన్.. పాన్..

ఢిల్లీ నుంచి గోవా వెళ్తున్న ఇండిగో విమానంలోని పైలట్ చాలా టెన్షన్‌తో అన్న మాట ఇది..

వెంటనే ముంబై ఎయిర్‌పోర్టులో స్టాండర్డ్ ఎమర్జెన్సీ చర్యలను చేపట్టారు. అంబులెన్స్‌లు, అగ్నిమాపక దళం రన్‌వే వద్దకు చేరుకున్నాయి. బుధవారం రాత్రి 9.53 గంటలకు విమానాన్ని ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ఆ సమయంలో విమానంలో 191 మంది ప్రయాణికులు ఉన్నారు. రాత్రి 9.27 గంటల సమయంలో విమానం ఇంజన్-1లో సమస్య తలెత్తడంతో దాన్ని గుర్తించిన పైలట్.. 'పాన్.. పాన్.. పాన్' అంటూ ఎమర్జెన్సీ కాల్ చేసినట్లు అధికారులు తెలిపారు.

పాన్.. పాన్.. పాన్..

కిళ్లీ కాదు.. కలవరం..



పాన్ అంటే..?

పాన్.. పాన్.. పాన్ అన్నది ప్రపంచవ్యాప్తంగా అందరూ ప్రామాణికంగా అనుసరించే రేడియో కాల్. తక్షణ ప్రాణాపాయం లేని పరిస్థితుల్లో వాడే ఎమర్జెన్సీ కాల్ ఇది. ప్రాణాపాయం లేనప్పటికీ.. ఇది అర్జంట్.. దీనిపై వెంటనే దృష్టి సారించాలి అన్నది ఆ కాల్ అర్థం. విమానంలో వైద్యపరమైన అత్యవసర పరిస్థితి, ఇంజన్లలో సమస్యలు, తక్కువ ఇంధనం ఉండటం, తీవ్రత తక్కువ ఉండే మెకానికల్ సమస్యలు తలెత్తినప్పుడు దీన్ని వాడతారు. అంటే పూర్తిస్థాయి ఎమర్జెన్సీ కాదు.. ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోల్, గ్రౌండ్ స్టాఫ్ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకునేలా 'పాన్' కాల్ అలర్ట్ చేస్తుంది. పాన్ అనేది పాన్నె అనే ఫ్రెంచ్ పదం నుంచి వచ్చింది. దీని అర్థం బ్రేక్‌డౌన్.

మేడే.. మేడే.. మేడే..



మేడే మేడే మేడే అని పైలట్ అన్నాడంటే.. తక్షణ ప్రాణాపాయం.. పూర్తిస్థాయి ఎమర్జెన్సీ అని అర్థం. అత్యవసర సాయం అందాలి. అన్ని రకాల సహాయక సిబ్బంది రంగంలోకి దిగాలి. వెంటనే ల్యాండింగ్ క్లియరెన్స్ ఇవ్వాలి. రన్‌వేపై దీనికి అడ్డు లేకుండా.. మిగిలిన విమానాలను తొలగించాలి. ఇంజన్లు మొత్తంగా ఫెయిల్ అయినప్పుడు, విమానంలో అగ్నిప్రమాదం జరిగినప్పుడు, లో క్యాబిన్ ప్రెషర్(దీని వల్ల లోపల ఆక్సిజన్ తగ్గిపోతుంది), తీవ్రమైన మెకానికల్ సమస్య తలెత్తినప్పుడు దీన్ని వాడతారు. మేడే అన్నది మేడి అనే ఫ్రెంచ్ పదం నుంచి వచ్చింది. దీని అర్థం నాకు సహాయం చేయండి అని.. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మేడే మేడే మేడే అని అంటూ పైలట్ అత్యవసర సాయం కోసం అర్థించిన విషయం తెలిసిందే.

మూడు సార్లు ఎందుకు?

విమాన, సముద్రయానాల్లో ఇదో ప్రామాణిక పద్ధతి. స్పష్టంగా వినిపించడం కోసం.. అర్థం చేసుకోవడం కోసం మూడుసార్లు చెబుతారు. అలాగే రెగ్యులర్ సంభాషణకు దీనికి మధ్య తేడాను గుర్తించడానికి.. పరిస్థితిని మామూలుగా తీసుకోకుండా వెంటనే స్పందించడానికి ఇది ఉపయోగపడుతుంది. దీని వల్ల పాన్‌కు బదులు మేడే అని.. మేడేకి బదులు పాన్ అని అపార్థం చేసుకునే ప్రమాదాన్ని కూడా నివారించినట్లు అవుతుంది.



- సాక్షి, సెంట్రల్ డెస్క్

క్లుప్తంగా...

హైకోర్టు ఏసీజేగా జస్టిస్ శామ్ కోషి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే)గా జస్టిస్ శామ్ కోషిని నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏసీజే విధులు నిర్వహించిన జస్టిస్ సుజోయ్ పాల్ బదిలీపై కోల్‌కతాకు వెళ్లడంతో తదపరి సీనియర్ జడ్జికి ఆ బాధ్యతల అప్పగింతకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. దీంతో గురువారం కేంద్ర న్యాయ శాఖ అధికారికంగా ఉత్తర్వులిచ్చింది. త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ శనివారం తెలంగాణ హైకోర్టు సీజేగా బాధ్యతలు స్వీకరించనున్న విషయం విదితమే. అప్పటివరకు జస్టిస్ శామ్ కోషి ఏసీజే బాధ్యతలు నిర్వర్తిస్తారు.

ఏఐ సాయంతో సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ

కేంద్ర సమాచార శాఖ కార్యదర్శి సంజయ్‌జాజు



సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం వేవ్‌ఎక్స్ స్టార్టప్ యాక్సిలరేటర్ ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేసిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్‌జాజు అన్నారు. ఏఐ, మెషీన్ లెర్నింగ్ ఆధారిత సాంకేతిక పరిష్కారాలపై దేశవ్యాప్తంగా ఉన్న ఇంక్యుబేటర్లు, స్టార్టప్‌లతో గురువారం టీహబ్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంజయ్‌జాజు మాట్లాడుతూ స్టార్టప్‌లు వేవ్‌ఎక్స్ పోర్టల్ ద్వారా 'కలా సేతు', 'భాషా సేతు'సవాళ్ల కోసం దరఖాస్తు చేసుకుని వివరాలు పొందవచ్చని తెలిపారు. ఎంపికైన బృందాలు ఢిల్లీలో జాతీయ జ్యూరీ ముందు తమ పరిష్కారాలను ప్రదర్శిస్తాయని, విజేతకు పూర్తిస్థాయి అభివృద్ధి కోసం ఒక ఎంఓయూ, ఆల్ ఇండియా రేడియో (ఏఐఆర్), దూరదర్శన్ (డీడీ), పీఐబీ ద్వారా సహాయం, వేవ్‌ఎక్స్ ఇన్నోవేషన్ ప్లాట్‌ఫాం కింద ఇంక్యుబేషన్ లభిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీ-హబ్ సీఈఓ, టీ-హబ్‌లో ఇంక్యుబేట్ అవుతున్న స్టార్టప్‌లు, ఐఐటీ హైదరాబాద్, ఎన్ఐటీల సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, యాక్టివ్ ఇన్నోవేషన్ సెల్స్ ఉన్న ఇంజినీరింగ్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

21న తపాలా సేవలు బంద్

సాక్షి, హైదరాబాద్: పోస్టాఫీసుల్లో అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీ (ఏపీటీ) అప్లికేషన్ ఏర్పాటు పనులు నిర్వహిస్తున్నందున.. ఈ నెల 21న రాష్ట్రవ్యాప్తంగా తపాలా శాఖ కార్యాలయాల్లో వినియోగదారులకు ఎలాంటి సేవలు అందుబాటులో ఉండవని తెలంగాణ పోస్టల్ సర్కిల్ ఒక ప్రకటనలో తెలిపింది. అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీ పనులు రంగారెడ్డి, నల్లగొండ, యాదాద్రి-భువనగిరి జిల్లాల్లోని పోస్టాఫీసులలో ఇప్పటికే పూర్తయినందున, అవి మాత్రం ఆరోజు యథావిధిగా పనిచేస్తాయని స్పష్టం చేసింది. ఏపీటీ అప్లికేషన్ వల్ల వినియోగదారులకు వేగంగా మెరుగైన సేవలు అందించేందుకు వీలు కలుగుతుందని పేర్కొంది.

175 మంది ఉద్యాన ఉద్యోగుల పునర్నియామకం

సాక్షి, హైదరాబాద్: ఉద్యానవన శాఖలో గతంలో తొలగించిన 175 మంది ఉద్యాన విస్తరణాధికారులను (హెచ్ఈవోలు) ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ప్రభుత్వం తిరిగి అవకాశం కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేసింది. నెలకు రూ.22,750 వేతనంతో 32 జిల్లాలతో పాటు ములుగు, జీడిమెట్ల ఉద్యాన శాఖ కేంద్రాలకు 175 మందిని కేటాయించారు. కాగా గత ప్రభుత్వం తొలగించిన 175 మంది ఉద్యాన విస్తరణాధికారులను తిరిగి ఔట్ సోర్సింగ్ పద్ధతిలో అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషాకి తెలంగాణ ఉద్యాన అధికారుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది.

అమ్రాబాద్‌లో పులులు 36

2023-24తో పోల్చితే మూడు అధికం

- 13 మగ, 20 ఆడ పులులున్నట్లు గుర్తింపు
- 2024-25 నాలుగో దశ గణనలో వెల్లడి
- సత్ఫలితాలిస్తున్న ప్రాజెక్ట్ టైగర్ కార్యక్రమం



అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో పెద్దపులి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రాజెక్ట్ టైగర్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ముఖ్యంగా అమ్రాబాద్ పులుల అభయారణ్యం (ఏటీఆర్)లో పెద్దపులుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 2024-25లో నాలుగో దశ పులుల గణన (ఫేజ్-4 మానిటరింగ్) నివేదిక ప్రకారం ఏటీఆర్‌లో ప్రస్తుతం 36 పులులు ఉన్నట్టు తేలింది. 2023-24లో ఇక్కడ 33 పులులు ఉండగా, ఏడాదిలో మూడు పెరిగాయి. మొత్తం 13 మగ పులులు, 20 ఆడ పులులు, లింగబేధం తేలని ఒక పులి (అన్ ఐడెంటిఫైడ్), రెండు పిల్లలు ఉన్నట్టు గుర్తించారు. తల్లి పులుల సంఖ్య పెరగడంతో పునరుత్పత్తి వ్యవస్థ బలోపేతం అవుతోంది. ఏటీఆర్‌లో అడల్ట్ టైగర్స్ 26 నుంచి 34కు పెరగడం పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందని అంచనా వేస్తున్నారు. పులుల పెరుగుదల అంటే వాటి సంఖ్య పెరగడమే కాదు. పర్యావరణ పరిస్థితులు అనుకూలంగా మారాయని, అటవీ ప్రాంతాల్లో మనుషుల సంచారం, ప్రవేశం తగ్గుతోందనేందుకు సూచన అని అటవీ అధికారులు చెబుతున్నారు. 'పులుల సంఖ్య పెరగడం చాలా ప్రోత్సాహకరమైన విషయం. ఇది కేవలం అటవీ శాఖ శ్రమకు ప్రతిఫలం కాదు. స్థానిక గిరిజనులు, వన్యప్రాణి సంరక్షణ దిశగా పనిచేసే సంఘాలు కలసికట్టుగా చేసిన కృషికి ఫలితం. రాబోయే రోజుల్లో ఇంకా శాస్త్రీయ పద్ధతుల్లో మానిటరింగ్ పెంచుతూ, సంరక్షణ మరింత బలోపేతం చేస్తాం'అని ఏటీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ హిరామత్ వెల్లడించారు.

2023-24, 2024-25లో పులుల గణాంకాలు

అంశం	2023-24	2024-25
మొత్తం పులులు	33	36
మగ పులులు	11	13
ఆడ పులులు	15	20
పులి పిల్లలు	7	2
లింగ నిర్ధారణ కాని పులులు	0	1

హరిత శక్తి హబ్‌గా తెలంగాణ

- కేంద్ర ప్రతిపాదనలు
- పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలి
- సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన రంగంలో తెలంగాణ కీలక భాగస్వామిగా మారే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందని.. అందుకు తగ్గట్లుగా రాష్ట్ర ప్రభుత్వం పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు సహకరించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గురువారం ఆయన లేఖ రాశారు. బొగ్గు శాఖ పరిధిలోని కోల్ ఇండియా, నేవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ వంటి కేంద్ర సంస్థలు రాష్ట్రంలో సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వంటి ప్రాజెక్టులకు పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

రూ.10 వేల కోట్ల పెట్టుబడులు..

ఈ కేంద్ర సంస్థలు ఆయా ప్రాజెక్టుల్లో వచ్చే మూడు సంవత్సరాల్లో రూ.10 వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు కిషన్‌రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వ నిర్మాణాత్మక భాగస్వామ్యం అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులకు భూసేకరణ, భూకేటాయింపు, ఇతర అనుమతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని కేంద్ర మంత్రి సూచించారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు కేవలం విద్యుత్ ఉత్పత్తికే కాకుండా, కార్బన్ ఉద్గారాల తగ్గింపు, పర్యావరణ పరిరక్షణ, ఉద్యోగావకాశాలు, నైపుణ్యాభివృద్ధి, ఇంధన భద్రత, ఆర్థిక వృద్ధి వంటి అనేక బహుళ ప్రయోజనాలు కలిగిస్తాయని కిషన్ రెడ్డి వివరించారు.

ముఖ్యమంత్రి చొరవ అవసరం..

ఈ ప్రాజెక్టులు విజయవంతంగా అమలు కావాలంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి స్పష్టంచేశారు. రాష్ట్రానికి ఉన్న పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని.. తెలంగాణను దేశంలో హరిత శక్తి కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశాన్ని వినియోగించుకోవాలని కేంద్ర ప్రభుత్వం కోరుతోందన్నారు. తెలంగాణలో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని సంస్థలన్నీ పూర్తిగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాయని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇది రాష్ట్రం పట్ల కేంద్రం చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఉత్తమ కంటోన్మెంట్‌గా 'సికింద్రాబాద్'

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల ప్రదానం

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25 ఫలితాల్లో తెలంగాణకు ప్రతిష్టాత్మక గౌరవం దక్కింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు దేశంలోనే ఉత్తమ కంటోన్మెంట్‌గా ఎంపికైంది. అదేవిధంగా, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రామిసింగ్ స్వచ్ఛ నగరంగా గుర్తింపు పొందింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఢిల్లీలో గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, పరిశుభ్రత నెలకొల్పేందుకు సుమారు 14 కోట్ల మంది పౌరులు, రాష్ట్ర ప్రభుత్వాలు, నగర పాలక సంస్థలు సహా వివిధ భాగస్వాములు పాల్గొన్న 2024 పరిశుభ్రత సర్వేను కేంద్రం చేపట్టడం తనకు సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ సర్వే ప్రపంచంలోనే అతి పెద్దదిగా నిలిచిందని చెప్పారు.

క్లీన్ ఎనర్జీని ప్రోత్సహించాలి

పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సాక్షి, న్యూఢిల్లీ: భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్లీన్ ఎనర్జీని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్రాల సహకారం చాలా అవసరమని తెలిపారు. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలోని భారత మండపంలో 'ఉర్జా మంథన్ 2025'కార్యక్రమం గురువారం జరిగింది. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణలో క్లీన్, గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025 కింద తీసుకున్న చర్య లను శ్రీధర్‌బాబు వివరించారు. బయో ఇంధనాలు, కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ), సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) నెట్‌వర్క్‌లపై దృష్టి సారించి, ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరిస్తున్నట్టు తెలిపారు. పెరుగుతున్న పారిశ్రామిక, గృహ అవసరాలను తీర్చడానికి తెలంగాణలో సీఎన్జీ, ఎల్ఎన్జీ టెర్మినల్స్‌ను స్థాపించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహ కారం అవసరమని పేర్కొన్నారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ఉత్పత్తిలో కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి పెట్టాలని కోరారు. సాటాట్, నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ వంటి పథకాల కింద క్లీన్ ఇంధన సాంకేతిక పరిజ్ఞానాలను పెంపొందించడానికి ఎంఎస్ఎంఈలు, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఇంధన రంగంలో స్థిరమైన, సమగ్ర ఇంధన అభివృద్ధికి జాతీయ నమూనాగా మారడానికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోందని తెలిపారు.

బండి సంజయ్‌కు మరోసారి సిట్ నోటీసులు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో వాంగ్మూలం ఇవ్వాలని విజ్ఞప్తి
- వచ్చే గురువారం వచ్చి తీసుకోవాలని కోరిన కేంద్ర మంత్రి



సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు సిట్ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. గురువారం కరీంనగర్‌లో ఆయన ఇంటికి వెళ్లిన దర్యాప్తు అధికారులు నోటీసులు అందించారు. సంజయ్‌తో పాటు ఆయన పీఆర్వో, పీఏలను సాక్షులుగా పరిగణిస్తూ వాంగ్మూలం ఇవ్వాలని నోటీసులు ఇచ్చారు. సిట్ నోటీసులపై సానుకూలంగా స్పందించిన సంజయ్ వచ్చే గురువారం వాంగ్మూలం ఇవ్వడానికి అంగీకరించారు. ఆయన కేంద్ర మంత్రి కావడంతో తామే వెళ్లి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకోవాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌లో సంజయ్ వాంగ్మూలం నమోదు చేయనున్నారు. సంజయ్‌తో పాటు ఆయన పీఆర్వో పసునూరు మధు, పీఏ బోయినిపల్లి ప్రవీణ్‌రావు, మాజీ పీఏ పోగుల తిరుపతి స్టేట్‌మెంట్లను కూడా రికార్డు చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

కేసీఆర్ నేరం చేస్తే నాకు ప్రేమలేఖ వచ్చింది...

'బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ చేసిన లుచ్చా పనుల ఫలితంగానే నేను ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పోలీసుల నుంచి లవ్ లెటర్ (నోటీసులు) అందుకోవాల్సి వచ్చింది' అని బండి సంజయ్ పేర్కొన్నారు. ''నాతోపాటు నా కుటుంబ సభ్యులు, వ్యక్తిగత సిబ్బంది ఫోన్లను కూడా ట్యాప్ చేసిన నీచుడు కేసీఆర్. భార్యాభర్తలు పడక గదిలో మాట్లాడుకునే మాటలను కూడా ట్యాప్ చేసి ఎంతో మంది జీవితాలను నాశనం చేసిన దుర్మార్గ కుటుంబం కేసీఆర్‌దే' అని 'ఎక్స్'వేదికగా మండిపడ్డారు.

సీఎం రేవంత్ పేరిట డీప్‌ఫేక్..

- రేవంత్‌రెడ్డి 'క్వాంటం ఏఐ' వెబ్‌సైట్‌ను ప్రమోట్ చేస్తున్నట్టుగా వీడియో సృష్టి
- అది ఫేక్ వీడియో అని నిర్ధారించిన ఫ్యాక్ట్‌చెక్ తెలంగాణ
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన



సాక్షి, హైదరాబాద్: రూ. 21,000 పెట్టుబడి పెట్టడం ద్వారా మీరు రూ. 2 లక్షలు సంపాదిస్తారు. మీరు దీన్ని నమ్మి పెట్టుబడి పెట్టండి 'అని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నట్టుగా ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఢిల్లీలో ఒక న్యూస్ చానల్‌కు రేవంత్‌రెడ్డి ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూ వీడియోను వినియోగించి ఏఐతో ఒక డీప్‌ఫేక్ వీడియోను సృష్టించారు సైబర్‌నేరగాళ్లు. రేవంత్ రెడ్డి క్వాంటం ఏఐ అనే వెబ్‌సైట్‌ను ప్రమోట్ చేస్తున్నట్లుగా కనిపించే నకిలీ ఏఐ-జనరేటెడ్ వీడియోను నమ్మవద్దని సీఎం కార్యాలయ అధికారులు సూచించారు. ఈ మేరకు గురువారం ఎక్స్‌లో ఒక పోస్టు పెట్టారు. ఫ్యాక్ట్ చెక్‌తెలంగాణ సైతం ఈ వీడియో డీప్‌ఫేక్ అని, దాని నమ్మి మోసపోవద్దని సూచించింది. 'రేవంత్ రెడ్డి ఎప్పుడూ అలాంటి ప్రకటన చేయలేదు. అసలు క్వాంటం ఏఐని భారత ప్రభుత్వం ప్రారంభించలేదని, ప్రముఖుల వీడియోలను నకిలీవి సృష్టించి మోసాలకు పాల్పడుతున్నట్టు తెలిపారు. ఇలాంటి వీడియోల నుంచి సురక్షితంగా ఉండాలని సూచించారు. ఇలా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని ఊదరగొట్టే ప్రకటనలు నమ్మవద్దని, అటువంటి వెబ్‌సైట్‌లలో వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ సమాచారాన్ని ఎప్పుడూ షేర్ చేయవద్దని సూచించారు. ప్రభుత్వం పెట్టే ఏవైనా ఆర్థిక పథకాలను గురించి ధృవీకరించడానికి అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్‌లను మాత్రమే ఉపయోగించాలని పేర్కొన్నారు. ఇలాంటి మోసాలను గుర్తిస్తే వెంటనే http://cybercrime.gov.in కు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

ఏఐతో చిక్కిన ఎగవేతదారుడు!

- క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ ఎగ్గొట్టేందుకు వ్యాపారి యత్నం
- ఎంఎస్ ఆఫీస్ ఫాంట్ ఆధారంగా గుర్తించిన ఏఐ టూల్



సాక్షి, హైదరాబాద్: స్థిరాస్తి విక్రయాలకు సంబంధించి ఆదాయపు పన్ను శాఖకు చెల్లించాల్సిన లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్ (ఎల్‌టీసీజీ) ట్యాక్స్ ఎగవేయాలని పథకం వేసిన హైదరాబాద్ వ్యాపారి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) దెబ్బకు అడ్డంగా దొరికిపోయాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి 2000 సంవత్సరానికి ముందు రూ.68 లక్షలతో ఓ పాత ఇంటిని కొని, దానికి మరమ్మతులు చేయించి 2002లో రూ.1.4 కోట్లకు విక్రయించాడు. దీనిపై క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్‌గా రూ.21.6 లక్షలు చెల్లించాల్సి ఉంది. అయితే 2002-08 మధ్య తనకు చెందిన మరో ఇంటి అభివృద్ధి కోసం రూ.71 లక్షలకు పైగా వెచ్చించినట్లు నకిలీ బిల్లులు సృష్టించి, ట్యాక్స్‌గా రూ.7,200 చెల్లించాడు. ఈ వ్యవహారాన్ని సందేహించిన ఆదాయపు పన్ను శాఖ అధికారులు.. సదరు వ్యాపారికి నోటీసులు జారీ చేయగా, గత 16 ఏళ్లుగా ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచాయి. ఈ బిల్లుల్లోని లోటుపాట్లను గుర్తించడానికి ఇటీవల అధికారులు ఏఐ టూల్‌ను వినియోగించారు. వ్యాపారి సమర్పించిన బిల్లుల్లో 2002 జూలై 6 తేదీతో రూ.7.6 లక్షల రసీదు కూడా ఉంది. దీన్ని విశ్లేషించిన ఏఐ టూల్.. మైక్రోసాఫ్ట్ ఆఫీస్‌లోని కాలిబ్రి అనే ఫాంట్‌తో దానిని ముద్రించినట్లు గుర్తించింది. ఎంఎస్ ఆఫీస్‌లో ఆ ఫాంట్ 2007 నుంచి మాత్రమే అందుబాటులోకి వచ్చినట్లు స్పష్టం చేసింది. దీంతో 2007లో అందుబాటులోకి వచ్చిన ఫాంట్‌తో 2002లో బిల్లు ఎలా ముద్రించారని సదరు వ్యాపారికి మరోసారి నోటీసులు జారీ చేశారు. దీంతో గత్యంతరం లేక ఆ వ్యాపారి మొత్తం రూ.21.6 లక్షలు పన్ను చెల్లించి అధికారులకు క్షమాపణ చెప్పి వెళ్లారు.

హెచ్‌సీఏ అక్రమాల వెనుక కేటీఆర్, కవిత

- గత పదేళ్లలో దాదాపు రూ.600 కోట్లు దుర్వినియోగం
- కేటీఆర్ బావమరిది కంపెనీకే ఐపీఎల్ టికెట్ల విక్రయ కాంట్రాక్టు
- తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ
- దర్యాప్తు చేయాలని సీఐడీ అదనపు డీజీ చారుసిన్హాకు ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో గత పదేళ్లలో జరిగిన నిధుల గోల్‌మాల్, ఇతర అక్రమాల వెనుక హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుతోపాటు మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత హస్తం ఉందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, కార్యదర్శి దారం గురువారెడ్డి ఆరోపించారు. కేటీఆర్, కవిత, జగన్మోహన్‌రావుతోపాటు హెచ్‌సీఏ మాజీ డైరెక్టర్ వంక ప్రతాప్, మరికొందరిపై దర్యాప్తు జరపాలని సీఐడీ అదనపు డీజీ చారుసిన్హాకు గురువారం ఫిర్యాదు చేశారు. ఐపీఎల్ టికెట్ల విక్రయ కాంట్రాక్టును కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలకు చెందిన కంపెనీలకు ఇచ్చారని ఫిర్యాదులో తెలిపారు. కేటీఆర్, కవిత తెరవెనుక ఉండి ప్రభావితం చేయడం వల్లే హెచ్‌సీఏ అధికారులు ఎలాంటి భయం లేకుండా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో ఫుడ్ కాంట్రాక్టు కేటీఆర్, కవిత, జగన్మోహన్‌రావులకు బంధువైన సురభి కేటరర్స్‌కు అప్పగించారని, ట్రావెల్స్ కాంట్రాక్టులు, హోటల్ బుకింగ్స్ సైతం ఈ వర్గంవారికే కట్టబెట్టారని ఫిర్యాదులో ఆరోపించారు.

పదేళ్లలో రూ.600 కోట్లు మాయం

బీసీసీఐ నుంచి క్రికెట్ అభివృద్ధికి గ్రాంట్ల రూపంలో, ఐపీఎల్ నుంచి వాటాగా వచ్చే డబ్బును దోచుకోవడానికి భారీ కుట్ర జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గత పదేళ్లలో బీసీసీఐ నుంచి వచ్చిన దాదాపు రూ.500 నుంచి రూ.600 కోట్లను వేటికోసం ఖర్చు చేశారన్నదానికి సరైన ఆధారాలు లేవని తెలిపారు. హెచ్‌సీఏ ఈ పదేళ్లలో ఎలాంటి ఆస్తులను సమకూర్చుకోలేదని.. అదే సమయంలో హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్స్ వ్యక్తిగత ఆస్తులు మాత్రం భారీగా పెరిగాయని ఆరోపించారు. హెచ్‌సీఏకు అజారుద్దీన్ అధ్యక్షుడిగా వ్యవహరించిన 2019 నుంచి 2022 సమయంలో జరిగిన అవినీతిపైనా దర్యాప్తు చేయాలని కోరారు.

హెచ్‌సీఏలోకి మీరెలా వచ్చారు?

- హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌లో పనిచేసిన మీరు ఎలా అర్హులు?
- గౌలిపుర క్రికెట్ క్లబ్‌ను శ్రీచక్ర క్రికెట్ క్లబ్‌గా ఎందుకు మార్చారు?
- మొదటి రోజు కస్టడీలో జగన్మోహన్‌రావుపై సీఐడీ ప్రశ్నల వర్షం
- హెచ్‌సీఏలో నిధుల దుర్వినియోగంపై ఈడీ ఈసీఐఆర్ నమోదు

సాక్షి, హైదరాబాద్: 'హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో అక్రమంగా ఎలా ప్రవేశించారు? హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శిగా ఉన్న మీరు హెచ్‌సీఏ ఎన్నికలకు ఎలా అర్హులవుతారు? గౌలిపుర క్రికెట్ క్లబ్‌ను శ్రీచక్ర క్రికెట్ క్లబ్‌గా ఎందుకు మార్చారు? ఆ సంఘం అధ్యక్షుడు కృష్ణయాదవ్ సంతకం ఎందుకు ఫోర్జరీ చేశారు?'అని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుపై సీఐడీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. ఆరు రోజుల కస్టడీలో భాగంగా తొలిరోజు గురువారం జగన్మోహన్ రావు సహా ఐదుగురు నిందితులను సీఐడీ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. చంచల్‌గూడ మహిళా జైలులో ఉన్న కవితను, చర్లపల్లి జైలులో ఉన్న జగన్మోహన్‌రావు సహా నలుగురు నిందితులను రెడ్ హిల్స్‌లోని సీఐడీ రీజినల్ ఆఫీస్‌కు తరలించి న్యాయవాది సమక్షంలో ప్రశ్నించారు. ఫోర్జరీ కేసుతోపాటు ఐపీఎల్ టికెట్ల వివాదం, హెచ్‌సీఏ నిధుల గోల్‌మాల్‌కు సంబంధించి జగన్మోహన్‌రావు, ట్రెజరర్ జేఎస్ శ్రీనివాసరావు, సీఈఓ సునీల్‌కాంటె, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ కార్యదర్శి రాజేందర్‌యాదవ్, ఆయన భార్య కవితలను 22 వరకు ప్రశ్నించనున్నారు. మొదటి రోజు నిందితుల వ్యక్తిగత వివరాలు, క్రికెట్ సహా ఇతర క్రీడలకు సంబంధించిన వివరాలతో స్టేట్‌మెంట్లు రికార్డ్ చేసినట్లు తెలిసింది. హెచ్‌సీఏ అధ్యక్ష పదవి కోసం జగన్మోహన్‌రావు పన్నిన కుట్రపైనే సీఐడీ అధికారులు ప్రధానంగా దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. ప్రధానంగా మాజీ మంత్రి కృష్ణయాదవ్ సంతకాలు ఫోర్జరీ చేసి హెచ్‌సీఏ అధ్యక్షుడిగా పోటీచేయటం వెనుకున్న వివరాలను రాబడుతున్నారు. గౌలిపుర క్రికెట్ క్లబ్‌ను శ్రీచక్ర క్రికెట్ క్లబ్‌గా మార్చడానికి గల కారణాలను ఆ క్లబ్ అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి రాజేందర్ యాదవ్‌ల నుంచి సేకరించినట్లు సమాచారం. ప్రధానంగా జగన్మోహన్‌రావు హెచ్‌సీఏ అధ్యక్షుడు కావడానికి వీరిద్దరూ ఎలా సహాయం చేశారనే కోణంలో సీఐడీ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది.

హెచ్‌సీఏ కుంభకోణంపై ఈడీ కేసు

హెచ్‌సీఏలో నిధుల గోల్‌మాల్ కేసులో ఈడీ రంగంలోకి దిగింది. హెచ్‌సీఏ అధ్యక్షుడిగా జగన్మోహన్‌రావు ఎన్నికలో జరిగిన అక్రమాలు, నిధుల గోల్‌మాల్‌పై సీఐడీ నమోదు చేసిన కేసు, నిందితుల రిమాండ్ రిపోర్ట్ ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో గురువారం ఈడీ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) నమోదు చేశారు. హెచ్‌సీఏ నిధులు దుర్వినియోగం, నిందితుల ఆర్థిక లావాదేవీల ఆధారంగా దర్యాప్తు చేయనున్నారు. నిందితులకు సీఐడీ కస్టడీ ముగిసిన అనంతరం ఈడీ అధికారులు వారి కస్టడీ కోరుతూ కోర్టును ఆశ్రయించనున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

మళ్లీ తెరపైకి 'సరిహద్దు' వివాదం!



సరిహద్దు గ్రామాలపై మహారాష్ట్ర నేతల వ్యాఖ్యలు

తమ రాష్ట్రంలోనే విలీనం చేస్తామంటూ ప్రకటనలు

తెలంగాణలోనే కలపాలని కలెక్టరేట్ ఎదుట ప్రజల నిరసన

కెరమెరి(ఆసిఫాబాద్): స్తబ్దుగా ఉన్న తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. సరిహద్దు గ్రామాలు తమవేనని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఆయా పంచాయతీల్లోని కొన్ని గ్రామాల ప్రజలు ఈ ప్రకటనను వ్యతిరేకిస్తుండగా, మరికొందరు మాత్రం సానుకూలంగా స్పందిస్తున్నారు. ఆరు గ్రామాల ప్రజలు తెలంగాణలోనే కొనసాగుతామంటూ గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టరేట్‌లో వినతిపత్రం సైతం సమర్పించారు. ముంబైలో ప్రస్తుతం మహారాష్ట్ర ప్రభుత్వం కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో జివితితోపాటు పలు సరిహద్దు గ్రామాలకు చెందిన 11 మంది నాయకులు ప్రజాప్రతినిధులను కలిశారు. సరిహద్దు గ్రామాల విషయంలో స్పష్టతనివ్వాలని కోరడంతోనే విలీన విషయం మళ్లీ తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది.

అసలు వివాదం ఇదీ..

1955–56లో ఫజల్ అలీ కమిషన్ ద్వారా రాష్ట్రాల సరిహద్దులను నిర్ధారించారు. ఈ క్రమంలో భాషా ప్రాతిపదికన ప్రస్తుతం ఉన్న వివాదాస్పద 14 గ్రామాలు మహారాష్ట్రలోకి వెళ్లాయి. 1978లో మరోసారి మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సరిహద్దులు నిర్ణయించగా, భౌగోళిక పరిస్థితుల ఆధారంగా ఆర్టికల్–3 ద్వారా ఆయా గ్రామాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధీనంలో ఉంటాయని ఒప్పందం కుదుర్చుకున్నాయి. ముకదంగూడ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త రాందాస్ నర్వడే తెలిపిన వివరాల ప్రకారం .. 1980 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగబోమని, మహారాష్ట్రలో విలీనం చేయాలని ఉద్యమం ప్రారంభమైంది.. దీంతో 1983లో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ప్రజల సమస్యలు తెలుసుకుని కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. 1978లో చేసిన హద్దుల ప్రకారం గ్రామాలు ఏపీకి చెందినవేనని స్పష్టం చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వం కూడా గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌కు చెందుతాయని 1990 జూలై 7న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అక్కడ మలిదశ ఉద్యమం ప్రారంభమైంది. మరాఠీ మాట్లాడే వారు ఎక్కువగా ఉన్నారని, భాషా ప్రాతిపదికన విభజించాలని న్యాయవాది, రాజురా ఎమ్మెల్యే వామన్‌రావు చటప్ ప్రజలతో కలిసి ఆందోళన చేశారు. అసెంబ్లీలోనూ సమస్యను లేవనెత్తారు. వివాదాస్పద గ్రామాలు భాషాపరంగా తమకు చెందుతాయని 'మహా'సర్కార్ 1993 ఆగస్టు 5న 1990 నాటి పాత ఉత్తర్వులను రద్దు చేసింది. దీనిపై 1996 ఏప్రిల్ 3న అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం హైకోర్టులో రిట్ పిటిషన్‌ను వేసింది. అక్కడి ప్రభుత్వం అదే ఏడాది ఏప్రిల్ 30న సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ 10338/96 దాఖలు చేసింది. కేసు వెనక్కి తీసుకోవాలని సుప్రీంకోర్టు 1997 ఫిబ్రవరి 12న ఏపీకి ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రిట్ పిటిషన్‌ను ఆగస్టు 21న బేషరతుగా వెనక్కి తీసుకుంది. అయితే ఆ ఉత్తర్వులపై స్థానిక ప్రజలు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందలేదు. దీంతో ఇరు రాష్ట్రాలూ తమ పాలనను కొనసాగిస్తున్నాయి. ఇరు ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఎన్నికల్లోనూ ప్రజలు ఓటు వేస్తున్నారు. 1965 నుంచి ఆయా గ్రామాలు మహారాష్ట్రలోని నోకేవాడ, పుద్యాన్‌మోదా గ్రామ పంచాయతీలో ఉండగా, 1990లో మళ్లీ పరంధోళి, అంతాపూర్ గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసి గ్రామాలను విడదీసింది. అనంతరం ఆంధ్రప్రదేశ్ కూడా పరంధోళి, అంతాపూర్ గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది.

ఇరు రాష్ట్రాల పాలన

ప్రస్తుతం 14 గ్రామాలు ఇరు రాష్ట్రాల పాలనలో కొనసాగుతున్నాయి. ప్రజలకు రెండేసి రేషన్ కార్డులు, ఓటరు కార్డులు ఉన్నాయి. మహారాష్ట్ర, తెలంగాణ ప్రభుత్వాల ఆధ్వర్యంలో పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. గతంలో పరంధోళి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనా నిర్మించలేదు. పట్టాల కోసం 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్నా సమస్యకు పరిష్కారం లభించలేదు. గ్రామాలను అనుసంధానిస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం రవాణా సౌకర్యం కల్పించింది. ఇరవై శాతం గిరిజనులకు తెలంగాణ ప్రభుత్వం అటవీ హక్కు పత్రాలు అందించింది. డెబ్బైయ్ శాతం ఉన్న ఎస్సీలు, 10 శాతం ఉన్న బీసీలకు హక్కులు కల్పించకపోవడంతో.. వారిలో చాలామంది మహారాష్ట్రలో కలుస్తామని చెబుతున్నారు.

పట్టాలిస్తేనే..



నలభయ్యేళ్లుగా సాగు చేస్తున్నా నేటికీ భూములకు పట్టాలు లేవు. ఇరు ప్రభుత్వాలు కూడా స్పందించకపోవడంతో సంక్షేమ పథకాలు అందడం లేదు. ప్రజలు పేదరికంలో బతుకుతున్నారు. ఏ ప్రభుత్వం సాగు భూములకు పట్టాలిస్తే ఆ రాష్ట్రంలో కొనసాగుతాం.

– కాంబ్లె లక్ష్మణ్, మాజీ సర్పంచ్, పరంధోళి

'మహా'సర్కారు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



మహారాష్ట్ర సర్కారు 14 గ్రామాలు తమవే అని ప్రకటించిన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుంది. మరాఠీ మాట్లాడే మేమంతా భాషా ప్రాతిపదికన మహారాష్ట్రలోనే ఉంటామని 1980 నుంచి పోరాటం చేస్తున్నాం. గ్రామాలు మహారాష్ట్రకు చెందినవని 1997లోనే సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.

– రాందాస్ రన్‌వీర్, సామాజిక కార్యకర్త, ముకదంగూడ

తెలంగాణ రాష్ట్రంలోనే ఉంటాం

తెలంగాణ ప్రభుత్వం గిరిజనులకు ఎన్నో పథకాలు అమలు చేస్తోంది. అటవీ భూములకు హక్కు పత్రాలు ఇచ్చింది. త్వరలో ఇందిరమ్మ ఇళ్లు కూడా అందనున్నాయి. తాగునీరు, సాగునీరు తదితర సౌకర్యాలు కల్పిస్తోంది. మా గ్రామాల ప్రజలు తెలంగాణ రాష్ట్రంలోనే ఉంటాం.

– హడ్పె బాజీరావు, ఇంద్రానగర్

సరిహద్దు గ్రామాల వివరాలు

పంచాయతీ	గ్రామాలు	కుటుంబాలు	జనాభా	ఓటర్లు
పరంధోళి	పరంధోళి, కోటా, పరంధోళి తాండ, శంకర్‌లొద్ది	430	1700	937
ముకదంగూడ	మహరాజ్‌గూడ, ముకదంగూడ	230	1044	743
అంతాపూర్	అంతాపూర్, ఇంద్రానగర్, పద్మావతి, ఏసాపూర్, నారాయణగూడ	429	1600	970
భోలాపటార్	భోలాపటార్, లేండిగూడ, గౌరీ	425	1475	916


రెండు ప్రభుత్వాల రేషన్ కార్డులు చూపుతున్న మహిళలు



తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పాఠశాల


పరంధోళిలో మహారాష్ట్ర గ్రామ పంచాయతీ కార్యాలయం



ఆటపాటలు.. తొట్టెల ఊరేగింపులు

సచివాలయంలో ఘనంగా బోనాలు • భారీగా హాజరైన ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్: ఆటపాటలు, శివసత్తులు, తొట్టెల ఊరేగింపులతో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం, నల్ల పోచమ్మ దేవస్థానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలలో.. తెలంగాణ సెక్రటేరియట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు గిరి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, లావణ్య లత, జనరల్ సెక్రటరీ ప్రేమ్, అదనపు కార్యదర్శి రాము భూక్య, తెలంగాణ సెక్రటేరియట్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి పి.లింగమూర్తి, ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగుల మహిళా నేతల నీరజాక్షి, యామిని, భారీ సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. సచివాలయ ప్రాంగణం నార్త్ గేటు నుంచి ప్రారంభమైన ఉత్సవాల ఊరేగింపు.. బాహుబలి గేటు, సౌత్ గేటు నుంచి, నల్ల పోచమ్మ ఆలయం వరకు సాగింది. సచివాలయం లోపలి నుంచి తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు విన్యాసాలు, పోతరాజుల ప్రదర్శనలతో సచివాలయం మార్మోగింది. పలువురు కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.



రామగుండం ఎరువులకు గండం

అమ్మోనియా పైప్‌లైన్ లీక్.. ప్లాంట్ షట్‌డౌన్

ప్లాంట్ పునరుద్ధరణకు 20 రోజుల సమయం

రాష్ట్రంలో యూరియా కొరత మరింత పెరిగే ప్రమాదం

ఫెర్టిలైజర్ సిటీ (రామగుండం): తెలంగాణతోపాటు 6 రాష్ట్రాల్లో యూరియా సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఎరువుల కర్మాగారం (ఆర్‌ఎఫ్‌సీఎల్) బుధవారం రాత్రి అమ్మోనియా కనెక్టర్ పైప్‌లైన్ లీక్ కావడంతో ప్లాంట్‌ను షట్‌డౌన్ చేశారు. దీంతో యూరియా ఉత్పత్తి నిలిచిపోయింది. ప్లాంట్ మరమ్మతులకు సుమారు 20 రోజుల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర, ఎరువులు రసాయనాల మంత్రిత్వ శాఖ 12.7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. అయితే, ప్లాంట్ వార్షిక మరమ్మతుల నేపథ్యంలో గత మే 6న ప్లాంట్ షట్‌డౌన్ చేశారు. జూన్ 13న మరమ్మతులు పూర్తి కావడంతో పునరుద్ధరించారు. జూన్ 16న యూరియా ఉత్పత్తి ప్రారంభమైంది. దీంతో జూన్‌లో 46,347.57 మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేశారు. కర్మాగారంలో ఉత్పత్తి అయిన యూరియాలో ఏప్రిల్, జూన్‌లో తెలంగాణ రాష్ట్రానికి 30 శాతం యూరియానే కేటాయించారు.

రాష్ట్రానికి తగ్గిన కేటాయింపులు..


రామగుండం ఎరువుల కర్మాగారం

తెలంగాణకు గత జూన్‌లో 30,000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా 15,924.87 మెట్రిక్ టన్నులు సరఫరా చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా వానాకాలం సాగు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాలలో వరినాట్లు ఊపందుకున్నాయి. రైతులు యూరియా కోసం ఫెర్టిలైజర్ దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్లాంట్ షట్‌డౌన్ కావడంతో.. ఈ ప్రభావం తెలంగాణ రాష్ట్రంపై అధికంగా పడుతుందని భావిస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ యూరియా దిగుమతి దృష్టి సారించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

2025-26 ఏప్రిల్, జూన్‌లో పలు రాష్ట్రాల సరఫరా చేసిన యూరియా (మెట్రిక్ టన్నుల్లో)

తెలంగాణ	55,777.14
ఆంధ్రప్రదేశ్	26,379.18
కర్ణాటక	22,563.3
మహారాష్ట్ర	11,681.01
ఛత్తీస్‌గఢ్	10,908.66
తమిళనాడు	12,982.94
మధ్యప్రదేశ్	8,062.2

కేటీఆర్‌పై కేసులో వివరణ ఇవ్వండి

పోలీసులకు, ఫిర్యాదుదారులకు హైకోర్టు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: నల్లగొండ జిల్లా నకిరేకల్ పీఎస్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై నమోదైన కేసులో వివరణ ఇవ్వాలని పోలీసులు, ఫిర్యాదుదారులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ఆగస్టు 5కు వాయిదా వేసింది. సాక్షుల వాంగ్మూలాలను కూడా తమ ముందుంచాలని దర్యాప్తు అధికారికి ఆదేశాలు జారీ చేసింది. నకిరేకల్‌లో పదో తరగతి తెలుగు ప్రశ్నపత్రం లీకైందంటూ సోషల్ మీడియాలో కేటీఆర్ తప్పుడు ప్రచారం చేశారంటూ నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాస్ కాపీయింగ్ నిందితులతో తనకు సంబంధాలు ఉన్నాయంటూ కేటీఆర్ ఎక్స్'లో పోస్టు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమెతోపాటు శ్రీనివాస్ అనే మరో వ్యక్తి ఫిర్యాదు మేరకు కేటీఆర్‌తోపాటు క్రిశాంక్, కొణతం దిలీప్‌పై మార్చి 25న కేసులు నమోదు చేశారు. ఈ కేసులు కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు. ఒకే అంశంపై ఒకే స్టేషన్‌లో రెండు కేసులు నమోదు చేశారని, ఇది సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని కేటీఆర్ తరపు న్యాయవాది రమణ్‌రావు వాదించారు. ఓ టీవీ చానల్‌లో వచ్చిన వార్తను మాత్రమే ఆయన పోస్టు చేశారని, వ్యక్తిగత వ్యాఖ్యలు కాదని చెప్పారు.

ప్రభంజన్ యాదవ్ మృతికి సంతాపం

సాక్షి, హైదరాబాద్: మూడు దశాబ్దాలుగా బీసీ, సామాజిక న్యాయ ఉద్యమాలలో చురుగ్గా పనిచేస్తూ.. తెలంగాణ ఉద్యమంలో సైతం విశిష్ట పాత్ర పోషించిన ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ మృతిపై బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ మనవడిని తెలంగాణ రాష్ట్రానికి పలుమార్లు తీసుకొచ్చి.. బీసీ నాయకులలో ఉద్వేగాన్ని, బీసీల ఉద్యమాలపై ఆసక్తిని రేకెత్తించిన వైనాన్ని గురువారం ఒక ప్రకటనలో ఆయన గుర్తు చేసుకున్నారు.

రామేంద్రకుమార్‌కు ముందస్తు బెయిల్

తుపాకి సరఫరా చేసినట్లు కేసు

సాక్షి, హైదరాబాద్: గచ్చిబౌలి ప్రిజం పబ్ కాల్పుల కేసులో అరెస్టయిన బత్తుల ప్రభాకర్‌కు తుపాకులు సరఫరా చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రామేంద్ర కుమార్ రవికి హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. దాదాపు 80 క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్న ప్రభాకర్.. 2025, ఫిబ్రవరిలో గచ్చిబౌలిలోని ప్రిజం పబ్‌లో ఒక పోలీసు అధికారిపై కాల్పులు జరిపాడు. ఈ కేసులో అతన్ని అరెస్టు చేయగా, తుపాకిని బిహార్ నుంచి తెచ్చుకున్నట్లు చెప్పాడు. దీని ఆధారంగా బిహార్‌కు చెందిన సివిల్ ఇంజనీర్ రామేంద్ర కుమార్ రవిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో పోలీసులు తనను అరెస్టు చేసే అవకాశం ఉందని, ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై జస్టిస్ శ్రీనివాస్‌రావు గురువారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సెక్రటేరియట్ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలకు నామినేషన్లు

సాక్షి, హైదరాబాద్: ఈనెల 26న జరగనున్న సెక్రటేరియట్ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికల్లో ఆఫీసు బేరర్లు, ఈసీ సభ్యుల ఎన్నికల్లో పోటీకి పలువురు నామినేషన్లు దాఖలు చేశారు. అధ్యక్ష పదవికి ముగ్గురు, జనరల్ సెక్రటరీగా నలుగురు, ఉపాధ్యక్షులుగా ముగ్గురు, కోశాధికారిగా ముగ్గురు, ఈసీ సభ్యులుగా ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన ఈనెల 19న ఉదయం, ఎన్నికలు 26న జరగనున్నాయని ఎన్నికల అధికారి శారదాబాయి తెలిపారు.

నీ గూడు చెదిరింది...


కొంగలకు చికిత్స అందిస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ(రామగుండం): కొంగల గూళ్లు కూలిపోవడంతోపాటు వాటి పిల్లలు గాయాలతో మృత్యువాత పడ్డాయి. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగిన ఈ విషాదకర సంఘటన వివరాలివి. గోదావరిఖని అడ్డగుంటపల్లిలో రోడ్డు సమీపంలోని పెద్ద చింతచెట్టును బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. దీంతో చెట్టుకొమ్మలపై పొదిగిన కొంగపిల్లలతో సేదదీరుతున్న వందలాది కొంగల గూళ్లు చెదిరిపోయాయి. కొమ్మల కింద పడిన పిల్లలు పెద్దసంఖ్యలో చనిపోగా.. చాలావరకు గాయపడ్డాయి. గాయపడిన కొంగలు కొమ్మలపైనే గురువారం తెల్లవారేదాకా అరవడంపై పర్యావరణ, పక్షి ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన కొంగపిల్లల ఖననం, తీవ్రంగా గాయపడిన వాటికి చికిత్స, గూడు చెదిరిన వాటిని మరోచోటికి తరలించడానికి రామగుండం నగరపాలక సంస్థ, అటవీ, పశువైద్యాధికారులు రంగంలోకి దిగారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సతీశ్, జిల్లా పశు వైద్యాధికారి శంకర్‌తోపాటు వైద్యుడు పల్లె ప్రసాద్, సిబ్బంది చంద్రశేఖర్, హ్యాండ్స్ టూ సర్వ్ ఎన్జీవో వ్యవస్థాపకుడు దేవినేని అరవింద్‌స్వామి సేవలు అందించారు. కాగా, బతికిన కొంగలను కరీంనగర్‌లోని పార్క్‌కు తరలించారు. గాయపడిన కొంగల చికిత్సకు సుమారు రూ.8వేల వరకు తన సంస్థ ద్వారా వెచ్చించినట్లు అరవింద్‌స్వామి తెలిపారు. కాగా, చింతచెట్టు నరికివేతతో రామగుండం బల్దియాకు సంబంధం లేదని కమిషనర్ (ఎఫ్‌ఏసీ) అరుణశ్రీ స్పష్టం చేశారు.


కొంగలను ప్రత్యేక వాహనంలో తరలిస్తున్న ప్రతినిధులు



చినుకు..కినుకు

ముందుగా పలకరించిన తొలకరిని చూసి రైతన్న పులకరించిపోయాడు. తుపానుల తాకిడికి ముందే పంట ఒబ్బిడి చేసుకోవచ్చుననుకుని వడివడిగా ఏరువాకకు సిద్ధమయ్యాడు. వానచినుకు ఊరించి ఉసూరుమనిపించడంతో ఇప్పుడు నెర్రెలిచ్చిన నేలను చూసి తలపట్టుకుంటున్నాడు. ఎండిపోతున్న నారుమళ్లను చూడలేక చినుకు కోసం దీనంగా ఆకాశం వంక చూస్తున్నాడు. ఏలూరు శివారులో ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



తీరానికి తీరని గాయం

విశాఖ తీరంలో సముద్రపు కోత రోజురోజుకూ పెరిగిపోతోంది. గత కొన్ని నెలలుగా వైఎంసీఏ ఎదుట సముద్రతీరం భారీగా కోతకుగురవుతోంది. ఇక్కడ కొన్ని కొబ్బరి చెట్లు సైతం కోత కారణంగా కూలిపోయాయి. తాజాగా పాండురంగాపురం సమీపంలోనూ తీరంలోని ఇసుకమేటలు కోతకు గురవుతున్నాయి. అధికారులు దీనిపై దీనిపై దృష్టిపెట్టి నిపుణుల సూచనలతో ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



ఇక చీనీ వంతు

ఆరుగాలం శ్రమించి మంచి ఫలసాయం సాధిస్తున్న రైతు మార్కెట్ ముంగిట బోల్తాపడుతున్నాడు. మొన్న అరటి, నిన్న మామిడి రైతులు ఉసూరుమనగా, నేడు చీనీ రైతుల వంతు వచ్చింది. మంచి దిగుబడి వచ్చింది.. అప్పులు తీరుతాయని ఆశతో చీనీకాయలు అనంతపురం మార్కెట్‌కు తెస్తున్న రైతులు ఆశించిన ధర దక్కకపోవడంతో ఉసూరుమంటున్నారు. కాయలను కుప్పలుగా పోసి కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

ప్లాస్టిక్ రహితంగా ప్రభుత్వ కార్యాలయాలు

- తొలుత అక్టోబర్ నాటికి 17 కార్పొరేషన్లలో అమలుకు చర్యలు
- సీఎస్ కె.విజయానంద్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కె.విజయానంద్ తెలిపారు. స్వర్ణాంధ్ర పీ–4 ఫౌండేషన్, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన తదితర అంశాలపై ఆయన గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణకు దశల వారీగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అక్టోబరు నాటికి 17 మున్సిపల్ కార్పొరేషన్లను ప్లాస్టిక్ రహిత కార్పొరేషన్లుగా ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. స్వర్ణాంధ్ర పీ–4 ఫౌండేషన్ కింద ఆగస్టు 15నాటికి 15 లక్షల బంగారు కుటుంబాల దత్తతను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని తెలిపారు. ఇప్పటికే 19,17,000 బంగారు కుటుంబాలను గుర్తించగా, 5.20 లక్షల కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారని వివరించారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద 1,027 గ్రామాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇప్పటికే 765 గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా ప్రకటించామని, మరో 262 గ్రామాలను కూడా త్వరగా ప్రకటించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు.

డీఎస్సీ-2003 టీచర్లకు పాత పెన్షన్ ఇవ్వాలి

స్కూల్ టీచర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం పాత పెన్షన్ వర్తింపజేయాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసులు, టి.చందనరావు ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్యపై ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదన్నారు. న్యాయమైన పాత పెన్షన్ విధానం డిమాండ్ సాధనకు శుక్రవారం అన్ని జిల్లా కేంద్రాల్లో జరిగే నిరసనకు స్కూల్ టీచర్స్ అసోసియేషన్ మద్దతిస్తున్నట్టు ప్రకటించారు.

అమ్మవార్లకు 1,400 కిలోల భారీ సారెలు



తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులోని మదుగులమ్మ, నూకాలమ్మ అమ్మవార్లకు గురువారం భక్తులు 1400 కిలోల భారీ సారెలు సమర్పించారు. బిక్కవోలు తాళ్ళవారి ఆడపడుచు మదుగులమ్మ తల్లికి స్థానిక మహిళలు ఇంటి వద్ద చేసిన పలు రకాల 800 కిలోల పిండివంటలు సమర్పించారు. అలాగే పసుపు, కుంకుమ, గాజులు, అరటి పండ్లు, కొబ్బరి కాయలు, చీరలు, పండ్లు కూడా అందజేశారు. తొలుత శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయానికి చేరుకుని, అక్కడి నుంచి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించి, సారె సమర్పించారు. అలాగే, నూకాలమ్మ తల్లికి పసుపు, కుంకుమ, గాజులు, అరటి తదితర పండ్లతో పాటు 600 కిలోల స్వీట్లు సమర్పించారు. రెండు ఆలయాల వద్ద అమ్మవార్లకు సమర్పించిన సారెలను భక్తులకు పంపిణీ చేశారు. – బిక్కవోలు

రైతుల నోట్లో మట్టి కొట్టి.. కంపెనీలకు దోచిపెట్టి..



- రూ.కోట్లు పంచుకు తినేందుకు కూటమి పెద్దల స్కెచ్
- కోకో కంపెనీలకు రూ.14.88 కోట్లు మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఈ క్రాప్ డేటా ఆధారంగా రైతుల వద్ద 1,620 టన్నుల కోకో నిల్వలు

సాక్షి, అమరావతి: కోకో గింజలకు తగిన ధర లభించక నష్టాల పాలైన రైతుల నోట్లో మట్టి కొట్టిన టీడీపీ కూటమి పెద్దలు, కంపెనీలు కుమ్మక్కై రూ.కోట్లు పంచుకుతినేందుకు స్కెచ్ వేశారు. ప్రస్తుత సీజన్‌లో రైతుల నుంచి ప్రభుత్వం నిర్దేశించిన కోకో ధర కిలో రూ.500 చొప్పున 2,976.76 టన్నులు సేకరించిన కంపెనీలకు కిలోకు రూ.50 ప్రోత్సాహకం కింద రూ.14.88 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

స్వాహా చేసేందుకే..

కోకో గింజలకు నాణ్యతతో సంబంధం లేకుండా 2023–24 సీజన్‌లో కిలో రూ.1,050కు పైగా ధర లభించగా, ప్రస్తుత సీజన్‌లో అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో రూ.770కు పైగా పలుకుతున్నప్పటికీ కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులకు ధర లేకుండా చేశారు. ప్రీమియం గింజలను సైతం కిలో రూ.300–450కు మించి కొనలేమని చేతులెత్తేశారు. ఆఫ్ సీజన్ (వర్షకాలం పంట) గింజలనైతే కొనే వారే లేకపోవడంతో దళారులకు కిలో రూ.200–250 చొప్పున రైతులు తెగనమ్ముకోవాల్సి వచ్చింది. రాష్ట్రంలో 1.12 లక్షల ఎకరాల్లో కోకో పంట సాగవుతుండగా.. ఎకరాకు 3–4 క్వింటాళ్ల చొప్పున ప్రస్తుత సీజన్‌లో 12 వేల టన్నుల దిగుబడి వచ్చినట్టు అంచనా. దాదాపు 10 వేల టన్నులకుపైగా రైతులు అయినకాడికి అమ్ముకోగా.. ఈ క్రాప్ డేటా ఆధారంగా రైతుల వద్ద 1,620 టన్నులు కోకో గింజలు ఉండిపోయినట్టు మార్చిలోనే ఉద్యాన శాఖాధికారులు లెక్కతేల్చారు. మద్దతు ధర కల్పించేందుకు రైతులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టడంతో ప్రభుత్వం జోక్యం చేసుకుని కిలో రూ.500 తక్కువ కాకుండా కొనుగోలు చేయిస్తామని హామీ ఇచ్చింది. తమ వద్ద నిల్వలు పేరుకుపోయాయని, ఇప్పుడున్న పరిస్థితుల్లో కొనలేమని, ప్రీమియం గింజలకు కిలోకు రూ.450కు మించి ఇవ్వలేమని కంపెనీలు తెలిపాయి. కిలో రూ.500 చొప్పున రైతులకు చెల్లిస్తే.. రూ.50 చొప్పున ప్రోత్సాహకంగా అందిస్తామని ప్రభుత్వం కంపెనీలకు భరోసా ఇచ్చింది. జూన్ 30 వరకు సేకరించేందుకు వీలుగా మార్గదర్శకాలు జారీ చేసింది. క్రాప్ డేటా ఆధారంగా ఎకరాకు 3 క్వింటాళ్ల సరాసరి దిగుబడులొచ్చినట్టుగా లెక్కతేల్చారు. ఇప్పటివరకు అమ్ముకోగా, రైతుల వద్ద మిగిలిన నిల్వల వివరాలను సమీప రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకుంటే ఆ మేరకు కంపెనీలు కిలో రూ.500 చొప్పున చెల్లిస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. వాస్తవానికి రైతుల వద్ద 1,620 టన్నుల గింజలున్నాయని ప్రకటించగా, ఆఫ్ సీజన్‌లో ఉన్న నిల్వలు కూడా కలుపుకున్నా 2వేల టన్నులకు మించి ఉండవు. పైగా ఈ నిల్వల్లో కొత్త పంటకు చెందిన నాణ్యమైన గింజలకు మాత్రమే కిలో రూ.500 చొప్పున కొన్ని కంపెనీలు చెల్లించాయి. మరికొన్ని కంపెనీలు కిలో రూ.450కు మించి చెల్లించలేదు. నాణ్యత తక్కువగా ఉన్న గింజలకు దళారులు కిలో రూ.300కు మించి చెల్లించలేదు. వాస్తవ పరిస్థితులు ఇలా ఉంటే కంపెనీలు మాత్రం ఏకంగా 2,976.76 టన్నులు సేకరించినట్టు చెప్పడం విస్మయానికి గురిచేస్తోంది. తొలుత 1,620 టన్నులు మాత్రమే రైతుల వద్ద ఉన్నాయని చెప్పారు. కానీ.. చివరికి వచ్చేసరికి అదనంగా 1356.76 టన్నులు సేకరించినట్టు లెక్కలు చూపుతున్నారు. ఈ గింజలు ఎక్కడ నుంచి వచ్చాయని రైతులు ప్రశ్నిస్తున్నారు. పైగా సేకరించిన గింజలన్నీ ప్రీమియం గింజలుగానే నమోదు చేశారు. ఆ మేరకు కిలోకు రూ.50 చొప్పున ప్రోత్సాహకం కింద కంపెనీలకు ఇచ్చేందుకు రూ.14.88 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. తొలుత అంచనా వేసిన 1,620 టన్నుల్లో కనీసం 20–30 శాతం గింజలు నాణ్యత లేదనే సాకుతో కిలో రూ.300కు మించి ధర చెల్లించలేదు. అయినా సరే 1,620 టన్నులకు కిలో రూ.50 చొప్పున ప్రోత్సాహకం లెక్కతేల్చినా రూ.8 కోట్లకు మించదు. అలాంటిది ఏకంగా 2,976.76 టన్నులకు రూ.14.88 కోట్లు చెల్లించడం ద్వారా కంపెనీలతో కుమ్మక్కై ఆ మొత్తాలను స్వాహా చేసేందుకు కూటమి పెద్దలు పథకం పన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రైతుల పేరిట కంపెనీలకు దోచిపెట్టేందుకే..

రైతుల నుంచి 2,976 టన్నులు కోకో గింజలను కిలో రూ.500 చొప్పున కంపెనీల ద్వారా కొనుగోలు చేయించినట్టు ప్రభుత్వం గొప్పగా చెబుతోంది. రైతుల నుంచి 1,620 టన్నులు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం 2,976 టన్నులు సేకరించినట్టు ప్రకటించింది. ఇప్పటికీ తమ వద్ద ఉన్న టన్నుల కొద్దీ కోకో గింజలు కొనుగోలు చేయడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కంపెనీలు నేటికీ కిలో రూ.450కు మించి చెల్లించడం లేదంటున్నారు. కిలోకు రూ.50 చొప్పున ప్రోత్సాహకం కింద రైతుల తరఫున కంపెనీలకు రూ.14.88 కోట్లు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించడం విస్మయానికి గురిచేస్తోంది. కొనుగోలు, ప్రోత్సాహకం చెల్లింపుల విషయంలో పారదర్శకత పాటించాలి.

– కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి, ఏపీ కోకో రైతుల సంఘం

రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలి

వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు పేర్కొన్నారు. ఈ ఏడాది కనీసం 11 శాతం తగ్గించేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించే ప్రత్యామ్నాయ పద్ధతులను, వాటి ప్రయోజనాలను తెలిపే వాల్‌పోస్టర్‌ను గురువారం మంగళగిరిలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో డైరెక్టర్ ఢిల్లీ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువుల స్థానంలో సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో సాలీనా 36.5 లక్షల టన్నుల ఎరువులను వినియోగమవుతున్నాయని, ఈ ఏడాది 32.50 లక్షల టన్నులకు కుదించాలన్నారు. ఎరువుల వినియోగాన్ని నియంత్రించే లక్ష్యంతో రూపొందించిన ఈ పోస్టర్లు, కరపత్రాల ద్వారా గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

రామగుండం ఎరువులకు గండం

- అమోనియా పైప్‌లైన్ లీక్.. ప్లాంట్ షట్‌డౌన్
- ప్లాంట్ పునరుద్ధరణకు 20 రోజుల సమయం

ఫెర్టిలైజర్ సిటీ (రామగుండం): తెలంగాణతోపాటు 6 రాష్ట్రాల్లో యూరియా సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఎరువుల కర్మాగారం (ఆర్‌ఎఫ్‌సీఎల్) బుధవారం రాత్రి అమ్మోనియా కన్వెర్టర్ పైప్‌లైన్ లీక్ కావడంతో ప్లాంట్‌ను షట్‌డౌన్ చేశారు. దీంతో యూరియా ఉత్పత్తి నిలిచిపోయింది. ప్లాంట్ మరమ్మతులకు సుమారు 20 రోజుల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర, ఎరువులు రసాయనాల మంత్రిత్వ శాఖ 12.7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. అయితే, ప్లాంట్ వార్షిక మరమ్మతుల నేపథ్యంలో గత మే 6న ప్లాంట్ షట్‌డౌన్ చేశారు. జూన్ 13న మరమ్మతులు పూర్తి కావడంతో పునరుద్ధరించారు. జూన్ 16న యూరియా ఉత్పత్తి ప్రారంభమైంది. దీంతో జూన్‌లో 46,347.57 మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేశారు. కర్మాగారంలో ఉత్పత్తి అయిన యూరియాలో ఏప్రిల్, జూన్‌లో తెలంగాణ రాష్ట్రానికి 30 శాతం యూరియానే కేటాయించారు.

సూర్యప్రభపై కుమార స్వామి చిద్విలాసం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలోని కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం స్వామివారు సూర్యప్రభ వాహనంపై శ్రీకాళహస్తి పురవీధుల్లో ఊరేగారు. ముందుగా ఆలయ అలంకార మండపంలో శ్రీవల్లి, దేవసేన సమేత కుమారస్వామివారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు.





చుట్టూ పచ్చని కొండలు.. గిరులపై నుంచి జాలువారే జలపాతాల అందం చూసేందుకు రెండు కళ్లు చాలడం లేదు. ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో కురుస్తున్న వర్షాలకు జలపాతాలు ఉప్పొంగి ప్రవహిస్తూ కనువిందు చేస్తుండటంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. వీటిని తిలకించేందుకు ఉత్సాహంగా తరలివస్తున్న సందర్శకులు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

పాల పొంగులా పరవళ్లు

- గిరులపై నుంచి ఉరకలేస్తున్న జలపాతాలు ■ ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో విస్తారంగా వర్షాలు
- భారీగా వరదనీరు చేరికతో కనువిందు ■ సందర్శకుల మదిని దోచేస్తున్న ప్రకృతి అందాలు

ముంచంగిపుట్టు: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు జలపాతాలు ఉరకలేస్తున్నాయి. డుడుమ జలపాతం 558 అడుగుల పైనుంచి మంచు తెరల మధ్య జాలు వారుతూ పర్యాటకులను కట్టిపడేస్తోంది. అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలంలోని కుమడ పంచాయతీలో జడిగూడ జలపాతం కనువిందు చేస్తోంది. ముంచంగిపుట్టు– పెదబయలు మండలాల సరిహద్దులో తారాబు జలపాతం ఎత్తయిన గిరులపై నుంచి జాలువారుతూ పాలనురగను తలపిస్తోంది. బరడ పంచాయతీ పరిధిలో హంశబంద, జర్జుల పంచాయితీ బురదగుంట జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి. బూసిపుట్టు పంచాయతీ, నంతవీధి, దోనిపుట్టు గ్రామాల దగ్గర నెమలి జలపాతాలు ఎత్తయిన కొండల మధ్య నుంచి జాలువారుతూ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఇక్కడికి సమీపంలోని రంగినిగూడ జలపాతం ఉరకలు వేస్తూ కనువిందు చేస్తోంది. వీటి అందాలను తిలకించేందుకు ఆంధ్రా–ఒడిశా సరిహద్దులతోపాటు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు.ప్రత్యేక అనుభూతి పొందుతున్నారు.



పాల నురగ మాదిరిగా కనువిందు చేస్తున్న తారాబు జలపాతం

ఇబ్బందులు తప్పడం లేదు



ఆంధ్ర ఒడిశా సరిహద్దులో ప్రకృతి అందాలు అద్భుతంగా ఉన్నాయి. ముఖ్యంగా డుడుమ, తారాబు జలపాతాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సినిమా షూటింగ్‌ల సంఖ్య గత కొద్ది నెలలుగా పెరిగాయి. పర్యాటకులు ఉండేందుకు కాటేజీలు, జలపాతాలకు వెళ్లేందుకు రహదారులు లేవు. దీనివల్ల ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వీటిని అందుబాటులోకి తెస్తే సందర్శకుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది. – బాయన నాథ్, పర్యాటకుడు, విశాఖపట్నం

కనీస వసతులు కరువు




ఆంధ్రా ఒడిశా సరిహద్దులో చాలా జలపాతాలు ఉన్నాయి. ప్రతి రోజు వీటిని చూసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో పర్యటకులు వస్తున్నారు. తారాబు,డుడుమ జలపాతాల వద్ద సినిమా షూటింగ్‌లు జరుగుతున్నాయి. అయితే కనీస వసతులు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు సౌకర్యాలు కల్పిస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి.


–గంపరాయి అనిల్, ఫొటోగ్రాఫర్, ముంచంగిపుట్టు



నెమలి జలపాతం



జాలువారుతున్న రంగినిగూడ జలపాతం



తారాబు జలపాతం వద్దకు కర్రల నిచ్చెనపై నుంచి వెళ్తున్న పర్యాటకులు

వసతుల్లేక నరకం

జలపాతాల అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులు రహదారి, కాటేజీల సౌకర్యం లేక, తినేందుకు ఆహారం దొరక్క నరకం చూస్తున్నారు.

- తారాబు జలపాతానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ముంచంగిపుట్టు నుంచి బూసిపుట్టు మీదుగా గుంజువాడ చేరుకోవాలి. అక్కడి నుంచి జలపాతం వద్దకు రెండు కిలోమీటర్ల పొడవునా బురదలోంచి వెళ్లాలి. జలపాతం దగ్గరకు వెళ్లేందుకు స్థానికులు కర్రలు ఏర్పాటుచేశారు. ప్రమాదకర పరిస్థితుల్లో అక్కడికి చేరుకుంటున్నారు. బూసిపుట్టు నుంచి పిట్టలబుర్ర వరకు రోడ్డు మంజూరైంది. పనులు మొదలుపెట్టి వదిలేశారు.
- జడిగూడ జలపాతానికి ముంచంగిపుట్టు నుంచి కుమడ చేరుకోవాలి. అక్కడ నుంచి భల్లుగుడ మీదుగా కిలోమీటరు మేర కాలినడకన వెళ్లాలి. తుప్పల మయంగా ఉండటంతో సందర్శకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ స్థానికులు కొంతమేర రహదారి మార్గాన్ని రాళ్లతో మెరుగుపరిచారు.
- రంగినిగూడ జలపాతానికి ముంచంగిపుట్టు నుంచి లక్ష్మీపురం మీదుగా రంగినిగూడ వెళ్లాలి. అక్కడి నుంచి అరకిలోమీటరు దూరంలో ఉన్న జలపాతం వద్దకు వెళ్లేందుకు రహదారి లేదు.
- నెమలి జలపాతాలకు ముంచంగిపుట్టు నుంచి సరియాపల్లి మీదుగా వెళ్లాలి. అడవిమార్గంలో మూడు కిలోమీటర్ల మేర నడిచి కొండలపై నుంచి వెళ్లాలి.

సాక్షి సినిమా



● నాగార్జున ● ప్రభాస్ ● నాగచైతన్య ● రవితేజ ● విజయ్ ఆంటోని ● శివ కార్తికేయన్

25, 50, 100, 125, 150...
చూడ్డానికి ఇవి కేవలం నంబర్లే. కానీ, చిత్ర పరిశ్రమలో వీటికి చాలా ప్రాధాన్యం ఉంది. ప్రత్యేకించి నటీనటుల కెరీర్‌లో ఈ మైలురాయి నంబర్లు ప్రత్యేకమనే చెప్పాలి. తమ కెరీర్‌లో ల్యాండ్ మార్క్ చిత్రాలపై కథానాయకులతో పాటు దర్శకులు, సంగీత దర్శకులు, నిర్మాతలు కూడా ప్రత్యేకమైన దృష్టి సారిస్తారు. ఈ మైల్ స్టోన్ మూవీస్‌పై ఇటు ఇండస్ట్రీ వర్గాలతో పాటు అటు ప్రేక్షకుల్లోనూ ఫుల్ క్రేజ్ ఉంటుంది. అందుకే బాక్సాఫీస్ వద్ద మైలురాయి చిత్రాలు మంచి వసూళ్లు సాధిస్తుంటాయి. ప్రస్తుతం హీరోలు అక్కినేని నాగార్జున, ప్రభాస్, రవితేజ, నాగచైతన్య, విజయ్ ఆంటోని, శివ కార్తికేయన్ వంటి పలువురు తమ కెరీర్‌లో మైల్‌స్టోన్ సినిమాలతో బిజీ బిజీగా ఉన్నారు. అయితే ఈ మైలురాయితో ఆగేదిలేదు.. జర్నీ కంటిన్యూస్ అన్నట్లు జోరుగా హుషారుగా సినిమాలు ఒప్పుకుంటున్నారు. ఇక ఈ స్టార్స్ మైల్ స్టోన్ మూవీ గురించి చూద్దాం...

మైల్ స్టోన్

జర్నీ కంటిన్యూస్..

నాగార్జున @ 100

తెలుగు చిత్ర పరిశ్రమలోని సీనియర్ స్టార్ హీరోల్లో చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్ ఉన్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌కి ఆ నలుగురు నాలుగు స్తంభాల్లా ఉన్నారు. వీరిలో చిరంజీవి ఇప్పటికే 150వ సినిమా మైలురాయిని దాటేశారు. అలాగే బాలకృష్ణ కూడా 100 చిత్రాల మైల్‌స్టోన్‌ని క్రాస్ చేశారు. ప్రస్తుతం ఈ వరుసలో నిలిచారు నాగార్జున. తన నాలుగు దశాబ్దాల కెరీర్‌లో 100వ సినిమా ల్యాండ్ మార్క్ మూవీకి సర్వం సిద్ధం చేసుకుంటున్నారాయన. తన సెంచరీ మూవీ కోసం ఆచి తూచి వ్యవహరిస్తున్నారు. ఆయన వందో చిత్రానికి పూరి జగన్నాథ్, బెజవాడ ప్రసన్న కుమార్, తమిళ డైరెక్టర్ మోహన్ రాజా, నవీన్ పేర్లు ఆన్‌లైన్‌లో చక్కర్లు కొట్టాయి. అయితే తన మైలురాయి 100వ సినిమాని తెరకెక్కించే అవకాశాన్ని తమిళ దర్శకుడు ఆర్‌ఏ. కార్తీక్‌కి ఇచ్చారు నాగార్జున. 'నిత్తం ఒరువానం' (తెలుగులో ఆకాశం) చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం తమిళంలో హిట్‌గా నిలిచింది. ఈ సినిమా కథ, కార్తీక్ తెరకెక్కించిన విధానం నాగార్జునకి బాగా నచ్చడంతో తన వందో సినిమాకి ఆయనకి అవకాశం ఇచ్చారు. ఈ చిత్రంపై ఇటు ఇండస్ట్రీతో పాటు అటు అక్కినేని అభిమానుల్లో ఫుల్ క్రేజ్ నెలకొంది. ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా అద్భుతమైన కథని సిద్ధం చేశారట కార్తీక్. ఈ సినిమాని అన్నపూర్ణ స్టూడియోస్‌పై నాగార్జున నిర్మించనుండటం విశేషం. ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాదే మొదలు కానుంది. ఇదిలా ఉంటే.. 'ఆఫీసర్' (2018) సినిమాతోనే నాగార్జునకి వంద చిత్రాలు పూర్తయ్యాయి. కానీ, అతిథి పాత్రల్లో మెరిసిన చిత్రాలను ఆయన లెక్కలోకి తీసుకోవడం లేదు. హీరోగా, ముఖ్యమైన పాత్రల్లో కనిపించిన చిత్రాలనే కౌంట్ వేస్తున్నారు.

ప్రభాస్ @ 25

'బాహుబలి: ది బిగినింగ్', 'బాహుబలి: ది కన్ క్లూజన్' వంటి బ్లాక్‌బస్టర్స్ తర్వాత వరుస పాన్ ఇండియా సినిమాలతో దూసుకెళుతున్నారు హీరో ప్రభాస్. ఏకకాలంలో రెండు మూడు సినిమాల చిత్రీకరణలో పాల్గొంటున్నారు. 'ఈశ్వర్' (2002) సినిమాతో హీరోగా పరిచయమైన ఆయన 25 సినిమాల మైలురాయిని చేరుకున్నారు. తన మైల్ స్టోన్ మూవీకి దర్శకత్వం వహించే అవకాశం సందీప్ రెడ్డి వంగాకి ఇచ్చారు ప్రభాస్. ఈ చిత్రానికి 'స్పిరిట్' టైటిల్ ఖరారు చేశారు. 'అర్జున్ రెడ్డి, యానిమల్' వంటి సినిమాలతో సూపర్ హిట్స్ అందుకున్న సందీప్ రెడ్డి ఈ సినిమాకి దర్శకత్వం వహించనున్నారు. ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్, కృష్ణన్ కుమార్, మురాద్ ఖేతానీ నిర్మించనున్నారు. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనున్న ఈ చిత్రంలో ప్రభాస్‌కి జోడీగా నటించే చాన్స్ అందుకున్నారు త్రిప్తీ దిమ్రీ. 'యానిమల్' చిత్రంలో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమెకి మరోసారి తన సినిమాలో హీరోయిన్‌గా అవకాశం ఇచ్చారు సందీప్. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. ''ప్రభాస్, సందీప్ రెడ్డి క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న ఈ చిత్రం భారత సినిమా చరిత్రలోనే ఒక గొప్ప ప్రాజెక్టుగా నిలవనుంది. 9 భాషల్లో ఈ సినిమాని విడుదల చేస్తాం'' అని చిత్ర బృందం పేర్కొంది. ప్రభాస్ ప్రస్తుతం 'ది రాజా సాబ్', 'ఫౌజి' సినిమాలతో బిజీగా ఉన్నారు.

రవితేజ @ 75

హీరో రవితేజ జెట్ స్పీడ్‌లో సినిమాలు చేస్తుంటారు. హిట్లూ, ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా వరుస చిత్రాలతో దూసుకెళుతుంటారాయన. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించిన ఆయన స్టార్ హీరోగా వరుస సినిమాలు చేస్తున్నారు. తన కెరీర్‌లో 75 సినిమాల మైలురాయిని చేరుకున్నారు రవితేజ. ఈ చిత్రానికి 'మాస్ జాతర' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. భాను భోగవరపు దర్శకత్వం వహించిన 'మాస్ జాతర' రవితేజ కెరీర్‌లో 75వ చిత్రం. 'ధమాకా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో రవితేజ, హీరోయిన్ శ్రీలీల 'మాస్ జాతర'లో రెండోసారి జోడీగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. రవితేజ కెరీర్‌లో ఓ మైల్ స్టోన్‌గా రూపొందిన ఈ సినిమాపై ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో, రవితేజ అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. ఈ ఏడాది మే 9న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా వాయిదా పడింది. ఆగస్టు 27న విడుదల చేయనున్నారు మేకర్స్. ''రవితేజ నుంచి అభిమానులు, ప్రేక్షకులు కోరుకునే విందు భోజనంలాంటి మాస్ ఎంటర్‌టైనర్‌గా 'మాస్ జాతర' రూపొందింది'' అని చిత్రబృందం ప్రకటించింది.

నాగచైతన్య @ 25

'తండేల్' సినిమాతో సూపర్ హిట్ అందుకోవడంతో పాటు వంద కోట్ల వసూళ్లు సాధించిన హీరోల క్లబ్‌లో చేరిన నాగచైతన్య ఫుల్ జోష్‌లో ఉన్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న చిత్రం 'ఎన్‌సీ 24' (వర్కింగ్ టైటిల్). కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి హీరోయిన్. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా రెండో షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ఇది చైతన్య కెరీర్‌లో 24వ సినిమాగా తెరకెక్కుతుండగా.. తన మైల్ స్టోన్ 25వ చిత్రం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారట ఆయన. ఈ చిత్రం ద్వారా కిశోర్ అనే కొత్త దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయం కానున్నారనే వార్తలు వినిపించాయి. ఆయన చెప్పిన కథ నచ్చడంతో చైతన్య పచ్చ జెండా ఊపారని సమాచారం. అయితే నాగచైతన్య 25వ సినిమా దర్శకుడిగా తాజాగా శివ నిర్వాణ పేరు బలంగా వినిపిస్తోంది. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'మజిలీ' (2019) చిత్రం మంచి విజయం అందుకుంది. అందుకే తన మైల్ స్టోన్ సినిమా కోసం మరోసారి శివ నిర్వాణకి చైతన్య అవకాశం ఇచ్చారనే వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. 'ఖుషీ' (2023) చిత్రం విడుదలై దాదాపు రెండేళ్లు కావస్తున్నా మరో కొత్త సినిమాని ప్రకటించలేదు శివ నిర్వాణ. ఆయనతో మరోసారి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్న చైతన్య ఇప్పటికే పిలిపించి, మాట్లాడారట. చైతన్య కోసం ఓ పవర్‌ఫుల్ లైన్‌ని శివ నిర్వాణ చెప్పడంతో ఆయనకు నచ్చిందని, పూర్తి కథని సిద్ధం చేయాలని చెప్పినట్లు ఫిల్మ్‌నగర్ టాక్. ఇదిలా ఉంటే.. 'సర్దార్' మూవీ ఫేమ్ తమిళ దర్శకుడు పీఎస్ మిత్రన్ కూడా నాగచైతన్యకి ఓ కథ వినిపించినట్లు తెలుస్తోంది. మరి... నాగచైతన్య కెరీర్‌లోని 25వ చిత్రానికి దర్శకుడు ఎవరు? అనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి.

విజయ్ ఆంటోని @ 25

మ్యూజిక్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించిన విజయ్ ఆంటోని ఆ తర్వాత నటుడిగా మారారు. హీరోగా, సంగీత దర్శకుడిగా బిజీగా ఉంటూనే దర్శకుడిగా, నిర్మాతగానూ మారారాయన. హీరోగా వరుస సినిమాలు చేస్తున్న ఆయన తన కెరీర్‌లో నటించిన 25వ మైల్‌స్టోన్ మూవీ 'శక్తి తిరుమగన్'. అరుణ్ ప్రభు దర్శకత్వంలో మీరా విజయ్ ఆంటోని సమర్పణలో విజయ్ ఆంటోని నిర్మించారు. ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. 'శక్తి తిరుమగన్' తెలుగులో 'భద్రకాళి' పేరుతో విడుదల కానుంది. ఇది ఆయన కెరీర్‌లో 25వ చిత్రం కావడంతో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని, ఎంతో జాగ్రత్తగా మలిచారట. దాదాపు రూ. 200 కోట్ల కుంభకోణం చుట్టూ ఈ కథ తిరుగుతుందట. విజయ్ గతంలో కంటే ఈ సినిమాలో స్టైలిష్‌గా, యాక్షన్ హీరోగా కనిపించనుండటంతో పాటు ఆయనే సంగీతం అందిస్తుండటం విశేషం. ఇదిలా ఉంటే.. 'శక్తి తిరుమగన్' చిత్రానికి తొలుత 'పరాశక్తి' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. అయితే శివ కార్తికేయన్ హీరోగా నటిస్తున్న చిత్రానికి కూడా 'పరాశక్తి' అని టైటిల్ ఫిక్స్ చేయడంతో విజయ్ ఆంటోని 'శక్తి తిరుమగన్'గా పేరు మార్చుకున్నారు.

శివ కార్తికేయన్ @ 25

వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ అనతి కాలంలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు శివ కార్తికేయన్. తన కెరీర్‌లో ఆయన నటిస్తున్న 25వ ల్యాండ్ మార్క్ మూవీ 'పరాశక్తి'. 'గురు, ఆకాశమే నీ హద్దురా' చిత్రాల ఫేమ్ సుధా కొంగర ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రవి మోహన్, అథర్వ, శ్రీలీల ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఆకాశ్ భాస్కరణ్ నిర్మిస్తున్న ఈ సినిమా తమిళ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రంలో శివ కార్తికేయన్ విద్యార్థి సంఘం నాయకుడిగా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. ఆ మధ్య విడుదలైన టీజర్‌కి మంచి స్పందన వచ్చింది. 'సైన్యమై కదిలిరా... పెను సైన్యమై కదిలిరా...' అంటూ శివ కార్తికేయన్ చెప్పే డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. 2026 జనవరిలో ఈ సినిమా తమిళ, తెలుగు భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

- దేరంగుల జగన్ మోహన్



● జీవీ ప్రకాశ్ కుమార్

జీవీ ప్రకాశ్ కుమార్ గురించి ప్రత్యేకించి పరిచయం అక్కర్లేదు. సంగీత దర్శకుడిగా ఇప్పటికే తానేంటో నిరూపించుకున్నారాయన. ఓ వైపు మ్యూజిక్ డైరెక్టర్‌గా బిజీ బిజీగా ఉంటూనే మరోవైపు హీరోగానూ సినిమాలు చేస్తున్నారు. 'టైగర్ నాగేశ్వరరావ్, ఆదికేశవ, సార్, లక్కీ భాస్కర్, మట్కా, రాబిన్ హుడ్' వంటి తెలుగు చిత్రాలకు తనదైన సంగీతం అందించి, ఇక్కడి ప్రేక్షకులను కూడా అలరించారాయన. అంతేకాదు... ఆయన హీరోగా నటించిన పలు తమిళ చిత్రాలు తెలుగులో డబ్ అయ్యాయి. మ్యూజిక్ డైరెక్టర్‌గా 100 సినిమాల మైలురాయిని చేరుకున్నారు ప్రకాశ్ కుమార్. శివ కార్తికేయన్ హీరోగా నటిస్తున్న 25వ ల్యాండ్ మార్క్ మూవీ 'పరాశక్తి'కి ఆయన సంగీతం అందిస్తున్నారు. ఇది జీవీకి వందో చిత్రం కావడం విశేషం.

భయంగా ఉంది... అయినా సిద్ధమే!

- సల్మాన్ ఖాన్



గాల్వాన్ లోయలో 2020లో భారత్-చైనా సైనికుల మధ్య జరిగిన యుద్ధం, ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంతో రూపొందుతున్న చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్'. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తున్నారు. ఇందులో ఆర్మీ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తారు సల్మాన్. అలాగే ఈ చిత్రంలోని మరో కీలక పాత్రలో నటి చిత్రాంగద సింగ్ కనిపిస్తారు. ఈ సినిమాకు సంబంధించి తన ప్రిపరేషన్ గురించి సల్మాన్ ఖాన్ తాజాగా మాట్లాడుతూ– ''నా గత చిత్రం 'సికందర్' యాక్షన్ మూవీ. 'బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్' డిఫరెంట్ మూవీ. ఇందులో చాలా యాక్షన్ అయితే ఉంది. కానీ గత చిత్రాలతో పోల్చినప్పుడు ఈ చిత్రం పూర్తిగా విభిన్నమైంది. ఈ సినిమా కోసం చాలా శ్రమిస్తున్నాను. ప్రతి రోజూ వర్కౌట్స్ చేస్తున్నాను. ఈ తరహా కష్టాన్ని ఈ సినిమా డిమాండ్ చేస్తుంది. త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించనున్నాం. కష్టమైన లొకేషన్స్‌లో షూట్ చేయాల్సి ఉంది. లడక్‌లో దాదాపు ఇరవై రోజుల షూటింగ్ ప్లాన్ చేశాం. ఇందులో ఎనిమిది రోజులు గడ్డకట్టే చలిలో షూటింగ్ చేయాల్సి ఉంది. ఈ విషయం తలచుకుంటే నాకు భయంగా ఉంది. కానీ ఇందులో నేనే నటించడానికి సిద్ధంగా ఉన్నాను. ఫిజికల్‌గా ఈ సినిమా కష్టమైనప్పటికీ ఈ జర్నీ నాకో మంచి మెమొరీ'' అని పేర్కొన్నారు. ఇక అపూర్వ లిఖియా దర్శకత్వం వహించనున్న ఈ సినిమాను సల్మాన్ ఖాన్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది. అనుకున్న ప్రకారం ఈ సినిమా షూటింగ్ పూర్తయితే వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా విడుదల చేసే ఆలోచనలో ఉన్నారట మేకర్స్. ఒకవేళ కుదరకపోతే... సల్మాన్ ఖాన్ ఫేవరెట్ సీజన్ రంజాన్ సందర్భంగా ఈ సినిమా విడుదల కావొచ్చు.

మోనికా కోసం చాలా కష్టపడ్డాను



● పూజా హెగ్డే

''మోనికా ని ఇంతగా ఇష్టపడినందుకు అందరికీ ధన్యవాదాలు'' అని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు పూజా హెగ్డే. రజనీకాంత్ హీరోగా నటించిన 'కూలీ' సినిమాలో తాను చేసిన 'మోనికా...' పాట గురించే ఆమె ఇలా చెప్పారు. అనిరుథ్ రవిచందర్ స్వరపరచిన ఈ స్పెషల్ సాంగ్‌కి మంచి ఆదరణ లభిస్తోంది. ఇంతగా ఆదరణ పొందుతున్న ఈ పాటకి డ్యాన్స్ చేయడం వెనక ఉన్న కష్టం గురించి పూజా హెగ్డే మాట్లాడుతూ – ''ఇప్పటి వరకూ నా కెరీర్‌లో నేను చేసిన పాటల్లో ఫిజికల్‌గా నాకు చాలా టఫ్‌గా అనిపించిన పాట 'మోనికా...'. మండే ఎండ, విపరీతమైన వేడి, దుమ్ము... వీటికి తోడు హై ఎనర్జీ డ్యాన్స్ వల్ల ఈ పాట షూట్ చాలా కష్టంగా అనిపించింది. పైగా కాలు బెణికిన తర్వాత నేను చేసిన తొలి పాట ఇది. ఈ కష్టాలేమీ స్క్రీన్‌పై కనబడనివ్వకుండా గ్లామరస్‌గా కనిపించడంతో పాటు డ్యాన్స్ కూడా జోరుగా చేయాలి. మహా శివరాత్రి నాడు ఈ పాటను చిత్రీకరించాం. ఆ రోజు నేను ఉపవాసం ఉన్నాను. మొత్తానికి 'మోనికా...' కోసం ఎంత కష్టపడాలో అంతా పడ్డాను.. థియేటర్లలో ఈ పాట ఓ బ్లాస్ట్... అందరూ డ్యాన్స్ చేస్తారు. ఇక ఈ పాటకి సంబంధించిన టాస్క్‌ని నేను విజయవంతంగా పూర్తి చేయడానికి నాకు సపోర్ట్ చేసిన డ్యాన్సర్స్‌కి థ్యాంక్స్. ఇదిలా ఉంటే... లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన ఈ 'కూలీ' ఆగస్టు 14న విడుదల కానుంది.

నేనే కావాలని వచ్చేశావు!

''నాతో వస్తే లైఫ్ ఎలా ఉంటుందో ఆలోచించకుండా నేనే కావాలని వచ్చేశావు. మా అమ్మా నాన్నే నన్ను ఇలా చూసుకోలేదని వాళ్లే తిట్టుకునే విధంగా నిన్ను చూసుకుంటా'' అంటూ విజయ్ సేతుపతి చెప్పే డైలాగ్‌తో 'సార్ మేడమ్' ట్రైలర్ ఆరంభమైంది. విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ జంటగా నటించిన చిత్రం 'సార్ మేడమ్'. 'ఎ రగ్డ్ లవ్‌స్టోరీ' అనేది ట్యాగ్ లైన్. పాండిరాజ్ దర్శకత్వంలో సత్యజ్యోతి ఫిలిమ్స్ బ్యానర్‌పై సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ని రిలీజ్ చేసింది చిత్రయూనిట్. ''రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామాగా రూపొందిన సినిమా 'సార్ మేడమ్'. ఇప్పటికే విడుదలైన టీజర్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో మాస్ యాక్షన్ కూడా ఉంటాయి. విజయ్, నిత్యల మధ్య వచ్చే గొడవలు చాలా వినోదాన్ని పంచుతాయి. అలాగే పరోటా మాస్టర్‌గా విజయ్ సేతుపతి కనిపించే సన్నివేశాలు కూడా నవ్వులు పూయిస్తాయి.



● నిత్యామీనన్, విజయ్ సేతుపతి

ఆయన మరోసారి తన సహజమైన నటనతో ఆకట్టుకుంటారు. సంతోష్ నారాయణన్ నేపథ్య సంగీతం సినిమాని మరింతగా ఎలివేట్ చేస్తుంది. ఎం. సుకుమార్ అందించిన విజువల్స్ అందంగా ఉంటాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

బిజినెస్ రీల్

అమెరికా ఈబీ5 ప్రోగ్రాంపై దక్షిణాదిలో ఆసక్తి

యూఎస్ఐఎఫ్ వీపీ అక్షత్ గుప్తా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అమెరికాలో సుమారు రూ. 8.5 కోట్లు పెట్టుబడులు పెట్టడం ద్వారా పర్మనెంట్ రెసిడెన్సీ పొందే అవకాశం కల్పించే ఈబీ-5 ఇమ్మిగ్రెంట్ ఇన్వెస్టర్ ప్రోగ్రాంపై దక్షిణాది వారిలో గణనీయంగా ఆసక్తి కనిపిస్తోంది. దీనికోసం దరఖాస్తు చేసుకునే ప్రతి పది మంది భారతీయుల్లో నలుగురు దక్షిణాదిలో మూలాలు ఉన్న వారేనని యూఎస్ ఇమ్మిగ్రేషన్ ఫండ్ (యూఎస్ఐఎఫ్) వీపీ (బిజినెస్ డెవలప్‌మెంట్) అక్షత్ గుప్తా తెలిపారు. అమెరికాలో ఉంటున్న భారతీయులు, అక్కడ తమ పిల్లలను చదివిస్తున్న వారిలో దీనిపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. నిబంధనలు మారినా కూడా, 2026 సెప్టెంబర్ 30లోగా దరఖాస్తు చేసుకున్న వారి అప్లికేషన్లకెలాంటి సమస్యా ఉండదని అక్షత్ తెలిపారు. తమ సంస్థ ఇప్పటివరకు 6వేల మంది పైగా ఇన్వెస్టర్లకు ఈబీ-5తో ప్రయోజనాన్ని చేకూర్చిందని ఆయన చెప్పారు.

సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో బ్లాక్ బస్టర్ కిలో సేల్..!

హైదరాబాద్: ఆషాఢమాసం సందర్భంగా సౌత్ ఇండియా షాపింగ్ మాల్ 'షాపింగ్ కిలోల్లో.., సంతోషం టన్నుల్లో' పేరుతో 'కిలో సేల్' నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఒక కేజీ కంచిపట్టు చీరలు కొంటే ఒక కేజీ చీరలు ఉచితంగా పొందవచ్చు. అన్ని రకాల వస్త్రాలపై 66% తగ్గింపు, కలంకారీ పట్టుచీర కొనుగోలుపై 2వ చీర రూ.49కే ఇస్తుంది. ప్రతి గ్రాము బంగారు ఆభరణాల కొనుగోలుపై 2 గ్రాముల వెండి ఉచితంగా పొందవచ్చు. కేజీ వెండి వస్తువుల కొనుగోలుపై ఫ్లాటుగా రూ.5,000 తగ్గింపు ఇస్తుంది. వ్యాట్ కూడా 5% నుంచే ప్రారంభం అవుతుంది. అలాగే వెండి ఆభరణాలపై భారీగా డిస్కౌంట్లు ఉన్నాయి. ఆషాఢం 'కిలో సేల్' ఆఫర్లను కస్టమర్లమంతా వినియోగించుకోవాలని సంస్థ అధినేతలు కోరారు.

ఎన్‌టీపీసీ సీఎండీ పదవీకాలం పొడిగింపు

న్యూఢిల్లీ: ఎన్‌టీపీసీ చైర్మన్, ఎండీ గురదీప్ సింగ్ పదవీ కాలాన్నీ కేంద్రం వచ్చే ఏడాది(2026) జూలై 31 వరకు పొడిగించింది. ఈ మేరకు విద్యుత్ మంత్రిత్వ శాఖ ప్రతిపాదనకు కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. పీఎస్‌యూలకు సారథులను ఎంపిక చేసే పీఈఎస్‌బీ ఆ పదవికి సరైన వ్యక్తిని గుర్తించడంలో విఫలమవడంతో సంబంధిత మంత్రిత్వ శాఖ తిరిగి గురదీప్ సింగ్ పేరును ప్రతిపాదించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-7-2025

విశాఖ	540-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500-00
విజయవాడ	520-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATACONSUM	1,103.20	2.01
TATASTEEL	159.97	1.68
HINDALCO	672	0.79
M&M	3,216.00	0.61
TRENT	5,414.00	0.59

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TECHM	1,564.20	-2.72
INDUSINDBK	863	-1.9
INFY	1,581.00	-1.67
WIPRO	258.75	-1.54
SBILIFE	1,802.40	-1.46

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,040
ఎన్ఎస్ఈ	95,272
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,45,938
ఎఫ్ఐఐ	- 3,694
డీఐఐ	+ 2,821

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	67.38 (రాత్రి 11.30కు)	$ 66.38 (క్రితం ముగింపు)
బ్రెంట్	69.31 (రాత్రి 11.30కు)	$ 68.52 (క్రితం ముగింపు)

హెల్త్ స్టార్టప్‌లను ప్రోత్సహించాలి



- ఆస్పత్రులకు పన్నులపరంగా ప్రోత్సాహకాలివ్వాలి
- అప్పుడే మెడికల్ టూరిజం హబ్‌గా ఎదగడం సాధ్యం
- కేపీఎంజీ, ఎఫ్‌హెచ్ఆర్ఏఐ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: 2035 నాటికి భారత్ అంతర్జాతీయ మెడికల్ హబ్‌గా ఎదగాలంటే విదేశీ పేషంట్లకు చికిత్స చేసే ఆస్పత్రులకు పన్నులపరమైన ప్రోత్సాహకాలు ఇవ్వాలని ఓ నివేదిక సూచించింది. అలాగే ఆరోగ్య సంరక్షణ రంగ అంకుర సంస్థలకు మరింత తోడ్పాటు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంది. కేపీఎంజీ ఇన్ ఇండియా, భారతీయ హోటళ్లు, రెస్టారెంట్ అసోసియేషన్ల సమాఖ్య (ఎఫ్‌హెచ్ఆర్ఏఐ) రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం 2025లో 18.2 బిలియన్ డాలర్లుగా ఉండే భారత మెడికల్ టూరిజం మార్కెట్ వార్షికంగా 12.3 శాతం వృద్ధితో 2035 నాటికి 58.2 బిలియన్ డాలర్ల స్థాయికి చేరనుంది. ఈ నేపథ్యంలో దీనికి తోడ్పాటు అందించేందుకు ఎంబసీలు, ఎగ్జిబిషన్లు, డిజిటల్ ప్లాట్‌ఫాంల ద్వారా అంతర్జాతీయంగా బ్రాండింగ్ ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని రిపోర్ట్ సూచించింది. అలాగే, రాష్ట్రాలు, జాతీయ స్థాయిలో 'హీల్ ఇన్ ఇండియా' మిషన్‌ను ఆవిష్కరించాలని పేర్కొంది. 'పెట్టుబడులను ఆకర్షించేందుకు, సేవలను మరింత మెరుగుపర్చుకునేందుకు ప్రభుత్వం ద్రవ్యేతర, ద్రవ్యపరమైన ప్రోత్సాహకాలు ఇవ్వాలి. అంతర్జాతీయ పేషంట్లకు చికిత్స చేసే ఆస్పత్రులకు పన్నుల పరంగా మినహాయింపులు ఇవ్వొచ్చు. మార్కెటింగ్ డెవలప్‌మెంట్ అసిస్టెన్స్ స్కీము కింద సబ్సిడీలను పెంచవచ్చు. డిజిటల్ ప్లాట్‌ఫాంలు సహా ఇతరత్రా మాధ్యమాల్లో మార్కెటింగ్, ప్రమోషన్ కోసం సాంకేతిక సహకారం అందించవచ్చు. అలాగే వెల్‌నెస్ సెంటర్లు సహా వైద్యపరమైన మౌలిక సదుపాయాల విభాగంలోకి 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించవచ్చు' అని నివేదిక తెలిపింది.

మరిన్ని విశేషాలు..

- మెడికల్ టూరిజానికి ప్రత్యక్షంగా దోహదపడే హెల్త్-టెక్, వైద్య పరిశోధనలు, డిజిటల్ హెల్త్ సొల్యూషన్ల విభాగాల్లో పని చేసే స్టార్టప్‌లు, ఇతర సంస్థలకు నిర్దిష్ట సబ్సిడీలు, గ్రాంట్లు ఇవ్వాలి.
- భారత ఆస్పత్రులను కూడా తమ నెట్‌వర్క్‌ల్లో జోడించుకునేందుకు అంతర్జాతీయ బీమా సంస్థలతో కలిసి పనిచేస్తూ బీమా పోర్టబిలిటీ వెసులుబాటును తీసుకురావచ్చు. దీనితో విదేశీ పేషంట్లకు ఆర్థిక ప్రతిబంధకాలు తగ్గుతాయి. బీమా ఉన్న విదేశీ పేషంట్లకు భారత్ మరింత ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారేందుకు ఇది ఉపయోగపడుతుంది.
- వీసా-ఇన్సూరెన్స్ లింకేజీ మధ్య అంతరాలను తగ్గించడం, అంతర్జాతీయ ప్రమాణాలతో, బహు భాషల్లో సేవలందించేలా ఆస్పత్రుల్లో సిబ్బందికి శిక్షణనివ్వడంపై దృష్టి పెట్టాలి.
- మెడికల్, వెల్‌నెస్ టూరిజంపై జాతీయ వ్యూహం, మార్గదర్శ ప్రణాళికకు అనుగుణంగా జాతీయ స్థాయిలో మిషన్ ఏర్పాటు చేయాలి.
- పాలసీల అమలు, అంతర్-మంత్రిత్వ శాఖల సమన్వయం కోసం జాతీయ మెడికల్, వెల్‌నెస్ టూరిజం ప్రమోషన్ బోర్డును సమగ్ర జాతీయ మిషన్‌గా అప్‌గ్రేడ్ చేయాలి.
- మెడికల్ టూరిజం సూచీలో భారత్ 10వ ర్యాంకులో, వెల్‌నెస్ టూరిజంలో 7వ స్థానంలో ఉంది.
- 2024లో భారత్ 4,63,725 మెడికల్ వీసాలను జారీ చేసింది. మెజారిటీ పేషంట్లు బంగ్లాదేశ్, జీసీసీ దేశాలు, ఆఫ్రికా నుంచి వచ్చారు.
- 2024లో అంతర్జాతీయంగా మెడికల్ టూరిజం మార్కెట్ 41.75 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది 2030 నాటికి రెట్టింపు అవుతుందని అంచనా.

రష్యాపై ఆంక్షలు విధిస్తే ప్రత్యామ్నాయాలు ఉన్నాయ్

- ఇతర దేశాల నుంచి చమురు సరఫరా
- కేంద్ర పెట్రోలియం మంత్రి పురి



న్యూఢిల్లీ: రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై అమెరికా ఆర్థిక ఆంక్షల రిస్కును కేంద్రం తోసిపుచ్చింది. రష్యా దిగుమతుల విషయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే, ఇతర దేశాల నుంచి ముడి చమురు సరఫరాతో అధిగమిస్తామని పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. దేశ చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతుల రూపంలోనే సమకూరుతోంది. సాధారణంగా మధ్యప్రాచ్యం నుంచి భారత్‌కు ముడి చమురు సరఫరా అధికంగా అవుతుండేది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి తర్వాత నుంచి మారిన పరిణామాలతో గత మూడేళ్లుగా రష్యా ప్రధాన సరఫరాదారుగా మారిపోయింది. పాశ్చాత్య దేశాలు కొనుగోళ్లు తగ్గించడంతో భారత్ తదితర దేశాలకు రష్యా తక్కువ ధరకే చమురు సరఫరా చేస్తోంది. దీంతో భారత రిఫైనరీలు రష్యా ముడి చమురు దిగుమతుల వైపు మళ్లాయి. ఇప్పుడు మొత్తం దిగుమతుల్లో 40 శాతం రష్యా నుంచే ఉంటున్నాయి. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి పురి దీనిపై మాట్లాడారు. చమురు సరఫరా మార్కెట్లోకి ఇటీవలి కాలంలో గయానా తదితర కొత్త సరఫరాదారులు ప్రవేశించగా, ఇప్పటికే ఉన్న బ్రెజిల్, కెనడాలు సరఫరాను పెంచినట్టు చెప్పారు. గతంతో పోల్చిచూస్తే భారత్ ముడి చమురు సరఫరాలు వైవిధ్యంగా మారినట్టు తెలిపారు. సాధారణంగా 27 దేశాల నుంచి చమురును కొనుగోలు చేస్తుండగా, ఇప్పుడు ఆ సంఖ్య 40కు చేరినట్టు తెలిపారు.

స్థిరంగానే చమురు ధరలు

ముడి చమురు ధర ప్రస్తుతం బ్యారెల్ ధర 68.5 డాలర్ల వద్ద ఉండగా.. రానున్న నెలల్లోనూ 65 డాలర్ల స్థాయిలో స్థిరంగా కొనసాగొచ్చని మంత్రి పురి అభిప్రాయపడ్డారు. పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని 20 శాతం మించి పెంచే విషయమై నీతి ఆయోగ్ అధ్వర్యంలో పరిశ్రమల ప్రతినిధులతో చర్చిస్తున్నట్టు చెప్పారు. మరోవైపు రష్యా సరఫరా నిలిచిపోతే ఉక్రెయిన్-రష్యా సంక్షోభం ముందు నాటి విధానానికి (పూర్వపు సరఫరా చైన్‌కు) మళ్లుతామని ఐవోసీ చైర్మన్ ఏఎస్ సాహ్నే ఇదే కార్యక్రమంలో భాగంగా స్పష్టం చేశారు.

టాటా ఎలక్ట్రానిక్స్, బోష్ జట్టు



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల విభాగాల్లో పరస్పరం సహకరించుకునే దిశగా జర్మన్ టెక్నాలజీ సంస్థ రాబర్ట్ బాష్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు దేశీ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం టాటా ఎలక్ట్రానిక్స్ వెల్లడించింది. దీని ప్రకారం టాటా ఎలక్ట్రానిక్స్ అస్సాంలో ఏర్పాటు చేసే అసెంబ్లీ .. టెస్ట్ యూనిట్లో, గుజరాత్‌లోని ఫౌండ్రీలో చిప్‌ల ప్యాకేజింగ్, తయారీ కార్యకలాపాలపై ఇరు సంస్థలు కలిసి పని చేస్తాయి. అలాగే వాహనాల్లో వినియోగించే ఎలక్ట్రానిక్స్ తయారీ సేవలను అందించే విధంగా స్థానిక ప్రాజెక్టులపై కూడా దృష్టి పెట్టనున్నాయి. దేశీయంగా సమగ్రమైన సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ వ్యవస్థను నెలకొల్పేందుకు తమ భాగస్వామ్యం దోహదపడుతుందని టాటా ఎలక్ట్రానిక్స్ సీఈవో రణ్‌ధీర్ ఠాకూర్ తెలిపారు. అధునాతన ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్‌కి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో సరఫరా వ్యవస్థను పటిష్టం చేసేందుకు ఇది ఉపయోగపడుతుందని రాబర్ట్ బాష్ ఈవీపీ డిర్క్ క్రైస్ చెప్పారు.

జోహో నుంచి ఎల్‌ఎల్‌ఎం



బెంగళూరు: దేశీ టెక్నాలజీ సంస్థ జోహో తమ స్వంత లార్జ్ ల్యాంగ్వేజ్ (ఎల్‌ఎల్‌ఎం) మోడల్‌ను ప్రవేశ పెట్టింది. తమ ఉత్పత్తులను ఉపయోగించే సంస్థల కోసం దీన్ని డిజైన్ చేసినట్లు కంపెనీ తెలిపింది. ఎన్‌విడియాకు చెందిన ఏఐ కంప్యూటింగ్ ప్లాట్‌ఫాంను ఉపయోగించి దీన్ని తాము అంతర్గతంగా తయారు చేసినట్లు పేర్కొంది. ఇంగ్లీష్, హిందీలో మాటలను ఆటోమేటిక్‌గా టెక్స్ట్ కింద మార్చే మోడల్స్‌ను కూడా ప్రవేశపెడుతున్నట్లు వివరించింది. దీన్ని ఇతర భారతీయ, యూరోపియన్ భాషలకు కూడా విస్తరిస్తామని తెలిపింది.

ఈ-కార్ట్స్ వ్యాపారంలోకి కైనెటిక్ గ్రీన్

టొనినో లాంబోర్గినితో జట్టు



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ఎలక్ట్రిక్ కార్ట్‌ల విభాగంలోకి ప్రవేశించడంపై కైనెటిక్ గ్రీన్ దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా గోల్ఫ్, లైఫ్‌స్టయిల్స్ కార్టుల తయారీ కోసం ఇటలీకి చెందిన టొనినో లాంబోర్గినితో చేతులు కలిపింది. వచ్చే దశాబ్దకాలంలో 1 బిలియన్ డాలర్ల పైగా టర్నోవరును లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఏర్పాటు చేసే కైనెటిక్ గ్రీన్ టొనినో లాంబోర్గిని (కేజీటీఎల్) జాయింట్ వెంచర్ సంస్థలో కైనెటిక్ గ్రీన్‌కి 70 శాతం, టొనినోకి 30 శాతం వాటాలు ఉంటాయి. వచ్చే పదేళ్లలో అంతర్జాతీయంగా ఎలక్ట్రిక్ కార్ట్ వ్యాపారంలో 10% వాటాను సాధించాలని నిర్దేశించుకున్నట్లు కైనెటిక్ గ్రీన్ సీఈవో సులజ్జా ఫిరోదియా మోత్వాని తెలిపారు. అమెరికా, యూరప్, ఆసియావ్యాప్తంగా 25-30 మార్కెట్లలో ప్రవేశించడం ద్వారా వచ్చే అయిదేళ్లలో 300 మిలియన్ డాలర్ల ఆదాయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది వ్యవధిలో జాయింట్ వెంచర్ సంస్థ వివిధ మార్గాల్లో 20 మిలియన్ డాలర్లు సమీకరించనున్నట్లు వివరించారు. గోల్ఫ్ కోర్సులు, రిసార్టులు, ఎయిర్‌పోర్టుల్లో ఎలక్ట్రిక్ కార్టులను వాడతారు. ఇవి 80-150 కి.మీ. రేంజితో, 10,000-14,000 డాలర్లకు లభిస్తాయి. దేశీయంగా ఏటా 1,500 యూనిట్లు అమ్ముడవుతున్నాయి.

హెక్సావేర్ చేతికి ఎస్ఎంసీ స్వేర్డ్

డీల్ విలువ రూ.1,029 కోట్లు

న్యూఢిల్లీ: ప్రముఖ ఐటీ కంపెనీ హెక్సావేర్ టెక్నాలజీస్ 120 మిలియన్ డాలర్లతో (రూ.1,029 కోట్లు) ఎస్ఎంసీ స్వేర్డ్‌ను కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (జీసీసీలు) మార్కెట్లో విస్తరణకు ఈ డీల్ దోహదపడుతుందని పేర్కొంది. జీసీసీ కేంద్రాల నిర్మాణం, నిర్వహణ, బదిలీ సేవల్లో ఎస్ఎంసీ స్వేర్డ్ సేవలు అందిస్తోంది. "ఎస్ఎంసీ కొనుగోలుతో జీసీసీ నైపుణ్యాలు మరింత బలపడతాయి. ఎస్ఎంసీ నైపుణ్యాలు మధ్య స్థాయి జీసీసీ విభాగంలో మా మార్కెట్ విస్తరణకు దోహదపడతాయి. ఎస్ఎంసీ సేవలను మా విస్తృతమైన క్లయింట్లకు ఆఫర్ చేస్తాం"అని హెక్సావేర్ టెక్నాలజీస్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం ఇచ్చింది.

దక్షిణాది మార్కెట్ కోసం జేఎస్‌డబ్ల్యూ వాటర్‌గార్డ్ సిమెంట్

ముంబై: దక్షిణాది రాష్ట్రాల్లో వాతావరణానికి అనుగుణంగా ఉండే సీహెచ్‌డీ వాటర్‌గార్డ్ సిమెంటును జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ప్రవేశపెట్టింది. తేమ నుంచి నిర్మాణానికి రక్షణ కల్పించేలా ఇందులో టర్బో జెల్ టెక్నాలజీ ఉపయోగించినట్లు సంస్థ తెలిపింది. అత్యధిక తేమ, భారీ వర్షాలు ఉండే వాతావరణంలోనూ కాంక్రీట్ నిర్మాణాలు దీర్ఘకాలం మన్నేందుకు ఇది తోడ్పడుతుందని వివరించింది. నిర్మాణంలో ఉపయోగించిన ఇనుము తుప్పు పట్టకుండా ఈ ప్రీమియం సిమెంటు రక్షణ కల్పిస్తుందని వివరించింది. ప్రాంతీయంగా కాంట్రాక్టర్లు, సివిల్ ఇంజినీర్లు, బిల్డర్లకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని సంస్థ పేర్కొంది.

క్యూ1 ఫలితాలు

ఎల్‌టీఐమైండ్‌ట్రీ లాభం అప్

క్యూ1లో రూ. 1,254 కోట్లు




న్యూఢిల్లీ: టెక్నాలజీ కన్సల్టింగ్, డిజిటల్ సొల్యూషన్ల దేశీ దిగ్గజం ఎల్‌టీఐమైండ్‌ట్రీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 11 శాతం వృద్ధితో రూ. 1,254 కోట్లను అధిగమించింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 1,134 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 8 శాతం పుంజుకుని రూ. 9,841 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 9,143 కోట్ల టర్నోవర్ నమోదైంది. జూన్‌కల్లా మొత్తం సిబ్బంది సంఖ్య 83,889కు చేరింది. ఇసాప్‌లో భాగంగా ఉద్యోగుల సంక్షేమ నిధికి 67,252 షేర్లను కొత్తగా జారీ చేసేందుకు బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కంపెనీ వెల్లడించింది. వీటిని తదుపరి దశలో అర్హతగల ఉద్యోగులకు బదిలీ చేయనుంది.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌టీఐమైండ్‌ట్రీ షేరు బీఎస్ఈలో 2.6 శాతం క్షీణించి రూ. 5,191 వద్ద ముగిసింది.

ఇండియన్ హోటల్స్ లాభం జూమ్

- కొత్తగా 6 హోటళ్లు షురూ



న్యూఢిల్లీ: ఆతిథ్య రంగ టాటా గ్రూప్ దిగ్గజం ఇండియన్ హోటల్స్ కంపెనీ(ఐహెచ్‌సీఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 27 శాతం జంప్‌చేసి రూ. 329 కోట్లను అధిగమించింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో కేవలం రూ. 260 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 1,596 కోట్ల నుంచి రూ. 2,102 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 1,268 కోట్ల నుంచి రూ. 1,662 కోట్లకు పెరిగాయి. వరుసగా 13వ క్వార్టర్‌లోనూ రికార్డ్ ఫలితాలు సాధించినట్లు కంపెనీ ఎండీ, సీఈవో పునీత్ చత్వాల్ పేర్కొన్నారు. గైడెన్స్‌కు అనుగుణంగా ఆదాయంలో రెండంకెల వృద్ధి సాధించినట్లు తెలియజేశారు. హోటళ్ల విభాగం నుంచి 14 శాతం అధికంగా రూ. 1,814 కోట్లు లభించగా.. 31.4 శాతం ఇబిటా మార్జిన్లు సాధించినట్లు వెల్లడించారు. ఈ కాలంలో 12 ఒప్పందాలు కుదుర్చుకోగా.. కొత్తగా 6 హోటళ్లను ప్రారంభించినట్లు తెలియజేశారు. హోటళ్ల పోర్ట్‌ఫోలియో 390కు చేరినట్లు వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో ఐహెచ్‌సీఎల్ షేరు 0.4 శాతం బలపడి రూ. 754 వద్ద ముగిసింది.

సౌత్ ఇండియన్ బ్యాంక్ లాభం వృద్ధి

మొత్తం ఆదాయం రూ. 2,984 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ సౌత్ ఇండియన్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 10 శాతం వృద్ధితో రూ. 322 కోట్లను తాకింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 294 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,736 కోట్ల నుంచి రూ. 2,984 కోట్లకు బలపడింది. వడ్డీ ఆదాయం రూ. 2,314 కోట్ల నుంచి రూ. 2,362 కోట్లకు స్వల్పంగా పుంజుకుంది. నిర్వహణ లాభం రూ. 508 కోట్ల నుంచి రూ. 672 కోట్లకు ఎగసింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 4.5 శాతం నుంచి 3.15 శాతానికి, నికర ఎన్‌పీఏలు 1.44 శాతం నుంచి 0.68 శాతానికి దిగివచ్చాయి. కనీస మూలధన నిష్పత్తి 18.11 శాతం నుంచి 19.48 శాతానికి మెరుగుపడింది.

ఫలితాల నేపథ్యంలో సౌత్ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 0.6% క్షీణించి రూ. 31 వద్ద ముగిసింది.

జియో ఫైనాన్స్ లాభం ప్లస్

క్యూ1లో రూ. 325 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం ఆర్ఐఎల్ నుంచి విడివడిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 4 శాతం పుంజుకుని రూ. 325 కోట్లను తాకింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 313 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 418 కోట్ల నుంచి రూ. 619 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 79 కోట్ల నుంచి రూ. 261 కోట్లకు భారీగా పెరిగాయి. వడ్డీ ఆదాయం రూ. 162 కోట్ల నుంచి రెట్టింపై రూ. 363 కోట్లకు చేరింది. ఈ కాలంలో జియో పేమెంట్స్ బ్యాంక్(జేపీబీఎల్)లో 14.96 శాతం వాటాకు సమానమైన 7.9 కోట్ల ఈక్విటీ షేర్లను ఎస్‌బీఐ నుంచి సొంతం చేసుకుంది. ఇందుకు రూ. 104.54 కోట్లు వెచ్చించింది. వెరసి 2025 జూన్ 18 నుంచి జేపీబీఎల్ పూర్తి అనుబంధ సంస్థగా అవతరించినట్లు వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో జియో ఫైనాన్స్ షేరు బీఎస్ఈలో 0.5 శాతం బలహీనపడి రూ. 318 వద్ద ముగిసింది.

వంట నూనెల కంపెనీలకు సవాళ్లు!

- ఆదాయం 2-3 శాతం మేర తగ్గొచ్చు
- 0.50 శాతం మేర మార్జిన్లు క్షీణించవచ్చు
- అమ్మకాలు మాత్రం సానుకూలమే
- 2025-26 సంవత్సరంపై క్రిసిల్ అంచనా



ముంబై: వంట నూనెల రిఫైనరీ సంస్థలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో సవాళ్లను ఎదుర్కోనున్నాయి. ముఖ్యంగా వాటి ఆదాయం 2-3 శాతం మేర తగ్గి, రూ.2.6 లక్షల కోట్లుగా ఉండొచ్చని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. అమ్మకాలు మాత్రం 2024-25తో పోల్చి చూస్తే 2.8-3 శాతం మేర పెరగొచ్చని పేర్కొంది. అయినప్పటికీ నిర్వహణ మార్జిన్ 0.30-0.50 శాతం వరకు తగ్గి 3.3-3.5 శాతం మధ్య ఉంటుందని తెలిపింది. మూలధన అవసరాలు, వ్యయాలు తక్కువగా ఉండడం కారణంగా వాటి పరపతి ప్రొఫైల్ స్థిరంగా ఉంటుందని తన నివేదికలో క్రిసిల్ రేటింగ్స్ పేర్కొంది. మన దేశ వంట నూనెల వినియోగంలో 60 శాతాన్ని దిగుమతి చేసుకుంటుండడం గమనార్హం. నూనెల దిగుమతుల్లో 50 శాతం పామాయిల్ కాగా, సోయాబీన్, సన్‌ఫ్లవర్ ఇతర నూనెల వాటా మిగిలిన 50 శాతంగా ఉంటోంది. సోయాబీన్ మినహా మిగిలిన ప్రధాన వంట నూనెలు అయిన సన్‌ఫ్లవర్, పామాయిల్ ధరలు ఇటీవలి కాలంలో తగ్గడాన్ని ప్రస్తావించింది. దీంతో కంపెనీల ఆదాయం కొంత క్షీణతను చూడనున్నట్టు క్రిసిల్ రేటింగ్స్ వివరించింది. బయోడీజిల్ తయారీ డిమాండ్ కారణంగా సోయాబీన్ నూనెల ధరలు పెరిగినట్టు తెలిపింది.

బ్రాండెడ్ కంపెనీల మార్జిన్లపై అధిక ప్రభావం

"ఈ ఏడాది అమ్మకాలు స్థిరంగా 2.8-3% మేర వృద్ధి చెందొచ్చు. 25.5-26 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉండొచ్చు. గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో సగటు వృద్ధి 2.7 శాతం కంటే ఎక్కువే. గృహాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, కేటరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ ఇతర విభాగాల నుంచి డిమాండ్ స్థిరంగా పెరుగుతోంది''అని క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్ జయశ్రీ నందకుమార్ పేర్కొన్నారు. అమ్మకాలు పెరగడం వల్ల ఆదాయ క్షీణత 2-3 శాతానికి పరిమితం కావొచ్చని క్రిసిల్ అంచనా వేసింది. కంపెనీలు సాధారణంగా 40-50 రోజుల అవసరాలకు సరిపడా నిల్వలు నిర్వహిస్తుంటాయి కనుక, ధరలు తగ్గడం వాటి మార్జిన్లను ప్రభావితం చేస్తుందని పేర్కొంది. నాన్ బ్రాండెడ్ కంపెనీలతో పోల్చితే బ్రాండెడ్ కంపెనీలు ఎక్కువ ఇన్వెంటరీలు (నిల్వలు) కలిగి ఉంటాయని, కనుక వాటి మార్జిన్లపై ఎక్కువ ప్రభావం పడుతుందని తెలిపింది. మధ్యప్రాచ్యంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరగడం ఫలితంగా రవాణా వ్యయాలు అధికమైతే.. అది నూనెల ధరలు ఎగిసేందుకు దారితీయొచ్చని అంచనా వేసింది.

చౌక దిగుమతుల నుంచి రక్షణ

ముడి నూనెలు, రిఫైనరీ నూనెల (శుద్ధి చేసిన) దిగుమతులపై భిన్నమైన సుంకాలతో పరిశ్రమకు ప్రభుత్వం మద్దతుగా నిలిచినట్టు క్రిసిల్ నివేదిక గుర్తు చేసింది. ముడి పామాయిల్, ముడి సోయాబీన్ ఆయిల్, ముడి సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతులపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 27.5 శాతం నుంచి 16.5 శాతానికి తగ్గించగా, అదే సమయంలో రిఫైనరీ నూనెలపై 35.75 శాతం కస్టమ్స్ డ్యూటీని కొనసాగించడాన్ని ప్రస్తావించింది. ఈ చర్య చౌక దిగుమతుల నుంచి దేశీ నూనె రిఫైనరీ సంస్థలకు రక్షణ నివ్వడమే కాకుండా, నూనెల ధరలు 5 శాతం వరకు తగ్గడానికి దారితీసినట్టు తెలిపింది.

విండీస్‌కు మరో శరాఘాతం


రసెల్

భారీ షాట్లతో ప్రత్యర్థి బౌలర్లతో పాటు అంపైర్లను సైతం భయపెట్టగల హిట్టర్... పరిస్థితులతో సంబంధం లేకుండా బంతిపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడగల 'మిసైల్'... అవసరమైనప్పుడల్లా బంతితో బోల్తా కొట్టించగల బౌలర్... మైదానంలో అసాధారణ ఫీల్డింగ్‌తో కట్టిపడేయగల అథ్లెట్... ఇలా అన్ని రంగాల్లో ఆకట్టుకున్న వెస్టిండీస్ డేంజర్‌మ్యాన్ ఆండ్రె రసెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇప్పటికే టెస్టు క్రికెట్‌లో అధఃపాతాళానికి చేరిన వెస్టిండీస్ క్రికెట్ జట్టుకు రసెల్ నిర్ణయం మరో శరాఘాతంలా మారింది. ఇంకో ఏడు నెలల్లో టి20 ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో... ఇటీవల నికోలస్ పూరన్ రిటైర్మెంట్ ప్రకటించగా... ఇప్పుడు రసెల్ కూడా ఆ నిర్ణయం తీసుకున్నాడు. దీంతో కరీబియన్ జట్టు కష్టాలు మరింత పెరగనున్నాయి.

అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన వెస్టిండీస్ ఆల్‌రౌండర్ రసెల్

టి20 ప్రపంచకప్‌నకు 7 నెలల ముందు అనూహ్య నిర్ణయం

ఫ్రాంచైజీ క్రికెట్‌కే పెద్దపీట వేస్తున్న కరీబియన్ క్రికెటర్లు

సాక్షి క్రీడావిభాగం

వెస్టిండీస్ క్రికెట్ జట్టుకు మరో షాక్ తగిలింది. స్టార్ బ్యాటర్, మాజీ కెప్టెన్ 29 ఏళ్ల నికోలస్ పూరన్ ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకగా... ఇప్పుడు ఆల్‌రౌండర్ రసెల్ కూడా అదే బాటపట్టాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు 37 ఏళ్ల రసెల్ తాజాగా వెల్లడించాడు. సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో జరగనున్న రెండో టి20 అనంతరం కెరీర్‌ను ముగించనున్నట్లు ప్రకటించాడు. సుదీర్ఘ ఫార్మాట్ విషయం పక్కన పెడితే... పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మెరుపుల ఆల్‌రౌండర్‌గా ముద్రపడ్డ రసెల్ సేవలను విండీస్ బోర్డు సరిగ్గా వినియోగించుకోలేకపోయిందనే చెప్పాలి. లోయర్ ఆర్డర్‌లో భారీ షాట్లతో జట్టుకు ఊహించని స్కోర్లు అందించగల నైపుణ్యంతో పాటు... వైవిధ్యమైన పేస్‌తో ప్రత్యర్థిని బోల్తా కొట్టించగల రసెల్ 2019లో జాతీయ జట్టు తరఫున చివరి వన్డే ఆడాడు. అప్పటి నుంచి కేవలం టి20లకే పరిమితమైన ఈ జమైకా స్టార్... ఇప్పుడు దానికి కూడా టాటా చెప్పనున్నాడు. 2026 ఫిబ్రవరిలో భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న టి20 ప్రపంచకప్‌నకు మరో ఏడు నెలల వ్యవధి మాత్రమే ఉండగా... దానికి ముందు రసెల్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. తాజాగా ఆస్ట్రేలియాతో చివరి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 27 పరుగులకే ఆలౌటై భారీ విమర్శలు మూటగట్టుకున్న కరీబియన్ జట్టు... ఇక ముందు టి20 ఫార్మాట్‌లోనూ మెరుగైన ప్రదర్శన చేయడం కష్టమే అనిపిస్తోంది. ఒకప్పుడు జట్టు నిండా అద్భుతమైన బ్యాటర్లు, అరివీర భయంకర బౌలర్లు ఉన్న విండీస్ జట్టు... ఇప్పుడు రోజు రోజుకు ప్రమాణాలు పడిపోతూ పాతాళం దిశగా పయనిస్తోంది.

లీగ్‌లకే పరిమితం...

విశ్వవ్యాప్తంగా ఎక్కడ టి20 లీగ్‌లు జరుగుతున్నా... అందులో ప్రధానంగా కనిపించే ప్లేయర్లు కరీబియన్లే అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్ ఇలా అన్నింట్లో ముందుండే విండీస్ ఆటగాళ్ల కోసం ఫ్రాంచైజీలన్నీ పోటీపడుతుంటాయి. క్రిస్ గేల్ నుంచి మొదలుకొని పొలార్డ్, బ్రావో, రసెల్, నరైన్, హెట్‌మైర్, పూరన్ ఇలా ఈ జాబితా చాంతాడంత పెద్దది. రసెల్ విషయానికి వస్తే... అతడు ఆడని లీగ్ లేదంటే అతిశయోక్తి కాదు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న రసెల్... ప్రపంచంలో ఎక్కడ లీగ్ జరుగుతున్నా అందులో దర్శనమివ్వడం పరిపాటి. ఐపీఎల్‌తో పాటు బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్), కరీబియన్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్), బిగ్‌బాష్ లీగ్ (బీబీఎల్), పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్), అఫ్గానిస్తాన్ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్), లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్), విటాలిటీ బ్లాస్ట్, చాంపియన్ లీగ్ టి20 (సీఎల్‌టి20), మేజర్ క్రికెట్ లీగ్, హండ్రెడ్ ఇలా లెక్కకు మిక్కిలి లీగ్‌ల్లో రసెల్ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. జట్టుకు అవసరమైన దశలో బ్యాటింగ్‌కు దిగి మెరుపులు మెరిపించడంతో పాటు... బంతితోనూ ఆకట్టుకోగల నైపుణ్యం రసెల్ సొంతం. ఇలాంటి ఆల్‌రౌండర్‌ను సరిగ్గా వినియోగించుకోలేకపోయిన విండీస్ క్రికెట్ బోర్డు... కనీసం వరల్డ్‌కప్ వరకు అతడిని కొనసాగమనే దిశగా కూడా ప్రయత్నాలు చేయలేకపోయింది. ఒకప్పుడు రసెల్‌తో కలిసి డ్రెస్సింగ్ రూమ్ పంచుకున్న డారెన్ స్యామీ ఇప్పుడు విండీస్ ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తుండగా... అతడు కూడా తన సహచరుడికి సర్దిచెప్పలేని పరిస్థితి.

హార్డ్ హిట్టర్...

2010 తొలినాళ్లలో భారీ హిట్టింగ్‌తో వెలుగులోకి వచ్చిన రసెల్... 2011 వన్డే ప్రపంచకప్ ఆడిన వెస్టిండీస్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. అయితే అక్కడ పెద్దగా ప్రభావం చూపలేకపోయిన ఈ జమైకన్... ఆ తర్వాత ప్రపంచ చాంపియన్ టీమిండియాతో మ్యాచ్‌లో రికార్డులు తిరగరాశాడు. నార్త్‌సౌండ్ వేదికగా జరిగిన మూడో వన్డేలో 96 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి జట్టు కష్టాల్లో పడ్డ సమయంలో తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన రసెల్... 64 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌ల సహాయంతో 92 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఆ మ్యాచ్‌లో విండీస్ ఓడినా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు గెలుచుకోవడంతో పాటు... వన్డేల్లో 9వ స్థానంలో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన ప్లేయర్‌గా రికార్డు సృష్టించాడు. ఇక వన్డే కెరీర్‌లో అత్యధిక స్ట్రయిక్‌రేట్ (130.22) గల బ్యాటర్‌గా ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచాడు. 2012, 2016లో ఐసీసీ టి20 వరల్డ్‌కప్ గెలిచిన వెస్టిండీస్ జట్టులో సభ్యుడైన రసెల్... కెరీర్‌లో ఏకైక టెస్టు 2010లో శ్రీలంకపై ఆడాడు. ఆ తర్వాత కేవలం పరిమిత ఓవర్ల క్రికెట్‌కే పరిమితమైన ఈ ఆల్‌రౌండర్... పలు మ్యాచ్‌ల్లో తన ప్రదర్శనతో జట్టుకు విజయాలు అందించాడు. ముఖ్యంగా జట్టు ఆశలన్నీ వదిలేసుకున్న సమయంలో అనూహ్య హిట్టింగ్‌తో చెలరేగి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపడం రసెల్‌కు అలవాటు. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే గొప్ప అనుకునే స్థాయి నుంచి... దేశం తరఫున ఆడటం కన్నా లీగ్‌ల్లో పాల్గొనడమే మిన్న అనే స్థాయికి రసెల్ ఎదగగా... అలాంటి నిఖార్సైన ఆల్‌రౌండర్‌ను సరైన రీతిలో వాడుకోలేని వైచిత్ర విండీస్ బోర్డుది.

కేకేఆర్ కీలక ప్లేయర్

లీగ్‌ల ప్రాధాన్యత పెరిగిన తర్వాత ఇక జాతీయ జట్టుకు ఆడాలనే లక్ష్యాన్నే పక్కన పెట్టిన వెస్టిండీస్ ప్లేయర్లు... విశ్వవ్యాప్తంగా ఫ్రాంచైజీ క్రికెట్‌లో సత్తా చాటుతున్నారు. ఐపీఎల్‌లో ఏజట్టును పరిశీలించినా అందులో కీలక పాత్ర పోషిస్తున్నది విండీస్ ప్లేయర్లే. 2012లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఐపీఎల్ అరంగేట్రం చేసిన రసెల్... తొలి రెండు సీజన్‌లలో పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. 2014లో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు మారిన అనంతరం అతడి ఆట మరోస్థాయికి చేరింది. లోయర్ ఆర్డర్‌లో కీలక పరుగులు చేయడంతో పాటు... ప్రత్యర్థికి అంతుచిక్కని తన బౌలింగ్‌తో కేకేఆర్ జట్టులో కీలక ప్లేయర్‌గా ఎదిగాడు. ఫ్రాంచైజీ తరఫున ఆడిన తొలి సీజన్‌లోనే చాంపియన్‌గా నిలిచిన రసెల్... అప్పటి నుంచి అదే జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. 2015 ఐపీఎల్ సీజన్‌లో అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో విజృంభించిన ఈ జమైకన్ 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచాడు. కేకేఆర్ తరఫున 170కి పైగా స్ట్రయిక్ రేట్‌తో 2400 పైచిలుకు పరుగులు చేసిన రసెల్... 100కు పైగా వికెట్లు సైతం పడగొట్టాడు. ఇప్పుడిక అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికేయడంతో లీగ్‌లపై మరింత దృష్టి పెట్టడం ఖాయమే!

మారథాన్ రన్నర్ చెప్‌ఎన్‌గెటిక్‌పై నిషేధం

గతేడాది ప్రపంచ రికార్డు సృష్టించిన కెన్యా అథ్లెట్



లుసానే: కెన్యాకు చెందిన అథ్లెట్ రూత్ చెప్ఎన్‌గెటిక్ గత ఏడాదే మహిళల మారథాన్‌లో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. 2 గంటల 9 నిమిషాల 56 సెకన్లలో పరుగు పూర్తి చేసిన ఆమె... 2 గంటల 10 నిమిషాల లోపు ఈ ఘనత సాధించిన తొలి మహిళా అథ్లెట్‌గా నిలిచింది. అయితే ఇప్పుడు నెలల వ్యవధిలోనే ఆమె డోపింగ్ పరీక్షల్లో విఫలమైంది. దాంతో అథ్లెటిక్స్ ఇంటిగ్రిటీ యూనిట్ (ఏఐయూ) రూత్‌పై తాత్కాలిక నిషేధం విధించింది. మార్చిలో ఆమె ఇచ్చిన శాంపిల్స్‌కు పరీక్షలు నిర్వహించగా... ప్రపంచ డోపింగ్ వ్యతిరేక సంస్థ (వాడా) నిషేధిత జాబితాలో ఉన్న డ్రగ్ హైడ్రోక్లోరోథియాజైడ్‌ను రూత్ తీసుకున్నట్లుగా తేలింది. నిజానికి శాంపిల్స్ ఫలితాలు వచ్చిన తర్వాత కూడా ఇంకా విచారణ పూర్తి కాకపోవడంతో ఏఐయూ ఆ సమయంలో ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. అయితే తానే స్వచ్ఛందంగా తాత్కాలిక నిషేధాన్ని స్వీకరించేందుకు రూత్ సిద్ధమైంది. ఇప్పుడు ఏఐయూ అధికారికంగా ఆమెపై నిషేధానికి ఆమోద ముద్ర వేసింది.

రెండో సీడ్‌పై గెలుపుతో సెమీస్‌లో అర్జున్-విజయ్ జోడీ



గెస్టాడ్ (స్విట్జర్లాండ్): తమ సంచలన ప్రదర్శన కొనసాగిస్తూ గెస్టాడ్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో అర్జున్ ఖడే-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో అర్జున్-విజయ్ జంట 6-3, 7-6 (7/5)తో రెండో సీడ్ జాకబ్ ష్నయిటర్-మార్క్ వాల్నర్ (జర్మనీ) ద్వయంపై సంచలన విజయం సాధించింది. 88 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అర్జున్-విజయ్ ఒక ఏస్ సంధించడంతో పాటు ప్రత్యర్థుల సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు. అర్జున్-విజయ్ జోడీకి 'రిజర్వ్ పూల్' నుంచి చివరి నిమిషంలో ఈ టోర్నీలో ఆడే అవకాశం దక్కించుకుంది.

'బుమ్రాను ఆడించాలనే ఉంది'

భారత అసిస్టెంట్ కోచ్ డస్కటే వ్యాఖ్య ● నాలుగో టెస్టుకు టీమిండియా సన్నాహాలు


డస్కటే



బుమ్రా

బెకెన్‌హామ్: ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో భారత టాప్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడతాడని టీమ్ మేనేజ్‌మెంట్ ఇప్పటికే ప్రకటించింది. పని భారాన్ని తగ్గించడంలో భాగంగా తొలి మూడు టెస్టుల్లో అతను రెండు మ్యాచ్‌లలో బరిలోకి దిగగా... మిగిలిన రెండు టెస్టుల్లో ఒక మ్యాచ్‌కు దూరం కావచ్చు. అయితే అతను ఏ టెస్టులో ఆడతాడనే విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. సిరీస్ సమం చేయాల్సిన పరిస్థితి ఉంది కాబట్టి దీనిపై మ్యాచ్ సమయానికే తుది నిర్ణయం తీసుకుంటామని జట్టు అసిస్టెంట్ కోచ్ టెన్ డస్కటే వెల్లడించాడు. 'బుమ్రా మరో మ్యాచ్‌కే అందుబాటులో ఉంటాడనే విషయం మాకు తెలుసు. మాంచెస్టర్‌లో సిరీస్ సమం చేయాల్సిన అవసరం ఉంది కాబట్టి మాకు బుమ్రా కీలకం. కాబట్టి ఆడించే ఆలోచన అయితే ఉంది. అయితే ఇతర ఎన్నో అంశాలు ఇందులో ఉన్నాయి. మిగిలిన రెండు టెస్టులు, వాటిలో మా అవకాశాలను దృష్టిలో పెట్టుకుంటూ తుది జట్టు ఎంపిక చేయాలి. అందుకే ఇప్పుడే ఏమీ చెప్పలేం. మాంచెస్టర్‌లో దీనిపై తుది నిర్ణయం తీసుకుంటాం' అని డస్కటే స్పష్టం చేశాడు. మూడో టెస్టులో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ సుదీర్ఘ స్పెల్‌లు బౌలింగ్ చేయడాన్ని బుమ్రా ఫిట్‌నెస్‌తో పోలుస్తూ వచ్చిన విమర్శలను డస్కటే కొట్టిపారేశాడు. అందరూ ఒకే తరహాలో బౌలింగ్ చేయరని, మరో బౌలర్‌తో పోల్చుకోవాల్సిన అవసరం లేదన్న డస్కటే... చిన్న చిన్న స్పెల్‌లలో బౌలింగ్ చేయడం బుమ్రా శైలి అని గుర్తు చేశాడు. మరో పేసర్ సిరాజ్ నిర్విరామంగా బౌలింగ్ చేసిన విషయాన్ని మర్చిపోవద్దని కూడా అతను అన్నాడు. గురువారం భారత జట్టు ప్రాక్టీస్‌లో పాల్గొనగా వికెట్ కీపర్ రిషభ్ పంత్ దీనికి దూరంగా ఉన్నాడు. అయితే పంత్ కోలుకునేందుకు తగినంత విశ్రాంతి ఇస్తున్నామని, తర్వాతి టెస్టులోనూ అతను బ్యాటింగ్ చేస్తాడని కూడా భారత అసిస్టెంట్ కోచ్ స్పష్టం చేశాడు.

ప్రాక్టీస్‌లో ఆటగాళ్లు...

లార్డ్స్ టెస్టులో ఓటమి నుంచి కోలుకున్న భారత జట్టు తర్వాతి టెస్టుపై దృష్టి పెట్టింది. మాంచెస్టర్ టెస్టుకు ముందు అందుబాటులో ఉన్న ఏకైక ప్రాక్టీస్ సెషన్‌లో టీమిండియా ఆటగాళ్లు శ్రమించారు. ఇంకా మాంచెస్టర్‌కు వెళ్లని మన జట్టు లండన్ శివార్లలో బెకెన్‌హామ్‌లో ఉన్న కెంట్ కౌంటీ క్రికెట్ గ్రౌండ్‌లో గురువారం సాధన చేసింది. కేఎల్ రాహుల్ మినహా ఇతర బ్యాటర్లంతా ఇందులో పాల్గొన్నారు. గాయం నుంచి కోలుకుంటున్న రిషభ్ పంత్‌తో పాటు పేసర్లు బుమ్రా, సిరాజ్, ఆకాశ్‌దీప్ కూడా ప్రాక్టీస్ చేయలేదు. వీరంతా స్వల్పంగా వామప్ చేసి ఆపై జిమ్‌కే పరిమితమయ్యారు. మరోవైపు సుదర్శన్ ఆడిన షాట్‌ను ఆపే క్రమంలో పేసర్ అర్ష్‌దీప్ సింగ్ చేతికి బలంగా దెబ్బ తగిలింది. స్వల్ప చికిత్స అనంతరం బ్యాండేజీతో అతను మైదానం వీడాడు. బుమ్రా ఆడకపోతే అతని స్థానంలో అర్ష్‌దీప్‌తో అరంగేట్రం చేయించాలని మేనేజ్‌మెంట్ భావిస్తున్న స్థితిలో ఈ గాయం తీవ్రత ఎలాంటిదో చూడాలి. అర్ష్‌దీప్ వెనుదిరిగాక టీమ్ బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ స్వయంగా బౌలింగ్‌కు దిగి భారత బ్యాటర్లకు సహకరించాడు. లార్డ్స్‌లో పరాజయాన్ని మరచి మళ్లీ ఆత్మవిశ్వాసంతో కనిపించిన జట్టు ఉత్సాహంగా, సరదాగా సాధనలో పాల్గొనడం విశేషం.

కరుణ్ నాయర్‌పై వేటు!



లండన్: ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు ఈ నెల 23 నుంచి జరగనుండగా అప్పుడే తుది జట్టుపై చర్చ మొదలైంది. సిరీస్‌లో జట్టు ఆడిన మూడు టెస్టులను చూస్తే బ్యాటర్ కరుణ్ నాయర్ మినహా ఇతర ఆటగాళ్లంతా రాణించారు. నాయర్ మాత్రం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోయాడు. క్రీజ్‌లోకి వచ్చాక మెరుగ్గానే ఇన్నింగ్స్‌లను ఆరంభించినా...వాటిని అతను భారీ స్కోర్లుగా మలచలేకపోయాడు. అతను వరుసగా 0, 20, 31, 26, 40, 14 (మొత్తం 131 పరుగులు) స్కోర్లు నమోదు చేశాడు. ఎనిమిదేళ్ల విరామం తర్వాత తనకు లభించిన 'మరో చాన్స్'ను నాయర్ సద్వినియోగం చేసుకోలేదు. ముఖ్యంగా లార్డ్స్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో అతను అవుటైన తీరు విమర్శలకు దారి తీసింది. ఈ నేపథ్యంలో నాలుగో టెస్టులో నాయర్ స్థానం నిలబెట్టుకోవడం కష్టంగానే ఉంది. కీలకమైన మూడో స్థానంలో నాయర్‌కు బదులుగా యువ ఆటగాడు సాయి సుదర్శన్‌కు మరో అవకాశం ఇవ్వాలని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. లీడ్స్ టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో డకౌట్ అయినా... రెండో ఇన్నింగ్స్‌లో చక్కటి షాట్లతో చెప్పుకోదగ్గ ప్రదర్శన (30 పరుగులు) కనబర్చాడు. తుది జట్టుకు సంబంధించి ఈ ఒక్క మార్పు మాత్రం కచ్చితంగా ఉండవచ్చని తెలుస్తోంది.



సొంతగడ్డపై చివరిసారిగా...

మాంట్రియల్ టోర్నీ తర్వాత టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పనున్న బుచార్డ్

మాంట్రియల్: కెనడా టెన్నిస్ స్టార్ జెనీ బుచార్డ్ తన కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించింది. మాంట్రియల్ ఓపెన్ టోర్నీ అనంతరం ఆటకు వీడ్కోలు పలుకుతానని గురువారం ప్రకటించింది. ఈ ఏడాది ఆఖరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ అయిన యూఎస్ ఓపెన్‌కు ముందు సన్నాహక టోర్నీగా నిర్వహించే 'నేషనల్ బ్యాంక్ ఓపెన్' త్వరలో మాంట్రియల్‌లో జరుగుతుంది. 'ప్రతీ దానికి టైమ్ ఉంటుంది. అలాగే నేను నిష్క్రమించే టైమ్ వచ్చింది. ఎక్కడ కెరీర్‌ను మొదలు పెట్టానో అక్కడే టెన్నిస్‌ను ముగించబోతున్నాను' అని సోషల్ మీడియాలో బుచార్డ్ పోస్ట్ చేసింది. కెరీర్‌లో 299 విజయాలు, 230 పరాజయాల రికార్డును కలిగిన బుచార్డ్ 2023లో కెనడా గెలిచిన బిల్లీ జీన్ కింగ్ కప్‌లో కీలకపాత్ర పోషించింది. 2014లో బుచార్డ్ సూపర్ ఫామ్ చాటుకుంది. ఆ ఏడాది వింబుల్డన్‌లో రన్నరప్‌గా నిలిచిన ఈ కెనడా స్టార్ ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్ ఓపెన్‌లలో సెమీఫైనల్ దాకా పోరాడింది. తద్వారా కెరీర్ బెస్ట్ ఐదో ర్యాంక్‌కు ఎగబాకింది. అయితే మరుసటి ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ క్వార్టర్స్ చేరిన ఆమెకు యూఎస్ ఓపెన్ చేసిన గాయం కెరీర్‌ను దెబ్బతీసింది. 2015లో యూఎస్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్స్ చేరిన ఆమె లాకర్ రూమ్ వద్ద జారిపడింది. దీంతో కన్‌కషన్‌కు గురైన ఆమె టోర్నీ నుంచి అర్ధంతరంగా వైదొలగింది. దీనిపై యూఎస్ ఓపెన్ నిర్వాహకులపై విమర్శలు వచ్చాయి. సరైన ఏర్పాట్లు చేయకపోవడం వల్లే ఆమె గాయపడిందని జ్యూరీ విచారణలో తేలింది.

ప్రొ లీగ్ ఫలితాలు మనకో పాఠం

- ఆసియా క్రీడలు, ప్రపంచకప్‌కు ముందే మేలుకోవాలి
- భారత మాజీ కెప్టెన్ శ్రీజేశ్ వ్యాఖ్య



శ్రీజేశ్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్ టోర్నీ భారత జట్టుకు పాఠంలాంటిదని భారత మాజీ కెప్టెన్, హాకీ దిగ్గజం పీఆర్ శ్రీజేశ్ అన్నాడు. వచ్చే ఏడాది జరిగే ఆసియా క్రీడలు, ప్రపంచకప్‌కు ముందు మనకిది మేలుకొలుపు సంకేతమని చెప్పాడు. నెదర్లాండ్స్, బెల్జియం సంయుక్తంగా నిర్వహించే ప్రపంచకప్ వచ్చే ఏడాది ఆగస్టు 15 నుంచి 30 వరకు జరుగుతుంది. అనంతరం జపాన్ ఆతిథ్యమిచ్చే ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19 నుంచి 4 వరకు జరుగుతాయి. యూరోపియన్ అంచె ప్రొ లీగ్ పోటీల్లో భారత జట్టు తీవ్రంగా నిరాశపరిచాయి. తొమ్మిది జట్లు పోటీపడిన యూరోపియన్ అంచెలో భారత పురుషుల జట్టు ఎనిమిదో స్థానంలో నిలిచింది. అయితే ఫలితాలు నిరాశపరిచినప్పటికీ భారత ఆటగాళ్ల ప్రదర్శన మరీ అంత తీసికట్టుగా ఏమీ లేదని ప్రస్తుతం భారత అండర్-21 జట్టుకు హెడ్ కోచ్‌గా ఉన్న శ్రీజేశ్ చెప్పుకొచ్చాడు. అక్టోబర్‌లో జరిగే వేదాంత ఢిల్లీ హాఫ్ మారథాన్‌కు సంబంధించిన ప్రచార కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన శ్రీజేశ్ మీడియాతో మాట్లాడుతూ 'నిజానికి మన ఆటగాళ్లు బాగానే ఆడారు. ప్రతీ మ్యాచ్‌లోనూ గోల్స్ కోసం ఎన్నో అవకాశాల్ని సృష్టించారు. గెలిచేందుకు ఆఖరి దాకా పోరాడారు. కొన్నిసార్లు ఇంతబాగా ఆడినప్పటికీ దురదృష్టవశాత్తూ నిరుత్సాహకర ఫలితాలు వస్తాయి. యూరోప్‌లో సరిగ్గా అదే జరిగింది' అని వివరించాడు. ఆ అంచె పోటీల కోసం చక్కగా సన్నద్ధమైనప్పటికీ మైదానంలో ఫలితాలే ప్రతికూలమయ్యాయన్నాడు. అయితే ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని ఆసియా కప్, ప్రపంచకప్ మెగా ఈవెంట్లకు మరింత మెరుగ్గా సిద్ధమవ్వాల్సిన ఆవశ్యకతను యూరోపియన్ అంచె పోటీలు తెలియజేస్తున్నాయని చెప్పాడు. టోక్యో, పారిస్ వరుస ఒలింపిక్స్‌లో భారత జట్టు కాంస్య పతకాలు గెలుపొందడంలో కీలకపాత్ర పోషించిన శ్రీజేశ్.. సుదీర్ఘమైన కెరీర్‌కు వీడ్కోలు పలికిన అనంతరం కోచింగ్ బాధ్యతలు చేపట్టాడు. అండర్-21 జూనియర్ పురుషుల జట్టుకు హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ కోచింగ్ ప్రయాణంపై మాట్లాడుతూ ఆటగాడిలాగే రొటీన్‌గా ఉందన్నాడు. ఉదయమే నిద్రలేవడం, ప్లేయర్లకు వార్మప్ తదుపరి శిక్షణ ఇవ్వడం, తదుపరి ట్రెయినింగ్ సెషన్ వ్యవహారాలు చక్కదిద్దడం, విశ్లేషించడం జరుగుతోందన్నాడు. అప్పుడు ఆటగాడిగా ఎక్కువగా శారీరకంగా శ్రమిస్తే ఇప్పుడు కోచ్‌గా మానసికంగా ఎక్కువ శ్రమించాల్సి వస్తోందని చెప్పుకొచ్చాడు. ఈ ఏడాది చెన్నై, మదురై నగరాల్లో నవంబర్ 28 నుంచి డిసెంబర్ 10 వరకు జరిగే జూనియర్ ప్రపంచకప్ కోసం జట్టును తీర్చిదిద్దే పనిలో ఉన్నానని చెప్పాడు. ముందుగా ఒక్కో మ్యాచ్ గెలవడం, క్వార్టర్స్ చేరడం తమ లక్ష్యాలుగా ఉన్నాయన్నాడు. చిరకాల ప్రత్యర్థులు (భారత్, పాక్) ఒకే పూల్ (బి)లో ఉన్నప్పటికీ దీనిపై అనవసరంగా చర్చించి కుర్రాళ్లపై ఒత్తిడి పెంచదల్చుకోలేదని పేర్కొన్నాడు.



బాలికలను సంపన్నులకు ఎరవేశాడన్న ఆరోపణలు ఎదుర్కొన్న జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతంలో దిగిన ఫొటోను అంటిస్తున్న ఉద్యమకారిణి. గురువారం లండన్‌లో తీసిందీ ఫొటో



గ్జిపెంగ్ సంస్థ తయారుచేసిన వినూత్న ఎగిరే వాహనం ఇది. బీజింగ్‌లో మూడవ చైనా ఇంటర్నేషనల్ సప్లై చైన్ ప్రదర్శనలో దీనిని గురువారం ప్రదర్శించారు.



ఉత్తర ఫ్రాన్స్‌లోని రూబాక్స్ సిటీ భవనంపై 'స్టాచూ ఆఫ్ లిబర్టీ' చేతులతో తన ముఖాన్ని దాచుకుంటున్నట్లు వేసిన కుడ్య చిత్రమిది. జుడీత్ డీ లూవా అనే చిత్రకారుడు దీనిని చిత్రించాడు

వాద్రాపై ఈడీ చార్జిషీట్

న్యూఢిల్లీ: వ్యాపారవేత్త, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అభియోగ పత్రాన్ని కోర్టులో సమర్పించింది. 2008లో గుర్గావ్‌లోని సెక్టార్ 83లో షికోహ్‌పూర్‌లో 3.53 ఎకరాల భూమి కొనుగోలు వ్యవహారంలో మనీ లాండరింగ్ జరిగిందంటూ చార్జిషీటులో ఈడీ పేర్కొంది. ఆ భూమిని స్కై లైట్ హాస్పిటాలిటీ అనే కంపెనీ ఓంకారేశ్వర్ ప్రాపర్టీస్ సంస్థ నుంచి కొనుగోలు చేసింది. చెల్లింపు చెక్కులను మరో కంపెనీకి స్కై లైట్ రియాలిటీ జారీ చేసింది. ఈ రెండు సంస్థలకు వాద్రా యజమానిగా ఉన్నాయి. ఇక సేల్ డీడ్‌సమయంలో ఈ కంపెనీ వద్ద కేవలం రూ.1 లక్ష నగదు ఉంటే రూ.7.5 కోట్లు పెట్టి భూమిని కొనుగోలు చేయగల్గిందని ఈడీ చార్జిషీటులో ప్రస్తావించింది.మరుసటి రోజే ఆ భూమిని స్కైలైట్ హాస్పిటాలిటీ పేరిట మార్చేశారు. 24 గంటల్లోపే భూమి టైటిల్‌ను వాద్రా కంపెనీకి మార్చారు. ఈ ప్రక్రియకు సాధారణంగా కనీసం మూడు నెలలు పడుతుంది. ఒక నెల తర్వాత హరియాణాలో హుడా ప్రభుత్వం స్కైలైట్ హాస్పిటాలిటీకి దాదాపు 2.71 ఎరాల భూమిలో గృహనిర్మాణ ప్రాజెక్టు అభివృద్ధికి అనుమతులు వచ్చాయి. ఫలితంగా భూమి విలువ ఒక్కసారిగా అమాంతం పెరిగింది. 2008లో రియల్ ఎస్టేట్ దిగ్గజం డీఎల్‌ఎఫ్ ఆ ప్లాట్‌ను రూ.58 కోట్లకు కొనుగోలు చేసింది. అంటే ఆ భూమి విలువ ఒకేసారి 700 శాతం పెరిగింది. డీఎల్‌ఎఫ్ రెండు మూడు దఫాలుగా వాద్రాకు నగుదు చెల్లింపులు జరిపింది. 2012లో ఈ భూమి వ్యవహారాన్ని బయటకు తెచ్చిన మాజీ ఐఏఎస్ ఆఫీసర్ అశోక్ ఖేమ్కాను అప్పటి ముఖ్యమంత్రి హుడా ఆదేశాల మేరకు వెంటనే బదిలీ చేయడానికి ప్రయత్నించి తరువాత రద్దు చేశారు. భూమి వ్యవహారంపై సమగ్రస్థాయిలో విచారణ జరిపిన ఖేమా ఆ భూమి మ్యూటేషన్‌ను రద్దు చేయడం అప్పట్లో వివాదాస్పదమైంది. ఈ సమస్యను పరిశీలించడానికి ముగ్గురు సీనియర్ ఐఏఎస్‌లతో ప్యానెల్ ఏర్పాటైంది. 2013లో హుడా ప్రభుత్వం వాద్రాకు, డీఎల్‌ఎఫ్‌కు క్లీన్ చిట్ ఇచ్చింది. బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ వ్యవహారంపై విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. భూ ఒప్పందాల్లో హుడా, వాద్రాలు అక్రమాలకు పాల్పడినట్లు 2018లో ఆరోపణలు వచ్చాయి. అందులో ఈ 3.5 ఎకరాల భూమి కూడా ఉంది. తప్పుడు డిక్లరేషన్ ఆధారంగా భూమిని కొనుగోలు చేశారని ఆరోపిస్తూ గుర్గావ్ పోలీసులు 2018 సెప్టెంబర్ 2న ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఈడీ దర్యాప్తు ప్రారంభించింది.

అత్యంత స్వచ్ఛ నగరం అహ్మదాబాద్

- రెండో స్థానంలో భోపాల్, మూడో స్థానంలో లక్నో
- 'సూపర్ స్వచ్ఛ లీగ్'కేటగిరీలో ఇండోర్, సూరత్, నవీ ముంబై, విజయవాడ
- స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాలు ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మధ్యప్రదేశ్ ప్రజలకు గర్వకారణం: సీఎం మోహన్

స్వచ్ఛ సర్వేక్షణ్ ఫలితాల్లో తమ నగరాలకు ర్యాంక్‌లు దక్కడం పట్ల మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ హర్షం వ్యక్తంచేశారు. సూపర్ స్వచ్ఛ లీగ్ విభాగంలో ఇండోర్ తొలి స్థానంలో నిలిచిందన్నారు. ఇది తమ రాష్ట్ర ప్రజలకు గర్వకారణమని గురువారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. భోపాల్, దేవాస్, షాగంజ్, జబల్పూర్, గ్వాలియర్, ఉజ్జయినీ, బుద్నీ నగరాలకు స్వచ్ఛ అవార్డులు లభించాయని తెలిపారు. క్లీన్‌నెస్ విషయంలో తమ రాష్ట్రం అగ్రస్థానానికి చేరుకుంటోందని వివరించారు. మరోవైపు ఇండోర్ మేయర్ పొష్యమిత్ర భార్గవ సైతం స్పందించారు. ప్రజల భాగస్వామ్యం, సహకారం వల్లే ఇండోర్ సిటీ అత్యంత శుభ్రమైన నగరంగా అవార్డు సొంతం చేసుకుందని స్పష్టంచేశారు. పారిశుద్ధ్య కార్మికుల శ్రమ, అంకితభావం వల్లే దేశవ్యాప్తంగా తమకు ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు.

న్యూఢిల్లీ: దేశంలో అత్యంత స్వచ్ఛమైన పెద్ద నగరాల(10 లక్షలకుపైగా జనాభా కలిగిన) జాబితాలో గుజరాత్‌లోని అహ్మదాబాద్ మొదటి స్థానంలో నిలిచింది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌కు రెండో స్థానం, ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోకు మూడో స్థానం దక్కింది. 2024–25 స్వచ్ఛ సర్వేక్షణ్ ఫలితాలను కేంద్ర ప్రభుత్వం గురువారం వెల్లడించింది. ఈ ఏడాది మొత్తం కేటగిరీల్లో నగరాలకు ర్యాంక్‌లు ప్రకటించారు. పారిశుద్ధ్యం, పచ్చదనం విషయంలో మెరుగైన పనితీరు కనబర్చిన నగరాలకు ప్రజాభిప్రాయం మేరకు ర్యాంక్‌లు కేటాయించారు. దేశవ్యాప్తంగా 4,500 నగరాలు, పట్టణాల్లో ఈ సర్వే నిర్వహించారు. స్వచ్ఛతా యాప్‌తోపాటు ప్రభుత్వ వెబ్‌సైట్, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలను ప్రశ్నించారు. 14 కోట్ల మంది అభిప్రాయాలు సేకరించారు. ఈసారి కొత్తగా ప్రకటించిన 'సూపర్ స్వచ్ఛ లీగ్ నగరాల'కేటగిరీలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్, గుజరాత్‌లోని సూరత్, మహారాష్ట్రలోని నవీ ముంబై, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు వరుసగా మొదటి నాలుగు ర్యాంకులు లభించాయి. సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్.. టాప్–త్రీ క్లీన్ సిటీస్ ఇన్ ఫైవ్ పాపులేషన్ కేటగిరీస్(స్వచ్ఛ షహర్).. స్పెషల్ కేటగిరీ–గంగా టౌన్స్, కంటోన్మెంట్ బోర్డ్స్, సఫాయి మిత్రా సురక్ష, మహాకుంభ్.. ప్రామిసింగ్ క్లీన్ సిటీ ఆఫ్ స్టేట్, యూనియన్ టెరిటరీ విభాగాల్లో మొత్తం 78 అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ప్రదానం చేశారు. స్వచ్ఛ నగరాల జాబితాలో ఇండోర్, సూరత్, నవీ ముంబై గత కొన్నేళ్లుగా అగ్రస్థానంలో నిలుస్తున్న సంగతి తెలిసిందే. స్వచ్ఛత విషయంలో అవి ఇతర నగరాలకు మార్గదర్శకంగా మారాయని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ వెల్లడించింది.

యెమెన్ అధికారులతో చర్చిస్తున్నాం

- నిమిష ప్రియకు ఉరిశిక్ష తప్పించడమే లక్ష్యం
- భారత విదేశాంగ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ: యెమెన్‌లో హత్య కేసులో మరణ శిక్ష పడిన కేరళ నర్సు నిమిషా ప్రియ విషయంలో అక్కడి అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని భారత విదేశాంగ శాఖ గురువారం ప్రకటించింది. అలాగే కొన్ని సన్నిహిత మిత్రదేశాలతోనూ మాట్లాడుతున్నామని వెల్లడించింది. నిమిషా ప్రియకు ఈ నెల 16న ఉరిశిక్ష అమలు చేయాల్సి ఉండగా, చివరి నిమిషంలో వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఉరిశిక్షను రద్దు చేయించే దిశగా ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇతర దేశాల సాయంతో యెమెన్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు భారత విదేశాంగ శాఖ ప్రయత్నిస్తోంది. ఇది చాలా సున్నితమైన అంశమని, నిమిషా ప్రియకు అవసరమైన సాయం అందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని విదేశాంగ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ చెప్పారు. నిమిషా ప్రియ కుటుంబానికి న్యాయ సహాయం అందిస్తున్నామని, ఇందుకోసం ఒక లాయర్‌ను నియమించామని తెలిపారు. యెమెన్ అధికారులతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ సమస్యను పరిష్కరించాలన్న పట్టుదలతో పని చేస్తున్నట్లు వివరించారు. తాజా పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని, నిమిషా ప్రియకు ఉరిశిక్ష అమలు కాకుండా చూడాలన్నదే తమ లక్ష్యమని రణధీర్ జైశ్వాల్ స్పష్టంచేశారు.

క్రెడిట్ కాంగ్రెస్ సర్కార్‌కు.. నిందలు కోహ్లీకి

- తొక్కిసలాటకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- బీజేపీ ఎమ్మెల్యే అరవింద్ బెల్లాద్ డిమాండ్

బెంగళూరు: చిన్నస్వామి స్టేడియంలో తొక్కిసలాటకు ఆర్సీబీ యాజమాన్యం, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ కారణమని పేర్కొంటూ హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదిక సమర్పించడంపై బీజేపీ ఎమ్మెల్యే అరవింద్ బెల్లాద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐపీఎల్‌లో ఆర్సీబీ విజయానికి క్రెడిట్ కొట్టేయాలని చూసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. దుర్ఘటనలకు మాత్రం ఆర్సీబీ క్రికెటర్ విరాట్ కోహ్లీపై నిందలు వేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. క్రెడిట్ సొంతం చేసుకోవడానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ ఆరాటపడ్డారని చెప్పారు. ఆర్సీబీ యాజమాన్యంతోపాటు డి.కె.శివకుమార్, కర్ణాటక ప్రభుత్వ అధికారుల పిలుపు మేరకు భారీగా జనం తరలివచ్చారని అరవింద్ బెల్లాద్ గుర్తుచేశారు. చిన్నస్వామి స్టేడియంలో జరిగే విజయోత్సవాలకు హాజరు కావాలంటూ ప్రజలకు పిలుపునిచ్చింది డి.కె.శివకుమార్ కాదా? అని ప్రశ్నించారు. దుర్ఘటనకు ఆర్సీబీ కారణమైతే పోలీసులను ఎందుకు సస్పెండ్ చేశారో చెప్పాలని నిలదీశారు. 11 మంది మరణానికి కారణమైన తొక్కిసలాటకు కర్ణాటక ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మరొకరిపై నిందలు వేసి తప్పించుకోవాలని చూడడం సరైంది కాదన్నారు.

పెరోల్ మీదొస్తే ప్రాణం తీశారు

- నిందితుడిని ఆస్పత్రిలోనే అంతమొందించిన ప్రత్యర్థి గ్యాంగ్
- పట్టపగలే బిహార్ రాజధాని పట్నాలో ఘటన
- రాష్ట్రంలో శాంతిభద్రతలపై విపక్షాల విమర్శలు

పట్నా: బిహార్‌లో ప్రజారక్షణ, శాంతి భద్రతలు అనేవి గాల్లో దీపాలని మరోసారి నిరూపణ అయ్యింది. పట్టపగలే ఐదుగురు సాయుధులు గన్స్ పట్టుకుని ఆస్పత్రిలోకి నేరుగా వచ్చి ఐసీయూలో చికిత్స చేయించుకుంటున్న వ్యక్తిని చంపేసిన ఘటన బిహార్‌లో జరిగింది. ఇందుకు రాజధాని పట్నా వేదికైంది. చందన్ మిశ్రా అనే 36 ఏళ్ల నిందితుడిపైకి ఐదుగురు ఆగంతకులు విచక్షణారహితంగా బుల్లెట్ల వర్షం కురిపించి రక్తపుమడుగులో పడేసి వెళ్లిన వైనం అక్కడి ఆస్పత్రి సీసీటీవీ ఫుటేజీలో రికార్డయింది. దీంతో పట్నాలో తుపాకుల సంస్కృతి ఎంతగా నాటుకుపోయిందో ఆ సీసీటీవీ ఫుటేజీ కళ్లకు కట్టింది. అయితే కాల్పుల్లో మరణించిన చందన్ సచ్ఛీలుడేం కాదని గతంలోనే నిరూపితమైంది. బక్సర్ జిల్లాకు చెందిన చందన్ 12 హత్యకేసుల్లో నిందితుడు. ఆయనపై గతంలోనే 24 కేసులు నమోదయ్యాయి.

ఆస్పత్రిలో కాల్పుల మోత..

పలు కేసుల్లో అరెస్టయి జైలులో ఉన్న చందన్ అనారోగ్య కారణాలతో పెరోల్ మీద బయటికొచ్చి ఆస్పత్రి ఐసీయూలో చేరారు. ఈ విషయం తెల్సుకున్న ప్రత్యర్థి గ్యాంగ్ సభ్యులు గురువారం ఉదయం 7.30 గంటలకు బజార్ ఏరియాలోని పరాస్ ఆస్పత్రికి ఒకేసారి వచ్చారు. కారిడార్‌లో ఒకరి వెనకాల మరొకరు నడుస్తూ వెళ్లారు. చందన్ విశ్రాంతి తీసుకుంటున్న ఐసీయూ విభాగంలోని గదిలోకి ఒకరి తర్వాత ఒకరు వెళ్లారు. వెళ్తూ వెళ్తూనే తమ తమ గన్‌లను సిద్ధంగా చేతిలో పట్టుకుని వెళ్లారు. గదిలోకి వెళ్లగానే తూటాల వర్షం కురిపించారు. రక్తమోడుతూ చందన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. చనిపోయాడని నిర్ధారించుకుని షూటర్లు అంతా నెమ్మదిగా గది నుంచి బయటికొచ్చి దొరికిపోతామన్న భయం ఏమాత్రం లేకుండా తాపీగా నడుచుకుంటూ వెళ్లిపోయారు. విషయం తెల్సి పోలీసులు రంగంలోకి దిగారు. ఇప్పటికే పట్నా, బక్సర్‌లలో ఆరుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నామని పట్నా సెంట్రల్ మహిళా ఎస్పీ దీక్షా చెప్పారు. రాష్ట్ర రాజధానిలో కాల్పుల ఘటనపై విపక్షాలు నితీశ్ కుమార్ సర్కార్‌పై దుమ్మెత్తిపోశాయి.



ఆస్పత్రిలో కాల్పులు జరిపేందుకు వరసగా వెళ్తున్న షూటర్ల వీడియో దృశ్యం

కూల్చేసిన ఇల్లు సత్యజిత్ రేది కాదు

బంగ్లాదేశ్ ప్రభుత్వం స్పష్టీకరణ

ఢాకా: బంగ్లాదేశ్‌లోని మైమెన్‌సింగ్ జిల్లాలో సత్యజిత్ రే పూర్వీకుల ఇంటిని కూల్చివేసినట్లు వచ్చిన వార్తలను బంగ్లాదేశ్ అధికారులు తోసిపుచ్చారు. కూల్చేసిన ఇల్లు ఆయనది కాదని తెలిపారు. 'దుర్లోవ్ హౌస్'పిలిచే సత్యజిత్ రే పూర్వీకుల ఇంటిని తాము తాకలేదని జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది. 'ఆ ఆస్తికి సంబంధించిన ప్రభుత్వ రికార్డులను ధ్రువీకరించడానికి మేం బుధవారం ఒక సమావేశం నిర్వహించాం. స్థానిక పెద్దలతో కూడా మాట్లాడి చారిత్రక పత్రాలను తనిఖీ చేశాం. కూల్చివేస్తున్న ఇల్లు గతంలో మైమెన్‌సింగ్ చిల్డ్రన్స్ అకాడమీ కార్యాలయంగా ఉండేది. సత్యజిత్ రే పూర్వీకులతో దీనికి సంబంధాలున్నాయని నిరూపించడానికి ఎటువంటి రికార్డులు లేవు'అని తెలిపారు. 'రే పూర్వీకుల ఆస్తి ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. మేం దాని ప్రస్తుత యజమానితో మాట్లాడాం, అతను ఆ ఆస్తిని రే కుటుంబం నుంచి నేరుగా కొనుగోలు చేశాడు. దానిని నిరూపించడానికి తన వద్ద పత్రాలు ఉన్నాయని ఆయన ధ్రువీకరించారు. కూల్చివేస్తున్న భవనం రే పూర్వీకుల ఇల్లుగా తప్పుడు ప్రచారం జరుగుతోంది'అని ఆయన జోడించారు. సత్యజిత్ రే తాత, ప్రముఖ రచయిత, ప్రచురణకర్త ఉపేంద్ర కిషోర్ రే చౌదరి నిర్మించిన శతాబ్దం నాటి కట్టడాన్ని కూల్చివేశారని అనేక వార్తా కథనాలు వెలువడ్డాయి. దీంతో పెద్ద ఎత్తున విమర్శలొచ్చాయి. ఆయన అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సైన్యానికి 7 వేల ఏకే–203 రైఫిల్స్

న్యూఢిల్లీ: సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత సైన్యం సాయుధంగా బలపడుతోంది. దశాబ్దాల కాలం నాటి రైఫిళ్ల వాడకాన్ని దశలవారీగా నిలిపేయనుంది. తాజాగా శిక్షణ పూర్తిచేసుకోబోతున్న సైనికుల బ్యాచ్‌కు మరో రెండు, మూడు వారాల్లో 7,000 దాకా కలాష్నికోవ్ ఏకే–203 రకం రైఫిళ్లను అందజేయనున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని అమేథి నగరంలో ఇండో–రష్యన్ భాగస్వామ్యంతో ఈ రైఫిళ్లను తయారుచేస్తున్న విషయం విదితమే. గత 18 నెలల్లో 48,000 రైఫిళ్లను తయారుచేసి సరఫరాచేశారు. 2023 జనవరిలో ఏకే203 రైఫిళ్ల ఉత్పత్తి అధికారికంగా ప్రారంభమైంది. 2026 కల్లా 1,00,000 యూనిట్లను డెలివరీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సంవత్సరం చివరి నాటికి ఇండో–రష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ గడువు ముగియనుంది. తర్వాత పూర్తిగా స్వదేశీ రైఫిల్‌గా ఇది అవతరించనుంది. ప్రస్తుతం రైఫిళ్లను 50 శాతం స్వదేశీ భాగాలతో ఉత్పత్తి చేస్తున్నారు. అమేథీలో ప్రతి నెలా 12,000 రైఫిళ్లు తయారవుతున్నాయి. ప్రతి వంద సెకన్లకు ఒక రైఫిల్ తయారవుతోంది. ఒక సంవత్సరంలో 1.5 లక్షల రైఫిళ్లను ఉత్పత్తి చేస్తారు. పూర్తి ఆర్డర్ అంటే.. 6 లక్షల రైఫిళ్ల తయారీ 2030నాటికి పూర్తి కానుంది. గడువు కంటే దాదాపు 22 నెలలు ముందుగానే అన్ని రైళ్ల తయారీ, సరఫరా పూర్తి చేయనున్నట్టు అంచనా. ఇక ఈ రైఫిల్స్‌కు ఆఫ్రికా, మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతి చేయాలంటూ విజ్ఞప్తులు వచ్చాయి. భారత త్రివిధ బలగాల అవసరాలు తీరాక అనంతరం విదేశాలకు ఎగుమతి చేయనున్నారు.

ఏకే–203 ప్రత్యేకతలు

పాత కలాష్నికోవ్ సిరీస్‌కు ఆధునిక రూపం అయిన ఏకే–203 ఖచ్చితత్వంలో పనిచేస్తుంది. ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలతోపాటు అధిక ఎత్తుల్లో రణక్షేత్రాల్లో సులువుగా ఉపయోగించేందుకు అనువుగా దీనిని రూపొందించారు. నిమిషానికి 700 తూటాలను దీని నుంచి ప్రయోగించవచ్చు. గరిష్ఠంగా 800 మీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం ఇది ఖచ్చితత్వంతో ఛేదించగలదు.

నేడు బెంగాల్, బిహార్‌లో ప్రధాని పర్యటన

రూ.5,000 కోట్ల విలువైన ప్రాజెక్టుల ప్రారంభం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో నేడు ప్రధాని మోదీ పర్యటించి రూ.5,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. పశ్చిమ బర్ధమాన్ జిల్లాలోని దుర్గాపూర్ పట్టణంలో బీజేపీ చేపట్టిన భారీ ర్యాలీలోనూ ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్–మే కాలంలో పశ్చిమబెంగాల్ శాసనసభ ఎన్నికలున్న నేపథ్యంలో రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈనెల 21వ తేదీన కోల్‌కతాలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సారథ్యంలో అమరవీరుల దినోత్సవ ర్యాలీ జరగనున్న నేపథ్యంలో అంతకు ముందే మోదీ రాష్ట్రంలో పర్యటిస్తుండటం గమనార్హం. ''బిహార్ నుంచి ప్రధాని మోదీ శుక్రవారం దుర్గాపూర్‌కు చేరుకుంటారు. తొలుత వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ప్రాజెక్టుల కార్యక్రమాల్లో ప్రధాని పాల్గొంటారు. తర్వాత పార్టీ బహిరంగ సభలో ప్రసంగిస్తారు'' అని బెంగాల్ బీజేపీ సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. పశ్చిమబెంగాల్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా సమీర్ భట్టాచార్యను బీజేపీ అధిష్టానం నియమించాక రాష్ట్రానికి మోదీ రావడం ఇదే తొలిసారి. త్వరలో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో టీఎంసీ అధికారికంగా నిర్వహించే చివరి అమరవీరుల దినోత్సవం ఇదేకావడంతో ఈ కార్యక్రమంలోనే టీఎంసీ తన ఎన్నికల అజెండాను ప్రకటించే వీలుందని తెలుస్తోంది. ఓటర్లను ఆకర్షించేందుకు కొత్త పథకాలనూ మమతా బెనర్జీ ప్రకటించే అవకాశముంది. ఈ నేపథ్యంలో అంతకు ముందే ఈ తరహా హామీలను శుక్రవారం జరగబోయే బహిరంగ సభలో మోదీ ప్రకటిస్తారని బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి.

బిహార్‌లోనూ మోదీ పర్యటన

శుక్రవారం బిహార్‌లోనూ మోదీ పర్యటించనున్నారు. రూ.7,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించనున్నారు. ఈస్ట్ చంపారన్ జిల్లాలోని మోతిహారీ పట్టణంలోని గాంధీ మైదాన్‌లో భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొననున్నారు. ఈ సభకు 5,00,000 మంది హాజరవుతారని అంచనా. అందుకు తగ్గట్లు భారీ ఏర్పాట్లుచేస్తున్నట్లు జిల్లా మేజిస్ట్రేట్ సౌరభ్ జోర్వాల్ చెప్పారు. రూ.4,079 కోట్లతో పూర్తిచేసిన దర్భాంగా– నార్కాటియాగంజ్ 256 కిలోమీటర్ల రైల్వేలైన్ డబ్లింగ్‌ను మోదీ జాతికి అంకితంచేయనున్నారు.

రూ.1,950 కోట్లతో బీపీసీఎల్ ప్రాజెక్ట్

రూ.1,950 కోట్లతో చేపట్టనున్న భారత్ పెట్రోలియం కార్పొరేషన్(బీపీసీఎల్)వారి సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. దుర్గాపూర్–హల్దియా గ్యాస్ పైప్‌లైన్‌లోని 132 కిలోమీటర్ల దుర్గాపూర్–కోల్‌కతా సెక్షన్‌ను మోదీ శుక్రవారం జాతికి అంకితంచేయనున్నారు. పీఎం ఉర్జా గంగా ప్రాజెక్ట్‌లో భాగంగా రూ.1,190 కోట్లతో దీనిని పూర్తిచేశారు. పూర్వ బర్ధమాన్, హుగ్లీ, నదియా జిల్లాల్లో లక్షలాది కుటుంబాలకు సహజవాయువు సరఫరాను సుసాధ్యంచేయడంతోపాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మందికి ఉపాధికి ఈ ప్రాజెక్ట్ బాటలు వేస్తోంది.

స్కూళ్లలో గీతా పారాయణం తప్పనిసరి

ఉత్తరాఖండ్ ప్రభుత్వ ఉత్తర్వులు

డెహ్రాడూన్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం అసెంబ్లీలో భగవద్గీత శ్లోకాలను పారాయణం తప్పనిసరి చేస్తూ ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతిరోజూ ఒక గీతా శ్లోకాన్ని పఠించడమే కాకుండా దాని అర్థం, శాస్త్రీయ ఔచిత్యాన్ని విద్యార్థులకు వివరించాలని సూచించింది. ఆధునిక విద్యతో భారతీయ సంప్రదాయ విజ్ఞానాన్ని మిళితం చేయడం, విద్యార్థుల్లో స్వీయ క్రమశిక్షణ, నాయకత్వం, భావోద్వేగ సమతుల్యత వంటి విలువలను ప్రోత్సహించడం లక్ష్యమని జూలై 14న జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొంది. ప్రతి వారం ఒక శ్లోకం ఎంచుకుని దాని అర్థంతో పాఠశాల నోటీసు బోర్డులో ప్రదర్శించాలని, విద్యార్థులు దానిని నేర్చుకోమని చెప్పాలని, వారం చివరిలో తరగతి గదిలో ఆ శ్లోకంపై చర్చలు నిర్వహించాలని, విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకోవాలని సూచించింది. అంతేకాదు.. గీత బోధనలను లౌకిక దృక్కోణం నుంచి చూడాలని, మనస్తత్వశాస్త్రం, తర్కం, ప్రవర్తనా శాస్త్రం, నైతిక తత్వశాస్త్రం దృష్టితో చూడాలని ఆ ఉత్తర్వు పేర్కొంది. బోధనలు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విద్యార్థుల ప్రవర్తనను ప్రభావితం చేయాలని విద్యా శాఖ పేర్కొంది. ఉత్తర్వులను ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి స్వాగతించారు. 'భగవద్గీత కాలాతీత జ్ఞాన వనరు. ఇది దేవభూమి. మన పిల్లలు దీనిని అర్థం చేసుకోవడం, ప్రేరణ పొందడం చాలా ముఖ్యం'అని అన్నారు.మాజీ ముఖ్యమంత్రి హరీష్ రావత్ ఈ చర్యకు మద్దతు ఇచ్చారు.

సుప్రీంకోర్టు ఉత్తర్వు రివర్స్

- 13 ఏళ్ల కుమారుడిని తండ్రికి అప్పగిస్తూ గతేడాది తీర్పు
- తల్లి కస్టడీకే అప్పగిస్తూ మళ్లీ ఉత్తర్వు జారీ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు అసాధారణ నిర్ణయం తీసుకుంది. ఏడాది క్రితం తాము స్వయంగా ఇచ్చిన ఉత్తర్వునే మార్చేసింది. 13 ఏళ్ల బాలుడి మానసిక పరిస్థితిని, అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని అతడిని తల్లికే అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఆ బాలుడిని తండ్రి కస్టడీకి అప్పగిస్తూ 2024 ఆగస్టులో ఇచ్చిన ఉత్తర్వును న్యాయస్థానం మార్చింది. కేరళకు చెందిన యువతి, యువకుడికి 2011లో వివాహం జరిగింది. వారికి 2012లో కుమారుడు జన్మించాడు. తర్వాత కాపురంలో విభేదాలు తలెత్తడంలో వేర్వేరుగా జీవిస్తున్నారు. విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. కుమారుడు తల్లి వద్దే ఉండేలా, తండ్రి నెలకు రెండు రోజులు చూసేలా ఒప్పందం కుదిరింది. 2015లో వారికి విడాకులు మంజూరయ్యాయి. యువతి మళ్లీ పెళ్లిచేసుకుంది. ఆమెకు ఒక కుమారుడు జన్మించాడు. మొదటి భర్త నాలుగేళ్లుగా ఆమె మొదటి కుమారుడిని చూడడానికి రాలేదు. తాను మలేషియా వెళ్లిపోతున్నానని, మొదటి బిడ్డను కూడా తీసుకెళ్తానని, ఇందుకు అంగీకరిస్తూ సంతకం చేయాలని మొదటి భర్తను 2019లో కోరింది. అందుకు అతడు నిరాకరించాడు. ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించాడు. తన బిడ్డను తనకే అప్పగించాలని కోరాడు. కానీ, బిడ్డను తల్లికే అప్పగిస్తూ 2022లో ఫ్యామిలీ కోర్టు ఉత్తర్వు జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ మొదటి భర్త కేరళ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. హైకోర్టు అతడికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. బిడ్డను తండ్రి కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ తల్లి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై గత ఏడాది విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కేరళ హైకోర్టు తీర్పును సమర్థించింది. కుమారుడు తండ్రి వద్దే ఉండొచ్చని ఉత్తర్వు జారీ చేసింది. దాంతో ఈ ఉత్వర్వును పునఃసమీక్షించాలని కోరుతూ తల్లి మరోసారి పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సుప్రీంకోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. గత ఏడాది ఇచ్చిన ఉత్తర్వును రివర్స్ చేస్తున్నట్లు తేల్చిచెప్పింది. కుమారుడు తల్లి కస్టడీలోనే ఉండొచ్చని తేల్చిచెప్పింది. ఈ సమయంలో అతడికి తల్లి అవసరం చాలా ఉందని అభిప్రాయపడింది. చిన్న వయసులో బిడ్డకు తల్లే అసలైన సంరక్షురాలు అని న్యాయస్థానం పేర్కొంది.

భిక్షాటనలో మగ్గిపోతున్న పసివాళ్లకు డీఎన్‌ఏ టెస్ట్

ఛండీగఢ్: చిన్నారులను అపహరించి, వారిని భిక్షాటన కోసం వినియోగించే ముఠాల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు, మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు పంజాబ్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా భిక్షాటన చేస్తున్న వాళ్ల డీఎన్‌ఏతో, వాళ్ల వెంట ఉండే పసివాళ్ల డీఎన్‌ఏలను సరిపోల్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం బిచ్చగాళ్లు, వాళ్ల వెంట ఉన్న చిన్నారులకు డీఎన్‌ఏ పరీక్షలు చేయనున్నారు. భిక్షాటన చేసేవారందరికీ జీవనజ్యోత్–2 కార్యక్రమంలో భాగంగా డీఎన్‌ఏ టెస్టులు నిర్వహించాలని డెప్యూటీ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశామని రాష్ట్ర సామాజిక భద్రత, మహిళ, శిశు అభివృద్ధి శాఖ మహిళా మంత్రి డాక్టర్ బల్జీత్ కౌర్ చెప్పారు.

1,563 మంది భారతీయుల బహిష్కరణ

స్వదేశానికి సాగనంపిన ట్రంప్ సర్కార్

వాషింగ్టన్: ఈ ఏడాది జనవరి 20న అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు అమెరికా 1,563 మంది భారతీయులను బహిష్కరించి స్వదేశానికి సాగనంపిందని భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. బహిష్కరించిన వారిలో ఎక్కువ మందిని వాణిజ్య విమానాల్లో తిప్పి పంపించిందని విదేశాంగ శాఖ అధికారి ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ట్రంప్ తొలిసారిగా అధ్యక్షుడిగా సేవలందించిన కాలంలో మొదటి నెలలోనే 37,660 మంది వివిధ దేశాలకు చెందిన వలసదారులను బహిష్కరించడం గమనార్హం. జో బైడెన్ అధ్యక్షుడిగా ఉన్న కాలంలో కేవలం 3,000 మందిని మాత్రమే బహిష్కరించడం గమనార్హం. ప్రస్తుతం 18,000 వేలకుపైగా భారతీయులు సరైన పత్రాలు లేకుండా జీవిస్తున్నట్లు అమెరికా సిద్ధం చేసిన ఒక నివేదిక పేర్కొంది.

కోటలు లేని ఏకైక సింధు నాగరికత పట్టణం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

- క్రీ.పూ.2500 ఏళ్ల కిందట సింధు నాగరికత విలసిల్లింది. సింధు నదీ పరీవాహక ప్రాంతంలో విరాజిల్లడం వల్ల ఈ నాగరికతను సింధు నాగరికత అని, సింధులోయ నాగరికత అని పిలుస్తారు. తొలిసారి హరప్పా ప్రాంతంలో తవ్వకాలు జరపడంతో దీన్ని హరప్పా నాగరికత అని కూడా అంటారు.
- తొలిసారిగా 1921లో భారత సర్వేయర్ జనరల్‌గా ఉన్న సర్ జాన్ మార్షల్ ఆధ్వర్యంలో దయారాం సహాని.. హరప్పా (రావి నది ఒడ్డు)న తవ్వకాలు జరపడంతో ఒక విశిష్ట నాగరికత బయటపడింది.
- సింధు నాగరికత పేరును హరప్పా నాగరికతగా సర్ జాన్‌మార్షల్ మార్చాడు. పురావస్తు ఆధారాల ప్రకారం సింధు నాగరికత కాలం క్రీ.పూ.3,000 నుంచి క్రీ.పూ.1,500. సింధు నాగరికత ఉన్నత దశలో ఉన్న కాలం క్రీ.పూ.2,500 నుంచి క్రీ.పూ.1,750 వరకు.
- సింధు నాగరికతకు లిపి ఉంది. కానీ చదివేందుకు వీలుకాకపోవడం వల్ల దీన్ని 'ప్రోటో హిస్టారిక్' యుగం (సంధి కాలపు చారిత్రక యుగం) అని పిలుస్తారు.
- ఈ యుగంలో ఉపయోగించిన లోహం 'కంచు'. అందుకే సింధు నాగరికతను 'కాంస్య యుగపు' నాగరికత అని కూడా పిలుస్తారు. ఈ నాగరికత శిలాయుగం నుంచి లోహ యుగానికి మార్పు చెందుతున్న కాలంలో అభివృద్ధి చెందింది. సింధు నాగరికతకు సమకాలీన నాగరికతలు.. మెసపటోమియా (ఇరాక్) (యూఫ్రటీస్, టైగ్రిస్); ఈజిప్ట్ (నైలు నది); చైనా (హోయాంగ్ హో) మొదలైనవి. సమకాలీన నాగరికతల కంటే సింధు నాగరికత 6 అంశాల్లో విశిష్టమైందిగా గుర్తింపు పొందింది.
- సింధు నాగరికత మిగిలిన నాగరికతల కంటే వైశాల్యంలో పెద్దది. ఇది 1.3 మి.చ.కి.మీ.లలో విస్తరించి ఉంది. దీని సరిహద్దులు ఉత్తరాన జమ్ముకశ్మీర్‌లోని మండా నుంచి దక్షిణాన మహారాష్ట్రలోని దైమాబాద్ వరకు, తూర్పున ఉత్తరప్రదేశ్‌లోని అలింగీర్ నుంచి పాకిస్తాన్‌లోని (సుక్త-జందార్) వరకు విస్తరించి ఉంది.
- సింధు నాగరికత పట్టణ నాగరికత (ఇది సింధు నాగరికత ముఖ్య లక్షణం).
- ఇక్కడి పట్టణాలు గ్రిడ్ వ్యవస్థలో, ప్రధాన వీధులు ఉత్తర-దక్షిణాలుగా, ఉప వీధులు తూర్పు -పడమరలుగా దీర్ఘ చతురస్రాకారంలో ఉన్నాయి.



- సింధు ప్రజలు ఇళ్ల నిర్మాణంలో కాల్చిన ఇటుకలను ఉపయోగించటాన్ని ప్రత్యేక అంశంగా చెప్పొచ్చు (దీనిలోనే సింధు ప్రజలు పరిపక్వత సాధించారు).
- ఈ నాగరికతలో పారిశుద్ధ్యానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. భూగర్భ మురుగు నీటి వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. మురుగు నీటి కోసం ఇంకుడు గుంతలు తవ్వటం ఈ నాగరికతలోని ప్రత్యేకత.
- సాంకేతిక పరిజ్ఞానంలో మిగిలిన నాగరికతల కంటే గొప్పది.
- సింధు ప్రజలు ప్రపంచంలో తొలిసారి పత్తిని పండించారు.

సింధు నాగరికత తవ్వకాల్లో మొత్తం 250 ప్రదేశాలు బయటపడ్డాయి. అందులో ముఖ్యమైనవి..

సింధు నాగరికతకు చెందిన ప్రధాన ప్రదేశాలు - పురావస్తు విశేషాలు

- **హరప్పా:** సింధు నాగరికత తవ్వకాల్లో బయటపడిన మొట్టమొదటి పట్టణం.

పట్టణ నిర్మాణం- ముఖ్య లక్షణాలు

- 2 వరుసల్లో నిర్మించిన 6 ధాన్యాగారాలు, పంటలు నూర్చే వృత్తాకారపు వేదికలు బయటపడ్డాయి.
- రాతితో చెక్కిన నటరాజ విగ్రహం వెలుగుచూసింది.
- చెక్కతో తయారు చేసిన శవపేటికలు.
- కోటకు వెలుపల చిన్నచిన్న గదులతో కూడిన నిర్మాణాలు.
- **మొహంజోదారో:** మొహంజోదారో అంటే సింధు భాషలో మృతుల దిబ్బ (Mound of Dead) అని అర్థం.
- తవ్వకాల్లో బయటపడిన అతి పెద్ద సింధు నాగరికత ప్రాంతం.
- పెద్ద ధాన్యాగారం (Great Granary)
- కాల్చిన ఇటుకలతో నిర్మించిన 39×23×9 అడుగుల విస్తీర్ణం గల మహాస్నానవాటిక బయటపడింది.
- అనేక స్తంభాలతో కూడిన అసెంబ్లీ హాలు నిర్మాణం.
- ఏడుసార్లు వరదలకు గురై, తిరిగి 7 సార్లు పునర్నిర్మితమైన పట్టణం.
- కంచుతో పోత పోసిన నాట్యగత్తె విగ్రహం లభించింది.
- రాతితో తయారుచేసిన పశుపతి మహాదేవుని విగ్రహం దొరికింది.
- **చాన్హుదారో:** కోటలు లేని ఏకైక సింధు నాగరికత పట్టణం.
- సిరాబుడ్డి (Ink pot) దొరికింది.
- పూసలు, ఆభరణాలు తయారుచేసే పరిశ్రమ ఆనవాళ్లు వెలుగుచూశాయి.
- **కాళీభంగన్:** రాజస్థానీ భాషలో కాళీభంగన్ అంటే నల్ల గాజులు అని అర్థం.
- నాగలితో పొలం దున్నిన ఆనవాళ్లు ఇక్కడ కనిపించాయి.
- యజ్ఞ యాగాదులకు గుర్తుగా 2 అగ్నిహోమాలు బయటపడ్డాయి.
- **లోథాల్:** కాల్చిన ఇటుకలతో కూడిన మానవ నిర్మిత నౌకాశ్రయం ఉన్న పట్టణం.
- మొదటిసారిగా వరి పండించిన ఆనవాళ్లు లభించాయి.
- ఎక్కువగా ముద్రికలు దొరికాయి.
- సతి ఆచారానికి సంబంధించిన ఆనవాళ్లు ఉన్నాయి.
- కొలిచే ప్రమాణం (త్రాసు, కొలబద్ద) వంటి పనిముట్లు దొరికాయి.
- కాళీభంగన్‌లా అగ్ని గుండం ఆనవాళ్లు ఇక్కడ బయల్పడ్డాయి.
- చదరంగం లాంటి ఆటకు సంబంధించిన ఆనవాళ్లు దొరికాయి.
- **రంగాపూర్:** ఇక్కడ హరప్పాకు పూర్వం ఉన్న సంస్కృతి వెలుగుచూసింది.
- ధాన్యపు పొట్టుకు సంబంధించిన ఆనవాళ్లు లభించాయి.
- **కోట్-డిజి:** సింధు నాగరికతకు పూర్వమే విలసిల్లిన నాగరికత విశేషాలు ఉన్నాయి.
- ఇక్కడ రాతితో చేసిన బాణాలు బయటపడ్డాయి.
- **రూపార్ :** ఇక్కడ కుండల తయారీ ఆనవాళ్లు లభించాయి.
- **సుర్కటోడా:** గుర్రం అవశేషాలు లభించిన ఏకైక పట్టణం.
- క్షీణ దశలో ఉన్న సింధు నాగరికత ఆనవాళ్లు లభించాయి.
- **బన్వాలి:** మేలు రకపు బార్లీ, ఆవాలను ఉపయోగించిన, పండించిన ఆనవాళ్లు దొరికాయి.
- **అలంగీర్‌పూర్:** ఇది హరప్పా నాగరికత చివరి దశను తెలుపుతుంది.
- **ధోలవీర:** భారతదేశంలో బయల్పడిన సింధు నాగరికతకు చెందిన అతిపెద్ద పట్టణం.

ఆర్థిక పరిస్థితులు

- **వ్యవసాయం:** సింధు ప్రజల ముఖ్య వృత్తి వ్యవసాయం. గోధుమ, బార్లీ ముఖ్య పంటలు. వీటిని రబీ సీజన్‌లో అధికంగా పండించేవారు. ఇతర ముఖ్య పంటలు నువ్వులు, ఆవాలు, బఠాణీలు తదితర లెగ్యుమినేసి కుటుంబానికి చెందిన పంటలను పండించేవారు. నవంబర్‌లో విత్తనాలు చల్లి ఏప్రిల్‌లో కోతలు కోసేవారు. సింధు ప్రాంత ప్రజలు తొలిసారిగా పత్తిని పండించారు. వీరు తొలిసారిగా పత్తిని పండించటం వల్ల గ్రీకులు పత్తిని సిండర్ అని పిలిచేవారు.
- వ్యవసాయ మిగులు ఎక్కువగా ఉండేది. మిగులును ధాన్యాగారాల్లో భద్రపరిచేవారు. వ్యవసాయ మిగులుతో అంతర్గతంగా ఎద్దుల బండి ద్వారా, అంతర్జాతీయంగా పడవల ద్వారా వ్యాపారం చేసేవారు.
- ఆవు, ఎద్దు, బర్రె, మేక, కుక్క, పిల్లి తదితర పెంపుడు జంతువులతో పాటు ఏనుగు, పులి, ఖడ్గ మృగం వంటి అడవి జంతువులు కూడా వీరికి తెలుసు. సింహం గురించి వీరికి తెలియదు.
- **పరిశ్రమలు:** కుండలు, పూసల తయారీ, బొమ్మలు (టెర్రకోట బొమ్మలు) - ముద్రలు, తాయెత్తులు, పడవల తయారీ పరిశ్రమలు ముఖ్యమైనవి.
- **వర్తక వాణిజ్యం:** అంతర్జాతీయ వ్యాపారం మెసపటోమియాలోని సుమేరియన్లతో ఎక్కువగా జరిగేది. మెసపటోమియాలో లభించిన అనేక హరప్పా వ్యాపార ముద్రికలు దీనికి ఉదాహరణ.
- **ఎగుమతులు:** వ్యవసాయ ఉత్పత్తులైన గోధుమ, బార్లీ, పత్తితోపాటు దంతాలతో చేసిన సామగ్రి, కుండలు, బొమ్మలు, పూసలు తదితరాలు.
- **దిగుమతులు:** ఆఫ్గానిస్తాన్ నుంచి తగరం, ఆఫ్గానిస్తాన్, పర్షియా నుంచి బంగారం, రాజస్థాన్ నుంచి రాగిని, సౌరాష్ట్ర నుంచి కాంబ్‌షల్స్ (విలువైన రాయి)ని దిగుమతి చేసుకొనేవారు. వస్తు మార్పిడి విధానం ద్వారానే వ్యాపారం జరిగేది.

ప్రదేశం	ప్రస్తుత ప్రాంతం	తవ్విన సం.	పురావస్తు శాస్త్రవేత్త	నది
హరప్పా	పశ్చిమ పంజాబ్‌లోని మాంటిగోమరి జిల్లా	1921	దయారాం సహాని	రావి
మొహంజోదారో లార్ఖానా జిల్లా	సింధు రాష్ట్రంలోని (పాక్)	1922	ఆర్.డి. బెనర్జీ	సింధు
చాన్హుదారో	సింధు (పాక్)	1931	ఎన్.జి.మజుందార్	సింధు
కాళీభంగన్	ఉత్తర రాజస్థాన్	1953	ఎ.ఘోష్, బి.బి.లాల్ (1961)	గగ్గర్
లోథాల్	గుజరాత్	1957	ఎస్.ఆర్. రావ్	భోగవ్
రంగాపూర్	అహ్మదాబాద్ (గుజరాత్)	1953	ఎం.ఎస్. వాస్త్	మీదర్
కోట్-డిజి	సింధు (పాక్)	1955-57	ఫజుల్ అహ్మద్‌ఖాన్	సింధు
రూపార్	పంజాబ్ (భారత్)	1955-57	వై.డి. శర్మ	సట్లెజ్
సుర్కటోడా	కచ్ ప్రాంతం (గుజరాత్)	1972	జె.పి.జోషి	భోగవ్
బన్వాలి	హరియాణా	1973	ఆర్.ఎస్.బిస్ట్	సరస్వతి
ధోలవీర	గుజరాత్	1990-91	ఆర్.ఎస్.బిస్ట్	సబర్మతి ఉపనది

హెబియస్ కార్పస్ రిట్ అంటే ఏమిటి?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
పౌరశాస్త్రం - ఎస్‌ఏ కంటెంట్

లౌకికతత్వం - ప్రపంచశాంతి - భారతదేశం

'లౌకిక' అంటే మతంతో సంబంధం లేనిది అని అర్థం. 'లౌకికతత్వం' అంటే మతంతో ప్రమేయం లేని చింతన లేదా తత్వం. లౌకికతత్వాన్ని అనుసరించే దేశం ప్రజల మత సంబంధమైన విషయాల్లో జోక్యం చేసుకోదు. భారతదేశం వివిధ మతాలకు పుట్టినిల్లు. హిందూ, బౌద్ధం, జైనం, ఇస్లాం, క్రైస్తవం, పార్శీ మతాలు మనదేశంలో ఉన్నాయి. భారతదేశం ఒక లౌకిక రాజ్యం. క్రీస్తు పూర్వం నుంచి మతాలను పరిశీలిస్తే అశోకుడు మొదట హిందువు. తర్వాత ఉపగుప్తుడనే బౌద్ధమతాచార్యుని బోధనలతో బౌద్ధాన్ని స్వీకరించాడు. ఆ కాలంలోనే పరమత సహనాన్ని పాటించిన చక్రవర్తి అశోకుడు. హర్షుడు, చంద్రగుప్త విక్రమాదిత్యుడు కూడా లౌకికతత్వాన్ని అనుసరించారు. ఇక మధ్యయుగంలో తొలి లౌకిక చక్రవర్తి అక్బర్. దిన్-ఇ-ఇలాహీ అనే నూతన మతానికి అక్బర్ శ్రీకారం చుట్టాడు. అంతేకాకుండా ఇబాదత్ ఖానా అనే ప్రార్థన మందిరంలో సర్వమతాల వారు ప్రార్థనలు చేసుకొనే అవకాశం కల్పించాడు. ప్రస్తుతం మనదేశంలో హిందువులు, క్రిస్టియన్లు, ముస్లింలు, సిక్కులు, జైనులు, బౌద్ధులు మొదలైనవారు తమ మతాలు నిర్ణయించిన ఆచార వ్యవహారాలను పాటిస్తూ శాంతియుతంగా జీవిస్తున్నారు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా లౌకిక అనే పదాన్ని భారత రాజ్యాంగ పీఠికలో ప్రవేశపెట్టారు. భారతీయ లౌకికవాదం ఉదారమైంది. ప్రేమ, సహనం, సర్వమత సమానత్వం అనే



సూత్రాలకు ప్రాముఖ్యత ఇస్తుంది. మతవాదానికి బదులు మానవతావాదాన్ని పౌరులు అలవరచుకోవాలి. మతం పేరుతో ఇతరులపై దాడులు చేస్తే ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతుంది. తద్వారా అల్ప సంఖ్యాకుల్లో భయాందోళనలను తొలగిస్తుంది.

ప్రపంచ శాంతి

యుద్ధ భయం మానవాళిని అనాదిగా వేధిస్తోంది. మానవుల శాంతియుత సహజీవనానికి యుద్ధాలు తీవ్రమైన అంతరాయం కలిగిస్తున్నాయి. వీటివల్ల ఎంతో నష్టం కలుగుతుంది. 20వ శతాబ్దంలో సంభవించిన రెండు ప్రపంచ యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా పెను విధ్వంసాన్ని సృష్టించాయి. మొదటి ప్రపంచ యుద్ధం 1914-18 మధ్య కాలంలో జరిగింది. రెండో ప్రపంచ యుద్ధ కాలం 1939-45. మొదటి ప్రపంచ యుద్ధంలో అమెరికా తటస్థంగా ఉంది. మళ్లీ ప్రపంచ యుద్ధమే సంభవిస్తే ప్రపంచం మొత్తం కొద్ది క్షణాల్లో ధ్వంసం అవుతుందని అంచనా. అందుకే ప్రపంచ శాంతి నెలకొల్పడం ఎంతో అవసరమని వివిధ దేశాలు గుర్తించాయి. ఈ లక్ష్యసాధన కోసం మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత నానాజాతి సమితి, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఐక్యరాజ్య సమితి ఏర్పడ్డాయి. నానాజాతి సమితి 1920లో జెనీవా ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. 1945, అక్టోబర్ 24న న్యూయార్క్ కేంద్రంగా ఐక్యరాజ్యసమితి ఏర్పడింది.

భారతదేశం పాత్ర

ప్రపంచ శాంతి నెలకొల్పడానికి, కొన్ని దేశాలు గణనీయమైన కృషి చేస్తున్నాయి. వాటిలో భారతదేశం ఒకటి. ప్రపంచ శాంతిని కాపాడటం భారత విదేశాంగ విధాన ముఖ్య లక్ష్యాల్లో ఒకటి. జాతీయ ప్రయోజనాలను రక్షించుకోవడానికి ఇతర దేశాలతో సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సంబంధాల విషయంలో రూపొందించిన విధానాన్ని విదేశాంగ విధానం అంటారు. భారత విదేశాంగ విధానానికి మొదటి ప్రధాని నెహ్రూ రూపకల్పన చేశారు.

పంచశీల సూత్రాలు

టిబెట్ విషయంపై భారతదేశం, చైనా చేసుకున్న ఒడంబడికలో శాంతియుత సహజీవన సూత్రాలను పేర్కొన్నారు. వీటినే పంచశీల సూత్రాలు అంటారు. 1954 జూన్ 28న భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, చైనా ప్రధాని చౌ-ఎన్-లై ఈ ఒప్పందాన్ని ఆమోదించారు.

అలీనోద్యమం (నామ్)

భారత మొదటి ప్రధాని నెహ్రూ, యుగోస్లావియా అధ్యక్షుడు మార్షల్ టిటో, ఈజిప్ట్ అధ్యక్షుడు కమాలుద్దీన్ నాజర్ అలీనోద్యమానికి మూల పురుషులు. వీరికి ప్రపంచ శాంతి, సహజీవనం, సామరస్యం, సహకారం వంటి అంశాలపై అపార నమ్మకం ఉంది. అటు అమెరికా ఆధ్వర్యంలోని పెట్టుబడిదారి దేశాల కూటమి, ఇటు రష్యా నాయకత్వంలోని సామ్యవాద దేశాల కూటమిలో చేరని దేశాలను అలీన దేశాలు అంటారు. నామ్ 1961లో ఏర్పడింది. మొదటి సదస్సులో 25 దేశాలు పాల్గొన్నాయి. ప్రస్తుతం నామ్‌లో సభ్య దేశాల సంఖ్య-107. నామ్ ఏడో సదస్సు 1983లో న్యూఢిల్లీలో జరిగింది. ఈ సమావేశానికి నాటి భారత ప్రధాని ఇందిరాగాంధీ అధ్యక్షత వహించారు. భారత్ నామ్ ద్వారా ప్రపంచ శాంతి పరిరక్షణకు విశేష కృషి చేస్తోంది. క్యూబా సమస్య విషయంలో 1962లో అమెరికా-రష్యాల మధ్య రాజీని కుదర్చడంలో భారతదేశం ముఖ్యపాత్రను పోషించింది. అంతేకాకుండా శాంతిస్థాపన దిశగా 1983, 1985, 1988లలో పాకిస్థాన్‌తో ఒప్పందాలను కుదుర్చుకుంది.

మాదిరి ప్రశ్నలు

1. మనదేశంలో సంపూర్ణ అక్షరాస్యతా సంవత్సరంగా ఎప్పుడు ప్రకటించారు?
   1) 1992 2) 1991
   3) 1990 4) 1989
2. స్త్రీలలో అక్షరాస్యత అతి తక్కువ ఉన్న రాష్ట్రం?
   1) మేఘాలయ 2) రాజస్తాన్
   3) ఒడిశా 4) బీహార్
3. జీవించే హక్కును ఏ నిబంధన ద్వారా ప్రసాదించారు?
   1) 22 2) 20 3) 21 4) 24
4. స్త్రీలకు ఆస్తిలో సమాన హక్కును ఎప్పుడు చట్టబద్ధం చేశారు?
   1) 1985 2) 1989 3) 1984 4) 1983
5. మొట్టమొదటిసారిగా షెడ్యూల్డ్ కులాలు అనే పదాన్ని ఏ సంవత్సరంలో ఉపయోగించారు?
   1) 1940 2) 1945
   3) 1947 4) 1935
6. అస్పృశ్యతను ఒక పాపంగా అభివర్ణించినవారు?
   1) గౌతమబుద్ధుడు
   2) జవహర్‌లాల్ నెహ్రూ
   3) గాంధీజీ
   4) అంబేద్కర్
7. దేశంలో భాష ప్రాతిపదికగా ఏర్పడిన మొదటి రాష్ట్రం?
   1) ఆంధ్రప్రదేశ్ 2) కర్నాటక
   3) కేరళ 4) తమిళనాడు
8. ఒక జాతికి ఉండే లక్షణాలు?
   1) సంఘీభావం
   2) ఐకమత్యం
   3) భాష, మాండలికాలు
   4) సార్వభౌమాధికారం
9. రాజ్యాంగంలోని ఏ విభాగం నిర్బంధ ప్రాథమిక విద్య గురించి వివరిస్తుంది?
   1) ప్రవేశిక 2) ప్రాథమిక విధులు
   3) ఆదేశ సూత్రాలు
   4) పౌరహక్కులు
10. హెబియస్ కార్పస్ రిట్ అంటే ఏమిటి?
    1) ఇది అన్యాయమైన అరెస్ట్‌ను నిరోధిస్తుంది
    2) అధికారిని పనిచేయమని
    3) నీ పని నీవు చేయమని
    4) ప్రతిషేధం
11. Sons of soil (భూమిపుత్రుల) సిద్ధాంతం ఎవరిది?
    1) శివసేన 2) బీహార్
    3) తెలంగాణ 4) విదర్భ
12. భారత రాజ్యాంగ ప్రవేశికలో లౌకిక అనే పదాన్ని ఏ సంవత్సరంలో చేర్చారు?
    1) 1978 2) 1972
    3) 1976 4) 1970
13. ఐక్యరాజ్యసమితి ఏ నగరంలో ఉంది?
    1) చికాగో 2) న్యూయార్క్
    3) జెనీవా 4) శాన్‌ఫ్రాన్సిస్కో
14. దిన్-ఇ- ఇలాహీ అనే మతాన్ని ప్రవేశపెట్టిన వారు ఎవరు?
    1) బాబర్ 2) షాజహాన్
    3) ఔరంగజేబు 4) అక్బర్
15. భారతీయ లౌకికతత్వం ఎలాంటిది?
    1) సామాజికమైంది 2) నైతికమైంది
    3) ఉదారమైంది 4) ఏదీకాదు
16. రెండో ప్రపంచ యుద్ధంలో దారుణంగా ధ్వంసమైన నగరం?
    1) పెకింగ్ 2) నాగసాకి
    3) టోక్యో 4) తైవాన్
17. ఆసియా రాజ్యాల మొదటి మహాసభ జరిగిన నగరం ఏది?
    1) బాగ్దాద్ 2) నాగసాకి
    3) పెకింగ్ 4) ఢిల్లీ
18. భారత్-చైనాల మధ్య శాంతి ఒప్పందం ఏ సంవత్సరంలో జరిగింది?
    1) 1987 2) 1988
    3) 1985 4) 1983
19. అలీనవిధానం పితామహుడు ఎవరు?
    1) చౌ-ఎన్-లై 2) భుట్టో
    3) నెహ్రూ 4) గాంధీజీ
20. బాండుంగ్ సమావేశం జరిగిన సంవత్సరం?
    1) 1947 2) 1949
    3) 1950 4) 1955
21. మొదటి అలీనదేశాల సదస్సుకి హాజరైన సభ్య దేశాల సంఖ్య?
    1) 45 2) 35 3) 25 4) 55
22. పంచశీల ఎవరి ఒప్పందాల ఫలితం?
    1) రాజీవ్‌గాంధీ- బెనజీర్ భుట్టో
    2) ఇందిరాగాంధీ- జుల్ఫికర్ అలీభుట్టో
    3) నెహ్రూ-చౌ-ఎన్-లై
    4) సుకర్నో-టిటో
23. మారణాయుధాల సంఖ్య పెరగడానికి కారణం?
    1) మిత్రదేశాలు ఉచితంగా ఇవ్వడం
    2) శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధి
    3) ఖర్చు తగ్గడం
    4) శాస్త్రీయ విజ్ఞాన లోపం
24. వియత్నాం విప్లవాన్ని బలపరిచిన సమావేశం జరిగిన నగరం?
    1) అల్జీర్స్ 2) జకార్తా
    3) హవానా 4) హరారే
25. ఏ లక్ష్యసాధన కోసం ఐక్యరాజ్య సమితిని ఏర్పాటు చేశారు?
    1) ఏకీయత 2) జాతీయత
    3) శాంతి 4) మత సహనం
26. ఏ సంవత్సరంలో చైనా- ఇండియాల మధ్య యుద్ధం జరిగింది?
    1) 1965 2) 1948
    3) 1962 4) 1971
27. ఇండియా తొలిసారిగా అణు విస్ఫోటన పరీక్ష జరిపిన సంవత్సరం?
    1) 1974 2) 1970
    3) 1968 4) 1975
28. సార్క్ ఆవిర్భావం ఎక్కడ జరిగింది?
    1) సిలోన్ 2) ఢాకా
    3) ఢిల్లీ 4) ఖాట్మాండు
29. బ్రిటీషువారు పరిపాలించిన వలస రాజ్యాల కూటమిని ఏమని వ్యవహరిస్తారు?
    1) కామన్‌వెల్త్
    2) బ్రిటీష్ సమాఖ్య
    3) యూరోపియన్ దేశాల కూటమి
    4) నాటో

సమాధానాలు

1) 3; 2) 2; 3) 3; 4) 1; 5) 4; 6) 3; 7) 1; 8) 3; 9) 3; 10) 1; 11) 1; 12) 3; 13) 2; 14) 4; 15) 3; 16) 2; 17) 4; 18) 1; 19) 3; 20) 4; 21) 3; 22) 3; 23) 2; 24) 1; 25) 3; 26) 3; 27) 1; 28) 2; 29) 1.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐబీపీఎస్‌లో 5,208 పీవో/ఎంటీ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్) 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రొబేషనరీ ఆఫీసర్స్/మేనేజ్‌మెంట్ ట్రైనీస్(పీవో /ఎంటీ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 5,208.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 21.07.2025 నాటికి గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 01.07.2025 నాటికి 20 నుంచి 30 ఏళ్లు ఉండాలి. (02.07.1995 నుంచి 01.07.2005 మధ్య జన్మించినవారు అర్హులు). ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్లు, ఈఎస్ఎం అభ్యర్థులకు ఐదేళ్ల వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
» వేతనం: నెలకు రూ.48,480 నుంచి రూ.85,920(బేసిక్ పే)+ఇతర అలవెన్సులతో పాటు చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్స్ పరీక్ష, పర్సనాలిటీ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:21.07.2025
» ప్రిలిమినరీ పరీక్ష: ఆగస్ట్ 2025.
» మెయిన్స్ పరీక్ష: అక్టోబర్ 2025.
» ఇంటర్వ్యూ:డిసెంబర్ 2025 - జనవరి 2026
» వెబ్‌సైట్: https://www.ibps.in

ఎస్ఎస్‌సీలో 1,340 జూనియర్ ఇంజనీర్ పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) 2025 సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-బి(నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్) జూనియర్ ఇంజనీర్(సివిల్,మెకానికల్, ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 1,340.
» అర్హత: సంబంధిత విభాగంలో(సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్) డిప్లొమా లేదా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కొన్ని పోస్టులకు పని అనుభవం తప్పనిసరిగా ఉండాలి. వయసు:01.01.2026 నాటికి 30 ఏళ్ల లోపు ఉండాలి. సీపీడబ్ల్యూడీకి చెందిన కొన్ని పోస్టులకు 32 ఏళ్ల లోపు ఉండాలి.
» పే స్కేల్: రూ.35,400 నుంచి రూ.1,12,400
» ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష ద్వారా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:21.07.2025
» దరఖాస్తు ఫీజుకు చివరితేది: 22.07.2025.
» దరఖాస్తు సవరణ తేదీలు: 01.08.2025 నుంచి 02.08.2025 వరకు
» పేపర్-1 కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేదీలు: 27.10.2025 నుంచి 31.10.2025 వరకు
» పేపర్-2 పరీక్ష: జనవరి నుంచి ఫిబ్రవరి 2026 మధ్యలో
» వెబ్‌సైట్: https://ssc.gov.in

ఆకాశ మార్గంలో... అద్భుత విజయాలు!

వరుస విజయాలతో భారత్ అంతరిక్ష రంగంలో తన సత్తా చాటుతోంది. తాజాగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మార్చి 28న పీఎస్ఎల్వీ-సీ27 వాహక నౌక ద్వారా ఐఆర్ఎన్ఎస్ఎస్-1డీ ఉపగ్రహాన్ని దిగ్విజయంగా కక్ష్యలోకి చేర్చింది. దీంతో దేశీయ జీపీఎస్ వ్యవస్థ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. చంద్రుడిపైకి పంపిన చంద్రయాన్, అంగారక గ్రహంపైకి చేపట్టిన మార్స్ ఆర్బిటార్ మిషన్ (MOM) విజయవంతమవడం, పూర్తి దేశీయ పరిజ్ఞానంతో క్రయోజనిక్ ఇంజన్‌ను రూపొందించడం, అధిక బరువున్న ఉపగ్రహాలను మోసుకెళ్లగలిగే జీఎస్ఎల్వీ మార్క్–IIIని రూపొందించడం, పీఎస్ఎల్వీ ద్వారా 28 వరుస ఫలవంతమైన ప్రయోగాలు చేయడం.. తదితరాలన్నీ అంతరిక్ష రంగంలో మనం సాధించిన ప్రగతికి కలికితురాళ్లు. వీటన్నింటినీ భారత శాస్త్రవేత్తలు అతి తక్కువ కాలంలోనే, దాదాపుగా స్వతంత్రంగా సాధించి భారత ప్రతిష్టను ఇనుమడింపజేశారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ

భారత అంతరిక్ష కార్యక్రమం

డాక్టర్ విక్రం సారాభాయి నేతృత్వంలో భారత అంతరిక్ష కార్యక్రమం రూపుదిద్దుకుంది. 1962లో అణుశక్తి విభాగం ఆధ్వర్యంలో మొదటగా ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ (INCOSPAR) ఏర్పాటైంది. అదే ఏడాది తిరువనంతపురం వద్ద తుంబా ఈక్వటోరియల్ రాకెట్ లాంచింగ్ స్టేషన్ (TERLS) నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రం నుంచి 1963 నవంబర్ 21న మొదటి సౌండింగ్ రాకెట్‌ను ప్రయోగించారు. 1969లో ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ISRO) ఏర్పాటైంది. 1972లో అంతరిక్ష సంఘం, అంతరిక్ష విభాగం ఏర్పాటయ్యాయి. భారత అంతరిక్ష కార్యక్రమ విధానాన్ని అంతరిక్ష సంఘం రూపొందిస్తుంది. అంతరిక్ష విభాగం ఆ విధానాన్ని అమలు చేస్తుంది. 1972 ఏప్రిల్ 1 నుంచి ఇస్రో ప్రభుత్వ సంస్థగా మారింది. అదే ఏడాది ఏప్రిల్ 19న భారత్ తన తొలి ఉపగ్రహం ఆర్యభట్టను ప్రయోగించింది. అంతరిక్ష విభాగానికి సంబంధించి సుమారు 20 కేంద్రాలు వివిధ అంతరిక్ష కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నాయి. విక్రం సారాభాయి అంతరిక్ష కేంద్రం వీటిలో ప్రధానమైంది, పెద్దది. ఇది పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ రాకెట్లను నిర్మించడంతో పాటు ఏవియానిక్స్, ఏరోనాటిక్స్, సాలిడ్ ప్రొపెల్లెంట్ టెక్నాలజీ, మెటీరియల్ సైన్స్ లాంటి రంగాల్లో పరిశోధన నిర్వహిస్తుంది. అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ ఉపగ్రహాలకు చెందిన సాంకేతిక పరికరాలను నిర్మిస్తుంది. వీటిని బెంగళూరులోని ఇస్రో శాటిలైట్ సెంటర్ అనుసంధానించి ఉపగ్రహాలను నిర్మిస్తుంది. శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ వాహక నౌకల ద్వారా ఇన్‌శాట్, ఐఆర్ఎస్ ఉపగ్రహాలను ప్రయోగిస్తారు.

ఉపగ్రహ వ్యవస్థలు

భారత అంతరిక్ష కార్యక్రమంలో ప్రధానంగా మూడు రకాల ఉపగ్రహ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నారు. ఇన్‌శాట్ (ఇండియన్ శాటిలైట్ సిస్టం) వ్యవస్థ ఉపగ్రహాల ద్వారా టెలికమ్యూనికేషన్, రేడియో, టీవీ కార్యక్రమాల ప్రసారం, డీటీహెచ్ సేవలు, టెలి మెడిసిన్, టెలి ఎడ్యుకేషన్, వీడియో కాన్ఫరెన్సింగ్, విపత్తుల నిర్వహణ, విలేజ్ రిసోర్స్ సెంటర్లు, శాటిలైట్ న్యూస్ గ్యాథరింగ్, వాతావరణ సమాచార సేకరణ, హెచ్చరికల జారీ, ప్రమాదంలో చిక్కుకున్న వారిని గుర్తించడం, రక్షించడం మొదలైన సేవలు అందిస్తున్నారు.

ఐఆర్ఎస్ (ఇండియన్ రిమోట్ సెన్సింగ్ సిస్టం) ఉపగ్రహాల ద్వారా సహజ వనరుల పరిశీలన, సమాచార సేకరణ, నిర్వహణ, సంరక్షణ, నియంత్రణ, ముఖ్యంగా అటవీ, ఖనిజ, నేల, సముద్ర వనరుల నిర్వహణ సాధ్యమవుతోంది. దీంతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సరఫరా, విద్యుద్దీకరణ, కరవు నియంత్రణ, వాటర్‌షెడ్ల అభివృద్ధి, అడవులు, బంజరు భూముల నిర్వహణ తదితర సేవలు లభ్యమవుతున్నాయి. విపత్తు నిర్వహణ, జీవ వైవిధ్య సంరక్షణ, శీతోష్ణస్థితి మార్పు ప్రభావాల అధ్యయనం - నిర్మూలన, దేశ రక్షణ మొదలైనవాటిలోనూ ఐఆర్ఎస్ ఉపగ్రహాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. రిసోర్స్‌శాట్, ఓషన్‌శాట్, కార్టోశాట్, రీశాట్, మేఘట్రాపిక్స్, సరళ మొదలైనవి ముఖ్యమైన ఐఆర్ఎస్ ఉపగ్రహాలు.

ఉపగ్రహ ఆధారిత నావిగేషన్ అభివృద్ధి లక్ష్యంతో ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం (IRNSS) అనే సరికొత్త జీపీఎస్ వ్యవస్థను ఇస్రో అభివృద్ధి చేసుకుంది. ఇందులో మొత్తం ఏడు ఉపగ్రహాలు ఉంటాయి. ఇస్రో ఇప్పటి వరకు IRNSS-1A, 1B, 1C & 1D అనే నాలుగు ఉపగ్రహాలను ప్రయోగించింది. రవాణా రంగంలో ఈ వ్యవస్థ సాధారణ వ్యక్తులు సైతం తమ గమనం, చేరాల్సిన ప్రదేశం గురించి తెలుసుకోవడానికి, లక్ష్యం ఎంత దూరంలో ఉందో నిర్ధారించుకోవడానికి తోడ్పడుతుంది. తద్వారా మెరుగైన ట్రాఫిక్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి వీలవుతుంది. సుదూర ప్రాంతాల్లోని పర్యావరణ పరిశోధన కేంద్రాలను అనుసంధానించడానికి ఇది ఉపయోగపడుతుంది. మొదటిసారిగా 1970లో అమెరికా సైనికులకు దిశానిర్దేశం చేయడానికి మాత్రమే ఉద్దేశించిన గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం



ప్రస్తుతం సైనిక అవసరాలతో పాటు అనేక ఇతర అవసరాలకు కూడా ఉపయోగపడుతోంది. ఐఆర్ఎన్ఎస్ఎస్ ద్వారా బ్యాంకింగ్, వాణిజ్యం, కమ్యూనికేషన్స్ సేవలు మెరుగవుతాయి. ఇతర దేశాల ఉపగ్రహాలపై ఆధారపడటం కంటే దేశీయ నావిగేషన్ వ్యవస్థ ద్వారా పూర్తి భద్రతతో కూడిన మిలటరీ కార్యకలపాలను నిర్వహించవచ్చు. దీనికి ఐఆర్ఎన్ఎస్ఎస్ ఎంతగానో దోహదపడుతుంది. ఇది భారత భూభాగంలో, ప్రధాన భూభాగం నుంచి 1500 కిలోమీటర్ల విస్తీర్ణంలోనూ పనిచేస్తుంది.

అంతరిక్ష నౌకలు

ఉపగ్రహాలతో పాటు వాటిని ప్రయోగించే అంతరిక్ష నౌకలు కూడా చాలా కీలకమైనవి. ఇప్పటికీ ప్రపంచంలో కేవలం కొన్ని దేశాలకే రాకెట్ పరిజ్ఞానం ఉంది. అనేక అవాంతరాలు ఎదురైనప్పటికీ భారత్ రాకెట్ విజ్ఞానాన్ని దాదాపుగా సొంతంగానే అభివృద్ధి చేసుకుంది. ప్రారంభంలో శాటిలైట్ లాంచ్ వెహికల్-3 (SLV-3), అగ్‌మెంటెడ్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ASLV) అనే రెండు పరిశోధన నౌకలను ఇస్రో అభివృద్ధి చేసి, వాటి ద్వారానే ఉపగ్రహాలను ప్రయోగించింది. వీటి అభివృద్ధిలో సాధించిన పరిజ్ఞానం, వైఫల్యాలు అందించిన పాఠాలను దృష్టిలో ఉంచుకొని కార్యాచరణ అంతరిక్ష నౌకలను ఇస్రో అభివృద్ధి చేసింది. ఇవి రెండు రకాలు. అవి..

1) **పీఎస్ఎల్వీ (పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్):** ప్రపంచంలో విజయవంతమైన అతి కొద్ది రాకెట్లలో ఇది ఒకటి. ఇప్పటివరకు 29 పీఎస్ఎల్వీ ప్రయోగాలు నిర్వహించగా మొదటిది (పీఎస్ఎల్వీ-డీ1) మినహా మిగిలినవన్నీ పూర్తిగా విజయవంతమయ్యాయి. ఇప్పటివరకు ఈ వాహక నౌక ద్వారా 72 ఉపగ్రహాలను ప్రయోగించారు. వీటిలో 31 దేశీయ, 41 విదేశీ ఉపగ్రహాలు ఉన్నాయి. ఈ విధంగా అంతరిక్ష సేవలను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడంలో పీఎస్ఎల్వీ కీలక పాత్ర పోషిస్తుంది.

2) **జీఎస్ఎల్వీ (జియోస్టేషనరీ శాటిలైట్ లాంచ్ వెహికల్):** ధ్రువ కక్ష్యలోకి ఉపగ్రహాలను ప్రవేశ పెట్టడానికి ఉద్దేశించిన నాలుగంచెల నౌక ఇది. దీని ద్వారా భూస్థిర కక్ష్యలోనూ ఉపగ్రహాలను ప్రయోగించారు. ఇది మూడంచెల నౌక. దీని మూడో దశ 'క్రయోజనిక్ దశ'. అమెరికా ఒత్తిళ్ల మేరకు రష్యా ఈ ఇంజన్ సరఫరాను నిరాకరించినప్పటికీ భారత్ 1996లో దీని అభివృద్ధిని ప్రారంభించి సొంతంగా తయారు చేసుకుంది. ఇప్పటివరకు జీఎస్ఎల్వీ ద్వారా 8 ప్రయోగాలు నిర్వహించగా.. 5 విజయవంతమయ్యాయి. జీఎస్ఎల్వీ మార్క్-III అభివృద్ధితో ఇస్రో భారీ ఉపగ్రహాలను సైతం ప్రయోగించనుంది. ఇప్పటివరకు ఇలాంటి భారీ ఉపగ్రహాల ప్రయోగం కోసం ఏరియేన్ అనే విదేశీ రాకెట్‌పై ఆధారపడుతున్నారు. దీనికి సంబంధించిన ఎల్వీఎమ్-3 అనే ప్రయోగం ద్వారా ఇస్రో డిసెంబర్ 2014లో క్ర్యూ మాడ్యూల్ అట్మాస్ఫియరిక్ రీఎంట్రీ ఎక్స్‌పరిమెంట్ అనే కాప్స్యూల్‌ను విజయ వంతంగా భూమిపైకి తీసుకురాగలిగింది.

ఇవేకాకుండా అంతరిక్ష శోధనలో భాగంగా ఇస్రో చంద్రయాన్-1, మంగళయాన్, చంద్రయాన్-3 కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించింది. మొదటి ప్రయత్నంలోనే అంగారక గ్రహ కక్ష్యలోకి మంగళయాన్‌ను 2014 సెప్టెంబర్ 24న విజయవంతంగా ప్రవేశ పెట్టింది.

GSLV	తేది	ప్రయోగించిన ఉపగ్రహాలు	ఫలితం
1. GSLV-D1	2001 Apr 18	జీ శాట్-1	విజయం
2. GSLV-D2	2003 May 8	జీ శాట్-2	విజయం
3. GSLV-Fo1	2004 Sep 20	ఎడ్యు శాట్	విజయం
4. GSLV-Fo2	2006 July 10	ఇన్ శాట్-4సి	వైఫల్యం
5. GSLV-Fo4	2007 Sep 2	ఇన్ శాట్-4సిఆర్	విజయం
6. GSLV-D3	2010 Apr 15	జీ శాట్-4	విఫలం
7. GSLV-Fo6	2010 Dec 25	జీ శాట్-5 పి	విఫలం
8. GSLV-D5	2014 Jan 5	జీ శాట్-14	విజయం

One thing that is usually true...

BANK EXAMS

MARKETING AWARENESS



1. The term marketing refers to:
   a) New product concepts and improvements
   b) Advertising and promotion activities
   c) A philosophy that stresses more on customer value and satisfaction
   d) Planning sales campaigns
   e) None of these
2. In the history of marketing, when did the production period end?
   a) In the late 1800s
   b) In the early 1900s
   c) In the 1920s
   d) After the end of the Second World War
   e) None of these
3. A marketing philosophy summarized by the phrase 'a stronger focus on social and ethical concerns in marketing' is characteristic of the ____ period.
   a) production b) sales
   c) marketing
   d) societal marketing
   e) None of these
4. Which skills and capabilities will marketers need to increasingly have?
   a) Market research
   b) Digital and social media marketing
   c) Strategic marketing
   d) Sales
   e) None of these
5. Which of the following is not part of the external marketing environment?
   a) Political b) Legal
   c) Product d) Socio-cultural
   e) None of these
6. Tobacco advertising is now virtually banned in all marketing communication forms in many countries around the world. This can be explained as an influence of:
   a) Technological environment
   b) Legal environment
   c) Economic environment
   d) Ecological environment
   e) None of these
7. A firm has decided to alter its pricing and promotional strategies in response to slower than expected job growth and declining personal incomes. The firm is responding to changes in it's:
   a) Socio-cultural environment
   b) Political environment
   c) Economic environment
   d) Competitive environment
   e) None of these
8. The process of collecting information about the external marketing environment is:
   a) Environmental management
   b) Environmental scanning
   c) Marketing management
   d) Marketing research
   e) None of these
9. Which is NOT classified in buy classes?
   a) New task
   b) Information gathering
   c) Modified re-buy
   d) Straight re-buy
   e) None of these
10. With respect to consumer behaviour, one's friends and relatives could be considered a/an:
    a) Impersonal influence
    b) Reference group influence
    c) Perceptual influence
    d) Institutional influence
    e) None of these
11. Which of the following is not part of the consumer proposition acquisition process?
    a) Motive development
    b) Information gathering
    c) Proposition evaluation
    d) Perception
    e) None of these
12. The purchasing department reorders on a routine basis, very often working from an approved list of suppliers. This is referred to as:
    a) Straight re-buy b) New task
    c) Modified re-buy
    d) Routine buying
    e) None of these
13. Which sampling techniques are often selected in qualitative research?
    a) Non-probability sampling
    b) Probability sampling
    c) Stratified sampling
    d) Random sampling
    e) None of these
14. What is the term used to describe the degree to which the data elicited in a study is replicated in a repeat study?
    a) Replication b) Pre-code
    c) Reliability d) Convenience
    e) None of these
15. One thing that is usually true of focus groups is that:
    a) Most groups involve a small number of participants
    b) They usually average 5 to 10 minutes in length
    c) The moderator's job is to keep the group busy for the entire time and not let anyone leave
    d) The questions used are highly structured and response-driven
    e) None of these
16. Which type of research methods are designed to elicit responses to predetermined, standardized questions from a large number of respondents?
    a) Quantitative b) Qualitative
    c) Non-probability
    d) Probability e) None of these
17. The ____ process commences at corporate level. Here the organization sets out its overall mission, purpose and values.
    a) researching
    b) strategic planning
    c) controlling d) managing
    e) None of these
18. A statement about what an organization wants to become, which sets out an organization's future, is referred to as:
    a) Mission b) Values
    c) Organizational goals
    d) Vision e) None of these
19. A statement that sets out what the organization wishes to achieve in the long term is referred to as:
    a) Mission b) Vision
    c) Values
    d) Strategic context
    e) None of these
20. Organizational values are important because they ____.
    a) help shape mission statements
    b) help increase sales
    c) help guide behaviour and the recruitment and selection decisions
    d) help define market research
    e) None of these
21. A commonly used basis for segmenting consumer markets:
    a) Organizational size
    b) Demographics
    c) Product type
    d) Price e) None of these
22. Which of the following is not an example of a behavioural variable?
    a) Product usage
    b) Media usage
    c) Purchase occasion
    d) Personality e) None of these
23. ACORN, a segmentation analysis technique, stands for which of the following?
    a) A Corresponding Official Residential Notation
    b) A Classification of Reported Nationals
    c) A Classification of Residential Neighbourhood
    d) A Countrywide Official Resources Navigation
    e) None of these
24. The family life cycle:
    a) is a way to apply psychographic segmentation
    b) refers to the process of family formation and dissolution
    c) provides insights into the relationships among age, occupation, income and housing
    d) is composed of the 11 stages of personal growth from infancy to retirement
    e) None of these
25. Offerings move through a sequential, pre-determined pattern of development similar to the biological path that life forms follow. This is the concept of:
    a) Process of diffusion
    b) New product development
    c) Product life cycle
    d) Brand management
    e) None of these
26. Which of the following is NOT a service innovation strategy?
    a) Branded service innovation
    b) Established service innovation
    c) Incremental service innovation
    d) Radical service innovation
    e) None of these
27. ____ is concerned with value creation generated through novel or unusual service concepts.
    a) Established service innovation
    b) Radical service innovation
    c) Generic service innovation
    d) Incremental service innovation
    e) None of these
28. At the highest end of innovation maturity, firms seek to integrate the services dimension as part of their total offer. This is known as:
    a) Servitization b) Reutilization
    c) Diffusion d) Productization
    e) None of these
29. In marketing terms, ____ refers to what we get for what we pay.
    a) Revenue b) Cost
    c) Value d) Product
    e) None of these
30. ____ act as cues by indicating to a potential customer that there is a bargain to be had.
    a) Odd-number pricing
    b) Sale signs c) Relative price
    d) Price surplus e) None of these
31. ____vary according to the number of units of goods made or services sold.
    a) Product assets
    b) Price elasticity
    c) Fixed costs d) Variable costs
    e) None of these
32. Costs which do not vary according to the number of units of product made or service sold:
    a) Fixed costs b) Moving assets
    c) Working capital
    d) Fixed capital e) None of these
33. This is a hierarchy of effects or sequential model used to explain how advertising works:
    a) ADD b) AIDA
    c) PESTLE d) SWOT
    e) None of these
34. AIDA stands for Awareness, ___, Desire and _____.
    a) Interest; Action
    b) Intensity; Appeal
    c) Involvement; Action
    d) Involvement; Appeal
    e) None of these
35. Marketing communications is used to achieve one of two principal goals. The first concerns the development of brand values. What is the other goal?
    a) Increasing sales
    b) Informing about products
    c) Changing the behavior of target audiences
    d) Channeling communication tools
    e) None of these
36. Sharing of meaning created through the transmission of information:
    a) Communication
    b) Noise c) Transfer
    d) Understanding
    e) None of these
37. Users are able to create content and become more involved with a brand through:
    a) Door to door
    b) Online communities
    c) Direct mail d) Telemarketing
    e) None of these
38. A commercial activity, whereby one party permits another an opportunity to exploit an association with a target audience in return for funds, services or resources is referred to as:
    a) Advertising b) Exchange
    c) Sponsorship
    d) Public relations e) None
39. These sell directly to end consumers and may purchase directly from manufacturers and/or deal with wholesalers:
    a) Distributors b) Franchising
    c) Merchant d) Retailers
    e) None of these
40. These store goods for moderate to long periods:
    a) Storage warehouses
    b) Distribution centres
    c) Haulage transport
    d) Electronic data interchange
    e) None of these

KEY

1) c; 2) c; 3) d; 4) b;
5) c; 6) b; 7) c; 8) b;
9) b; 10) b; 11) d; 12) a;
13) a; 14) c; 15) a; 16) a;
17) b; 18) d; 19) a; 20) c;
21) b; 22) d; 23) c; 24) b;
25) c; 26) a; 27) b; 28) a;
29) c; 30) b; 31) d; 32) a;
33) b; 34) a; 35) c; 36) a;
37) b; 38) c; 39) d; 40) a.